

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 253

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 4-12-2023

కాంగ్రెస్ 64 | బీఆర్ఎస్ 39 | బీజేపీ 8 | ఎంఐఎం 7 | సీపీఐ 1



రేస్ గెలిచిన కాంగ్రెస్

64 సీట్లతో హస్తం ఘనవిజయం

ఫలితాన్నిచ్చిన 'మార్పు' నినాదం.. అధికార పార్టీపై వ్యతిరేకత ప్రభావం

39 సీట్లకే పరిమితమైన బీఆర్ఎస్..

8 స్థానాలతో బలం పెంచుకున్న బీజేపీ

7 చోట్ల గెలుపుతో ఎంఐఎం పట్టు పదిలం

కాంగ్రెస్ పొత్తుతో ఒక సీట్లో సీపీఐ గెలుపు

ఖాతా తెరవని సీపీఎం, బీఎస్పీ, జనసేన

గజ్వేల్‌లో కేసీఆర్, కొడంగల్‌లో రేవంత్ రెడ్డి విజయం.. బండి సంజయ్, ఈటల రాజేందర్ ఓటమిపాలు

ప్రధాన పార్టీలకు ఓట్లు, సీట్ల తీరిదీ..

కాంగ్రెస్ ఓట్లు(శాతం) 92,35,792 (39.40%)	బీఆర్ఎస్ ఓట్లు(శాతం) 87,53,924 (37.35%)
బీజేపీ ఓట్లు(శాతం) 32,57,511 (13.90%)	ఎంఐఎం ఓట్లు(శాతం) 5,19,379 (2.22%)

అత్యధిక మెజార్టీ
85,576
కేపీ వివేకానంద
(కుత్బుల్లాపూర్- బీఆర్ఎస్)

అత్యల్ప మెజార్టీ
268
కాలె యాదయ్య
(చేవెళ్ల- బీఆర్ఎస్)

2 లో




ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ తమిళిసైని కలిసిన డీకే, ఠాక్రే, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, మల్‌రెడ్డి

నేడు సీఎల్పీ భేటీ

18 లో

త్రీ చీర్స్



సెమీఫైనల్స్ పోరులో బీజేపీ ఘనవిజయం

మధ్యప్రదేశ్‌లో బంపర్ మెజారిటీ

రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ జయకేతనం

కాంగ్రెస్ చేజారిన ఆ రెండు రాష్ట్రాలు

రాజస్తాన్: రాజు ఎవరో?

మధ్యప్రదేశ్: మామా.. సీఎం మామా..

ఛత్తీస్‌గఢ్: బఘెల్‌కు 'బోనస్' దక్కలేదు

ఈ హ్యాట్రిక్.. వచ్చే హ్యాట్రిక్‌కు గ్యారంటీ

- సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తంచేసిన ప్రధాని మోదీ
- ఈ ఫలితాలు అహంకార కూటమికి గట్టి హెచ్చరిక
- బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రసంగించిన ప్రధాని

- వివరాలు 10,11లో

"బీజేపీకి మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ సోదర, సోదరీమణులకు నా ధన్యవాదాలు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతూ వస్తోంది. మన 'రోజు' వచ్చేదాకా ఈ ట్రెండ్ ఇలాగే సాగుతుంది. తెలంగాణతో బీజేపీ బంధం విడదీయరానిది. ఇక్కడి ప్రజల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తాం. అలుపెరగకుండా పనిచేసిన ప్రతీ బీజేపీ కార్యకర్తను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా"

-'ఎక్స్'లో మోదీ

ప్రగతిభవన్‌ను ప్రజాభవన్ చేస్తాం

- సామాన్యులకు పరిపాలనను అందుబాటులోకి తీసుకొస్తాం
- పార్టీ నేతలందరం ఐక్యంగా ఉండి విజయం సాధించాం
- టీజేఎస్, సీపీఐ అందించిన సహకారాన్ని మరువబోం
- ప్రజాస్వామిక స్ఫూర్తితో ముందుకు వెళ్తాం.. ప్రతిపక్షాలను కలుపుకొనిపోతాం

- వివరాలు 2లో



ఈ విజయం తెలంగాణ అమరవీరులకు అంకితం: రేవంత్



"నేడు జరిగే సీఎల్పీ సమావేశంలో సీఎం ఎవరన్న దానిపై స్పష్టత వస్తుంది.

-ఉత్తమ్‌కుమార్ రెడ్డి

- వివరాలు 18లో



"అధిష్టానం నాకు ఏ పదవి ఇచ్చినా దాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తా.

-భట్టి విక్రమార్క

- వివరాలు 2లో

జెయింట్ కిల్లర్

కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించిన వెంకట రమణారెడ్డి

9 లో

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పెను సంచలనం సృష్టించారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ప్రస్తుత సీఎం కేసీఆర్‌ను, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం అవుతారని భావిస్తున్న రేవంత్‌రెడ్డిని ఓడించారు.





ఎగుడు దిగుడు దారిలో కారు!

ఉద్యమ పార్టీ నుంచి రాజకీయ పార్టీగా.. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా..

- వివరాలు 6లో

ఎదురుదెబ్బలు గుణపాఠంగా తీసుకుంటాం

- నేర్చుకోవాల్సినవి నేర్చుకుని ముందుకెళ్తాం
- ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తాం
- ప్రజల పక్షాన వారి గొంతుకై ప్రశ్నిస్తాం

కొత్త ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని ఆశిస్తున్నాం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'గతంలో కంటే మంచి మెజారిటీతో విజయం సాధిస్తామనే ఆశాభావంతో ఎన్నికలకు వెళ్లాం. ఆగస్టు 21న కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు 60 లక్షల మంది పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి శ్రమించినప్పటికీ మేం ఆశించిన ఫలితం రాలేదు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారు. ప్రజల ఆకాంక్షకు మిగతా 3వ పేజీలో ▶



డీజీపీపై ఈసీ సస్పెన్షన్ వేటు



నూతన డీజీపీ రవిగుప్తా

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని డీజీపీ అంజనీకుమార్ కలవడంపై ఈసీ ఆగ్రహం

రేవంత్‌ను కలిసిన అదనపు డీజీలు సంజయ్‌కుమార్ జైన్, మహేశ్ భగవత్‌లకు నోటీసులు

- వివరాలు 3లో

ఒకింత విస్మయం.. కొంత సంతృప్తి

ఉమెన్.. డబుల్ డిజిట్

ప్రజా సేవలో డాక్టర్లు

- వివరాలు లోపలి పేజీల్లో

తెలంగాణ అభివృద్ధికి కృషి

'తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తుంది. రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం. ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు సత్వరం అమలయ్యేలా కృషి చేస్తాం. మా పార్టీ సాధించిన విజయాలు వచ్చే ఎంపీ ఎన్నికలకు దోహదపడతాయి. రాష్ట్రంలో బీజేపీ ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. అయిదేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం ఉంది.'



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

9 లో



జనసేనకు ఘోర పరాభవం

అన్ని చోట్లా డిపాజిట్ గల్లంతు

అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. బీజేపీతో పొత్తులో భాగంగా 8 సీట్లలో పోటీచేసినా ఆ పార్టీ అభ్యర్థులు అన్ని చోట్లా ఓడిపోయారు.

- వివరాలు 9లో

సర్వేలు చెప్పినట్టే ఫలితాలు!

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందంటూ జాతీయ, రాష్ట్రస్థాయి మీడియా, సర్వే సంస్థలు వెలువరించిన ఎగ్జిట్‌పోల్స్‌కు అనుగుణంగానే ఫలితాలు రావడం గమనార్హం. దాదాపు అన్ని సంస్థలు కూడా కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా నిలుస్తుందని, మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గరగా వస్తుందని అంచనా వేశాయి. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వచ్చిన సీట్లు కూడా దాదాపు ఎగ్జిట్‌పోల్స్, పోస్ట్‌పోల్స్‌లో పేర్కొన్నట్టుగానే వచ్చాయి.

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయండి

- ముహూర్తం కుదిరితే నేడు లేదంటే డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం
- డీజీపీ, ఇతర సీనియర్ ఐపీఎస్‌లకు స్పష్టం చేసిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై ఆ పార్టీ దృష్టి పెట్టింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో ఆదివారం డీజీపీ అంజనీకుమార్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థులు ముందంజలో ఉన్న సమయంలో ఉదయం 11.30 గంటలకు ఈ ముగ్గురు అధికారులు జూబ్లీహిల్స్‌లోని రేవంత్ ఇంటికి వచ్చి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ వారితో మాట్లాడుతూ, సోమవారం సాయంత్రం నుంచి మంచి ముహూర్తం ఉన్నందున, వీలైతే సోమవారం సాయంత్రమే ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. లేదంటే డిసెంబర్ 9న ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎల్బీ స్టేడియంలో ఉంటుందని వారికి సూచించినట్టు డీజీపీ కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, రేవంత్‌కి రాష్ట్ర నిఘా విభాగం ఆధీనంలోని ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్ డబ్ల్యూ), హైదరాబాద్ పోలీసులు ఆదివారం నుంచి భద్రతను పెంచారు.

రచ్చ గెలిచి.. ఇంట ఓడి..!


సాక్షి, హైదరాబాద్: ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న నానుడి హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ ఫలితాలను పరిశీలిస్తే తలకిందులైనట్లు స్పష్టమవుతోంది. రచ్చ గెలిచి ఇంట్లో ఓడిన పరిస్థితి మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో కనిపిస్తోంది. టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి స్థానంతోపాటు బీజేపీ రాష్ట్ర రథసారథి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఇలాకాలో ఒక్క స్థానంలోనూ ఆయా పార్టీలు ఖాతా తెరవలేదు. ప్రధాన పార్టీలకు అధ్యక్షులుగా, ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ రేవంత్, కిషన్‌రెడ్డి ఇలాకాలో ఆయా పార్టీలు ఖాతా తెరవకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇదండీ సంగతి



40 ఏళ్ల తర్వాత... 60 దాటిన కాంగ్రెస్

తాజా ఎన్నికల్లో 60 సీట్లు దాటి విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ నలభై ఏళ్ల తర్వాత ఈ రికార్డు సాధించడం గమనార్హం. 1983 తర్వాత ఆ పార్టీ తెలంగాణ ప్రాంతంలో ఎప్పుడూ 60 స్థానాలను దాటలేదు. 1989లో అత్యధికంగా 58 చోట్ల గెలిచింది. అప్పుడు తెలంగాణలో ఉన్నది 107 స్థానాలే కావడంతో ఆ ఎన్నికల్లో సాంకేతికంగా మ్యాజిక్ ఫిగర్ సాధించినట్టు లెక్క. మళ్లీ ఇప్పుడే మ్యాజిక్ ఫిగర్ సాధించింది.



(నియోజకవర్గాల పునర్విభజనతో 2009 నుంచి తెలంగాణలో సెగ్మెంట్ల సంఖ్య 119కి పెరిగింది. అంతకుముందు 107 ఉండేవి)

రేస్ గెలిచిన కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో 64 సీట్లతో హస్తం జయకేతనం

ఫలితాన్నిచ్చిన 'మార్పు'నినాదం.. అధికార పార్టీపై వ్యతిరేకత ప్రభావం

అంతా ఊహించినట్టుగానే, ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేసినట్టుగానే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల రేసు గెలిచింది. ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన కాసేపటికే హస్తం పార్టీ ఆధిక్యతపై స్పష్టత వచ్చింది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ గాలి వీచింది. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ సర్కారుపై వ్యతిరేకత ప్రభావం చూపింది. మొత్తం 119 నియోజకవర్గాలకుగాను మేజిక్ ఫిగర్‌ను దాటేసి 64 సీట్లతో హస్తం పార్టీ విజయం సాధించింది. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తామని ప్రచారంలో ధీమాగా చెప్పిన బీఆర్‌ఎస్ 39 స్థానాలకే పరిమితమైంది. బీజేపీ మొదట్లో డబుల్ డిజిట్ దాటేలా కనిపించినా.. చివరికి ఎనిమిది స్థానాలతో సరిపెట్టుకుంది. ఎంఐఎం తమ ఏడు స్థానాలను నిలబెట్టుకున్నా, కౌంటింగ్ ఆద్యంతం గట్టి పోటీనే ఎదుర్కొంది. కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ ఒకచోట గెలవగా.. సీపీఎం, బీఎస్పీ, జనసేన ఖాతా తెరవలేకపోయాయి. ఫలితాలతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. గాంధీభవన్, రేవంత్ నివాసం వద్ద ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ బోసిపోయింది. ఫలితాలపై స్పష్టత రాగానే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేస్తూ లేఖను గవర్నర్‌కు పంపగా, ఆమె వెంటనే ఆమోదించడం జరిగిపోయింది. మరోవైపు కాంగ్రెస్ ముఖ్య నేతలు గవర్నర్ తమిళిసైని కలసి కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ లేఖ అందజేశారు. సీఎల్పీ నేతను ఎన్నుకోవడానికి ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో సీఎం ఎవరు అవుతారన్నది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ గురితప్పిందని, ప్రజల తీర్పును శిరసావహిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఎదురు దెబ్బలను ఎదుర్కొని తిరిగి నిలదొక్కుకోవడం తమకు అలవాటేనని పేర్కొన్నారు.

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. ఆ పార్టీ ఇచ్చిన 'మార్పు'నినాదం ప్రజల్లోకి వెళ్లింది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత ప్రభావం చూపింది. రాష్ట్రంలోని మొత్తం 119 శాసనసభ స్థానాలకుగాను 118 చోట్ల పోటీచేసిన కాంగ్రెస్ 64 స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం కనీసం 60 సీట్లతో మ్యాజిక్ ఫిగర్ సాధించాల్సి ఉండగా.. నాలుగు సీట్లు ఎక్కువే 'చే'జిక్కించుకుంది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా తొలిసారిగా రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. తెలంగాణ ఏర్పాటయ్యాక వరుసగా రెండుసార్లు గెలిచి తిరుగులేని రాజకీయశక్తిగా అవతరించిన బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో చతికిలపడింది. మొత్తం 119 స్థానాల్లో పోటీ చేసిన బీఆర్‌ఎస్ 39 సీట్లకే పరిమితమైంది. సిట్టింగ్ మంత్రుల్లో ఆరుగురు ఓడిపోగా, చీఫ్ విప్, మరో ముగ్గురు విప్‌లకూ ఓటమి తప్పలేదు. కొన్నివర్గాల ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా కనిపించినా.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఆదరణతో బీఆర్‌ఎస్ గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు దక్కించుకుంది. ఇక జనసేనతో పొత్తు పెట్టుకుని, 111 స్థానాల్లో పోటీచేసిన బీజేపీ ఎనిమిది స్థానాలతో సరిపెట్టుకుంది. 2018 ఎన్నికల్లో కేవలం ఒకేచోట గెలిచిన కాషాయ పార్టీకి సంఖ్యాబలం పెరగడం ఊరట కలిగించే అంశమే. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ 7 సిట్టింగ్ స్థానాలను గెలిచి.. హైదరాబాద్ పాతబస్తీలో తన పట్టు నిలుపుకొంది. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా పోటీ చేసిన ఏకైక స్థానం కొత్తగూడెంలో సీపీఐ విజయం సాధించింది.

ఖాతా తెరవని బీఎస్పీ, సీపీఎం, జనసేన

- రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ గత నెల 30న జరగగా.. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను విడుదల చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో 107 స్థానాల్లో పోటీ చేసిన బీఎస్పీ.. బీజేపీతో పొత్తులో భాగంగా 8 చోట్ల పోటీ చేసిన జనసేన, 19 స్థానాల్లో బరిలో ఉన్న సీపీఎం, ఒక స్థానంలో పోటీచేసిన సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) పార్టీలు ఖాతా తెరవలేదు.
- రాష్ట్రంలోనే అత్యధికంగా కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు ఏకంగా 85,576 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇక చేవెళ్ల నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య అత్యల్పంగా 268 ఓట్ల తేడాతో గట్టెక్కారు.
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి రెండు స్థానాల్లో పోటీచేయగా.. గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45,031 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కామారెడ్డిలో ఓడిపోయారు.
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో 32,532 ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై విజయం సాధించారు.
- సిద్దిపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు 82,308 ఓట్ల మెజార్టీతో, సిరిసిల్లలో కేటీఆర్ 29,687 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో 23,464 ఓట్ల తేడాతో తిరిగి ఎన్నికయ్యారు. అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసినవారు తిరిగి గెలవరనే సెంటిమెంట్‌ను ఆయన తిరగరాశారు.
- కాంగ్రెస్ సీనియర్లలో భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జి.వివేక్, జి.వినోద్, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు గెలుపొందగా.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, షబ్బీర్ అలీ తదితరులు ఓటమి పాలయ్యారు.

బీజేపీ ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేల ఓటమి

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలోకి దిగిన ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావుతోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి గెలవలేకపోయారు. మరోవైపు కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ముగ్గురు ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ముగ్గురూ ఎమ్మెల్యేలుగా గెలవడం గమనార్హం.

బొటాబొటీ ఓట్లతో గట్టెక్కింది వీరే..

చేవెళ్లలో కాలె యాదయ్య (బీఆర్‌ఎస్) కేవలం 268 ఓట్ల అతి తక్కువ మెజార్టీతో గెలిచారు. యాకుత్‌పురలో జాఫర్ హుస్సేన్ (ఎంఐఎం) 878 ఓట్లు, జుక్కల్‌లో లక్ష్మీకాంతరావు (కాంగ్రెస్) 1,152, దేవరకద్రలో గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్) 1,392, నాంపల్లిలో మాజిద్ హుస్సేన్ (ఎంఐఎం) 2,037, బోధన్‌లో పి.సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్) 3,062, సిర్పూరులో హరీశ్‌బాబు (బీజేపీ) 3,088, కరీంనగర్‌లో గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్) 3,163, బాల్కొండలో వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్) 4,533, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి (బీఆర్‌ఎస్) 4,606, ఖానాపూర్‌లో ఎడ్మ బొజ్జు (కాంగ్రెస్) 4,702 ఓట్లతో తక్కువ మెజార్టీ సాధించారు.

20 మందికి 50వేలకుపైగా మెజారిటీ

రాష్ట్రంలో 20 మందికిపైగా ఎమ్మెల్యేలు 50 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో కేపీ వివేకానంద్ (బీఆర్‌ఎస్) 85,576 ఓట్ల మెజార్టీ సాధించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు (బీఆర్‌ఎస్) 82,308, చాంద్రాయణగుట్టలో అక్బరుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం) 81,660, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు (బీఆర్‌ఎస్) 70,387, నకిరేకల్ నుంచి వేముల వీరేశం (కాంగ్రెస్) 68,839 ఓట్ల మెజార్టీతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. 50 వేలపైన మెజార్టీ సాధించినవారిలో కాంగ్రెస్ నుంచి 13 మంది, బీఆర్‌ఎస్ నుంచి నలుగురు, ఎంఐఎం నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఉన్నారు.

రాహుల్, ప్రియాంక పర్యటించిన చోట్ల

గెలుపోటముల మిశ్రమంగా ఎన్నికల ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేతల ఎన్నికల ప్రచారం ఆ పార్టీ అభ్యర్థులకు మిశ్రమ ఫలితాన్నిచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన స్థానాల్లో కొన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలవగా, మరికొన్ని చోట్ల పరాజయం పాలయ్యారు. ఈ ఏడాది అక్టోబర్18న తన సోదరి ప్రియాంకతో కలిసి వరంగల్ జిల్లాకు వచ్చిన రాహుల్ ప్రచారం నిర్వహించిన ములుగు, వరంగల్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. రాహుల్ వెళ్లిన భూపాలపల్లి, వరంగల్ ఈస్ట్, కొల్లాపూర్, కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్, బోధన్, వేములవాడ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక, ఆయనతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెళ్లినప్పటికీ సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓటమి పాలు కావడం గమనార్హం. ప్రియాంక వెళ్లిన కొడంగల్, ఖానాపూర్, పాలేరు, ఖమ్మం, మధిర స్థానాల్లో గెలవగా, జహీరాబాద్, మల్కాజ్‌గిరి స్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. రాహుల్ వెళ్లిన కామారెడ్డి, ఆదిలాబాద్‌లోనూ పార్టీ అభ్యర్థి ఓడిపోగా, ఆంథోల్‌లో విజయం సాధించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రాహుల్ ప్రచారం చేసిన జూబ్లీహిల్స్, నాంపల్లి, మల్కాజ్‌గిరి స్థానాల్లో అభ్యర్థులు ఓడిపోయారు. ఖర్గే హాజరైన నల్లగొండలో కోమటిరెడ్డి భారీ మెజార్టీతో గెలవగా, ఆలంపూర్‌లో సంపత్‌కుమార్ పెద్ద తేడాతో ఓటమి పాలయ్యారు. గతంలో సోనియాగాంధీ సభ నిర్వహించిన తుక్కుగూడలో పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం) భారీ మెజార్టీతో విజయం సాధించడం గమనార్హం



విజయ సంకేతం చూపుతున్న భట్టి, ఆయన సతీమణి, కుమారుడు

'విక్రమార్కుడి' విజయ పరంపర

భట్టి ఘనవిజయం... వరుసగా నాలుగోసారి గెలుపు

ప్రతీ ఎన్నికలో పెరిగిన మెజారిటీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్క విజయపరంపర మరోసారి కొనసాగింది. భారీ మెజార్టీతో ఆయన మధిర ఎమ్మెల్యేగా నాలుగోసారి గెలిచారు. 2009, 2014, 2018లో వరుసగా విజయం సాధించిన భట్టి ఈ ఎన్నికల్లోనూ అదే ఒరవడి కొనసాగించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి భట్టి భారీ మెజార్టీ కైవసం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌పై 35,452 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో భట్టికి 1,08,970 ఓట్లు రాగా.. కమల్‌రాజ్‌కు 73,518 ఓట్లు వచ్చాయి. ఈ నాలుగు ఎన్నికల్లోనూ లింగాల కమల్‌రాజ్‌పైనే ఆయన విజయం సాధించడం మరో విశేషం. 2009లో ఆయన 1,417 ఓట్లతో, 2014లో 12,329 మెజార్టీతో, 2018లో 3,567 ఓట్లతో విజయం సాధించగా.. ప్రస్తుతం 35,452 ఓట్ల భారీ మెజార్టీతో పొందారు. ప్రస్తుతం సీఎల్పీ నేతగా ఉన్న భట్టికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నత పదవి దక్కుతుందని మధిర నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

ఏ పదవినిచ్చినా బాధ్యతగా నిర్వర్తిస్తా..

'సీఎంగా ఎవరనేది సీఎల్పీ అభిప్రాయాన్ని పార్టీ అధిష్టానం తీసుకుంటుంది. ఆ తర్వాత సీఎం ఎవరనేది పార్టీ అధిష్టానం ప్రకటిస్తుంది. నాకు ఏ పదవి ఇచ్చినా బాధ్యతగా నిర్వర్తిస్తాను'అని భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. పదేళ్లుగా ప్రజలకు దూరంగా ఉన్న ప్రగతిభవన్‌ను ప్రజాపాలన భవన్‌గా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను పాలనలో భాగస్వాములను చేస్తుందని తెలిపారు. ఖమ్మంలో ఆదివారం ఆయన కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణను సాధించుకున్నామని, ఇప్పుడు ఆ లక్ష్యాలను నిజం చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ అధికారి, ఉద్యోగి సమాజం కోసం, ప్రజల కోసం పనిచేయాలని భట్టి కోరారు. గెలుపొందిన అభ్యర్థులకు అభినందనలు తెలిపిన ఆయన, యావత్ తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

119 మంది ఎమ్మెల్యేల్లో 52 మంది కొత్త వాళ్లే

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత మూడోసారి జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసి అసెంబ్లీలోకి అడుగుపెట్టే ఔత్సాహికులు భారీ సంఖ్యలోనే ఉన్నారు. మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో కొత్తగా అసెంబ్లీలోకి అడుగుపెట్టేవారు 52 మంది ఉండడం విశేషం. కాంగ్రెస్ నుంచి 34 మంది కొత్తగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. బీఆర్‌ఎస్ నుంచి 9 మంది ఉండగా ఇందులో హుజూరాబాద్ నుంచి పోటీ చేసి గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. అదే విధంగా జనగామ నుంచి గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పనిచేశారు. మరో వైపు దుబ్బాక నుంచి గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం మెదక్ నుంచి ఎంపీగా ఉన్నారు. బీజేపీ నుంచి అసెంబ్లీకి వెళ్లే వారు కొత్తగా ఆరుగురు ఉన్నారు. ఎంఐఎం నుంచి కొత్తగా ముగ్గురు ఉన్నారు. వీరంతా తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు.

పార్టీ నేతలందరం ఐక్యంగా ఉండి విజయం సాధించాం
టీజేఎస్, సీపీఐ అందించిన సహకారాన్ని మరువబోం
ప్రజాస్వామిక స్ఫూర్తితో ముందుకు వెళ్తాం..
ప్రతిపక్షాలను కలుపుకొనిపోతాం
ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా ఉండాలి..
చిల్లర రాజకీయాలు వద్దు
ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మాట నిలబెట్టుకుంటామని వెల్లడి

ప్రగతిభవన్‌ను ప్రజాభవన్ చేస్తాం

సామాన్యులకు పరిపాలనను అందుబాటులోకి తీసుకొస్తాం

కాంగ్రెస్ విజయం తెలంగాణ అమరవీరులకు అంకితం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో చాడ, అజీజ్‌పాషా, వీహెచ్, ఠాక్రే, విజయశాంతి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని తెలంగాణ అమరవీరులకు అంకితం ఇస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజల ఆశలకు అనుగుణంగా దేశంలోనే ఆదర్శంగా ఉండేలా పరిపాలన అందిస్తామని.. ఇకపై సచివాలయాన్ని, ప్రగతిభవన్‌ను సామాన్యులకు అందుబాటులో ఉంచుతాని తెలిపారు. తాము ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని ప్రకటించారు. ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమైన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం రేవంత్ రెడ్డి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం డిసెంబర్ 3వ తేదీన శ్రీకాంతాచారి అమరుడయ్యాడని, అదే తేదీన వచ్చిన ఈ ప్రజాతీర్పును శ్రీకాంతాచారికి, తెలంగాణ అమరవీరులకు అంకితం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రజలు పూర్తి సహకారం అందించారని.. అద్భుతమైన తీర్పు ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శంగా ఉండేలా పరిపాలన

ప్రజల ఆశలకు అనుగుణంగా దేశానికే ఆదర్శంగా ఉండేలా పరిపాలన అందిస్తామని రేవంత్ చెప్పారు. ఇక నుంచి సచివాలయాన్ని సామాన్యులకు అందుబాటులో ఉంచుతామని, ప్రగతిభవన్‌ను డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రజాభవన్‌గా మారుస్తామని ప్రకటించారు. ప్రగతిభవన్ ప్రజల ఆస్తి అని, దాన్ని ప్రజలకోసమే వినియోగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 2004 నుంచి 2014 వరకు ఏరకంగా ప్రజాస్వామిక పరిపాలన అందించిందో.. అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ ముందుకు వెళతామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు రాహుల్‌గాంధీ చట్టబద్ధత కల్పిస్తామన్న అంశాలనూ అమలు చేసి మాట నిలబెట్టుకుంటాం. తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి, పేదలను ఆదుకోవడానికి ఈ విజయాన్ని ఉపయోగిస్తామన్నారు. మానవ హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని చెప్పారు.

ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా ఉండాలి

ప్రతిపక్షంలో ఎవరు ఉండాలో ప్రజలు నిర్ణయించారని.. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా ఉండాలని, చిల్లర రాజకీయాలు చేయవద్దని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయాన్ని కేటీఆర్ అభినందించడాన్ని స్వాగతించారు. ప్రజాతీర్పునకు తలవంచి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపక్షం సంపూర్ణంగా సహకరించాలని, మంచి పరిపాలన అందించే విధంగా ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ సహకారం అందిస్తుందని.. గతంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి జరిగిన ప్రయత్నాలు మళ్లీ జరగబోవని భావిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిపక్షాలన్నింటికీ ఆహ్వానం పలుకుతామని తెలిపారు.

భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో..

రాష్ట్రంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా స్ఫూర్తిని నింపారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏ సమస్య వచ్చినా తమకు నైతికంగా అండగా ఉన్నారంటూ రాహుల్‌గాంధీకి, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీలకు, రాష్ట్రంలో పార్టీ అంతర్గత విషయాలను సమన్వయం చేశారంటూ ఠాక్రేకు ధన్యవాదాలు తెలిపారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, మధుయాష్కీ వంటి నేతలందరితో కలసి ఐక్యంగా విజయం సాధించామని చెప్పారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్ పాషా వంటి నేతలు సహకారం అందించారన్నారు. కాంగ్రెస్ విజయంలో తనవంతు పాత్ర పోషించిన విజయశాంతికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సహజ మిత్రులు, ఎన్నికల్లో తమతో కలసి పోటీచేసిన సీపీఐతోపాటు, కలిసి పోటీ చేయని సీపీఎంను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సంపూర్ణ సహకారం అందించిన కోదండరాం, సీపీఐ నేతల సూచనలు, సలహాలను స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి, సినీ నటి విజయశాంతి పాల్గొన్నారు.

ఓడిపోయిన అనుభవం

పలువురు రాజకీయ దిగ్గజాల ఓటమి • కొందరు సీనియర్లదీ అదే పరిస్థితి • అసెంబ్లీ ఎన్నికల్లో షాకిచ్చిన ఓటర్లు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు రాజకీయ దిగ్గజాలకు ఓటర్లు షాక్ ఇచ్చారు. పలుమార్లు విజేతలైన సీనియర్లకూ పరాభవం తప్పలేదు. తిరుగులేదనుకున్న మంత్రులు సైతం ఓటమి పాలయ్యారు. ఆఖరుకు సీఎం కేసీఆర్ కూడా కామారెడ్డి ప్రజలు చేదు అనుభవాన్ని మిగిల్చారు. మరోవైపు సర్వశక్తులూ ఒడ్డి పోరాడిన నేతలు కూడా పరాజయం పాలయ్యారు. ఇలాంటి కొన్ని ఆసక్తికర ఫలితాలను పరిశీలిస్తే...

- ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా జీవితంతో పెనవేసుకున్న నేత. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. వరుసగా రెండుసార్లు సీఎంగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా అపారమైన అనుభవం ఉంది. ఈసారి ఎన్నికల్లో రెండుచోట్ల పోటీ చేసిన ఆయన గజ్వేల్‌లో గెలిచినా కామారెడ్డిలో మాత్రం ఓడిపోయారు.
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ హయాంలోనే సీనియర్ నేత. ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట, పాలకుర్తి నుంచి ఆరు పర్యాయాలు గెలిచిన నాయకుడు. ఈసారి మాత్రం పిన్న వయస్కురాలు, కొత్తగా రాజకీయ అరంగ్రేటం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని ఆయన్ను ఖంగు తినిపించారు.
- ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కి తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు రాజకీయ వారసత్వం ఉంది. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి, 2018లో అదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కేసీఆర్ మంత్రి వర్గంలో కీలక మంత్రి. కానీ ఈసారి తుమ్మల నాగేశ్వరరావు చేతుల్లో ఓటమి ఎదురైంది.
- బండి సంజయ్ పరిచయం అక్కర్లేని బీజేపీ నేత. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీకి ఊపు తెచ్చిన వ్యక్తి. కరీంనగర్ ఎంపీగా విజయం సాధించిన నేపథ్యం ఆయనది. కానీ ఈసారి కరీంనగర్ స్థానంలో పరాజయం చవిచూశారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్‌దీ ఇదే పరిస్థితి.
- తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌తో కలిసి పోరాడిన చరిత్ర ఈటల రాజేందర్‌ది. కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక, వైద్యశాఖ మంత్రిగా పనిచేశారు. బీఆర్‌ఎస్‌తో వివాదం రావడంతో బీజేపీలో చేరారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి రికార్డు సృష్టించారు. ఈసారి మాత్రం ఓటమి తప్పలేదు.
- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ స్థానానికి 2014 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ తరఫున 2014లో గెలిచారు. 2018లోనూ విజయం సాధించారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ గాలికి పరాజయం తప్పలేదు. మరో సీనియర్ నేత జోగు రామన్నదీ ఇదే అనుభవం. ఆదిలాబాద్ స్థానంలో 2009 నుంచి విజయాలను నమోదు చేశారు. 2023 ఎన్నిక ఆయనకు ఓటమిని అందించింది.
- ఉమ్మడి నిజామాబాద్‌లోని బాన్సువాడ, ఆర్మూర్, నిజామాబాద్ స్థానాల నుంచి మూడుసార్లు విజయం సాధించిన బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి కూడా అనుభవం ఈ ఎన్నికల్లో పనిచేయలేదు.

అసెంబ్లీలో అడుగు పెట్టనున్న బంధుగణం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన బంధుగణం భారీ విజయాలను మూట గట్టుకుంది. భార్యాభర్తలు, తండ్రీకొడుకులు, అన్నదమ్ములు, మామఅల్లుళ్లు గెలుపుతీరాలకు చేరారు. బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు(గజ్వేల్), ఆయన కుమారుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు(సిరిసిల్ల), మేనల్లుడు హరీశ్‌రావు(సిద్దిపేట) నుంచి గెలుపొందారు. మంత్రి చామకూర మల్లారెడ్డి(మేడ్చల్), ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి) నుంచి గెలుపొందారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను పక్కన పెట్టి గెలుపుగుర్రాలకే టికెట్ ఇవ్వాలనే కాంగ్రెస్ వ్యూహం ఫలించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసిన కెప్టెన్ ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు విజయం సాధించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(హుజూర్‌నగర్), ఆయన భార్య పద్మావతి(కోదాడ) నుంచి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ), ఆయన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నుంచి గెలుపొందారు. మాజీమంత్రి గడ్డం వినోద్(బెల్లంపల్లి), ఆయన సోదరుడు వివేక్ (చెన్నూరు) నుంచి విజయం సాధించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరి వివేక్ టికెట్ దక్కించుకోవడం గమనార్హం. బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చినా తిరస్కరించి కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కుమారుడు రోహిత్‌రావు(మెదక్) నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.

ఓయూలో సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో నియంత పాలన అంతమైందని పీసీసీ మాజీ జాయింట్ సెక్రెటరీ, ఓయూ పరిశోధక విద్యార్థి ఏగూరి ఉదయ్‌కుమార్, టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు తూము నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించగానే ఆర్ట్స్ కాలేజీ వద్దకు పెద్ద సంఖ్యలో విద్యార్థి, నిరుద్యోగులు, విద్యార్థి నాయకులు చేరుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏగూరి ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పార్టీ మారినా.. ఓటమి తప్పలే..!



సాక్షి, హైదరాబాద్: శాసనసభ 2018 ఎన్నికల్లో గెలుపొందిన విపక్ష ఎమ్మెల్యేల్లో 16 మంది బీఆర్‌ఎస్ గూటికి చేరుకున్నారు. వీరిలో ఇద్దరికి ప్రస్తుత ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ నిరాకరించడంతో 14 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పోటీ చేశారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆత్రం సక్కు (ఆసిఫాబాద్ -ఎస్టీ), స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన లావ్యుడా రాములు నాయక్ (వైరా ఎస్టీ) బీఆర్‌ఎస్‌లో చేరినా ప్రస్తుత ఎన్నికలో టికెట్ దక్కలేదు. గత ఎన్నికలో టీడీపీ నుంచి గెలుపొందిన మెచ్చా నాగేశ్వర్‌రావు (అశ్వారావుపేట ఎస్టీ), సండ్ర వెంకట వీరయ్య (సత్తుపల్లి ఎస్సీ)తో పాటు కాంగ్రెస్ నుంచి 12 మంది కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్ (ఎల్లారెడ్డి), సుధీర్‌రెడ్డి (ఎల్‌బీ నగర్), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), పైలట్ రోహిత్‌రెడ్డి (తాండూరు), బీరం హర్షవర్ధన్‌రెడ్డి (కొల్లాపూర్), చిరుమర్తి లింగయ్య (నకిరేకల్ ఎస్సీ), గండ్ర వెంకట రమణారెడ్డి (భూపాలపల్లి), రేగా కాంతారావు (పినపాక ఎస్టీ), హరిప్రియ భానోత్ (ఇల్లందు ఎస్టీ), కందాల ఉపేందర్ రెడ్డి (పాలేరు), వనమా వెంకటేశ్వర్‌రావు (కొత్తగూడెం), ఆత్రం సక్కు (ఆసిఫాబాద్ ఎస్టీ) బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా బరిలోకి దిగారు. వీరిలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), దేవిరెడ్డి సుధీర్ రెడ్డి (ఎల్‌బీనగర్) మాత్రమే తిరిగి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ వీడి.. గెలుపుతీరానికి చేరి..

బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరి టికెట్లు దక్కించుకున్న పలువురు నేతలు గెలుపు తీరాలకు చేరారు. బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చినా నిరాకరించి కాంగ్రెస్‌లోకి వెళ్లి తనతో పాటు తన కుమారుడికి టికెట్ సాధించుకున్న మైనంపల్లి హన్మంతరావు మాత్రం ఓటమి చెందారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), వేముల వీరేశం (నకిరేకల్), మందుల సామేలు (తుంగతుర్తి), తుమ్మల నాగేశ్వర్‌రావు (ఖమ్మం), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (పాలేరు), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కోరం కనకయ్య (ఇల్లందు), మనోహర్‌రెడ్డి (తాండూరు), గండ్ర సత్యనారాయణ (భూపాలపల్లి), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (భువనగిరి), కూచుకుళ్ల రాకేశ్ రెడ్డి (ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి కుమారుడు), వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్) గెలుపొందారు. సరితా తిరుపతయ్య (గద్వాల), శ్యామ్ నాయక్ (ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ భర్త - ఆసిఫాబాద్), జగదీశ్వర్ గౌడ్ (శేరిలింగంపల్లి) తదితరులు కాంగ్రెస్‌లో చేరి టికెట్ దక్కించుకున్నా గెలుపు తీరాలకు చేరలేకపోయారు. బోగా శ్రావణి (జగిత్యాల), ఆరేపల్లి మోహన్ (మానకొండూరు), కందుల సంధ్యారాణి (రామగుండం), పులిమామిడి రాజు (సంగారెడ్డి), కేసీఆర్ రత్నం (చేవెళ్ల) బీజేపీలో, నీలం మధు (పటాన్‌చెరు) బీఎస్పీలో చేరి టికెట్లు దక్కించుకున్నా ఫలితం లేకపోయింది.

డీజీపీపై ఈసీ సస్పెన్షన్ వేటు

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని అంజనీకుమార్ కలవడంపై ఆగ్రహం
- రేవంత్‌ను కలిసిన అదనపు డీజీలు సంజయ్‌కుమార్ జైన్, మహేశ్ భగవత్‌లకు నోటీసులు
- నూతన డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు



రేవంత్‌ను అభినందిస్తున్న డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు డీజీపీ అంజనీకుమార్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేసింది. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందే అంజనీకుమార్‌తోపాటు అదనపు డీజీలు సంజయ్‌కుమార్ జైన్, మహేశ్ భగవత్‌లు పీసీసీ అధ్యక్షుడు, కొడంగల్, కామారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి అభినందించారు. వాటి ఫొటోలు, వీడియోలు మీడియాలో రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. దీనిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని నివేదిక కోరింది. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 12:45 గంటల మధ్య హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని ముగ్గురు అధికారులు కలిసినట్లు సీఈఓ నివేదిక పంపారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఈసీ డీజీపీని వెంటనే సస్పెండ్ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది. అంజనీకుమార్ తర్వాత అర్హులైన సీనియర్ పోలీస్ అధికారిని డీజీపీగా నియమించాలని పేర్కొంది.

ఆదర్శంగా ఉండాల్సింది పోయి..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికల విధుల్లో ఉన్న ఏ అధికారి రాజకీయ పార్టీలకు, నాయకులపట్ల పక్షపాత ధోరణి కలిగి ఉండవద్దని నిబంధనలు ఉన్నా ఎలా ఉల్లంఘించారని తన నోటీసులో డీజీపీ అంజనీకుమార్‌ను ఈసీ ప్రశ్నించింది. డీజీపీగా పోలీస్‌శాఖ మొత్తానికి బాస్‌గా ఇతర సిబ్బందికి ఆదర్శంగా ఉండాల్సిన అధికారే నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలా? అని నిలదీసింది. ఎన్నికల్లో 2,290 మంది అభ్యర్థులు, 16 పార్టీలు పోటీలో ఉండగా ఒక పార్టీ స్టార్ క్యాంపెయినర్, ఒక రాజకీయ పార్టీ అభ్యర్థి ఇంటికి ఎన్నికల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుండగానే వెళ్లి శుభాకాంక్షలు చెప్పడాన్ని ఈసీ తప్పుబట్టింది. డీజీపీ మరో ఇద్దరు సీనియర్ పోలీస్ అధికారులతో వెళ్లి సదరు నాయకుడిని కలవడం వెనుక.. ఆ నాయకుడి నుంచి ఏదో లబ్ధి పొందాలన్న దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. డీజీపీ చర్యలనే క్షేత్రస్థాయిలోని పోలీసులు పాటిస్తూ ఎన్నికల కౌంటింగ్ విధులు వదిలి పార్టీల అభ్యర్థులను కలవడం ప్రారంభిస్తే ఎన్నికల ప్రక్రియ ఊహించనలేనంత వినాశకరంగా మారుతుందని ఈసీ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే డీజీపీని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించడంతోపాటు అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

డీజీపీగా రవిగుప్తా నియామకం..

రాష్ట్ర పోలీస్‌శాఖ బాస్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి రవిగుప్తా నియమితులయ్యారు. డీజీపీ అంజనీకుమార్‌పై ఈసీ సస్పెన్షన్ వేటు నేపథ్యంలో ఆయన స్థానంలో డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏసీబీ డీజీగా కొనసాగుతున్న రవిగుప్తా పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో డీజీపీగా కొనసాగనున్నారు.

కాంగ్రెస్ గెలుపుతో టీజేఎస్ సంబరాలు



ముషీరాబాద్ (హైదరాబాద్): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల తెలంగాణ జనసమితి (టీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. అమరవీరులస్తూపం వద్ద, ముషీరాబాద్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ విజయంతో కుటుంబ పాలనకు చరమగీతం పాడినట్లు అయిందని వారు అభిప్రాయపడ్డారు.

ఆ అరడజను అటూ ఇటూ అయితే!

- బీఆర్‌ఎస్ అంచనాలు తలకిందులు
- బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంకు 54 సీట్లు
- కేవలం 5 వేల ఓట్ల లోపు తేడాతో ఆరుగురి ఓటమి

సాక్షి, హైదరాబాద్: సొంత బలంతోనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఎంఐఎం, బీజేపీ మద్దతు తీసుకునే అవకాశం, ఆ మేరకు లెక్కల నేపథ్యంలో.. బీఆర్‌ఎస్ అంచనాలను ఓ అరడజను స్థానాలు తలకిందులు చేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ 39, బీజేపీ 8, ఎంఐఎం 7 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఏర్పాటుకు 60 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా, ఈ మూడు పార్టీలు కలిసి 54 స్థానాల్లోనే గెలుపొందాయి. బీఆర్‌ఎస్ మరో అరడజను స్థానాలు గెలిచి ఉంటే భిన్న ధ్రువాలైన ఈ రెండు పార్టీల మద్దతు అవసరమయ్యేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. వాస్తవానికి బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓ అరడజను స్థానాల్లో కేవలం ఐదు వేల ఓట్ల లోపు తేడాతో మాత్రమే ఓటమి పాలయ్యారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (దేవరకద్ర, 1,392 ఓట్లు), జాన్సన్ నాయక్ (ఖానాపూర్, 4,702 ఓట్లు), హన్మంతు షిండే (జుక్కల్, 1,152), మర్రి జనార్దన్ రెడ్డి (నాగర్‌కర్నూలు, 5,248 ఓట్లు), కోనేరు కోనప్ప (సిర్పూర్, 3,088 ఓట్లు), ఆమిర్ షకీల్ (బోధన్, 3,062 ఓట్లు) వీరిలో ఉన్నారు. కాగా బొటాబొటి ఆధిక్యతతో అయినా ఈ స్థానాల్లో విజయం సాధించి ఉంటే లెక్కలు తారుమారయ్యేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2.05% ఓట్ల తేడాతో ఓటమి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 39.4 శాతం ఓట్లతో అగ్రస్థానంలో నిలవగా, బీఆర్‌ఎస్ 37.35 శాతం ఓట్లను సాధించింది. కేవలం 2.05 శాతం ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడం గమనార్హం. కాగా బీజేపీ 13.9 శాతం, ఎంఐఎం 2.22 శాతం, బీఎస్పీ 1.37శాతం ఓట్లను దక్కించుకున్నాయి. ఎన్నికల్లో పోలైన మొత్తం 2,32,59,256 ఓట్లలో కాంగ్రెస్ 92,35,792, బీఆర్‌ఎస్ 87,53,924, బీజేపీ 32,57,511, ఎంఐఎం 5,19,379 ఓట్లను సాధించాయి.

అటు ఐదు.. ఇటు ఐదు

- బీఆర్‌ఎస్ వెంటే హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్
- బీజేపీని ఆదరించిన ఆదిలాబాద్, నిజామాబాద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలు ఈసారి విభిన్నంగా తీర్పు ఇచ్చాయి. ఐదు ఉమ్మడి జిల్లాలు పూర్తిగా కాంగ్రెస్ వైపు నిలవగా.. మరో ఐదు జిల్లాలు బీఆర్‌ఎస్, బీజేపీలను ఆదరించాయి. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లోని మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా విజయం సాధించింది. మిగతా ఐదు జిల్లాల్లో నామమాత్రంగా నిలిచింది. ఉమ్మడి హైదరాబాద్ రెవెన్యూ జిల్లా పరిధిలో అయితే హస్తం ఖాతా కూడా తెరవలేదు. రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కొన్నిసీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఊహించినట్టుగానే ఆదుకున్న దక్షిణం

మొదటి నుంచీ దక్షిణ తెలంగాణ జిల్లాలు కాంగ్రెస్ పార్టీని నిలబెడుతూ వస్తున్నాయి. ఉమ్మడి ఏపీ అయినా, తెలంగాణ ఏర్పాటయ్యాక అయినా దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ చెప్పుకోదగిన స్థానాల్లో విజయం సాధిస్తూ వస్తోంది. ఈసారి ఇది మరింత ఏకపక్షంగా మారింది. ముఖ్యంగా నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో వార్ వన్‌సైడే అన్నట్టు ఫలితాలు వచ్చాయి. నల్లగొండలోని 12 స్థానాల్లో 11 చోట్ల, ఖమ్మంలోని పదింటిలో తొమ్మిదిచోట్ల మహబూబ్‌నగర్‌లోని 14 సీట్లలో 12 చోట్ల.. వరంగల్‌లోని 12 స్థానాలకు 10 చోట్ల, కరీంనగర్‌లోని 13 స్థానాలకు గాను 8 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. కాంగ్రెస్‌కు వచ్చిన 64 సీట్లలో ఈ ఐదు జిల్లాల్లోనివే 50 స్థానాలు కావడం విశేషం.

ఎదురుదెబ్బలు గుణపాఠంగా తీసుకుంటాం

▶ మొదటి పేజీ తరువాయి

అనుగుణంగా కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని ఆశిస్తున్నాం.119 అసెంబ్లీ స్థానాలకు 39 సీట్లలో గెలిపించి ప్రతిపక్ష పాత్ర పోషించాలని మమ్మల్ని ప్రజలు ఆదేశించారు. ఆ పాత్రను సమర్థవంతంగా, బాధ్యతగా నిర్వహిస్తాం. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రభుత్వాన్ని ఎంత సమర్థవంతంగా, విశ్వాసంగా నడిపామో, ప్రతిపక్షంగా కొత్తపాత్ర కూడా అదే పద్ధతిలో నిర్వర్తిస్తాం. పార్టీ ఆవిర్భావం నుంచి 23 ఏళ్లుగా ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి. ఈ ఎదురుదెబ్బలను ఒక గుణపాఠంగా తీసుకొని, నేర్చుకోవాల్సినవి నేర్చుకుని ముందుకు సాగుతాం..'అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తాం

'పార్టీ తరఫున ఎన్నికైన శాసనసభ్యులందరికీ శుభాకాంక్షలు. వారి గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణితి ప్రదర్శించి, ప్రజా తీర్పును శిరోధార్యంగా భావించి రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు పంపారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం. వెంటనే ఇరుకున పెట్టే ప్రయత్నం చేయబోం. కుదురుకునేంత వరకు వేచిచూస్తాం. పదేళ్లు అధికారంలో ప్రజలకు సేవలందించిన మేము ప్రతిపక్ష పాత్రలో కూడా అలవోకగా ఇమిడిపోతాం. ప్రజల పక్షాన వారి గొంతుకై ప్రశ్నిస్తాం. కొత్త ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి..'అని కేటీఆర్ అన్నారు.

ఇది ఓ చిన్న స్పీడ్ బ్రేకర్ మాత్రమే..

'తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం సాగించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. ప్రజల దయతో రెండుసార్లు అధికారంలోకి వచ్చి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేశాం. ఎన్నికల ఫలితాలు కొంత నిరాశ పరిచినా బాధ, అసంతృప్తి లేదు. రాజకీయాల్లో స్థిత ప్రజ్ఞత అవసరం. గెలుపోటములు సహజం. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కేసీఆర్ చెప్పిన మాటలు శిరోధార్యం. ఈ ఓటమి చిన్న స్పీడ్ బ్రేకర్ మాత్రమే. ఓటమిపై సమీక్ష జరుపుకొని చిన్న చిన్న మార్పులు చేసుకొని కేసీఆర్ నాయకత్వంలో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. ప్రజల మన్ననలు తిరిగి పొందుతాం. ఓటమిపై ఆందోళన పడాల్సి న అవసరం లేదు..' అని చెప్పారు.

దృఢ సంకల్పంతో ముందుకు సాగుతాం

'తెలంగాణ ప్రజల శ్వాసగా కొనసాగించిన ప్రస్థానాన్ని మరింత దృఢ సంకల్పంతో ముందుకు కొనసాగిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదు. హైదరాబాద్ మహా నగరం, మెదక్ జిల్లా అండగా నిలిచాయి. కరీంనగర్‌లో ఐదు సీట్లు గెలిచాం. దేవరకద్రతో పాటు కొన్నిచోట్ల స్వల్ప తేడాతో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అనూహ్యంగా మా మంత్రులు కూడా ఓడిపోయారు. సింగరేణిలో కార్మిక సంక్షేమం కోసం ఎంతో చేశాం. వారసత్వ ఉద్యోగాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలన్నీ చేసినా అక్కడ కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచారు. ఇలాంటివి సమీక్షించుకొని ముందుకు పోవలసి ఉంది. కేసీఆర్ నాయకత్వంలో సర్వశక్తులు ఒడ్డి పోరాటం చేద్దాం..'అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, వారికి తమ పార్టీ తరఫున అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వానికి సహకరించిన అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధ లేదు.. నిరాశే

'అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎలాంటి బాధ లేదు. కానీ మేము ఆశించిన తరహాలో లేకపోవడం ఖచ్చితంగా నిరాశకు గురి చేసింది. వరుసగా రెండు పర్యాయాలు మాకు అధికారం ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలకు కృతజ్ఞులం. ప్రజాభిమానం చూరగొన్న కాంగ్రెస్‌కు అభినందనలు. అంతా మంచి జరగాలని కోరుకుంటున్నా' అని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'హ్యాట్రిక్ లోడింగ్ 3.0..సంబురాలకు సిద్ధంగా ఉండండి' అంటూ శనివారం చేసిన పోస్టును ట్యాగ్ చేస్తూ లక్ష్యాన్ని చేరలేకపోయామని తెలిపారు.



రాక్షసుడితో ఎవరు పోరాటం సలుపుతున్నారో,
ఆ ప్రక్రియలో వారు కూడా రాక్షసుడు కాకుండా చూసుకోవాలి.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 4 డిసెంబర్ 2023

చీకటి వెలుగులు

విశాల విశ్వంలో సృష్టి సమస్తం ద్వంద్వాలమయం. ఈ ప్రపంచం ద్వంద్వాలమయం. లోకంలో వెలుగు చీకట్లుంటాయి. నిప్పూ నీరూ ఉంటాయి. తీపి చేదులుంటాయి. రేయింబగళ్లు ఉంటాయి. ఎండా వానా ఉంటాయి. శీతోష్ణాలుంటాయి. శిశిర వసంతాలుంటాయి. జీవితంలో సుఖదుఃఖాలు ఉంటాయి. ఆశ నిరాశలు ఉంటాయి. శాంతి అశాంతులు ఉంటాయి. గెలుపు ఓటములు ఉంటాయి. ఉత్థాన పతనాలు ఉంటాయి. మన వేదాంతం ఎంతగా అద్వైత సిద్ధాంత బోధ చేస్తున్నా, మానవమాత్రులైన వారెవరూ ద్వంద్వాతీతులు కారు, కాలేరు. మనుషులకు మాత్రమే కాదు, ఈ భూమ్మీద పుట్టిన ప్రతి జీవిలోనూ ఆడా మగా ఉంటాయి. ప్రతి జీవికీ చావుపుట్టుకలు ఉంటాయి. ప్రతి జీవితానికీ ఆద్యంతాలుంటాయి. ద్వంద్వబంధురమైన సృష్టి ప్రకృతి సహజం. సృష్టిలో ఇన్ని ద్వంద్వాలే లేకుంటే, ప్రకృతికి ఇంతటి సౌందర్యమెక్కడిది? జీవితానికి ఇంతటి వైవిధ్యమెక్కడిది?

అద్వైతం అందమైన భావన. ఆధ్యాత్మిక ప్రవచనాల్లో 'బ్రహ్మ సత్యం... జగన్మిథ్య' అనే అద్వైత బోధను ఆలకించేటప్పుడు తన్మయత్వంతో కాసేపు ఓలలాడవచ్చేమో గాని, అది క్షణికమే! ఆ తర్వాత మిథ్యా మైకం నుంచి బయటపడ్డాక మనమింకా ద్వంద్వాల వలయంలోనే ఉన్నామన్న సంగతి ఎరుకపడటానికి ఎంతోసేపు పట్టదు. 'మనకు రెండు కళ్లు, రెండు కాళ్లున్నట్లే ద్వంద్వాలన్నీ మన జీవితంలో భాగమే!' అన్నాడు కార్లోస్ సాంటానా. అలాగని అతడేమీ తత్త్వవేత్త కాదు, వేదాంతి కాదు, కనీసం ప్రవచనకర్తయినా కాదు గాని, వారెవరికీ లేని ఎరుక అతడికి ఉంది. కార్లోస్ సాంటానా అమెరికన్ గిటారిస్ట్. అయినా, సృష్టిలోని ద్వంద్వాలను అర్థం చేసుకోవడానికి తత్త్వవేత్తలో, వేదాంతులో, ప్రవచనకర్తలో కానక్కర్లేదు... ఇసుమంత ఇంగితమున్న మనుషులైతే చాలు!

ద్వంద్వాలు మన వెలుపలే కాదు, మన లోపల కూడా ఉన్నాయి. ద్వంద్వాల నడుమ నిత్యసంఘర్షణే ప్రకృతి ధర్మం. 'మానవ జీవితమే మహాభారతం/ అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం' అన్న ఆరుద్ర మాటలు ఇందుకు చిన్న ఉదాహరణ. మన జీవితాలను నిర్దేశించేవి జ్ఞానాజ్ఞానాలు, ధర్మాధర్మాలు, న్యాయాన్యాయాలు, ఉచితానుచితాలు, రాగద్వేషాలు, నీతి అవినీతి వంటి ద్వంద్వాలే! విశ్వానికి మూలం తొలుత ఏకపదార్థమేనని, కాలక్రమంలో అది ద్వంద్వాలుగా విడిపోయిందని పాశ్చాత్య తత్త్వవేత్తల్లో కొందరి భావన. సృష్ట్యాదిలో ప్రపంచమంతా జలమయమై ఉండేదని మన పురాణాల కథనం. గ్రీకు తత్త్వవేత్త థేలీస్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. థేలీస్ అభిప్రాయాన్ని అతడి శిష్యుడు అనగ్జిమాండర్ ఖండించాడు. 'ఏదో ఒక అనిశ్చిత, అనిర్దిష్ట, అజ్ఞాత పదార్థం సమస్త స్థలాన్నీ ఆవరించి ఉండేది. అది అనంతం, అనశ్వరం' అని అనగ్జిమాండర్ అన్నాడు. సృష్టికి మూలమైన పదార్థం ద్వంద్వాతీతమైనదో కాదో ఇప్పటికీ ఎవరికీ తెలీదు గాని, మన చుట్టూ ఉన్న ద్వంద్వాలు, మన లోపలున్న ద్వంద్వాలు అందరికీ అనుభవపూర్వకమే!


జీవితంలో అడుగడుగునా తారసపడే ద్వంద్వాలే మన జీవన గమనాన్ని నిర్దేశిస్తాయి. ఎంతటి వారైనా జీవితంలో ఎదురయ్యే ద్వంద్వాలను అతిక్రమించలేరు. వాటి ఉనికిని గుర్తించకుండా ఉండలేరు. వాటికి అతీతంగా బతకలేరు. కాబట్టి మనం ద్వంద్వాలను నిర్ద్వంద్వంగా అంగీకరించక తప్పదు. లోకంలో కొందరు మనుషులు మంచివాళ్లుగా, మహానుభావులుగా చలామణీ అవుతారు. కొందరు దుర్మార్గులుగా, చెడ్డవాళ్లుగా పేరుమోస్తారు. నిజానికి ఎవరూ పూర్తిగా మంచివాళ్లుగా గాని, పూర్తిగా చెడ్డవాళ్లుగా గాని ఉండరు. జీవితంలో ఎదురయ్యే పరిస్థితులు, వాటికి స్పందించే తీరుతెన్నులే మనుషుల మంచిచెడులను బయటపెడతాయి. అందుకే 'మనుషులందరూ మంచి చెడుల సమ్మేళనాలే' అన్నాడు స్కాటిష్ రచయిత రాబర్ట్ లూయీ స్టీవెన్సన్.

'కృతా కృతేచ ద్వంద్వాని కదా శాంతాని కస్యవా/ ఏవం జ్ఞాత్వేహ నిర్వేదాత్ భవ త్యాగపరో వ్రతీ' అని అష్టావక్రుడు జనక మహారాజుకు చెప్పాడు. కృతాకృత కర్మకలాపాలు, సుఖదుఃఖాది ద్వంద్వాలు శాంతించినప్పుడు భక్తుడు సంశయరహితుడై జ్ఞాని అవుతాడని, అప్పుడు వైరాగ్య వ్రతం చేయకున్నా త్యాగపరాయణుడవుతాడని ఈ శ్లోకానికి అర్థం. జనకుడికి అష్టావక్రుడు చేసిన ఈ వేదాంత బోధ 'అష్టావక్రగీత'గా ప్రసిద్ధి పొందింది. అష్టావక్రుడు తన గీతబోధలో ద్వంద్వాల ఉనికిని నిరాకరించలేదు. కాకుంటే, అవి శాంతించాలన్నాడు. ద్వంద్వాల మధ్య సమతుల్యతను సాధించినప్పుడే అవి శాంతిస్తాయి. సుఖదుఃఖాలు, రాగద్వేషాల వంటి సహజాతి సహజమైన ద్వంద్వాలకు కొంత మోతాదుకు మించి స్పందించడం మానవ స్వభావం. ద్వంద్వాల ప్రభావాన్ని సమానంగా స్వీకరించి, ఆత్మావలోకనం చేసుకోగల సామర్థ్యమే స్థితప్రజ్ఞ! కాకపోతే, మనుషుల్లో స్థితప్రజ్ఞులు అరుదు. ముఖ్యంగా ప్రజల మధ్య గడిపే రాజకీయ నేతల్లో, సినీతారల్లో మరీ అరుదు.

ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల్లో జయాపజయాలు సర్వసాధారణాలు. ప్రజామోదం పొందిన వారు ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తారు. ప్రజాదరణ కొరవడిన వారు పరాజితులవుతారు. గెలుపొందిన వారు 'అంతా తమ ప్రయోజకత్వం/ తామే భువి కధినాథులమనుకొని ' విర్రవీగితే మాత్రం తర్వాతి ఎన్నికల్లో పర్యవసానాన్ని చవిచూడక తప్పదు. పరాజితులు ఇంతే తమ కర్మమనుకుని కుంగిపోయినా, తమను ఆదరించని ప్రజలను నిందించినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. ఘనవిజయాలు సాధించినప్పుడు బాధ్యతలను గుర్తెరిగి అప్రమత్తంగా ప్రవర్తించాలి. అపజయాలు ఎదురైనప్పుడు ఆత్మవిమర్శ చేసుకుని, లోపాలను సవరించుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. ఎన్నికల క్రతువులో ఘనవిజయాలూ శాశ్వతం కావు, అపజయాలూ శాశ్వతం కావు. శాశ్వతం కానివని తెలిసి తెలిసి ఫలితాలను తలకెక్కించుకుంటేనే ప్రమాదం.

నూతన ప్రభుత్వానికో ప్రేమలేఖ!

అభిప్రాయం



ప్రొ॥ జయధీర్ తిరుమలరావు

గతం నాస్తి కాదు. అది దారి దీపం. ఈ దీపం వెలుగుతూనే ఉండాలంటే సుపరిపాలన, ప్రజా దృక్పథం, జన సంక్షేమం అనే చమురు నిరంతరం పడుతుండాలి. తెలంగాణ ప్రజాకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలతో పాటు నడిచిన నాయకత్వానికి ప్రజలు అండదండలు అందించారు. 1200 మంది బలిదానాల పునాది మీద అధికారం చేజిక్కించుకుని వారి పాత్రను కావాలని విస్మరించి తామే తమ కుటుంబం త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించామని విర్రవీగుతూ ప్రజలనూ, పౌర సమాజాన్నీ అవమానించినందుకు నిశ్శబ్ద నిరసనే తాజా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిగా భావించాలి. ఇక నూతన పాలకులు అన్ని కులాలకూ ప్రాతినిధ్యం కల్పించాలి. దొరల రాజ్యం పోయి పటేళ్ళ రాజ్యం వచ్చిందని అనుకోకుండా చూడాలి.

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు గెలుస్తాయా? లేదా ప్రజలు గెలుస్తారా? ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే రాబోయే ఐదేళ్ళ రాజకీయం, పౌరసమాజం మధ్య వైరుధ్యాలు తలెత్తకుండా మరిన్ని విజయాలు సాధించవచ్చు. రాబోయే లోక్‌సభ, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకోకపోతే దేశవ్యాప్త అపజయానికి దారి తీసినట్టే!

ఓట్లు వేయించుకునేది రాజకీయ నాయకులు. వేసేది ప్రజలు. ఒక్కోసారి ఒక్క ఓటు కూడా ప్రభావం చూపుతుంది. అంతటి ప్రాధాన్యం ఓటుకు ఉంది. అందుకే ప్రజల పాత్రకు విలువ. పార్టీల జయాపజయాలను నిర్ణయించేది ప్రజలే! అటువంటి ప్రజలను విస్మరించిన పార్టీలకు అపజయం తప్పదు. తప్పటడుగులు వేస్తే, అధికారం హక్కుభుక్తమని విర్రవీగితే... ఇవాళ గెలిచిన పార్టీకి కూడా రేపు ఇదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే విజయానంతర పరిస్థితి రాబోయే విజయానికో, అపజయానికో భూమిక అవుతుంది.

గతం నాస్తి కాదు. అది దారి దీపం. ఈ దీపం వెలుగుతూనే ఉండాలంటే సుపరిపాలన, ప్రజా దృక్పథం, జన సంక్షేమం అనే చమురు నిరంతరం పడుతుండాలి. తెలంగాణ ప్రజాకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలతో పాటు నడిచిన నాయకత్వానికి ప్రజలు అండదండలు అందించారు. 1200 మంది బలిదానాల పునాది మీద అధికారం చేజిక్కించుకుని వారి పాత్రను, ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ లాంటి అనేకమంది పాత్రను కావాలని విస్మరించి తామే తమ కుటుంబం త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించామని విర్రవీగుతూ ప్రజలనూ, పౌర సమాజాన్నీ అవమానించినందుకు నిశ్శబ్ద నిరసనే తాజా తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాల సరళిగా భావించాలి.

గమనిస్తే... ఏక కుటుంబ పాలన తెలంగాణ ప్రజలను అసహ్యించుకునేలా చేసింది. అంతేకాదు. తాము చేసిన ప్రతి తప్పునూ ఆ నలుగురు మైకుల ముందు, పత్రికా ప్రకటనల రూపంలో ఊదరగొట్టడం అసహ్యించుకున్నారు. అలాంటి ధోరణికి దూరంగా ఉండాలి. తాము చెప్పిందే వేదం, చేసిందే చట్టం అన్నట్టుగా విర్రవీగే తత్వం ప్రజలను దాదాపుగా ప్రతిఘటించేట్లుగా చేసింది. అయితే ఊరిలో దొర మనస్తత్వం ఎట్లా ఉంటుందంటే తమను వ్యతిరేకించే వారు పుట్టి ఉండరు అని అనుకుంటారు.

ప్రజలు కట్టిన డబ్బును పట్టుకొని... తమ సొంత డబ్బు ఇస్తున్నట్టుగా సంక్షేమ పథకాల పంపిణీలో ప్రతిబింబించింది. ఆ పథకాల గురించి వేల కోట్ల రూపాయల ప్రకటనలు గుప్పించడంలో కూడా తమ ఫోటోలు, వ్యక్తిగత ప్రచారాలు అత్యధిక స్థాయికి



తెలంగాణ సచివాలయం

చేరుకున్నాయి. ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిసి కూడా వ్యక్తిగత అహంభావం వల్ల సవరించుకోలేదు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటులో, తదనంతర పాలనలో... దళితుల, ఆదివాసీల, వెనకబడిన వర్గాల ప్రయోజనాలను నెరవేర్చాలి. ఎందుకంటే ఈ పదేళ్ళ పాలనలో వారు వంచించబడ్డారు. ముఖ్యమంత్రి పదవి ఇస్తానన్న దగ్గర నుండి, 'దళిత బంధు' స్కీమ్ వరకు అడుగడుగునా మోసగింపునకు గురయ్యారు. ఓటు బ్యాంక్‌గా వారిని వాడుకున్నారు. దళితులలో గల రెండు ప్రధాన కుల సమాజాలను విడదీసి ఒక వర్గాన్నే చేరదీసిన ఫలితమే... ఎస్సీ నియోజకవర్గాలలో ఫలితాలు!

అలాగే ఆదివాసుల బతుకులు ఆగమాగం చేయబడ్డాయి. ఆదివాసీ తెగల మధ్య వైషమ్యాలు తలెత్తినప్పుడు ఒక తెగ వైపే మద్దతునిచ్చి మిగతా 17 తెగ, ఉప తెగలను వంచించారు. పోలీసు, అటవీ శాఖల వంటివి వారిని అగౌరవపరిచాయి. వారి భూములను లాక్కున్నాయి. బతికే స్వేచ్ఛను హరించింది ప్రభుత్వం. నాలుగేళ్ల క్రితం అసెంబ్లీ సాక్షిగా, అసెంబ్లీ నుండి అడవులకు వెళ్లి ప్రత్యక్ష పరిశీలన జరిపి పోడు సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన అధినాయకుడు తీరా వారి గురించి మాట్లాడడం మరిచాడు.

మేడారంలో జరిగే 'సమ్మక్క – సారక్క' జాతరకు వెళ్ళి మొక్కులు చెల్లించలేదు. అలాగే గోండుల ఆరాధ్య దైవం 'నాగోబా' జాతరకు కూడా వెళ్ళలేదు. తెలంగాణ వచ్చాక, అంతకు ముందు కన్నా వారి జీవితంలో ఎలాంటి మార్పూ లేదు. పైగా అవమానాలు పెరిగాయి. అందుకే ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గులాబీ జెండా అవనతం అయింది. ఇతర ఆదివాసుల పేరుతో ఎన్నికల్లోనూ, సంక్షేమ పథకాల్లోనూ అన్యాయం జరిగింది.

తెలంగాణ అస్తిత్వ చైతన్యం భావన మరింత పెరుగుతుంటే దాన్ని త్రుంచివేయడం జరిగింది. ప్రపంచ మహాసభల్లో వంద పైగా కోట్ల డబ్బు పంచుకున్నారే తప్ప భాషకూ, సంస్కృతికీ, సాహిత్యానికీ ఒరిగిందేమీ లేదు. భాషా సాంస్కృతిక శాఖ రాజకీయ నేతలకు ఊడిగం చేసింది. కోట్ల రూపాయలతో నిర్వహించిన కార్యక్రమాలు రాజకీయ నాయకుల ప్రాబల్యం పెంచుకోవడానికి పనికొచ్చాయి. ఏ ఒక్క ప్రజా కళారూపాన్నీ బతికించి దేశవ్యాప్త కీర్తినీ, వైభవాన్నీ చాటలేదు. పనికిరాని పుస్తకాలను అచ్చువేసి రాజకీయ నేతలకు ఉచితంగా పంచిపెట్టారే తప్ప ప్రజలలోకి తీసుకెళ్ళలేదు. వాటికోసం చేసిన ఖర్చు దుబారా చేశారు. ఎన్నో ప్రతులు పంచిపెట్టి ప్రజల సొమ్మును పట్టపగలు దుర్వినియోగం చేశారు. ఈ దుర్వినియోగంపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. కొత్త ప్రభుత్వం ఇలాంటి విషయాల పట్ల జాగరూకత వహించాల్సి ఉంది.

ప్రతి మూడేండ్లకో, ఎక్కువలో ఎక్కువ ఐదేండ్లకో అధికారుల, ఉద్యోగుల బదిలీలు జరగాల్సిందే! అలా జరుపకపోవడం వల్ల ప్రజలకు న్యాయం జరగదు. ఒకేచోట తిష్ఠ వేసుకునే ఉద్యోగుల వల్ల ప్రజలు ఎనలేని కష్టాలు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రే కాదు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలో ఒకరోజు ప్రజా దర్బారు ఏర్పాటు చేయాల్సిందే! ముఖ్యంగా కలెక్టర్లు కూడా! పౌర సమాజాన్ని సంప్రదిస్తూ పోవాలె తప్ప మేమే గొప్ప అనే భావనను దూరం చేయకపోతే వ్యక్తిగత అహంభావం పెరిగి ప్రభుత్వానికి ప్రజలు దూరం అవుతారు. 'ధరణి' వంటి పాపాల పుట్ట పనిపట్టకపోతే చిన్న రైతు, చిన్న ఇళ్ళు కట్టుకునే వారికి న్యాయం జరగదు. ప్రగతి భవన్‌ను ప్రభుత్వాసుపత్రిగానో, ప్రజా కళల మ్యూజియంగానో మార్చాలి.

నీటి ప్రాజెక్టులలో ఆర్థిక దుర్వినియోగాన్నీ, అలసత్వాన్నీ వెలికి తీయాలి. తెలంగాణ ప్రాధికార సంస్థను ఏర్పాటుచేసి ప్రొఫెసర్ కోదండరామ్ వంటి వారి సలహా సూచనలనూ, రికమెండేషన్స్‌నూ అమలయ్యేలా చూడాలి. 'తెలంగాణ ఇచ్చింది మేమే' అని చెప్పుకోవడం కాదు. 'మాకు అధికారం వచ్చాక చూడండి... ఇంతలా అభివృద్ధి చేశాం' అని చెప్పుకునే రీతిలో అభివృద్ధి జరగాలి. ఓట్లు ఏ ఒక్క కులం వారు వేస్తే ప్రభుత్వం గద్దెనెక్కలేదు. అన్ని కులాలకూ ప్రాతినిధ్యం కల్పించాలి. దొరల రాజ్యం పోయి పటేళ్ళ రాజ్యం వచ్చిందని అనుకోకుండా చూడాలి. పెనం మీంచి పొయ్యిలో పడ్డామని ప్రజలు అనుకొనే పరిస్థితి రాకూడదు. కర్ణాటక, తెలంగాణల్లో లాగా కాంగ్రెస్ వస్తే ఇలా బాగుపడతాం అని అన్ని రాష్ట్రాల ప్రజలూ చెప్పుకోవాలి. తెలంగాణను దేశ ప్రజలు గర్వించే రీతిలో అభివృద్ధిపరచాలి.

– వ్యాసకర్త జానపద పరిశోధకుడు, సామాజికవేత్త
మొబైల్ – 9951942242

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అప్పుడు చెప్తా...



నేను మళ్లీ అత్యంత అందమైన స్త్రీగా జన్మించాలనుకుంటున్నాను. అలాగే తరతరాలుగా సమకూరిన సంపద ఉండాలి. అప్పుడు నేనొక యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి– అందం, డబ్బు పెద్ద విషయాలు కాదనీ, మనసు, కఠినశ్రమ మాత్రమే ముఖ్యమనీ జ్ఞానాన్ని పంచొచ్చు.

– పారోమితా బార్డోలోయి, రచయిత్రి

దైవ భాష?



నాకు ఒక కార్యాలయం నుంచి ఒక డాక్యుమెంట్ కావాలి. అక్కడికి పదకొండు సార్లు వెళ్లాను, అది ఇమ్మని! నేను వాళ్లతో హిందీలో మాట్లాడాను. నాకు దాన్ని వాళ్లు ఇవ్వలేదు. పన్నెండో రోజు, వాళ్లతో ఇంగ్లీషులో మాట్లాడాను. దేవుడా! అది పనిచేసింది. అందరూ మర్యాదగా వ్యవహరించారు కూడా!

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఒత్తిడికి మందులు



బాగా ఒత్తిడిలో ఉన్నప్పుడు దూరంగా ఉండాల్సినవి: తీవ్రమైన ఉపవాసం, ఉదయం పూట తీవ్రమైన వ్యాయామం, పడుకునే ముందు కృత్రిమ కాంతి. బదులుగా చేయాల్సినవి: త్వరగా పడుకోవడం, బయట ఎక్కువసేపు గడపడం, మాంస కృత్తులు, కొవ్వుతో కూడినది మొదటి ఆహారంగా తీసుకోవడం.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

ప్రపంచ తీరు



వంట వండటానికీ, ఇల్లు శుభ్రం చేయడానికీ, మంచాలు సర్దడానికీ, పిల్లలను చూసుకోవడానికీ, కార్లను నడపడానికీ, బట్టలు ఉతకడానికీ పేదలను కుదుర్చుకుంటారు ధనికులు. కానీ వాళ్లు మాత్రం వీరు ఉపయోగించే లిఫ్టులు ఉపయోగించరాదు.

– రంజనా బెనర్జీ, జర్నలిస్ట్

అలా మొదలైంది...




ఛీర్స్, మిత్రో! నా పక్క సీట్లో ఎవరైనా ఉన్నారా అని ఒక మ్మాయి అడిగి ఇవ్వాల్టికి పదేళ్లు. సీటు ఖాళీగా ఉంది. ఆమె నా పక్కన కూర్చుంది. మేము మాటల్లో పడ్డాం. మాకు పెళ్లయి రెండున్నరేళ్లు.

– వివేక్ ప్రసాద్, బిజినెస్ కన్సల్టెంట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గాజా ఒడ్డున విపత్తు వంటకం

కామెంట్



కరణ్ థాపర్

సంధి గడువు ముగియగానే... గాజాపై ఇజ్రాయెల్ ఉద్దేశాలు ఎలా ఉండబోతున్నాయన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. బెంజమిన్ నెతన్యాహూ ప్రభుత్వం ప్రస్తుతం దక్షిణ గాజాలో తలదాచుకున్న దాదాపు 20 లక్షల మంది గాజా పౌరులను కేవలం 2.5 కిలోమీటర్ల వెడల్పు, 4 కిలోమీటర్ల పొడవు ఉన్న అల్–మవాసి అనే చిన్న ముక్క లాంటి భూభాగంలోకి నెట్టివేయడం గురించి ఆలోచిస్తోందని తెలుస్తోంది. దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ ఒక నిర్దిష్ట ఫలితానికి దారితీసే 'విపత్తు వంటకం'గా అభివర్ణించారు. 1948లో వెస్ట్ బ్యాంక్ నుంచి తమను తరిమేసినప్పుడు తొలిసారి శరణార్థులుగా మారిన గాజా ప్రజలు... ఇప్పుడు అల్–మవాసిలో చిక్కువడిపోతే కనుక రెండోసారి శరణార్థులుగా మారతారు.

ఇప్పటివరకు అర్థం అవుతున్నదానిని బట్టి మన దృష్టి ఇజ్రాయెల్‌కూ, గాజాలోని పాల స్తీనా ప్రజలకూ మధ్య సంబంధాలపైన మాత్రమే కేంద్రీకతం అయి ఉంది. యుద్ధ సమయంలో ఇది అనివార్యంగా జరిగేదే. అయితే మీరు కనుక ఇజ్రాయెలీలకు, పాలస్తీనియన్లకు మధ్య గల విస్తృతమైన సంబంధాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే మాత్రం ఇజ్రాయెల్ తన లక్షల మంది పాలస్తీనా పౌరులను, వారితో పాటుగా 1967 నుంచి చట్టవిరుద్ధంగా తన ఆక్రమణలో ఉంచుకున్న వెస్ట్‌బ్యాంక్ ప్రాంత పాలస్తీనియన్లతో ఎలా వ్యవహరిస్తూ వస్తున్నదో కూడా తెలుసు కోవలసిన అవసరం ఉంది. ఇక్కడ ఇస్తున్న కొన్ని వాస్తవాలు బహుశా మీకు తెలిసి ఉండకపోవచ్చు.

మొదటిది, ఇజ్రాయెల్ ప్రజాస్వామ్య దేశం. కానీ అది యూదు పౌరులకు మాత్రమే. అక్కడి 'నేషనల్ స్టేట్ చట్టం – 2018' యూదు పౌరులకు, దేశంలోని పాలస్తీనా జాతీయులకు మధ్య వివక్షను పాటిస్తోంది. ఉదాహరణకు, ఇజ్రాయెల్‌లోని 'పునరాగమన చట్టం' (లా ఆఫ్ రిటర్న్) ప్రపంచంలోని ఏ మూల నుండి వచ్చిన యూదులైనా అప్రమేయంగా ఇజ్రాయెల్ పౌరసత్వం పొందేందుకు అనుమతిని ఇస్తోంది. కానీ అక్కడే పుట్టి, 1948 నక్బా (జాతి ప్రక్షాళన) విపత్తులో, 1967 యుద్ధ సమయంలో ఇజ్రాయెల్‌ను వదిలి వెళ్లిన పాలస్తీనా కుటుంబాల వారికి మాత్రం ఈ హక్కును నిరాకరిస్తుంది. తరలిపోయిన అన్ని పాలస్తీనా కుటుంబాలు తిరిగి స్వదేశానికి వచ్చేందుకు హక్కును కల్పిస్తున్న ఐక్యరాజ్య సమితి 194వ తీర్మానాన్ని ధిక్కరించడమే ఇది.

రెండవది – ఎటువంటి అభియోగమూ లేకుండా పాలస్తీనియన్లను నిర్బంధంలోకి తీసుకునేందుకు అనుమతినిచ్చే 'అడ్మినిస్ట్రేటివ్ డిటెన్షన్ లా'ను ఇజ్రాయెల్ కలిగి ఉంది. 'అల్ జజీరా' చెబుతున్న ప్రకారం, ఇజ్రాయెల్ జైళ్లలో 7,200 మంది పాలస్తీనా ఖైదీలు ఉంటే వారిలో 2,200 మంది ఎలాంటి అభియోగమూ లేకుండా అరెస్ట్ అయినవారే. గత వారాంతంలో కాల్పుల విరమణ సందర్భంగా, ఇజ్రాయెల్ ఈ వైపు నుంచి 240 మందిని విడుదల చేస్తూనే, ఆ వైపు నుంచి 310 మందిని నిర్బంధంలోకి తీసుకుంది. 3,100 మంది లేదా 7,200లో 43 శాతం మంది అక్టోబర్ 7 తర్వాత (ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన రోజు) అరెస్ట్ అయినవారే.

ఇక, వెస్ట్ బ్యాంకు వైపు వెళ్దాం. 1967 నుండి 7,50,000 మంది ఇజ్రాయెలీలు వెస్ట్ బ్యాంక్ అనే పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించి, లోపలి వాళ్లను ఖాళీ చేయించి తాము అక్కడ స్థిరపడిపోయారు. ఇజ్రాయెల్ సైన్యం ఆక్రమణదారులను అడ్డుకోక పోగా, వారికి రక్షణ కల్పించింది. దీనిని నెతన్యాహూ ప్రభుత్వం కూడా ప్రోత్సహించింది. ఐక్యరాజ్యసమితి గుర్తింపు ఉన్న పాలస్తీనాను కుట్టడానికి వీలుకాని అతుకుల బొంతలా మార్చింది.



దక్షిణ గాజా ప్రాంతంపై జరిగిన బాంబు దాడులలో గాయపడిన బాలలు

వెస్ట్ బ్యాంక్‌కు వలస వచ్చి స్థిరపడిపోయిన ఇజ్రాయెలీలతో ఈ ఏడాది అక్టోబర్ 7 నుంచి జరుగుతున్న హమాస్ ఘర్షణల్లో 240 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు 'అల్ జజీరా' నివేదించింది. ''వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్‌లపై జరుగుతున్న తీవ్రవాద హింస ఆగాలని, హింసకు పాల్పడేవారిని జవాబుదారులను చేసి తీరాలని'' అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయెల్ నాయకులకు నొక్కి చెప్పినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' కథనం పేర్కొంది. కానీ బైడెన్ మాటలను నెతన్యాహూ లెక్క చేయలేదు. ''స్థిరపడిన వారి కదలికల గురించి చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని అధ్యక్షుడు బైడెన్‌కు చెప్పాను'' అని పత్రికా సమావేశంలో అన్నారాయన.

చివరిగా, సంధి గడువులన్నీ ఒకసారి ముగిశాక గాజాపై ఇజ్రా యెల్ ఉద్దేశాలు ఎలా ఉంటాయన్నది చూడాల్సిన అంశం. నెత న్యాహూ ప్రభుత్వం ప్రస్తుతం దక్షిణ గాజాలో తలదాచుకున్న సుమారు 20 లక్షల మంది గాజా పౌరులను కేవలం 2.5 కిలోమీటర్ల వెడల్పు, 4 కిలోమీటర్ల పొడవు ఉన్న అల్–మవాసి అనే చిన్న ముక్క లాంటి భూభాగంలోకి నెట్టివేయడం గురించి ఆలోచిస్తూ ఉందన్న విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ప్రతినిధిని ఉటంకిస్తూ 'బీబీసీ' దౌత్య సంబంధాల ప్రతినిధి పాల్ ఆడమ్స్ బహిర్గతం చేశారు. 1948లో వెస్ట్ బ్యాంక్ నుంచి తమను తరిమేసినప్పుడు గాజా ప్రజలు తొలిసారి శరణార్థులుగా మారారు. ఇప్పుడు వారు అల్–మవాసిలో చిక్కు పడిపోతే కనుక రెండోసారి శరణార్థులుగా మారతారు.

నిజంగా ఇది అధ్వాన్నమైన స్థితి. పాలస్తీని యన్ల సంక్షేమం కోసం పని చేస్తుండే ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యు.ఎన్.ఆర్.డబ్ల్యు.ఎ. కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియెట్ తౌమా... అల్– మవాసి గురించి చెబుతూ 'అక్కడ ఏమీ లేదు. కేవలం ఇసుక దిబ్బలు, తాటి చెట్లు మాత్రమే' అని అన్నారు. ఆఖరికి ఇజ్రాయెల్ రక్షణ దళాల ప్రతినిధి అయిన లెఫ్టినెంట్ కల్నల్ హెక్ట్ కూడా ''అల్–మవాసి భయానకం కాబోతోంది'' అన్నారు.

అల్–మవాసీలో అవసరం అయిన మౌలిక సదుపాయాలు లేవు. ఆసుపత్రులు లేవు. అంతే కాదు, అత్యధికులు గుడారాలలో నివసించవలసి వస్తుంది. చలికాలం మొదలయ్యాక చలి గజగజ లాడిస్తుంది. తరచు వర్షాలు పడుతుంటాయి. అయినప్పటికీ కూడా... ''మీ ప్రియమైన వారికి అల్–మవాసి అనుకూలమైన పరిస్థితులనే అందిస్తుంది'' అని ఇజ్రాయెల్ రక్షణ దళానికి చెందిన మరొక ప్రతినిధి అవిచే ఆడ్రయీ చెబుతున్నారు.

''అల్–మవాసికి సదుపాయాలు అందేలా చేయడం సహాయక సంస్థల బాధ్యతే''నని ఇజ్రాయెలీ అధికారులు అన్నట్లు 'బీబీసీ' నివే దించింది. దీనిని బట్టి గాజావాసులను వారి కర్మకు వారిని ఇజ్రాయెల్ వదిలేయబోతున్నట్లు స్పష్టం అవుతోంది. కానీ ఆ మాటను వారు ఒప్పుకోడానికి సుముఖంగా లేరు. ''గాజాలో జరగబోయే ఎలాంటి సురక్షిత ప్రాంత ఏర్పాటులోనూ మేము పాల్గొంచుకోబోమని 'ఐ.రా.స.'కు చెందిన 18 సంస్థలు, ఎన్జీవోలకు చెందిన అధినేతలు ఇప్పటికే ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ ఈ అల్–మవాసి ప్రతి పాదనను... ఒక నిర్దిష్ట ఫలితానికి దారితీసే ''విపత్తు వంటకం'' అని అభివర్ణించారు. ''సదుపాయాలు, సేవలు అందుబాటులో లేని అంత చిన్న ప్రదేశంలోకి అసంఖ్యాకంగా మనుషులను చేర్చడానికి ప్రయ త్నించడం వల్ల ఇప్పటికే ప్రమాదపుటంచున ఉన్న గాజా పౌరుల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు వాటిల్లుతుంది'' అని హెచ్చరించారు.

ఇక్కడితో నేను ఆగిపోతాను. మీకు చేరని వాస్తవాలను, మన మీడియా వెల్లడించని ఇజ్రాయెల్ ఆలోచనలను మీకు తెలియ జేయడమే నా ఉద్దేశం. ఈసారి ఇజ్రాయెల్‌ను ఒక వర్ణవివక్ష రాజ్యం అని అనవలసి వచ్చినప్పుడు ఈ మాటలను దన్నుగా చేసుకోండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.సప్తమి రా.8.28 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మఖ రా.11.57 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.10.42 నుండి 12.26 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.13 నుండి 1.01 వరకు, తదుపరి ప.2.27, నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** రా.9.16 నుండి 11.03 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.19, **సూర్యాస్తమయం:** 5.20.



రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏ వాదన గెలిచింది? ఏ అంశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది? ఓటరు దేన్ని విశ్వసించాడు? దేనికి ప్రభావితుడయ్యాడు? సర్వత్రా జరుగుతున్న చర్చ ఇది. రాజకీయ పార్టీల విశ్లేషణ కూడా ఇదే. ఈసారి ప్రధాన పార్టీలు మేనిఫెస్టోలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యమిచ్చే ప్రయత్నం చేశాయి. సంక్షేమ పథకాల హామీల్లో ప్రధాన పార్టీలూ పోటీ పడ్డాయి. ఈ క్రమంలో సామాజిక సమీకరణలనూ తెరమీదకు తెచ్చాయి. ఇవి ఓట్లు రాలుస్తాయని భావించాయి. అయితే ఈసారి ప్రజాక్షేత్రంలో పార్టీల ప్రచారం, నినాదాలు ఒక స్థాయి వరకే పరిమితం కాలేదు. ఎన్నికల వేడి పెరిగే కొద్దీ కొత్త అంశాలను అస్త్రాలుగా ఎంచుకున్నాయి. ఈవీఎంలు ఫలితాలు నిర్దేశించిన తర్వాత మాత్రం కొన్ని అంశాలే ఈసారి బలమైన ప్రభావం చూపాయనేది సుస్పష్టం.

- సాక్షి, హైదరాబాద్

మార్పునకే తెలంగాణ ఓటు

- జనం మార్పునకు ఆ నినాదమే కారణమా?
- ఒక్క అవకాశం ఇవ్వమనే' అభ్యర్థనే కాంగ్రెస్‌ను గెలిపించిందంటున్న విశ్లేషకులు
- పని చేయని బీఆర్ఎస్ అభివృద్ధి మంత్రం
- బీసీ సీఎం అన్నా... బీజేపీకి దక్కని ఆదరణ?

దూసుకెళ్లిన మార్పు

రెండు దఫాలు పాలించిన బీఆర్ఎస్ అభివృద్ధి మంత్రంతో మూడోసారి అధికారమివ్వమని కోరింది. దీన్ని బలమైన నినాదంగా ఆ పార్టీ భావించింది. కాంగ్రెస్ మాత్రం 'మార్పు కావాలి ... కాంగ్రెస్ రావాలి'అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లింది. 'ఒక్క అవకాశం ఇవ్వమనే'అభ్యర్థన బీఆర్ఎస్ నినాదం కన్నా ప్రభావం చూపినట్టు తెలుస్తోంది. సంప్రదాయ కాంగ్రెస్ నినాదాలకు విరుద్ధంగా అందరికీ అర్థమయ్యే భాషలో తీసుకెళ్ళిన మార్పు కావాలనే నినాదం బలంగా పనిచేసినట్టు కన్పిస్తోంది. అభివృద్ధి కన్పించిన జిల్లాల్లోనూ బీఆర్ఎస్ ఈసారి ప్రతికూలత చవి చూడటమే ఇందుకు కారణం. తిరుగులేదని భావించిన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీలతో పాగా వేసింది. కాంగ్రెస్ 'ఆరు హామీ'ల్లో కొద్దిపాటి కొత్తదాన్ని జొప్పించారు. మహిళలకు రూ. 2500, కౌలు రైతులు, రైతు కూలీలకు సహాయం కాంగ్రెస్ మేనిఫెస్టోలో కన్పించిన కొత్త అంశాలు. గ్రామీణ మహిళా ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టంగట్టడం చూస్తుంటే ఈ నినాదాలు ఆకట్టుకున్నాయనేది స్పష్టం. ఈసారి యువ ఓటరు పోలింగ్‌కు పోటెత్తడం, కాంగ్రెస్‌కు ఆకర్షితులవ్వడం విశేషం. ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ హామీకి... జాబ్ క్యాలెండర్‌ను జోడించడం మరింత నమ్మకాన్ని చేకూర్చింది. అధికార పార్టీ అవినీతి నినాదాన్ని బలంగా విన్పించే ప్రయత్నం చేసినా, బీఆర్ఎస్ బలమైన స్థానాలే కాదు... కాంగ్రెస్ బలమైన స్థానాల్లోనూ దీని ప్రభావం కన్పించలేదు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అన్న రాజకీయ నినాదం కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళింది. దీనివల్ల ప్రయోజనమూ పొందింది. కొన్ని వర్గాల ఓట్లు కాంగ్రెస్ పక్షానికి మళ్ళడం ఫలితాల్లో స్పష్టంగా కన్పిస్తోంది.

నిష్ఫలమైన బీఆర్ఎస్ అస్త్రాలు

బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో అభివృద్ధినే నమ్ముకుంది. అమలు చేసిన సంక్షేమాన్నే ప్రచార ఆయుధంగా చేసుకుంది. రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, పెన్షన్లను నినాదాలుగా మార్చింది. పాజిటివ్ మార్గంలోనే ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేసింది. ప్రతీ పథకంలోనూ మరింత పెంపును జోడించింది. కానీ రానురాను బీఆర్ఎస్ ప్రచార సరళి మార్చింది. పాజిటివ్ నుంచి కాంగ్రెస్‌పై విరుచుకుపడే నెగెటివ్ సరళిని ఎంచుకుంది. దీన్ని ఆ పార్టీ అనివార్యంగా భావించింది. 'మళ్ళీ కాంగ్రెస్ వస్తే...'కరెంట్ ఉండదు.. మత కలహాలు వస్తాయి... ముఖ్యమంత్రులు మారతారు... అభివృద్ధి కుంటుపడుతుందనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేసింది. రాజకీయ ప్రత్యర్థి దూకుడుకు కళ్లెం వేస్తుందని భావించింది. నెగెటివ్ ప్రచార సరళి అప్పటి వరకూ జరిగిన పాజిటివ్ ఓటింగ్‌ను డామినేట్ చేసిందనేది విశ్లేషకుల అభిప్రాయం. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి వల్ల నష్ట నివారణకు ... ముఖ్యమంత్రిగా తన వ్యక్తిగత ఇమేజ్‌తో ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు. ప్రజాక్షేత్రాన్ని ఇవేవీ అందుకోలేకపోయాయి. అభివృద్ధి కన్పించే ప్రాంతాల్లోనూ బీఆర్ఎస్ అనుకున్న రీతిలో లాభపడకపోవడం విశ్లేషకులను ఆశ్చర్య పరుస్తోంది. ప్రజల అభిమానం చూరగొనలేని అభ్యర్థుల వల్ల బీఆర్ఎస్ ఎన్నికల అస్త్రాలన్నీ నిష్ఫలమయ్యాయా? అనే చర్చ విన్పిస్తోంది.

కమలానికి కలిసి రాని బీసీ మంత్రం

బీజేపీ సీట్లు, ఓట్లు పెరగడానికి కారణాలేంటి? మోదీ, షాల ప్రచారమా? ఆ పార్టీ ఎన్నికల నినాదమా? అన్ని వర్గాల్లో జరిగే చర్చ ఇది. ఏడాది క్రితం ఊపు పెంచిన బీజేపీ ఎన్నికల వేళ చతికిల పడ్డా... ఆశాజనకమైన ఫలితాలనే చవిచూసింది. ప్రధానంగా తాము అధికారంలోకి వస్తే బీసీలకే పెద్దపీట వేస్తామని చెప్పింది. బీసీ నేతలకే ప్రధాన భూమికని చెప్పింది. అయితే, బీసీలుగా చెప్పుకునే బలమైన నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ ఎన్నికల్లో అంతగా ప్రభావం చూపలేదు. దీన్నిబట్టి బీజేపీ బీసీ నినాదాన్ని ప్రజలు విశ్వసించలేదనేది రాజకీయ వర్గాల విశ్లేషణ.

పడి లేచిన కెరటంలా..

రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి కాంగ్రెస్


సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పడి లేచిన కెరటంలా దూసుకొచ్చింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా తొలిసారి జరిగిన 2014 ఎన్నికల్లో 21 సీట్లకే పరిమితమైనా.. 2018లో 19 స్థానాలతోనే చతికిలపడినా.. మూడో ప్రయత్నంలో అధికారాన్ని 'హస్త'గతం చేసుకుంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 64 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. బీఆర్ఎస్ సర్కారుపై ఏర్పడిన ప్రజా వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్ సంస్థాగత బలం కూడా ఈ విజయానికి దోహదపడిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

కదలి తరంగంలా ముందుకు..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో డీలాపడిన కాంగ్రెస్.. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ విజయాన్ని ముద్దాడలేకపోయింది. ఓవైపు ఎమ్మెల్యేలు, మరోవైపు వార్డు సభ్యుల నుంచి జెడ్పీటీసీల వరకు అన్నిస్థాయిల్లోని వందల మంది నేతలు పార్టీని వీడటం సమస్యగా మారింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మూడు ఎంపీ సీట్లు గెలుచుకున్న హస్తం పార్టీ.. తర్వాత జరిగిన హుజూర్‌నగర్, దుబ్బాక, నాగార్జునసాగర్, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. కానీ క్రమంగా పుంజుకుని ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా నిలబడగలిగింది.

సత్ఫలితాలిచ్చిన వ్యూహాలు.. హామీలు.. ప్రచారం

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహాలు సత్ఫలితాలిచ్చాయి. పార్టీ నేతలు ఐక్యంగా తలపెట్టిన బస్సుయాత్ర వంటివి ప్రజల్లో సానుకూలత పెంచాయి. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్త ఎన్నికల ప్రచారానికి తోడు సోనియా, రాహుల్, ప్రియాంకల ప్రచారం కూడా కలసి వచ్చింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలూ ప్రజల్లోకి వెళ్లాయి. జాబ్ కేలండర్ పేరుతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని తేదీలతో సహా ప్రకటించడం నిరుద్యోగులను ఆకట్టుకుంది.



ఆ 14 సీట్లు 'హస్త'గతం

చాలా కాలం నుంచి గెలుపు కోసం ఎదురుచూస్తున్న 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఈసారి అనూహ్య విజయం సాధించింది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు సెగ్మెంట్లలో దశాబ్దాలుగా దక్కని విజయం ఈసారి సాకారమైంది. ● చెన్నూరులో 2004లో గెలిచిన కాంగ్రెస్ 19 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు విజయం సాధించింది. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ గెలిచారు. ● 2009లో బెల్లంపల్లి స్థానం ఏర్పడ్డాక కాంగ్రెస్ (గడ్డం వినోద్) గెలవడం ఇదే మొదటిసారి. ● మంచిర్యాలలోనూ కాంగ్రెస్ తొలిసారి విజయం సాధించింది. నాలుగుసార్లు (ఉప ఎన్నిక సహా) ఓటమి తర్వాత ఈసారి అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు మంచి మెజార్టీతో గెలుపొందారు. ● ఖానాపూర్‌లో 1989 తర్వాత కాంగ్రెస్ గెలిచింది ఇప్పుడే. కె.భీంరావు తర్వాత వెడ్మ బొజ్జు కాంగ్రెస్ నుంచి మళ్లీ విజయం సాధించారు. ● జుక్కల్ ఎస్సీలకు రిజర్వు అయిన తర్వాత జరిగిన జరిగిన 11 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఇది ఐదోసారే. ● నిజామాబాద్ రూరల్‌లో కాంగ్రెస్ తొలిసారి గెలిచింది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు డిచ్‌పల్లిగా ఉన్నప్పుడు 1978, 2008లో కాంగ్రెస్ విజయం సాధించింది. ● పెద్దపల్లిలో 34 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ జెండా ఎగిరింది. 1989లో గీట్ల ముకుందరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. వరుసగా ఆరుసార్లు ఓడాక మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు విజయం సాధించారు. ● దేవరకద్రలోనూ కాంగ్రెస్ (జి.మధుసూదన్‌రెడ్డి) తొలిసారి గెలిచింది. ● నాగర్‌కర్నూల్‌లో 1989 తర్వాత కాంగ్రెస్ విజయం సాధించింది ఇప్పుడే. డాక్టర్ రాజేశ్‌రెడ్డి కూచుకుళ్ల గెలిచారు. ● 1983 తర్వాత (40 ఏళ్లకు) ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ గెలిచింది. అక్కడ మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించారు. ● మెదక్‌లో 1989 తర్వాత ఇప్పుడే కాంగ్రెస్‌ను విజయం వరించింది. మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. ● మహబూబ్‌నగర్‌లో 1989లో పులి వీరన్న కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. తర్వాత వరుసగా ఏడుసార్లు ఓటమి పాలైన తర్వాత ఈసారి యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. ● భువనగిరిలోనూ 40 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ గెలిచింది. ఇక్కడ కుంభం అనిల్ గెలుపొందారు. ● నర్సంపేటలో 1957, 67లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. ఇంతకాలం తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నుంచి దొంతి మాధవరెడ్డి గెలుపొందారు.

ఇంకో 5 గెలిచి ఉంటే.. బిందాస్!

సాక్షి, హైదరాబాద్

"అబ్బా ఎలాగూ గెలిచాం.. మరో ఐదు స్థానాలు గెలుచుకుని ఉంటే ఇంకా బాగుండేది. టెన్షన్ పోయేది.. ఎన్నో తలనొప్పులు తప్పేవి..".. అసెంబ్లీ ఎన్నికల్లో మేజిక్ ఫిగర్ దాటినా కూడా కాంగ్రెస్ వర్గాల్లో అంతర్గతంగా జరుగుతున్న చర్చ ఇది. ప్రజలు అధికారమిచ్చారే గానీ.. మంచి మెజారిటీ ఇవ్వలేదనే భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. తెలంగాణ ఏర్పాటైన తొలుత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు 63 సీట్లలోనే గెలవగా.. ఇప్పుడు కాంగ్రెస్‌కు అంతకంటే ఒకేసీటు ఎక్కువగా వచ్చింది. ఈ క్రమంలో కొందరు పార్టీ ఫిరాయించినా పరిస్థితి తారుమారయ్యే ప్రమాదం ఉంటుందని నేతలు చెప్తున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా చాకచక్యంగా ఢీకొట్టేందుకు, పాలనలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకునేందుకు మరో ఐదుగురికిపైగా ఎమ్మెల్యేలు ఉండి ఉంటే బాగుండేదని అంటున్నారు. తక్కువ మెజారిటీ కారణంగా నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందేనని పేర్కొంటున్నారు. మహారాష్ట్ర షిండేతో శివసేనను చీల్చినట్టుగా.. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రయోగం చేసే అవకాశం లేకపోలేదని, అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందే సిద్ధమై ఉండాలని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతుండటం గమనార్హం.

- మరింత సుస్థిర స్థితిలో ఉండేవాళ్లమన్న భావనలో కాంగ్రెస్ నేతలు
- 70కిపైగా సీట్లు వచ్చి ఉంటే ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం
- ఇప్పుడు సీఎం, మంత్రివర్గ ఏర్పాటు నుంచి కీలక నిర్ణయాల దాకా తలనొప్పులే..
- నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి అనే భావన
- కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన నేతలు తిరిగొస్తారా అనే చర్చ
- ఫిరాయింపులపై పార్టీ వైఖరి ఎలా ఉంటుందోననే ఆసక్తి

అధిష్టానానికి కత్తిమీద సామే

బొటాబొటీ మెజారిటీ పరిస్థితుల్లో సీఎంగా ఎవరిని ఎంపిక చేయాలన్నది కూడా కాంగ్రెస్ అధిష్టానానికి కత్తిమీద సామేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీలో సీఎం ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎవరికి ప్రాధాన్యం లభించకపోయినా అలిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. సీఎం విషయంలో ఎమ్మెల్యేలను ఒప్పించినా.. తర్వాత మంత్రివర్గ కూర్పు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఎమ్మెల్సీ పదవులు వంటి చాలా వ్యవహారాల్లో అధిష్టానం తిప్పలు పడాల్సి ఉంటుందని కాంగ్రెస్ నేతలే అంటున్నారు.

వీడినవారు మళ్లీ వస్తారా?



కాంగ్రెస్‌లో చాలాకాలం పనిచేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారిలో కొందరు ఎన్నికల్లో గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వ సుస్థిరత కోసం అలాంటి వారిని తిరిగి రప్పించుకుంటారా అనే చర్చ జరుగుతోంది. అయితే ఇప్పటికిప్పుడే ఇలాంటి పరిణామాలకు ఆస్కారం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కాస్త సుస్థిరత సాధించాకే ఏవైనా ప్రయోగాలకు సిద్ధమవుతుందని నేతలు చెప్తున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎదురవుతాయని భావిస్తున్న పరిణామాలను ఢీకొట్టేందుకు ఇప్పటినుంచే రూట్ మ్యాప్ తయారవుతుందని, వందేళ్ల చరిత్ర కలిగిన తమకు అధికారం నిలుపుకోవడం ఎలాగో తెలుసని అంటున్నారు. ఈ క్రమంలో పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

సీనియర్ నేతలంతా గెలవడంతో..

కాంగ్రెస్ పార్టీలో ఉద్దండులుగా పేరొందిన నేతలు చాలా మంది ఈసారి ఎన్నికల్లో విజయం సాధించగలిగారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్ బాబు, జి. వివేక్ వెంకటస్వామి, పి.సుదర్శన్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, జూపల్లి కృష్ణారావు వంటి నేతలు గెలిచారు. సీనియర్ నేతలు జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఎలాంటి ఒడిదుడుకులకు అవకాశం ఉండబోదని, ఐదేళ్ల పాటు అధికారం పదిలంగా ఉంటుందనే ధీమా కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు



ఎక్స్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హర్షం వ్యక్తం చేశారు. పార్టీ గెలుపులో భాగస్వాములైన ప్రజలకు ఎక్స్ ద్వారా ఆయన ధన్యవాదాలు తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో గట్టి పోటీ ఇచ్చామని, అయితే అక్కడి ఫలితాలు నిరాశపరిచాయని పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీపై అభిమానం చూపి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలని తెలిపారు. నాలుగు రాష్ట్రాల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పాటుపడ్డ కార్యకర్తల సేవలను గుర్తిస్తున్నట్లు వివరించారు. ఒడిదుడుకులను అధిగమించి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం సిద్ధపడతామంటూ ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

గెలిచిన బీజేపీ, కాంగ్రెస్‌లకు అభినందనలు



ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపులో గెలుపొంది అధికారం చేజిక్కించుకున్న భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' సామాజిక మాధ్యమం ద్వారా ఆయా పార్టీలకు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 'రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిచిన బీజేపీకి, పొరుగు రాష్ట్రం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి అభినందనలు' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

హామీలన్నీ అమలు చేస్తాం



రాహుల్

తెలంగాణ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన, మద్దతు పలికిన వారందరికీ హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో చరిత్ర సృష్టించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అగ్రనేత ప్రియాంకాగాంధీ తెలిపారు. ఇది ప్రజలతోపాటు కార్యకర్తలందరి విజయమని ఆదివారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పార్టీని గెలిపించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు చెప్పారు.

ఆశించిన విధంగానే ప్రజలు ఫలితాన్నిచ్చారు



కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: నరకాసురుడి పాలనకు ముగింపు పలుకుతామని, హిట్లర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని ఏడాదిగా ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చెప్పినట్లుగానే ఫలితం ఇచ్చారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు అభ్యర్థిగా గెలిచాక పొంగులేటి వ్యాఖ్యానించారు. ఖమ్మంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో రాష్ట్ర ప్రజల అభీష్టం, అభిప్రాయాలకు భిన్నమైన పాలన సాగించడంతోనే బీఆర్ఎస్‌కు ఈ రకమైన ఫలితాలొచ్చాయని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పినట్లుగా మొదటి కేబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారంటీలపై తీర్మానం చేస్తామని, వంద రోజుల్లోనే ఇవి కార్యరూపం దాల్చేలా చర్యలుంటాయని పొంగులేటి వెల్లడించారు.



కుటుంబ సభ్యులతో రేవంత్‌రెడ్డి


గాంధీభవన్ కళకళ

సాక్షి, హైదరాబాద్/ బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గాంధీభవన్ పరిసరాలు తొలిసారి కళకళలాడాయి. గత పదేళ్లుగా జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఎప్పుడు ఎన్నికల ఫలితాలు వచ్చినా గాంధీభవన్ బోసిపోతూ కనిపించేది. కానీ, ఇప్పుడు దానికి భిన్నంగా గాంధీభవన్‌లో హడావుడి నెలకొంది. ఫలితాలు అనుకూలంగా వస్తుండటంతో పార్టీ శ్రేణులు ఉదయం 9 గంటల నుంచే గాంధీభవన్ బాట పట్టాయి. నృత్యాలు చేస్తూ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ పార్టీకి ఆధిక్యం పెరగటంతో గాంధీభవన్ పరిసరాలు మారుమోగాయి. జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాల్లోనూ కేడర్ సంబురాలు చేసుకుంది.

సీఎం కేసీఆర్ రాజీనామా ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆదివారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. అయితే సీఎం రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. ఈ మేరకు గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదివారంరాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లి తన రాజీనామా లేఖను సమర్పించకుండా తన దగ్గర కార్యదర్శిగా పనిచేసిన రాజశేఖర్ రెడ్డి ద్వారా రాజీనామా లేఖ పంపించారు. ఆ తరువాత కేసీఆర్ తన సొంత వాహనంలో ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు.

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల బలాల్లో వచ్చిన మార్పులు



గజ్వేల్‌లో కేసీఆర్ విజయం

45 వేల ఓట్ల మెజార్టీ

సాక్షి, సిద్దిపేట: గజ్వేల్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అధినేత, తాజా మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గెలుపొందారు. 9వసారి ఎమ్మెల్యేగా కేసీఆర్ విజయం సాధించారు. ఆరుసార్లు సిద్దిపేట, మూడుసార్లు గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలుపొందారు. నవంబర్ 30న రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగగా, ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగింది. కేసీఆర్(బీఆర్‌ఎస్)కు 1,11,684 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి ఈటల రాజేందర్(బీజేపీ)కు 66,653 ఓట్లు వచ్చాయి. ఈటలపై కేసీఆర్ 45,031 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గజ్వేల్ నియోజకవర్గంలో 44 మంది పోటీ చేశారు. అందులో ఒక్క రాజేందర్‌కు మాత్రమే డిపాజిట్ దక్కగా మిగతా 42 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. గత 2018 ఎన్నికలలో కేసీఆర్‌కు 1,25,444 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ రెడ్డికి 67,154 ఓట్లు వచ్చాయి. ప్రతాప్‌రెడ్డిపై 58,290 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతం కంటే ఈసారి కేసీఆర్‌కు 13,259 ఓట్ల మెజార్టీ తగ్గింది. ప్రతిసారీ గజ్వేల్‌లో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందితే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది. ఈసారి ఆ సెంటిమెంట్ లేదు. గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందింది.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుంది.

పోచారం గెలుపుతో ఆ ఆనవాయితీకి అడ్డుకట్ట

స్పీకర్‌గా పనిచేసిన తర్వాత కూడా గెలిచిన పోచారం



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/బాన్సువాడ: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన వారు తర్వాత ఎన్నికల్లో ఓడిపోయే ఆనవాయితీకి పోచారం శ్రీనివాస్ రెడ్డి అడ్డుకట్ట వేశారు. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో దిగిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం నాటి ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించారు. గతంలో స్పీకర్‌గా పనిచేసి మధుసూధనాచారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాదెండ్ల మనోహర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, ప్రతిభా భారతి తదితరులంతా తర్వాత ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఈ భయంతో అసెంబ్లీ స్పీకర్ పోస్ట్ అంటేనే ఎవరు ముందుకు రాని పరిస్థితి ఉండేది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయంతో ఆ ఆనవాయితీకి అడ్డుకట్ట వేసినట్టైంది. కాగా ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం బాన్సువాడలో పోచారం మాట్లాడుతూ...స్పీకర్లు ఓడిపోతారనేది కేవలం అపోహ మాత్రమేనని తన విజయంతో నిరూపణ అయ్యిందన్నారు. ప్రజలతో నిత్యం కలిసి ఉంటూ వారితో పని చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఎనిమిది సార్లు పోటీ చేస్తే ఏడు సార్లు గెలిపించిన బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రజా తీర్పును శిరసావహించాలని, పొరపాట్లను సరిదిద్దుకుంటామని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ తిరిగి ప్రజా సేవకు అంకితం అవుతుందని అన్నారు.

నెరవేరని 'హ్యాట్రిక్' కల

నెలల తరబడి ప్రజాక్షేత్రంలో ఉన్నా దక్కని ఫలితం		అక్కరకు రాని ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాలు	
ఫలితమివ్వని అభ్యర్థుల ముందస్తు ప్రకటన.. బీ ఫామ్‌ల పంపిణీ	సిట్టింగులకు పెద్దపీట దెబ్బతీసిందనే అభిప్రాయం	13 మంది కొత్త వారికి సీట్లు.. 9 మంది గెలుపు	అండగా నిలిచిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మెదక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా మూడుమార్లు అధికారంలోకి వచ్చి 'హ్యాట్రిక్'సాధించేందుకు భారత్ రాష్ట్ర సమితి సర్వశక్తులూ ఒడ్డినా ఆశించిన ఫలితం రాబట్టలేకపోయింది. పార్టీ పేరు మార్పుతో ఓ వైపు జాతీయ రాజకీయాల్లో అరంగేట్రానికి బాటలు వేసుకుంటూనే అసెంబ్లీ ఎన్నికల కోసం ఏడాది కాలంగా సన్నద్ధమైనా అధికారం పీఠం నుంచి వైదొలగాల్సి వచ్చింది. అభ్యర్థుల ఎంపిక మొదలుకుని బీ ఫామ్‌ల జారీ, ఇతర పార్టీల నుంచి చేరికలు, ఎన్నికల ప్రచార సభలు తదితరాలు అన్నింటా విపక్ష పార్టీలతో పోలిస్తే ముందంజలో ఉన్నా.. అధికారం చేపట్టేందుకు అవసరమైన మేజిక్ ఫిగర్‌కు చేరువ కాలేకపోయింది. అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు 104 మంది సభ్యుల సంఖ్యా బలం ఉండటం, అందులో సగం మందికి పైగా ఎమ్మెల్యేలు వరుసగా రెండు కంటే ఎక్కువ పర్యాయాలు గెలిచిన వారే ఉండటం ప్రతికూలంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు 35 మంది పార్టీ ఎమ్మెల్యేలపై క్షేత్ర స్థాయిలో తీవ్ర ప్రతికూలత నెలకొందని నిఘా వర్గాలు, వివిధ సంస్థలు నివేదికలు ఇచ్చినా వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడం కూడా నష్టాన్ని కలిగించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చక పోవడం వల్ల నష్టం జరిగిందని తేలినా.. మళ్లీ 'సిట్టింగులకే టికెట్లు'అంటూ పెద్దపీట వేయడం నష్టం చేకూర్చినట్లు ఫలితాల సరళి వెల్లడిస్తోందని అంటున్నారు. 13 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించి కొత్త వారికి అవకాశమిచ్చిన చోట 9 మంది గెలుపొందడమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, రుణ మాఫీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితబంధు, బీసీబంధు పథకాలు వంటి అంశాలు, ఎమ్మెల్యేలు, వారి అనుచరుల వ్యవహార శైలి ప్రభుత్వ వ్యతిరేకతను మూటగట్టడంలో కీలకంగా మారాయని అంటున్నారు.



బోసిపోయిన తెలంగాణ భవన్

స్థానికంగా దృష్టి కేంద్రీకరించలేకపోయారా?

ఈ ఏడాది మార్చి నుంచే ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించి తొలి విడతలో జిల్లా కలెక్టరేట్లు, పార్టీ జిల్లా కార్యాలయాల ప్రారంభం సందర్భంగా ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా సభలు నిర్వహించారు. ఏప్రిల్, మే నెలల్లో నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలతో కేడర్‌ను కార్యోన్ముఖుల్ని చేసే పనికి పూనుకున్నారు. జూన్‌లో దశాబ్ది ఉత్సవాల పేరిట సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేశారు. అందరికంటే ముందుగా ఆగస్టులోనే 105 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించి అంతర్గత అసమ్మతి సర్దుబాటుకు పూనుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాకమునుపే బీ ఫామ్‌లు జారీ చేశారు. ఇంత చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించేందుకు టీఆర్‌ఎస్ పేరును ఏడాది క్రితం బీఆర్‌ఎస్‌గా మార్చడం, పార్టీ పేరులో తెలంగాణ పదం లేకపోవడంపై పార్టీ నేతల్లో కొంత అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు పొరుగునే ఉన్న మహారాష్ట్రపై దృష్టి కేంద్రీకరించే క్రమంలో స్థానికంగా పార్టీ, ప్రభుత్వంపై కేసీఆర్ అంతగా దృష్టి కేంద్రీకరించలేదనే అభిప్రాయం కూడా ఉంది. అభ్యర్థుల ప్రకటనకు ముందూ, తర్వాత టికెట్ దక్కదని తేలడంతో పార్టీని వీడిన పొంగులేటి, తుమ్మల వంటి నేతలు తీరని నష్టం కలిగించారని అంటున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ధీటుగా ప్రకటించిన మేనిఫెస్టోను ఓటర్లలోకి తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు కూడా పాక్షిక ఫలితాన్నే ఇచ్చాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

'తెలంగాణ మోడల్'కు మిశ్రమ స్పందన

భారీగా ఓట్లు సాధిస్తుందని భావించిన 'తెలంగాణ మోడల్'నినాదం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పొరుగునే ఉన్న ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీగా సీట్లను సాధించి పెట్టింది. అయితే 'తెలంగాణ మోడల్'లో అంతర్భాగమైన సంక్షేమ పథకాలు ఓట్ల వర్షం కురిపిస్తాయనే లెక్కలు తారుమారై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిశ్రమ, ఇతర జిల్లాల్లో అరకొర ఫలితాన్నే ఇచ్చాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలకు ఐదు సీట్లు బీఆర్‌ఎస్ ఖాతాలో పడ్డాయి. ఉద్యమ కాలం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోకేవలం రెండేసి స్థానాలకు మాత్రమే బీఆర్‌ఎస్ పరిమితమైంది. 2018 ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాన్ని అందించిన నల్లగొండలో సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో గద్వాల, అలంపూర్‌లో మాత్రమే గెలుపు సాధ్యమైంది. మొదట్నుంచీ పార్టీకి పూర్తి ప్రతికూలంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటరు ప్రస్తుత ఎన్నికలోనూ అదే తీరును ప్రదర్శించడం గమనార్హం.

కాంగ్రెస్‌కు హైదరాబాద్ నో

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తూ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాలు బీఆర్‌ఎస్‌కు వెన్నుదన్నుగా నిలిచాయి. హైదరాబాద్‌లోని 15 స్థానాలకు గాను మిత్రపక్షాలైన బీఆర్‌ఎస్, ఎంఐఎం చెరో ఏడు స్థానాలు దక్కించుకున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 14 సీట్లకు గాను పది స్థానాలు అధికార పార్టీ ఖాతాలోనే పడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు పరిసర నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభివృద్ధి మంత్రానికి ఓటర్లు ఏకపక్షంగా మద్దతు పలికారు. పొరుగునే ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పది సీట్లకు గాను మంత్రి హరీశ్‌రావు సర్వశక్తులూ ఒడ్డటంతో సిద్దిపేట, గజ్వేల్ సహా ఏడు చోట్ల పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం దక్కగా, అధికార పగ్గాలు చేపడుతున్న కాంగ్రెస్‌కు హైదరాబాద్ జిల్లాలో ఒక్క సీటూ దక్కక పోవడం గమనార్హం.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: 'రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కు అవకాశమిచ్చిన ప్రజలు ఈసారి కాంగ్రెస్ పార్టీని ఆదరించారు. ప్రజల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ పాలన సాగాలని కోరుకుంటున్నా. ఈ ఎన్నిక సమరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా రేయింబవళ్లు శ్రమించిన మా పార్టీ శ్రేణులు, ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు'అని హరీశ్‌రావు ఆదివారం ట్వీట్ చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన విజేతలతో పాటు కాంగ్రెస్ పార్టీకి అభినందనలు. బీఆర్‌ఎస్ కార్యకర్తల కఠోర శ్రమకు కృతజ్ఞతలు. అధికారమున్నా లేకున్నా మనం తెలంగాణ ప్రజల సేవకులం. మన మాతృభూమి కోసం చిత్తశుద్ధితో పోరాడుదాం. కోరుట్ల ప్రజలకు ప్రత్యేకించి శుభాకాంక్షలు'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో పేర్కొన్నారు.

హరీశ్‌రావుకు తగ్గిన మెజార్టీ

2018లో 1,18,699.. ఈసారి 82,308 ఓట్లు

ఎమ్మెల్యేగా 7వ సారి విజయం

సాక్షి, సిద్దిపేట: గత ఎన్నికల కంటే ఈసారి మాజీమంత్రి టి.హరీశ్‌రావుకు 36,391 మెజార్టీ తగ్గింది. సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన హరీశ్‌రావుకు నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో 1,81,436 ఓట్లు పోలు కాగా, ఆయన 1,05,514 ఓట్లు సాధించారు. సమీపకాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణపై 82,308 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఏడోసారి హరీశ్‌రావు విజయం సాధించారు. గత ఎన్నికల మాదిరిగానే ఈసారి సైతం 20 మంది ప్రత్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు.

ఆ రెండింటనే సెంటిమెంట్


ఆనవాయితీని బ్రేక్ చేసిన సికింద్రాబాద్, గజ్వేల్

సాక్షి, నెట్‌వర్క్: ఆ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే, రాష్ట్రంలోనూ అదే పార్టీకి అధికారం వస్తుందనే ఆనవాయితీకి ఈ ఎన్నికల్లో బ్రేక్ పడింది. 1952 నుంచి ఆందోల్, అచ్చంపేట, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఒకసారి, గజ్వేల్ నియోజకవర్గంలో రెండుసార్లు మినహాయిస్తే మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ ఇక్కడ గెలిచిన అభ్యర్థి పార్టీనే అధికారం చేపట్టింది. కానీ, ఈ ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ అంతగా పండలేదు. ఆందోల్, అచ్చంపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రాజనర్సింహ, వంశీకృష్ణ విజయంతో ఈ రెండు నియోజకవర్గాల్లో సెంటిమెంట్ కొనసాగ గా, గజ్వేల్, సికింద్రాబాద్ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా కేసీఆర్, పద్మారావు విజయం సాధించటంతో ఆ సెంటిమెంట్‌కు బ్రేక్ పడినట్లయింది.

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో ఉన్న ఆ నలుగురూ ఓటమి

2022 అక్టోబర్ 26న వెలుగులోకి వ్యవహారం

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2022లో వెలుగులోకి వచ్చిన 'ఎమ్మెల్యేలకు ఎర కేసు'కు సంబంధించిన నలుగురు ప్రజా ప్రతినిధులు పైలెట్ రోహిత్‌రెడ్డి, కాంతారావు, హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. సీవీ ఆనంద్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేసిన ఈ కేసు ప్రస్తుతం త్రిశంకుస్వర్గంలో ఉంది. మునుగోడు ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ బీజేపీ పార్టీ భారీ స్కెచ్ వేసిందని, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు ఎర వేసి పార్టీ ఫిరాయించేలా ప్రయత్నించిందన్నది ప్రధాన ఆరోపణ. ఈ నలుగురిని బీజేపీ లక్ష్యంగా చేసినట్లు కేసు నమోదు చేశారు. తిరుపతికి చెందిన సింహయాజులు, ఢిల్లీకి చెందిన సతీశ్ శర్మ అలియాస్ రామచంద్ర భారతి, హైదరాబాద్‌కు చెందిన నందకుమార్ ఈ నలుగురు ఎమ్మెల్యేల కోసం వచ్చి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో ఉన్న రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఉండగా..స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ), రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు 2022 అక్టోబర్ 26న చేపట్టిన ఆపరేషన్‌లో వీరిని పట్టుకున్న సంగతి తెలిసిందే.



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సహా రాష్ట్ర మంత్రివర్గంలోని 17 మంది మంత్రులకుగాను 14 మంది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఈ 14 మందిలో ఎనిమిది మంది విజయం సాధించగా, ఆరుగురు ఓటమి పాలయ్యారు. మిగతా ముగ్గురు మంత్రులు మహమూద్ అలీ (హోం), సత్యవతి రాథోడ్ (గిరిజన, మహిళా, శిశు సంక్షేమం), పట్నం మహేందర్‌రెడ్డి (సమాచార, పౌర సంబంధాలు) శాసన మండలి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి), సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (వనపర్తి), ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి), పువ్వాడ అజయ్ (ఖమ్మం), వి.శ్రీనివాస్‌గౌడ్ (మహబూబ్‌నగర్) ఓటమి పాలయ్యారు. మంత్రులు కేటీఆర్ (సిరిసిల్ల), హరీశ్‌రావు (సిద్దిపేట), వేముల ప్రశాంత్‌రెడ్డి (బాల్కొండ), గంగుల కమలాకర్ (కరీంనగర్), చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం), తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), జి.జగదీశ్‌రెడ్డి (సూర్యాపేట) విజయం సాధించారు.

పోటీ చేసిన 14 మంది అమాత్యుల్లో 8 మందే గెలుపు

చీఫ్ విప్, విప్‌లూ పరాజయం పాలు

40 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఒక ఎన్నికలో కేసీఆర్ పరాజయం

ఇదే సమయంలో గజ్వేల్ నుంచి హ్యాట్రిక్ విజయం

కామారెడ్డిలో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ: సీఎం కేసీఆర్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి కూడా పోటీచేశారు. వీటిలో కామారెడ్డిలో పరాజయం పాలుకాగా.. గజ్వేల్‌లో మాత్రం వరుసగా మూడోసారి విజయం సాధించారు. కేసీఆర్ గత 40 ఏళ్లలో తొలిసారి ఒక ఎన్నికలో ఓడిపోవడం గమనార్హం. 1983లో తొలిసారిగా సిద్దిపేట అసెంబ్లీ స్థానంలో టీడీపీ తరపున పోటీచేసి ఓడిపోయారు. తర్వాత వరుసగా 1985, 1989, 1994, 1999లలో ఎమ్మెల్యేగా గెలిచారు. టీఆర్‌ఎస్ స్థాపించాక 2001 ఉపఎన్నిక, 2004 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించారు. 2004లో కరీంనగర్ ఎంపీగానూ పోటీ చేసి గెలవడంతో సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తర్వాత 2006, 2008లలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో కరీంనగర్‌లో గెలిచారు. 2009లో మహబూబ్‌నగర్, 2014లో మెదక్ ఎంపీగానూ విజయం సాధించారు. 2014, 2018తోపాటు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983 నాటి తొలి ఓటమి తర్వాత ఇప్పుడు కామారెడ్డిలో కేసీఆర్ పరాజయం పొందడం గమనార్హం.

చీఫ్ విప్ సహా విప్‌ల ఓటమి

శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్, విప్‌లుగా పని చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా పరాజయం పాలయ్యారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేయడంతో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బరిలో దిగలేదు. పోటీ చేసిన ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్ (వరంగల్ పశ్చిమ), బాల్క సుమన్ (చెన్నూరు), గువ్వల బాలరాజు (అచ్చంపేట), రేగ కాంతారావు (పినపాక), గొంగిడి సునీత (ఆలేరు) ఓటమి చెందారు.

ఎగుడు దిగుడు దారిలో కారు!

ఎత్తుపల్లాల మధ్య గులాబీ పార్టీ ప్రస్థానం


సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంతో ఉద్యమ పార్టీగా మొదలైన టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్)' రెండు దశాబ్దాల ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది. ఉద్యమ సమయంలో రాజీనామాలు, ఉప ఎన్నికలను అస్త్రాలుగా ప్రయోగించి అందరి దృష్టిని ఆకర్షించింది. 2004లో కాంగ్రెస్‌తో, 2009లో టీడీపీ నేతృత్వంలోని కూటమితో జట్టుకట్టి ఎన్నికల బరిలో నిలిచింది. రాష్ట్ర అవతరణ తర్వాత తమది పక్కా రాజకీయ పార్టీగా మారినట్లు అధినేత కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో 2014, 2018 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి అధికారాన్ని చేపట్టింది. ఈ క్రమంలో జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీకి వీలుగా టీఆర్‌ఎస్.. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)గా అవతరించింది. కేసీఆర్ జాతీయ రాజకీయాల దిశగా రంగం సిద్ధం చేసుకుంటూనే.. తెలంగాణలో మూడోసారి అధికారం సాధించి 'హ్యాట్రిక్'సీఎంగా రికార్డు సృష్టించాలని భావించారు. తర్వాత 'తెలంగాణ మోడల్' ఆలంబనగా జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో.. మేజిక్ ఫిగర్‌ను చేరుకోవడంలో విఫలమైన బీఆర్‌ఎస్ ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాలు కలుపుకొని మొత్తం 65 ఎంపీ సీట్లలో పోటీచేస్తామని బీఆర్‌ఎస్ గతంలో ప్రకటించింది.

కొత్త రాష్ట్రంలో అధికార పీఠం: తెలంగాణ ఏర్పాటుతోపాటు జరిగిన 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 119 స్థానాల్లో ఒంటరిగా పోటీచేసి 63 సీట్లు సాధించింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించారు. తర్వాతి కాలంలో రాజకీయ పునరేకీకరణ పేరిట టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ, సీపీఐల నుంచి ఎమ్మెల్యేలను టీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారు. నారాయణఖేడ్, పాలేరు ఉప ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులు గెలిచారు. ఇంకా ఆరు నెలల గడువు ఉండగానే 2018 సెప్టెంబర్ 6న అసెంబ్లీని కేసీఆర్ రద్దు చేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు గెల్చుకుని కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యారు. తర్వాతి కాలంలోనూ వివిధ పార్టీల నుంచి గెలిచిన 26 మంది ఎమ్మెల్యేలను చేర్చుకుని అసెంబ్లీలో 104 సంఖ్యాబలానికి చేరుకున్నారు. మరోవైపు జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టేందుకు 2022 అక్టోబర్ 5న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) పేరును భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)గా మార్చారు. ప్రతికూల ఫలితాల నేపథ్యంలో రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ ప్రస్థానం, పై ఆసక్తి నెలకొంది.


నాడు ఉప ఎన్నికలతో బలోపేతమై..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో కేసీఆర్ 2001లో టీడీపీకి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి, సిద్దిపేట శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి.. టీఆర్‌ఎస్‌ను స్థాపించారు. అదే ఏడాది 2001లో సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ బరిలోకి దిగి గెలుపొందారు. 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకుని..46 అసెంబ్లీ సీట్లలో పోటీచేసి, 26 స్థానాలును గెలుచుకుంది. రాష్ట్ర ఏర్పాటుపై కాంగ్రెస్ మాట తప్పిందంటూ యూపీఏ ప్రభుత్వం నుంచి బయటికి వచ్చిన కేసీఆర్.. 2006 కరీంనగర్ లోక్‌సభకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2008లో టీఆర్‌ఎస్‌కు చెందిన 16 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అయితే వాటికి జరిగిన ఉప ఎన్నికల్లో ఏడుగురే టీఆర్‌ఎస్ అభ్యర్థులు తిరిగి గెలిచారు. ఈ క్రమంలో 2009 సాధారణ ఎన్నికల్లో మహా కూటమితో టీఆర్‌ఎస్ పొత్తు కుదుర్చుకుని 45 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసింది. కానీ పది సీట్లే సాధించింది. 2010 జూలైలో జరిగిన ఉప ఎన్నికల్లో 11 మంది, 2011 ఉప ఎన్నికలో బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. 2012లో టీడీపీ, కాంగ్రెస్‌లకు రాజీనామా చేసిన జోగు రామన్న, గంప గోవర్ధన్, జూపల్లి కృష్ణారావు, తాటికొండ రాజయ్య కూడా టీఆర్‌ఎస్ అభ్యర్థులుగా గెలుపొందారు.


ఏ పార్టీకి ఎన్ని సీట్లు..



ఓట్ల శాతం..



వచ్చిన ఓట్లు..



ఉమ్మడి ఖమ్మంలో కాంగ్రెస్ గాలి..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. మొత్తం పది స్థానాలకు గాను ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి విజయం సాధించగా, భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచారు. గతంలో కాంగ్రెస్ ఆరు స్థానాలను దక్కించుకుంటే ఈసారి ఎనిమిది స్థానాలు గెలుపొందడంతోపాటు పొత్తులో భాగంగా సీపీఐని కూడా గెలిపించుకుంది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధిర నుంచి నాలుగోసారి విజయం సాధించారు. పాలేరు నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిపాజిట్ కోల్పోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సీపీఎం పోటీ చేసిన అన్ని స్థానాల్లో డిపాజిట్ దక్కలేదు. బీజేపీ, జనసేన కూడా ఏమాత్రం ప్రభావాన్ని చూపలేకపోయాయి.

భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు

మధిరలో నాలుగోసారి భట్టి విక్రమార్క తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌పై 35,452 ఓట్ల మెజార్టీతో గెలిచారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై 56,650 ఓట్ల మెజార్టీ సాధించారు. ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పై 49,381 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైరా నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌పై 33,045 ఓట్ల మెజార్టీ పొందారు. సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి.. బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యపై గెలిచారు.

కరీంనగర్‌లో హస్తం హవా!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉత్తర తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హస్తం హవా కొనసాగింది. మొత్తం 13 నియోజకవర్గాల్లోని 8 స్థానాలు మానకొండూరు, చొప్పదండి, ధర్మపురి, వేములవాడ, పెద్దపల్లి, రామగుండం, మంథని, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, హుజూరాబాద్ కోరుట్లలో గెలుపొందింది. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు అర్వింద్, సంజయ్ ఎమ్మెల్యే బరిలో పరాజయం పాలయ్యారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ తొలిసారి పరాజయం పాలయ్యారు.

ఉత్కంఠ పోరులో గంగుల గెలుపు

కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై విజయం సాధించారు. ఆఖరు రౌండ్ వరకు సాగిన ఉత్కంఠ పోరులో 3,169 ఓట్ల మెజారిటీతో గంగుల విజయం సాధించారు.

మెతుకు సీమలో బీఆర్ఎస్ పట్టు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మెతుకు సీమలో బీఆర్ఎస్ పార్టీ తన పట్టు నిలుపుకొంది. కాంగ్రెస్ పార్టీ హవాలోనూ ఉమ్మడి మెదక్ జిల్లాలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. మొత్తం 11 స్థానాలకు గాను బీఆర్ఎస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా విజయ దుందుభి మోగించిన కాంగ్రెస్ ఇక్కడ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక బీజేపీ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. ఆరు నియోజకవర్గాల్లోనైతే కమలం పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు.

గజ్వేల్‌లో కేసీఆర్‌దే విజయం

ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు గజ్వేల్‌లో విజయం సాధించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై కేసీఆర్ 45,031 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి టి.నర్సారెడ్డి 32,568 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు.

సిద్దిపేటలో కొనసాగిన హరీశ్ హవా..

కాంగ్రెస్ హవాలోనూ మంత్రి హరీశ్‌రావు ఘన విజయం సాధించారు. 82,308 ఓట్ల భారీ మెజారిటీతో సిద్దిపేటలో గెలుపొందారు.

దుబ్బాకలో 'కొత్త'కు భారీ మెజార్టీ

దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావుపై 53,513 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు.

సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓటమి..

సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభాకర్ 8,217 ఓట్లతో గెలుపొందారు.

ఆందోల్‌లో దామోదర్ విజయం

ఆందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, దామోదర రాజనర్సింహా 28,193 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.

'పాలమూరు'లో కాంగ్రెస్ హవా..

● ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో 12 గెలుపొంది సత్తా చాటింది. బీఆర్ఎస్ అభ్యర్థులు కేవలం రెండు స్థానాలకే పరిమితమయ్యారు. మహబూబ్‌నగర్, వనపర్తి నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డికి చుక్కెదురైంది. దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి జీఎమ్మార్ మధ్య రౌండ్ రౌండ్‌కూ హోరాహోరీ పోరు కొనసాగింది. రౌండ్‌రౌండ్‌కు ఉత్కంఠగా సాగిన లెక్కింపులో చివరి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డికి 907 ఓట్ల మెజార్టీ రాగా.. పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుని మొత్తం 1,392 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు.

తొలిసారిగా 9 మంది..

ఉమ్మడి పాలమూరులో తొమ్మిది మంది తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టనున్నారు. కాంగ్రెస్‌కు సంబంధించి జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి అభ్యర్థులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డితో పాటు బీఆర్ఎస్ అలంపూర్ అభ్యర్థి విజయుడు తొలిసారిగా విజయం సాధించారు. ఇందులో అందరూ యువతే కావడం విశేషం.

వనపర్తిలో గలాటా..

వనపర్తిలో చిట్యాల శివారులోని మార్కెట్ యార్డు గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్ నుంచి వెనుతిరిగి వెళ్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి కారు అద్దాలను కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేయడంతో దుమారం చెలరేగింది. పోలీసులు వారిని చెదరగొట్టి మంత్రిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకోకు దిగడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రోడ్డుపైనే సుమారు గంటన్నర సేపు ఆందోళనకు దిగగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులకు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

మంత్రులకు తప్పని ఓటమి..

మహబూబ్‌నగర్‌లో మంత్రి బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి 18,738 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అదేవిధంగా వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి 25,320 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.


ఒక్కటి మినహా. అన్నింటా హస్తం

● ఉమ్మడి నల్లగొండ జిల్లా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించింది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకుగాను 11 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, ఒక్క సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి జగదీష్‌రెడ్డి గెలుపొందారు. మిగతా నియోజకవర్గాలైన నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్‌లో వేముల వీరేశం, మునుగోడులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండలో నేనావత్ బాలునాయక్, నాగార్జునసాగర్‌లో కుందూరు జయవీర్‌రెడ్డి, మిర్యాలగూడలో బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి లో మందుల సామేల్, హుజూర్‌నగర్‌లో నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడలో నలమాద పద్మావతిరెడ్డి, ఆలేరులో బీర్ల అయిలయ్య, భువనగిరిలో అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపొందారు.

ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యం..

2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 10స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపొందగా, రెండు స్థానాల్లో అప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. ఈసారి అంతకుమించి 11 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే, ఒకే ఒక్క స్థానంలో బీఆర్ఎస్ గెలుపొందింది. ప్రస్తుత విజయంతో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలో తిరుగులేని పార్టీగా తమ పట్టును సాధించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులంతా తమ ప్రత్యర్థులైన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులపైనే ఈ విజయాన్ని సాధించారు. ప్రతి అభ్యర్థికి భారీ మెజారిటీని ఇచ్చి ఓటర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వైపు నిలిచారు. ఈ ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు ఆధిక్యాన్ని కనబరచడం విశేషం.



ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిచింది..

విలక్షణం.. ఇందూరు తీర్పు

● ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి ఇందూరు జిల్లా మరోసారి విలక్షణ తీర్పుతో తన ప్రత్యేకతను చాటుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ముఖాముఖి పోరు జరగగా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోరు జరిగింది. దీంతో నిజామాబాద్ జిల్లాలోని ఉన్న 9 స్థానాలకు గాను కాంగ్రెస్ 4, బీజేపీ 3, బీఆర్ఎస్ 2 చోట్ల విజయం సాధించాయి. సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీపడిన కామారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థిగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి జెయింట్ కిల్లర్ రేంజ్‌లో విజయం సాధించారు. నిజామాబాద్ అర్బన్ నుంచి బీజేపీ అభ్యర్థులుగా ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఆర్మూర్ నుంచి పైడి రాకేష్‌రెడ్డి విజయం సాధించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ స్థానాల్లో గెలిచింది. ప్రస్తుతం భూపతిరెడ్డి 21,963 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్‌రావు ప్రస్తుతం 24,001 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మదన్ మోహన్ 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి కేవలం 6వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక బోధన్ నుంచి గెలిచిన మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మినహా నిజామాబాద్ రూరల్ నుంచి విజయం సాధించిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి నుంచి గెలుపొందిన మదన్‌మోహన్‌రావు, జుక్కల్ నుంచి గెలిచిన లక్ష్మీకాంతరావు సైతం శాసనసభలో తొలిసారి అడుగుపెట్టనున్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కేవలం 3,062 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో గెలుపొందారు. 1999, 2004, 2009లో బోధన్ నుంచి గెలిచిన సుదర్శన్‌రెడ్డి వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో పనిచేశారు. 2014, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌పై పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం షకీల్‌పై విజయం సాధించారు.

పోచారం వరుసగా 5వ సారి, ప్రశాంత్‌రెడ్డి వరుసగా 3వ సారి విజయం

బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన పోచారం శ్రీనివాసరెడ్డి తన రాజకీయ జీవితంలో 8 సార్లు పోటీ చేసి 7 సార్లు గెలుపొందగా, 2009, 2011(ఉప ఎన్నిక), 2014, 2018, 2023లలో వరుసగా 5 సార్లు విజయం సాధించడం గమనార్హం. స్పీకర్‌గా పనిచేసిన వారు తదుపరి ఎన్నికల్లో ఓటమి చెందుతారన్న సెంటిమెంట్‌ను పోచారం బ్రేక్ చేశారు. పోచారం 23,464 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక బాల్కొండ నుంచి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 2014, 2018, 2023లో వరుసగా మూడుసార్లు గెలు పొందారు. ప్రశాంత్‌రెడ్డి కేవలం 4,533ఓట్లతో గెలుపొందారు. నిజామాబాద్ రూరల్ నుంచి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రస్తు తం 21,963 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.

ఓరుగల్లులో కాంగ్రెస్ హోరు

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మూడోసారి జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓరుగల్లులో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 10 చోట్ల గెలిచి అనూహ్య ఫలితాలను రికార్డు చేయగా, బీఆర్ఎస్ రెండు స్థానాలకే పరిమితమైంది. రాజకీయ ఉద్దండులుగా పేరొందిన నాయకులు, వరుస విజయాలను నమోదు చేసిన నేతలు కాంగ్రెస్ అభ్యర్థుల చేతిలో ఓటమిపాలయ్యారు. వరంగల్ పశ్చిమనుంచి బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి, తూర్పులో బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావుపై కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ, పరకాలలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు విజయం సాధించారు. అదేవిధంగా భూపాలపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు, ములుగులో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిపై కాంగ్రెస్ నుంచి ములుగు సీతక్క గెలుపొందారు. నర్సంపేటనుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి, పాలకుర్తిలో మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి, మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్‌పై కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్, డోర్నకల్‌లో రెడ్యానాయక్‌పై కాంగ్రెస్ అభ్యర్థి రాంచంద్రునాయక్ విజయం సాధించారు. జనగామలో కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరపై బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపొందారు.

గిరిజన ఖిల్లాలో 'కమలం' బోణీ!

● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు విభిన్న తీర్పు ఇచ్చారు. తొలిసారిగా ఈ ప్రాంతం నుంచి నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపి కొత్త రికార్డు సృష్టించారు. ఈ ప్రాంతం నుంచి కమలనాథులు శాసనసభకు ఎన్నికకావడం ఇదే తొలిసారి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది స్థానాల్లో ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్‌లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. 2019 ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా సోయం బాపూరావు బీజేపీ నుంచి గెలిచి సంచలనం సృష్టించారు. తాజాగా ఏకంగా నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించి ఇక్కడి ఓటర్లు అనూహ్య తీర్పునిచ్చారు.

బీఆర్ఎస్‌పై అదే దెబ్బ..

గిరిజనుల రిజర్వేషన్లు 6 నుంచి పది శాతం పెంచుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆదివాసీ, గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ భూమి హక్కు పత్రాలు) 48వేల మందికి లక్ష ఎకరాల అటవీ భూములపై హక్కులు కల్పించారు. కానీ ఇవేమీ బీఆర్ఎస్‌కు ఫలితం ఇవ్వలేకపోయాయి. ఆదివాసీ లంబాడా మధ్య వైరం, గిరిజనేతరులకు ఏజెన్సీ సమస్యలు బీఆర్ఎస్‌ను దెబ్బతీశాయి. మూడు ఎస్టీ స్థానాల్లో ఆసిఫాబాద్, బోథ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు కోవ లక్ష్మి అనిల్ జాదవ్ గెలుపొందగా, ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు గెలిచారు. నిర్మల్ నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, మంచిర్యాలలో నడిపెల్లి దివాకర్‌రావు, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప, బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్య, చెన్నూరులో బాల్క సుమన్ ఘోర ఓటమి పాలయ్యారు.

కేటీఆర్ దోస్తుకు కలిసి రాలే!

కేటీఆర్ స్నేహితుడైన భూక్యా జాన్సన్‌నాయక్ ఖానాపూర్‌లో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు గెలుపొందారు. మొదటి నుంచి ఈ స్థానంలో త్రికోణ పోటీగా ఉంది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ, సీనియర్ నాయకులు రమేశ్‌రాథోడ్, ఇటు జాన్సన్ నాయక్, వెడ్మ బొజ్జు బరిలో ఉండగా, చివరకు ఆదివాసీ నాయకుడికే పట్టం కట్టారు. ఇక్కడ 1984లో మాజీ మంత్రి కోట్నాక భీంరావు కాంగ్రెస్ నుంచి గెలవగా, మళ్లీ 40ఏళ్ల తర్వాత ఓ ఆదివాసీకి విజయం వరించింది.

గ్రేటర్ ఓటు బీఆర్ఎస్‌కే..

మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ కారుకే మెజారిటీ సీట్లు

వికారాబాద్‌లో కాంగ్రెస్ గాలి

సాక్షి, హైదరాబాద్, సాక్షి, మేడ్చల్ జిల్లా, సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రేటర్ నగరంలో అధికార బీఆర్ఎస్ సత్తా చూపింది. కోర్‌సిటీ(పాత ఎంసీహెచ్) పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ ఏడింట సిట్టింగ్‌లుండగా, తిరిగి వాటిని కైవసం చేసుకుంది. ముషీరాబాద్ (ముఠాగోపాల్), అంబర్‌పేట(కాలేరు వెంకటేశ్), ఖైరతాబాద్(దానం నాగేందర్), జూబ్లీహిల్స్(మాగంటి గోపీనాథ్), సనత్‌నగర్ (తలసాని శ్రీనివాస్‌యాదవ్), సికింద్రాబాద్(పద్మారావు)నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్న మరణంతో ఈసారి ఆయన కుమార్తె లాస్యనందితకు టికెట్టివ్వగా ఆమె గెలుపొందారు. గ్రేటర్ పరిధిలోనే ఉన్న రంగారెడ్డి జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు డి.సుధీర్‌రెడ్డి(ఎల్‌బీనగర్), ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్), అరికపూడి గాంధీ(శేరిలింగంపల్లి), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం) తిరిగి గెలుపొందారు.

మేడ్చల్ జిల్లాలో 5 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మేడ్చల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డి రెండోసారి గెలుపొందగా, కుత్బుల్లాపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మూడోసారి ఘనవిజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు కూడా మూడోసారి గెలుపొంది,హ్యాట్రిక్ సాధించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటిసారి పోటీ చేసిన బండారి లక్ష్మారెడ్డి గెలుపొందారు. అలాగే, మల్కాజిగిరిలో కూడా చామకూర మల్లారెడ్డి స్వయాన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మొదటిసారి విజయం సాధించారు.

రంగారెడ్డిలో కారు హవా..

రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గానూ ఐదు చోట్ల బీఆర్ఎస్, మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మహేశ్వరం నుంచి పోటీచేసిన మంత్రి సబితారెడ్డి మూడోసారి వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన కాలె యాదయ్య మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నుంచి ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లిలో అరికెపూడి గాంధీ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున షాద్‌నగర్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసిన వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపొందారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి 40వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు.

వికారాబాద్‌లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్!

వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగింది. నాలుగు నియోజకవర్గాల్లోనూ హస్తం పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. జిల్లా మొత్తం క్లీన్‌స్వీప్ చేయడంతో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో సంబరాలు మిన్నంటాయి. ఎమ్మెల్యేలకు ఎర కేసులో కీలకంగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి తాండూరులో బుయ్యని మనోహర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. వికారాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఈసారి గెలుపు బావుటా ఎగరేశారు. పరిగి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డిపై గెలుపొం దారు.

వాళ్లంతా కారు వైపే!

ఓ సామాజిక వర్గం నాయకుల మాటలను పట్టించుకోని సీమాంధ్రులు..

ఏపీ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో భారీ మెజారిటీతో బీఆర్ఎస్ విజయం

జీహెచ్ఎంసీ పరిధిలో ఖాతా తెరవని కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ సెటిలర్లు మరోసారి బీఆర్ఎస్ వైపే నిలిచారు. ఇటీవలి కాలంలో ఏపీలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలతో ఏపీ మూలాలున్న ఓటర్లంతా కాంగ్రెస్ వైపే నిలిచినట్లు ప్రచారం జరిగింది. సీమాంధ్రకు చెందిన ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన కొందరు మరో అడుగు ముందుకేసి ఈసారి సెటిలర్లు ఉన్న ప్రాంతాల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని, కాంగ్రెస్‌కు ఓటేయాలని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కూడా చేశారు. ఈ మేరకు ఆ సామాజిక వర్గం ఓట్లన్నీ కాంగ్రెస్‌కే పడుతాయని ఊదరగొట్టారు. అయితే ఫలితాలు అందుకు భిన్నంగా ఉండి, సీమాంధ్ర సెటిలర్లు ఇప్పటికీ బీఆర్ఎస్ వైపే ఉన్నట్లు స్పష్టమైంది. గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో ఎంఐఎం ప్రభావం ఉన్న ఏడు సీట్లు, బీజేపీకి గోషామహల్ పోగా మిగతా 16నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టనున్న కాంగ్రెస్‌కు జీహెచ్ఎంసీలో ఒక్కసీటు కూడా రాకపోవడం గమనార్హం.

బీఆర్ఎస్ నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఆ వర్గం ఎమ్మెల్యేలు..

సీమాంధ్రకు చెందిన ఒక సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ అభ్యర్థులు శేరిలింగంపల్లి నుంచి అరికపూడి గాంధీ, జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపీనాథ్ మూడోసారి భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ నియోజకవర్గాల్లో వారికి సంబంధించిన సామాజిక వర్గం ఓటర్లు గెలుపోటములను నిర్దేశించే స్థాయిలో ఉండడం గమనార్హం. అలాగే రాష్ట్రంలోనే అత్యధికంగా 85వేలకు పైగా మెజారిటీతో కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కె.పి. వివేకానంద విజయం సాధించడంలో సీమాంధ్రకు చెందిన ఓటర్లు కీలక పాత్ర పోషించారు. ఇక్కడ సీమాంధ్రకు చెందిన ఓ సామాజిక వర్గం నాయకులుగా చెప్పుకొనేవారు పనిగట్టుకొని ప్రచారం చేసినా ఓటర్లు పట్టించుకోలేదు. అదే విధంగా సనత్‌నగర్ ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొందిన తాజా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్కాజిగిరిలో రాజశేఖర్ రెడ్డి, ఎల్‌బీనగర్‌లో సుధీర్ రెడ్డి, ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, మేడ్చల్‌లో మల్లారెడ్డి , రాజేంద్రనగర్ నుంచి ప్రకాశ్‌గౌడ్ వంటి వారి విజయంలో కూడా సీమాంధ్ర ఓటర్లే కీలక పాత్ర పోషించారు. సీమాంధ్ర ఓటర్లు కులాల వారీగా విడిపోలేదనీ, అన్ని సామాజిక వర్గాలు ప్రధానంగా బీఆర్ఎస్ వైపే మొగ్గ చూపాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు వీరే

సిర్పూర్
హరీశ్‌బాబు (బీజేపీ)
ఓట్లు : 63702 మెజారిటీ : 3088
రెండో స్థానం : కోనప్ప (బీఆర్‌ఎస్) ఓట్లు : 60614
మూడోస్థానం: ప్రవీణ్‌కుమార్ (బీఎస్పీ) ఓట్లు : 44646

ఆసిఫాబాద్
కోవలక్ష్మి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 83036 మెజారిటీ : 22798
రెండో స్థానం : శ్యాం (కాంగ్రెస్) ఓట్లు : 60238
మూడో స్థానం : విజయ్ (స్వతంత్ర) ఓట్లు : 16469

చెన్నూర్
వివేక్ (కాంగ్రెస్)
ఓట్లు : 87541 మెజారిటీ : 37515
రెండో స్థానం : సుమన్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 50026
మూడో స్థానం : అశోక్ (బీజేపీ) ఓట్లు : 3375

బెల్లంపల్లి
వినోద్ (కాంగ్రెస్)
ఓట్లు : 82217 మెజారిటీ : 36878
రెండో స్థానం : చిన్నయ్య (బీఆర్‌ఎస్) ఓట్లు : 45339
మూడో స్థానం : శ్రీదేవి (బీజేపీ) ఓట్లు : 3812

మంచిర్యాల
ప్రేంసాగర్‌రావు (కాంగ్రెస్)
ఓట్లు : 105945 మెజారిటీ : 66116
రెండో స్థానం : రఘునాథ్ (బీజేపీ) ఓట్లు : 39829
మూడోస్థానం: దివాకర్‌రావు(బీఆర్‌ఎస్) ఓట్లు: 37989

ఆదిలాబాద్
శంకర్ (బీజేపీ)
ఓట్లు : 67608 మెజారిటీ : 6692
రెండో స్థానం : జోగురామన్న (బీఆర్‌ఎస్) ఓట్లు : 60916
మూడోస్థానం: శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు: 47724

ఖానాపూర్
వెడ్మబొజ్జు (కాంగ్రెస్)
ఓట్లు : 58870 మెజారిటీ : 4702
రెండో స్థానం : జాన్సన్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 54168
మూడో స్థానం : రమేష్(బీజేపీ) ఓట్లు : 52398

బోథ్
అనిల్‌జాదవ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 76792 మెజారిటీ : 22800
రెండో స్థానం : బాపూరావు (బీజేపీ) ఓట్లు : 53992
మూడో స్థానం : గజేందర్ (కాంగ్రెస్) ఓట్లు : 32797

నిర్మల్
మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ)
ఓట్లు: 106400 మెజారిటీ : 50703
రెండో స్థానం : ఇంద్రకరణ్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 55697
మూడో స్థానం :శ్రీహరిరావు(కాంగ్రెస్) ఓట్లు : 28642

ముధోల్
రామారావుపటేల్ (బీజేపీ)
ఓట్లు : 98252 మెజారిటీ : 23999
రెండో స్థానం :విఠల్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 74253
మూడోస్థానం : నారాయణరావు(కాంగ్రెస్) ఓట్లు: 15588

నిజామాబాద్ అర్బన్
సూర్యనారాయణ (బీజేపీ)
ఓట్లు : 75240 మెజారిటీ : 15387
రెండో స్థానం : షబ్బీర్‌అలీ(కాంగ్రెస్) ఓట్లు :59853
మూడోస్థానం :గణేష్‌గుప్తా (బీఆర్‌ఎస్) ఓట్లు: 44829

నిజామాబాద్ రూరల్
భూపతిరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 78378 మెజారిటీ : 21963
రెండోస్థానం : బాజిరెడ్డిగోవర్దన్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 56415
మూడో స్థానం : దినేష్ (బీజేపీ) ఓట్లు : 49723

కామారెడ్డి
వెంకటరమణారెడ్డి (బీజేపీ)
ఓట్లు : 66652 మెజారిటీ : 6741
రెండో స్థానం : కేసీఆర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 59911
మూడో స్థానం : రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 54916

ఎల్లారెడ్డి
మదన్‌మోహన్ (కాంగ్రెస్)
ఓట్లు : 86989 మెజారిటీ : 24001
రెండో స్థానం : సురేందర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 62988
మూడో స్థానం : సుభాష్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 27000

బాన్సువాడ
పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 76278 మెజారిటీ : 23464
రెండో స్థానం : రవీందర్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 52814
మూడోస్థానం: లక్ష్మీనారాయణ (బీజేపీ) ఓట్లు: 23685

జుక్కల్
లక్ష్మీకాంతారావు (కాంగ్రెస్)
ఓట్లు : 64489 మెజారిటీ : 1152
రెండో స్థానం : హన్మంత్‌షిండే (బీఆర్‌ఎస్) ఓట్లు : 63337
మూడో స్థానం : అరుణతార (బీజేపీ) ఓట్లు : 28437

బోధన్
సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 66963 మెజారిటీ : 3062
రెండో స్థానం : షకీల్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 63901
మూడో స్థానం : మోహన్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 33555

ఆర్మూర్
రాకేష్‌రెడ్డి (బీజేపీ)
ఓట్లు : 72658 మెజారిటీ : 29669
రెండో స్థానం : వినయ్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 42989
మూడో స్థానం : జీవన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 39395

బాల్కొండ
ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 70417 మెజారిటీ : 4533
రెండో స్థానం : సునీల్‌కుమార్(కాంగ్రెస్) ఓట్లు : 65884
మూడో స్థానం : అన్నపూర్ణ (బీజేపీ) ఓట్లు : 30250

కరీంనగర్
గంగుల కమలాకర్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 92179 మెజారిటీ : 3163
రెండో స్థానం : బండి సంజయ్(బీజేపీ) ఓట్లు : 89016
మూడో స్థానం : శ్రీనివాస్ (కాంగ్రెస్) ఓట్లు : 40057

చొప్పదండి
సత్యం (కాంగ్రెస్)
ఓట్లు : 90395 మెజారిటీ : 37439
రెండో స్థానం : రవిశంకర్(బీఆర్‌ఎస్) ఓట్లు : 52956
మూడో స్థానం : శోభ (బీజేపీ) ఓట్లు : 26669

మానకొండూరు
సత్యనారాయణ (కాంగ్రెస్)
ఓట్లు : 96773 మెజారిటీ : 32365
రెండో స్థానం : బాలకిషన్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 64408
మూడో స్థానం : మోహన్ (బీజేపీ) ఓట్లు : 14879

హుజూరాబాద్
కౌశిక్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 80333 మెజారిటీ : 16873
రెండో స్థానం : ఈటల రాజేందర్ (బీజేపీ) ఓట్లు : 63460
మూడో స్థానం : ప్రణవ్ (కాంగ్రెస్) ఓట్లు : 53164

హుస్నాబాద్
పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్)
ఓట్లు : 100955 మెజారిటీ : 19344
రెండో స్థానం : సతీష్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 81611
మూడో స్థానం : శ్రీరాం (బీజేపీ) ఓట్లు : 8338

కోరుట్ల
సంజయ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 72115 మెజారిటీ : 10305
రెండో స్థానం :అర్వింద్ (బీజేపీ) ఓట్లు : 61810
మూడోస్థానం: నర్సింగరావు (కాంగ్రెస్) ఓట్లు: 39647

జగిత్యాల
సంజయ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 70243 మెజారిటీ : 15822
రెండో స్థానం : జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 54421
మూడో స్థానం : శ్రావణి (బీజేపీ) ఓట్లు : 42138

ధర్మపురి
లక్ష్మణ్‌కుమార్ (కాంగ్రెస్)
ఓట్లు : 91393 మెజారిటీ : 22039
రెండో స్థానం : ఈశ్వర్ (బీఆర్‌ఎస్) ఓట్లు :69354
మూడో స్థానం : కుమార్ (బీజేపీ) ఓట్లు : 7345

రామగుండం
రాజ్‌ఠాకూర్ (కాంగ్రెస్)
ఓట్లు: 92227 మెజారిటీ : 56794
రెండో స్థానం : చందర్(బీఆర్‌ఎస్) ఓట్లు : 35433
మూడో స్థానం : సంధ్యారాణి (బీజేపీ) ఓట్లు : 12966

మంథని
శ్రీధర్‌బాబు (కాంగ్రెస్)
ఓట్లు: 103822 మెజారిటీ : 31380
రెండో స్థానం :మధుకర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 72442
మూడో స్థానం :సునీల్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 5779

పెద్దపల్లి
విజయరమణరావు (కాంగ్రెస్)
ఓట్లు : 118888 మెజారిటీ : 55108
రెండో స్థానం : మనోహర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 63780
మూడో స్థానం : ఉష (బీఎస్పీ) ఓట్లు : 10315

వేములవాడ
ఆదిశ్రీనివాస్ (కాంగ్రెస్)
ఓట్లు : 71451 మెజారిటీ : 14581
రెండోస్థానం: లక్ష్మీనరసింహారావు (బీఆర్‌ఎస్) ఓట్లు:56870
మూడో స్థానం : వికాస్ (బీజేపీ) ఓట్లు : 29710

సిరిసిల్ల
కేటీఆర్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 89244 మెజారిటీ : 29687
రెండో స్థానం : మహేందర్‌రెడ్డి(కాంగ్రెస్) ఓట్లు : 59557
మూడో స్థానం : రుద్రమదేవి (బీజేపీ) ఓట్లు : 18328

మెదక్
మైనంపల్లి రోహిత్ (కాంగ్రెస్)
ఓట్లు : 87126 మెజారిటీ : 10157
రెండోస్థానం: పద్మాదేవేందర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 76969
మూడోస్థానం: విజయ్‌కుమార్(బీజేపీ) ఓట్లు : 13657

నర్సాపూర్
సునీత లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 88410 మెజారిటీ : 8855
రెండో స్థానం : రాజిరెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 79555
మూడో స్థానం : మురళీధర్ (బీజేపీ) ఓట్లు : 22865

సంగారెడ్డి
చింతా ప్రభాకర్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 83112 మెజారిటీ : 8217
రెండో స్థానం : జగ్గారెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 74895
మూడో స్థానం : రాజు (బీజేపీ) ఓట్లు : 20921

నారాయణఖేడ్
సంజీవరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 91373 మెజారిటీ : 6547
రెండో స్థానం : భూపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 84826
మూడో స్థానం : సంగప్ప (బీజేపీ) ఓట్లు : 7823

జహీరాబాద్
మాణిక్‌రావు (బీఆర్‌ఎస్)
ఓట్లు : 96900 మెజారిటీ : 13280
రెండోస్థానం :చంద్రశేఖర్ (కాంగ్రెస్) ఓట్లు : 83620
మూడో స్థానం : రాంచందర్ (బీజేపీ) ఓట్లు : 13454

పటాన్‌చెరు
గూడెం మహిపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 105387 మెజారిటీ : 7091
రెండో స్థానం :శ్రీనివాస్‌గౌడ్ (కాంగ్రెస్) ఓట్లు : 98296
మూడో స్థానం : నీలం మధు (బీఎస్పీ) ఓట్లు : 46162

అందోల్
దామోదరరాజనర్సింహ (కాంగ్రెస్)
ఓట్లు : 114147 మెజారిటీ : 28193
రెండో స్థానం : క్రాంతికిరణ్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 85954
మూడో స్థానం : బాబుమోహన్ (బీజేపీ) ఓట్లు : 5524

సిద్దిపేట
హరీశ్‌రావు (బీఆర్‌ఎస్)
ఓట్లు: 105514 మెజారిటీ : 82308
రెండో స్థానం : హరికృష్ణ (కాంగ్రెస్) ఓట్లు : 23206
మూడో స్థానం : శ్రీకాంత్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 23201

దుబ్బాక
కొత్త ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 97879 మెజారిటీ : 53513
రెండో స్థానం : రఘునందన్‌రావు (బీజేపీ) ఓట్లు : 44366
మూడోస్థానం : శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు: 25235

గజ్వేల్
కేసీఆర్ (బీఆర్‌ఎస్)
ఓట్లు: 111684 మెజారిటీ : 45031
రెండోస్థానం : ఈటల రాజేందర్ (బీజేపీ) ఓట్లు : 66653
మూడో స్థానం : నర్సారెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 32568

వరంగల్ పశ్చిమ
రాజేందర్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 72649 మెజారిటీ : 15331
రెండోస్థానం : వినయ్‌భాస్కర్ (బీఆర్‌ఎస్) ఓట్లు: 57318
మూడో స్థానం : పద్మ (బీజేపీ) ఓట్లు : 30826

వరంగల్ తూర్పు
కొండాసురేఖ (కాంగ్రెస్)
ఓట్లు : 66725 మెజారిటీ : 15043
రెండో స్థానం : ప్రదీప్‌రావు (బీజేపీ) ఓట్లు : 51682
మూడో స్థానం : నరేందర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 42535

జనగామ
రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 98557 మెజారిటీ : 16418
రెండో స్థానం : ప్రతాప్‌రెడ్డి(కాంగ్రెస్) ఓట్లు : 82139
మూడో స్థానం : దశమంతరెడ్డి(బీజేపీ) ఓట్లు : 7595

స్టేషన్‌ఘన్‌పూర్
కడియం శ్రీహరి (బీఆర్‌ఎస్)
ఓట్లు :101696 మెజారిటీ :7779
రెండో స్థానం : ఇందిర (కాంగ్రెస్) ఓట్లు : 93917
మూడోస్థానం: విజయరామారావు (బీజేపీ) ఓట్లు: 4984

పాలకుర్తి
యశస్వినిరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు: 126848 మెజారిటీ : 47634
రెండో స్థానం : దయాకర్‌రావు (బీఆర్‌ఎస్) ఓట్లు : 79214
మూడో స్థానం : వెంకట్‌రెడ్డి (స్వతంత్ర) ఓట్లు : 4146

డోర్నకల్
రాంచందర్‌నాయక్ (కాంగ్రెస్)
ఓట్లు: 115587 మెజారిటీ : 53131
రెండో స్థానం : రెడ్యానాయక్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 62456
మూడోస్థానం : రత్నఅజ్మీర (స్వతంత్ర) ఓట్లు : 2773

మహబూబాబాద్
మురళీనాయక్ (కాంగ్రెస్)
ఓట్లు : 116644మెజారిటీ : 50171
రెండో స్థానం : శంకర్‌నాయక్(బీఆర్‌ఎస్) ఓట్లు : 66473
మూడోస్థానం: హుసేన్‌నాయక్(బీజేపీ) ఓట్లు: 17038

నర్సంపేట
దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు: 104185 మెజారిటీ : 18889
రెండోస్థానం: సుదర్శన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 85296
మూడో స్థానం : ప్రతాప్ (బీజేపీ) ఓట్లు : 3062

పరకాల
రేవూరి ప్రకాష్‌రెడ్డి(కాంగ్రెస్)
ఓట్లు : 72573 మెజారిటీ : 7941
రెండో స్థానం : ధర్మారెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 64632
మూడో స్థానం : కాళీప్రసాద్ (బీజేపీ) ఓట్లు : 38735

వర్ధన్నపేట
నాగరాజు (కాంగ్రెస్)
ఓట్లు: 106696 మెజారిటీ : 19458
రెండో స్థానం : రమేష్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 87238
మూడో స్థానం : శ్రీధర్ (బీజేపీ) ఓట్లు : 12275

భూపాలపల్లి
గండ్ర సత్యనారాయణ (కాంగ్రెస్)
ఓట్లు: 123116 మెజారిటీ : 52699
రెండోస్థానం: వెంకటరమణారెడ్డి(బీఆర్‌ఎస్) ఓట్లు: 70417
మూడో స్థానం :కీర్తిరెడ్డి(బీజేపీ) ఓట్లు : 14731

ములుగు
సీతక్క (కాంగ్రెస్)
ఓట్లు: 102267 మెజారిటీ : 33700
రెండో స్థానం : నాగజ్యోతి (బీఆర్‌ఎస్) ఓట్లు : 68567
మూడో స్థానం : ప్రహ్లాద్ (బీజేపీ) ఓట్లు : 5388

ఖమ్మం
తుమ్మల నాగేశ్వరరావు (కాంగ్రెస్)
ఓట్లు: 136016 మెజారిటీ : 49381
రెండో స్థానం : అజయ్(బీఆర్‌ఎస్) ఓట్లు : 86635
మూడో స్థానం : రామకృష్ణ (జనసేన) ఓట్లు : 4040

పాలేరు
పొంగులేటి శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు: 127820 మెజారిటీ : 56650
రెండో స్థానం : ఉపేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 71170
మూడో స్థానం : తమ్మినేని (సీపీఎం) ఓట్లు : 5308

మధిర
భట్టి విక్రమార్క (కాంగ్రెస్)
ఓట్లు : 108970 మెజారిటీ : 35452
రెండో స్థానం : కమల్‌రాజ్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 73518
మూడో స్థానం : భాస్కర్ (సీపీఎం) ఓట్లు : 6575

వైరా
రాందాస్‌నాయక్ (కాంగ్రెస్)
ఓట్లు : 93913 మెజారిటీ : 33045
రెండో స్థానం : మదన్‌లాల్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 60868
మూడో స్థానం : వీరభద్రం(సీపీఎం) ఓట్లు : 4439

సత్తుపల్లి
మట్టా రాగమయి (కాంగ్రెస్)
ఓట్లు : 111245 మెజారిటీ : 19440
రెండో స్థానం : సండ్ర వీరయ్య(బీఆర్‌ఎస్) ఓట్లు : 91805
మూడోస్థానం: రామలింగేశ్వరావు (బీజేపీ) ఓట్లు : 1882

కొత్తగూడెం
సాంబశివరావు (సీపీఐ)
ఓట్లు : 80336 మెజారిటీ : 26547
రెండో స్థానం వెంకట్రావు (ఫార్వర్డ్‌బ్లాక్) ఓట్లు : 53789
మూడో స్థానం : వనమా (బీఆర్‌ఎస్) ఓట్లు : 37555

పినపాక
పాయం వెంకటేశ్వర్లు (కాంగ్రెస్)
ఓట్లు : 90510 మెజారిటీ : 34506
రెండో స్థానం : కాంతారావు(బీఆర్‌ఎస్) ఓట్లు : 56004
మూడో స్థానం : బాలరాజు (బీజేపీ) ఓట్లు : 2627

ఇల్లెందు
కోరం కనకయ్య (కాంగ్రెస్)
ఓట్లు : 109171 మెజారిటీ : 57309
రెండో స్థానం : హరిప్రియ (బీఆర్‌ఎస్) ఓట్లు : 51862
మూడో స్థానం :రవీంద్రనాయక్ (బీజేపీ) ఓట్లు : 2568

అశ్వారావుపేట
ఆదినారాయణ (కాంగ్రెస్)
ఓట్లు : 74993 మెజారిటీ : 28905
రెండో స్థానం : నాగేశ్వరరావు (బీఆర్‌ఎస్) ఓట్లు : 46088
మూడో స్థానం : అర్జున్‌రావు (సీపీఎం) ఓట్లు : 2488

భద్రాచలం
వెంకట్రావ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 53252 మెజారిటీ : 5719
రెండో స్థానం :వీరయ్య (కాంగ్రెస్) ఓట్లు : 47533
మూడో స్థానం :పుల్లయ్య (సీపీఎం) ఓట్లు : 5860

నల్లగొండ
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 107405 మెజారిటీ : 54332
రెండో స్థానం : భూపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు :53073
మూడో స్థానం : రామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్) ఓట్లు : 27096

నకిరేకల్
వేముల వీరేశం (కాంగ్రెస్)
ఓట్లు : 133540 మెజారిటీ : 68839
రెండో స్థానం : లింగయ్య (బీఆర్‌ఎస్) ఓట్లు : 64701
మూడో స్థానం : మొగులయ్య (బీజేపీ) ఓట్లు : 5668

మునుగోడు
కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 119624 మెజారిటీ : 40590
రెండో స్థానం :ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 79034
మూడో స్థానం :కృష్ణారెడ్డి (బీజేపీ) ఓట్లు : 22319

దేవరకొండ
బాలునాయక్ (కాంగ్రెస్)
ఓట్లు: 111344 మెజారిటీ : 30021
రెండోస్థానం : రవీంద్రనాయక్ (బీఆర్‌ఎస్) ఓట్లు: 81323
మూడో స్థానం : లాలూనాయక్ (బీజేపీ) ఓట్లు : 9815

నాగార్జునసాగర్
కుందూరు జైవీర్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 119831 మెజారిటీ : 55849
రెండో స్థానం : భగత్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 63982
మూడో స్థానం : నివేదిత(బీజేపీ) ఓట్లు : 6491

మిర్యాలగూడ
బత్తుల లక్ష్మారెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 114462 మెజారిటీ : 48782
రెండో స్థానం : భాస్కర్‌రావు (బీఆర్‌ఎస్) ఓట్లు : 65680
మూడో స్థానం : రంగారెడ్డి(సీపీఎం) ఓట్లు : 3234

సూర్యాపేట
జగదీశ్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 75143 మెజారిటీ : 4606
రెండో స్థానం : దామోదర్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 70537
మూడో స్థానం : సంకినేని (బీజేపీ) ఓట్లు : 40407

తుంగతుర్తి
సామేల్ (కాంగ్రెస్)
ఓట్లు: 129535 మెజారిటీ : 51094
రెండో స్థానం కిషోర్(బీఆర్‌ఎస్) ఓట్లు : 78441
మూడోస్థానం: రామచంద్రయ్య (బీజేపీ) ఓట్లు : 4412

హుజూర్‌నగర్
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు: 116707 మెజారిటీ : 44888
రెండో స్థానం :సైదిరెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 71819
మూడో స్థానం : రఘు (ఫార్వర్డ్‌బ్లాక్) ఓట్లు : 8280

కోదాడ
పద్మావతి (కాంగ్రెస్)
ఓట్లు: 125783 మెజారిటీ : 58172
రెండో స్థానం : మల్లయ్య (బీఆర్‌ఎస్) ఓట్లు : 67611
మూడో స్థానం : శ్రీనివాస్ (బీఎస్పీ) ఓట్లు : 3369

భువనగిరి
అనిల్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 102742 మెజారిటీ : 26201
రెండో స్థానం : శేఖర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 76541
మూడో స్థానం : నారాయణరెడ్డి (బీజేపీ) ఓట్లు : 9200

ఆలేరు
ఐలయ్య (కాంగ్రెస్)
ఓట్లు: 122140 మెజారిటీ : 49636
రెండో స్థానం : సునీత (బీఆర్‌ఎస్) ఓట్లు : 72504
మూడో స్థానం : శ్రీనివాస్ (బీజేపీ) ఓట్లు : 9659

నారాయణపేట
పర్ణికారెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 84708 మెజారిటీ : 7951
రెండో స్థానం : రాజేందర్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఓట్లు : 76757
మూడో స్థానం : పాండురెడ్డి (బీజేపీ) ఓట్లు : 15078

మహబూబ్‌నగర్
శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 87227 మెజారిటీ : 18738
రెండో స్థానం : శ్రీనివాస్‌గౌడ్(బీఆర్‌ఎస్) ఓట్లు : 68489
మూడో స్థానం : మిథున్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 19919

జడ్చర్ల
అనిరుధ్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 90865 మెజారిటీ : 15171
రెండో స్థానం : లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 75694
మూడోస్థానం : చిత్తరంజన్‌దాస్ (బీజేపీ) ఓట్లు: 7312

దేవరకద్ర
మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 88551 మెజారిటీ : 1392
రెండో స్థానం : వెంకటేశ్వర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 87159
మూడో స్థానం : ప్రశాంత్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 13164

మక్తల్
శ్రీహరి (కాంగ్రెస్)
ఓట్లు : 74917 మెజారిటీ : 17525
రెండో స్థానం : రాంమోహన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 57392
మూడో స్థానం : జలంధర్‌రెడ్డి(బీజేపీ) ఓట్లు : 45455

వనపర్తి
మేఘారెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 107115 మెజారిటీ : 25320
రెండో స్థానం : నిరంజన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 81795
మూడో స్థానం : అనుజ్ఞారెడ్డి(బీజేపీ) ఓట్లు : 9185

గద్వాల
కృష్ణమోహన్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 94097 మెజారిటీ : 7036
రెండో స్థానం : సరిత (కాంగ్రెస్) ఓట్లు : 87061
మూడో స్థానం :రంజిత్ (ఫార్వర్డ్‌బ్లాక్) ఓట్లు : 13454

అలంపూర్
విజయుడు (బీఆర్‌ఎస్)
ఓట్లు : 104060 మెజారిటీ : 30573
రెండో స్థానం సంపత్ (కాంగ్రెస్) ఓట్లు : 73487
మూడోస్థానం : ప్రసన్నకుమార్ (బీఎస్పీ) ఓట్లు: 6082

నాగర్‌కర్నూల్
రాజేష్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 87161మెజారిటీ : 5248
రెండో స్థానం : జనార్దన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 81913
మూడో స్థానం : కే.కుమార్ (బీఎస్పీ) ఓట్లు : 4914

అచ్చంపేట
వంశీకృష్ణ (కాంగ్రెస్)
ఓట్లు: 115337 మెజారిటీ : 49326
రెండో స్థానం : బాలరాజు (బీఆర్‌ఎస్) ఓట్లు : 66011
మూడో స్థానం : సతీష్ (బీజేపీ) ఓట్లు : 4267

కల్వకుర్తి
కసిరెడ్డి నారాయణరెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 75858 మెజారిటీ : 5410
రెండో స్థానం : ఆచారి (బీజేపీ) ఓట్లు : 70448
మూడోస్థానం : జైపాల్ (బీఆర్‌ఎస్) ఓట్లు:42847

షాద్‌నగర్
శంకరయ్య (కాంగ్రెస్)
ఓట్లు : 77817 మెజారిటీ : 7128
రెండో స్థానం : అంజయ్య (బీఆర్‌ఎస్) ఓట్లు : 70689
మూడోస్థానం: విష్ణువర్దన్(ఫార్వర్డ్‌బ్లాక్) ఓట్లు: 31651

కొల్లాపూర్
జూపల్లి కృష్ణారావు (కాంగ్రెస్)
ఓట్లు : 93609 మెజారిటీ : 29931
రెండో స్థానం : హర్షవర్ధన్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఓట్లు : 63678
మూడో స్థానం : సుధాకర్‌రావు (బీజేపీ) ఓట్లు : 20389

కొడంగల్
ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు :107429 మెజారిటీ : 32532
రెండో స్థానం : పి.నరేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 74897
మూడో స్థానం : బంటు రమేష్ (బీజేపీ) ఓట్లు : 3988

ఇబ్రహీంపట్నం
మల్‌రెడ్డి రంగారెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు: 126506 మెజారిటీ : 36700
రెండో స్థానం : కిషన్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఓట్లు : 89806
మూడో స్థానం : దయానంద్ (బీజేపీ) ఓట్లు : 15790

ఎల్‌బీనగర్
సుధీర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు: 111380 మెజారిటీ : 22305
రెండో స్థానం : రంగారెడ్డి (బీజేపీ) ఓట్లు : 89075
మూడోస్థానం: మధుయాష్కీ (కాంగ్రెస్) ఓట్లు: 83273

మహేశ్వరం
సబితాఇంద్రారెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు: 125578 మెజారిటీ : 26187
రెండో స్థానం : శ్రీరాములు (బీజేపీ) ఓట్లు : 99391
మూడో స్థానం : కేఎల్‌ఆర్ (కాంగ్రెస్) ఓట్లు : 70657

రాజేంద్రనగర్
ప్రకాశ్‌గౌడ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు: 121734 మెజారిటీ : 32096
రెండో స్థానం : శ్రీనివాస్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 89638
మూడో స్థానం : నరేందర్(కాంగ్రెస్) ఓట్లు : 82057

శేరిలింగంపల్లి
అరికెపూడి గాంధీ (బీఆర్‌ఎస్)
ఓట్లు: 157332 మెజారిటీ : 46552
రెండో స్థానం : .జగదీశ్వర్ (కాంగ్రెస్) ఓట్లు : 110780
మూడో స్థానం : రవికుమార్ (బీజేపీ) ఓట్లు : 80148

చేవెళ్ల
కాలె యాదయ్య(బీఆర్‌ఎస్)
ఓట్లు : 76218 మెజారిటీ : 268
రెండో స్థానం : భరత్ (కాంగ్రెస్) ఓట్లు : 75950
మూడో స్థానం : రత్నం (బీజేపీ) ఓట్లు : 38455

వికారాబాద్
గడ్డం ప్రసాద్ (కాంగ్రెస్)
ఓట్లు : 86885 మెజారిటీ : 12893
రెండో స్థానం :ఆనంద్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 73992
మూడో స్థానం : నవీన్ (బీజేపీ) ఓట్లు : 7132

తాండూరు
మనోహర్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 84662 మెజారిటీ : 6583
రెండో స్థానం : రోహిత్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 78079
మూడో స్థానం : శంకర్‌గౌడ్ (జనసేన) ఓట్లు : 4087

పరిగి
రాంమోహన్‌రెడ్డి (కాంగ్రెస్)
ఓట్లు : 98536 మెజారిటీ : 24013
రెండో స్థానం : మహేష్‌రెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 74523
మూడో స్థానం : కిరణ్(బీజేపీ) ఓట్లు : 16653

మేడ్చల్
మల్లారెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు : 186017 మెజారిటీ : 33419
రెండో స్థానం : వజ్రేష్‌యాదవ్ (కాంగ్రెస్) ఓట్లు : 152598
మూడో స్థానం : సుదర్శన్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 50535

మల్కాజిగిరి
మర్రి రాజశేఖరరెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు: 125049 మెజారిటీ : 49530
రెండో స్థానం : హన్మంతరావు(కాంగ్రెస్) ఓట్లు : 75519
మూడోస్థానం: రాంచందర్‌రావు (బీజేపీ) ఓట్లు: 55427

కుత్బుల్లాపూర్
వివేకానంద (బీఆర్‌ఎస్)
ఓట్లు: 187999 మెజారిటీ: 85576
రెండో స్థానం : శ్రీశైలం (బీజేపీ) ఓట్లు : 102423
మూడోస్థానం: హన్మంత్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు: 101554

కూకట్‌పల్లి
కృష్ణారావు (బీఆర్‌ఎస్)
ఓట్లు: 135635 మెజారిటీ : 70387
రెండో స్థానం :రమేష్ (కాంగ్రెస్) ఓట్లు : 65248
మూడోస్థానం : ప్రేంకుమార్ (జనసేన) ఓట్లు : 39830

ఉప్పల్
లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్)
ఓట్లు: 132433 మెజారిటీ : 49429
రెండో స్థానం : పరమేశ్వరరెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 83004
మూడో స్థానం : ప్రభాకర్ (బీజేపీ) ఓట్లు : 46976

ముషీరాబాద్
ముఠా గోపాల్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 75207 మెజారిటీ : 37797
రెండో స్థానం : అంజన్‌కుమార్ (కాంగ్రెస్) ఓట్లు : 37410
మూడో స్థానం : రాజు (బీజేపీ) ఓట్లు : 35423

మలక్‌పేట
బలాల (ఎంఐఎం)
ఓట్లు : 55805 మెజారిటీ : 26106
రెండో స్థానం : అక్బర్ (కాంగ్రెస్) ఓట్లు : 29699
మూడోస్థానం : సురేందర్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 23731

అంబర్‌పేట
వెంకటేష్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 74416 మెజారిటీ : 24537
రెండో స్థానం : కృష్ణాయాదవ్ (బీజేపీ) ఓట్లు : 49879
మూడో స్థానం : రోహిణ్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు : 18004

ఖైరతాబాద్
దానం నాగేందర్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 67368 మెజారిటీ : 22010
రెండో స్థానం : విజయారెడ్డి(కాంగ్రెస్) ఓట్లు : 45358
మూడోస్థానం : రాంచంద్రారెడ్డి (బీజేపీ) ఓట్లు: 38094

జూబ్లీహిల్స్
మాగంటి గోపినాథ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 80549 మెజారిటీ : 16337
రెండో స్థానం :అజారుద్దీన్ (కాంగ్రెస్) ఓట్లు : 64212
మూడో స్థానం : దీపక్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 25866

సనత్‌నగర్
శ్రీనివాస్ యాదవ్ (బీఆర్‌ఎస్)
ఓట్లు : 72557 మెజారిటీ : 41827
రెండో స్థానం : శశిధర్‌రెడ్డి (బీజేపీ) ఓట్లు : 30730
మూడో స్థానం : నీలిమ (కాంగ్రెస్) ఓట్లు : 22492

నాంపల్లి
మాజిద్ హుస్సేన్ (ఎంఐఎం)
ఓట్లు : 62185 మెజారిటీ : 2037
రెండో స్థానం : ఫిరోజ్‌ఖాన్ (కాంగ్రెస్) ఓట్లు : 60148
మూడో స్థానం : ఆనంద్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 15420

కార్వాన్
కౌసర్ మోహినుద్దీన్ (ఎంఐఎం)
ఓట్లు : 83388 మెజారిటీ : 41986
రెండో స్థానం : అమర్‌సింగ్ (బీజేపీ) ఓట్లు : 41402
మూడో స్థానం : కృష్ణ(బీఆర్‌ఎస్) ఓట్లు : 29194

గోషామహల్
రాజాసింగ్ (బీజేపీ)
ఓట్లు : 80182 మెజారిటీ : 21457
రెండో స్థానం : నందకిషోర్ (బీఆర్‌ఎస్) ఓట్లు : 58725
మూడో స్థానం : సునీత (కాంగ్రెస్) ఓట్లు : 6265

చార్మినార్
మీర్ జుల్ఫికర్ అలీ (ఎంఐఎం)
ఓట్లు : 49103 మెజారిటీ : 22853
రెండో స్థానం : మేఘారాణి (బీజేపీ) ఓట్లు : 26250
మూడోస్థానం : ముజీబుల్లా (కాంగ్రెస్) ఓట్లు : 10899

చాంద్రాయణగుట్ట
అక్బరుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం)
ఓట్లు : 99776 మెజారిటీ : 81660
రెండో స్థానం : సీతారాంరెడ్డి (బీఆర్‌ఎస్) ఓట్లు : 18116
మూడో స్థానం : మహేందర్ (బీజేపీ) ఓట్లు : 16414

యాకుత్‌పురా
జాఫర్ హుస్సేన్ (ఎంఐఎం)
ఓట్లు : 46153 మెజారిటీ : 878
రెండో స్థానం :అమ్జదుల్లాఖాన్ (ఎంబీటీ) ఓట్లు : 45275
మూడోస్థానం : వీరేందర్‌బాబు (బీజేపీ) ఓట్లు: 22354

బహదూర్‌పురా
మహమ్మద్ ముబీన్ (ఎంఐఎం)
ఓట్లు :89451 మెజారిటీ : 67025
రెండో స్థానం : ఇనాయత్ అలీ (బీఆర్‌ఎస్) ఓట్లు : 22426
మూడో స్థానం : రాజేష్(కాంగ్రెస్) ఓట్లు : 14448

సికింద్రాబాద్
పద్మారావు (బీఆర్‌ఎస్)
ఓట్లు : 78223 మెజారిటీ : 45240
రెండో స్థానం : సంతోష్ (కాంగ్రెస్) ఓట్లు : 32983
మూడో స్థానం : సారంగపాణి(బీజేపీ) ఓట్లు : 25202

కంటోన్మెంట్
లాస్య నందిత (బీఆర్‌ఎస్)
ఓట్లు : 59057 మెజారిటీ : 17169
రెండో స్థానం : శ్రీ గణేష్ (బీజేపీ) ఓట్లు : 41888
మూడో స్థానం : వెన్నెల (కాంగ్రెస్) ఓట్లు : 20825

తెలంగాణ అభివృద్ధికి కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చెప్పారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి రమణారెడ్డి విజయం సాధించిన సందర్భంగా ఆయన ఆదివారం జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించనున్నట్టు కిషన్ రెడ్డి చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు సత్వరం అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ సాధించిన విజయాలు వచ్చే ఎంపీ ఎన్నికలకు దోహదపడుతాయని స్పష్టం చేశారు. కామారెడ్డిలో సీఎంతో పాటు, సీఎం అభ్యర్థిని ఓడించిన రమణారెడ్డి జాయింట్ కిల్లర్‌గా మారారంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ఓటింగ్ శాతం భారీగా పెరిగిందని పేర్కొన్నారు. అయిదేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కామారెడ్డి రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నుంచి రమణారెడ్డి అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

బర్రెలక్కకు 5,598 ఓట్లు

- కొల్లాపూర్‌లో శిరీషకు నాలుగో స్థానం
- కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి విజయం



సాక్షి, నాగర్‌కర్నూల్: నిరుద్యోగుల తరఫున అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి సంచలనం సృష్టించిన సోషల్‌మీడియా ఫేమ్ బర్రెలక్క అలియాస్ కర్నె శిరీషకు మొత్తం 5,598 ఓట్లు వచ్చాయి. కొల్లాపూర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన కర్నె శిరీష 5,598 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన బర్రెలక్కకు రాష్ట్రంలోని నిరుద్యోగులు, యువకులు బాసటగా నిలిచారు. పలువురు ప్రముఖులు మద్దతు ప్రకటించి ఆర్థిక సాయం అందించారు. ఎన్నికల్లో ఓడినా భవిష్యత్తులో నిరుద్యోగుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తానని శిరీష స్పష్టం చేశారు. తనకు మద్దతు తెలిపి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు 93,609 ఓట్లతో గెలుపొందారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి 63,678 ఓట్లతో రెండో స్థానం, బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు 20,389 ఓట్లతో మూడో స్థానంలో ఉండగా, శిరీష నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి గగనం శేఖరయ్యకు 2,563 ఓట్లు వచ్చాయి.

వాగ్దానాలు అమలు చేయండి: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంపు, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు 52 శాతానికి పెంపు, బీసీ కులగణన, ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు తదితరాలను వీలైనంత వేగంగా అమలు చేసేందుకు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని, ధర్నాలు, ర్యాలీలు, బహిరంగసభలకు అనుమతించాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.


గెలిచిన మహిళా ఎమ్మెల్యేలు వీరే..

నియోజకవర్గం	అభ్యర్థి
ములుగు	ధనసరి సీతక్క (కాంగ్రెస్)
కోదాడ	పద్మావతిరెడ్డి (కాంగ్రెస్)
ఆసిఫాబాద్	కోవా లక్ష్మి (బీఆర్‌ఎస్)
సత్తుపల్లి	మట్టా రాగమయి (కాంగ్రెస్)
వరంగల్ తూర్పు	కొండా సురేఖ (కాంగ్రెస్)
నర్సాపూర్	సునీతారెడ్డి (బీఆర్‌ఎస్)
నారాయణపేట	చిట్టెం పర్ణికారెడ్డి (కాంగ్రెస్)
పాలకుర్తి	యశస్వినిరెడ్డి (కాంగ్రెస్)
మహేశ్వరం	సబితారెడ్డి (బీఆర్‌ఎస్)
కంటోన్మెంట్	లాస్య నందిత (బీఆర్‌ఎస్)

ఉమెన్.. డబుల్ డిజిట్..

- అసెంబ్లీలో పెరిగిన మహిళల ప్రాతినిధ్యం
- ఆరు నుంచి పది మందికి చేరిన మహిళా ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. తాజాగా జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా పది మంది గెలుపొందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇప్పటికి మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా.. ఈ దఫా అత్యధికంగా గెలుపొంది తమ సంఖ్యాబలాన్ని డబుల్ డిజిట్‌కు చేర్చారు. ప్రస్తుతం గెలుపొందిన పది మందిలో ఆరుగురు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించగా.. నలుగురు బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఎనిమిది మంది మహిళలు ఎమ్మెల్యేలుగా గెలుపొందగా.. 2018లో జరిగిన ఎన్నికల్లో మహిళల గెలుపు ఆరుకు పరిమితమైంది. తాజాగా వారి సంఖ్య 10కి చేరుకోవడం శుభపరిణామని పరిశీలకులు అంటున్నారు. ప్రస్తుతం గెలుపొందిన మహిళల్లో ఐదుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఇద్దరు ఎస్సీ, మరో ఇద్దరు ఎస్టీ, ఒకరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు.



జెయింట్ కిల్లర్!

కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించిన వెంకటరమణారెడ్డి

- నోటు, మద్యం పంచబోనని తీర్మానం
- జెడ్పీ చైర్మన్‌గా మద్యం, ఇసుక మాఫియాపై పోరాటం
- ప్రజా ఉద్యమాల సహకారంతో అనూహ్య విజయం



కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి నివాసం వద్ద ఆయనకు దిష్టి తీస్తున్న దృశ్యం. చిత్రంలో కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ కామారెడ్డి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పెను సంచలనం సృష్టించారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ (బీఆర్‌ఎస్), రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)లను ఓడించి చరిత్ర లిఖించారు. ఒకేసారి ప్రస్తుత సీఎం కేసీఆర్‌ను, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం అవుతారని భావిస్తున్న రేవంత్‌రెడ్డిలను వెంకటరమణారెడ్డి ఓడించడం విశేషం. అయితే ఆయన ప్రత్యర్థులిద్దరూ రెండుచోట్ల నుంచి పోటీచేయడం గమనార్హం. కామారెడ్డితో పాటు పోటీచేసిన గజ్వేల్‌లో కేసీఆర్ గెలుపొందారు. కామారెడ్డితో పాటు పోటీచేసిన కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఎన్నికల పోలింగ్ ముగిశాక కూడా బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో ఆయన మాట్లాడిన సందర్భంగా గెలుపుపై ధీమాను వ్యక్తం చేశారు. భారీ అంచనాల మధ్య కేసీఆర్, రేవంత్‌రెడ్డిలతో పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో చివరకు అదే విశ్వాసం ఆయనను గెలిపించింది. ప్రజల్లో ఆయనకున్న మంచిపేరే వెంకటరమణారెడ్డిని విజయ తీరానికి చేర్చింది.

ప్రజలతో కలిసి ఉద్యమాలు...

వెంకటరమణారెడ్డి 2006లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తాడ్వాయి జెడ్పీటీసీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2008లో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి ఎన్నికై 2011 వరకు పనిచేశారు. 2018లో బీజేపీలో చేరిన ఆయన, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కామారెడ్డి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటినుంచి నియోజక వర్గంలో ప్రజలతో కలిసి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. ప్రజల్లో మంచి పట్టు సాధించడంతో ఈసారి బీజేపీ విడుదల చేసిన తొలి జాబితాలోనే వెంకటరమణారెడ్డి పేరు ప్రకటించారు. అయితే సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారని తెలిసినా వెనక్కు తగ్గలేదు. సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా పోటీకి సిద్ధపడ్డా ఇద్దరినీ ఓడించి తీరతానని శపథం చేశాడు. అన్నట్టే ఇద్దరూ ఆయన చేతిలో ఓడిపోయారు. వెంకటరమణారెడ్డికి 66,652 ఓట్లు రాగా, కేసీఆర్‌కు 59,911 ఓట్లు, రేవంత్‌రెడ్డికి 54,916 ఓట్లు వచ్చాయి. కేసీఆర్ మీద 6,741 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అవినీతి రహిత పాలన అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి 'సాక్షి'తో పేర్కొన్నారు.

అక్రమాలపై ఎక్కుపెట్టిన ఫిరంగి....

వెంకటరమణారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో మద్యం, ఇసుక మాఫియాపై యుద్ధం చేసి అప్పట్లో వార్తల్లో నిలిచారు. అధికార పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు వారించినా వెనక్కు తగ్గలేదు. ఒకసారి రాజీనామా పత్రాన్ని విసిరికొట్టి, గన్‌మెన్లు, కారును వదిలివెళ్లిన ఘటన అప్పట్లో సంచలనం రేపింది. అప్పట్లో ఉపాధ్యాయుల, ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు. 2018లో కామారెడ్డి స్థానంలో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తరువాత నియోజక వర్గంలో ప్రజాసమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ జనం నోట్లో నాలుకయ్యారు. ఎన్నికల్లో ప్రత్యర్థులు ఎంత ఖర్చు చేస్తున్నా, మద్యం ఎంత పంచుతున్నా వెంకటరమణారెడ్డి మాత్రం వాటికి దూరంగా ఉన్నారు. ఒక సందర్భంలో కార్యకర్తల నుంచి కూడా ఆయన ఇబ్బంది పడ్డారు. ఎన్నికలు దగ్గర పడిన సమయంలో మనం డబ్బులు ఇవ్వకుంటే, మద్యం పంచకుంటే ఇబ్బంది అవుతుందని అనుచరులు ఆయనతో గొడవ పడ్డారు. అయినా ఆయన వెనక్కు తగ్గలేదు. మద్యం పంచడం తనతో కాదని వారికి స్పష్టం చేశారు. దీంతో కార్యకర్తలు కొంత నిరాశ చెందినా, ఊళ్లకు వెళ్లి జనం కాళ్లు మొక్కుతూ ఓట్లు అభ్యర్థించడం విశేషం.

ఫలితాలపై విస్మయం..

ముగ్గురు ఎంపీలు సహా కీలక నేతల ఓటమిపై బీజేపీ అధిష్టానం షాక్

- గ్రామీణంలో దక్కిన పట్టు, 8 స్థానాల్లో గెలుపుపై హర్షం
- తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీతో జేపీ నడ్డా, అమిత్ షా సమీక్ష



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎన్నికల ఫలితాలు బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ఆశ్చర్యానికి గురిచేశాయి. పార్టీకి పట్టున్న గ్రేటర్ హైదరాబాద్‌లో పెద్దగా స్థానాలు కైవసం చేసుకోకపోవడం, అంతగా పట్టులేని గ్రామీణంలో సంతృప్తికరమైన ఫలితాలు రాబట్టడం బీజేపీ అధిష్టానాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. పార్టీలో కీలక నేతల ఓటమిని అధినాయకత్వం జీర్ణించుకోలేకపోతుంది.

ఫలితాలపై మోదీ, నడ్డా, అమిత్ షా సమీక్ష

నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ బీజేపీ కేంద్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మూడు రాష్ట్రాలలో పార్టీ విజయం నేపథ్యంలో ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో అగ్రనేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో పార్టీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు.. తెలంగాణలో మిశ్రమ ఫలితాలపై ప్రధానంగా చర్చించారు. ఎవరు గెలిచారు? ఎవరు ఓడిపోయారు? అనే దానిపై ఆరా తీశారు. ముగ్గురు ఎంపీలు సహా పార్టీలో కీలక నేతల ఓటమి అగ్రనేతలను నిరాశపరిచినట్లు తెలిసింది. ఓటమిపాలైన వారిలో ముగ్గురు ఎంపీలు సహా కీలక నేతలు ఉన్నారు. కరీంనగర్ ఎంపీ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కోరుట్ల నుంచి పోటీచేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బోథ్ నుంచి పోటీచేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, హుజూరాబాద్, గజ్వేల్ స్థానాల నుంచి పోటీ చేసిన చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఓటమి పాలవడం బీజేపీ పెద్దలను షాక్‌కు గురిచేసింది. అలాగే.. రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే స్థానమైన అంబర్‌పేట్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఎమ్మెల్యేగా పనిచేసిన ముషీరాబాద్‌లోనూ ఆ పార్టీ ఓటమిని మూటగట్టుకోవడం అధిష్టానం పెద్దలను అవాక్కయ్యేలా చేసింది. మరోవైపు.. రాష్ట్ర వ్యాప్తంగా 8 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవడం, అందులో సీఎం కేసీఆర్ పోటీచేసిన కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి విజయం, గ్రేటర్ హైదరాబాద్‌లో బలం పుంజుకోవడం తోపాటు, గ్రామీణ ప్రాంతాలలో సైతం పార్టీకి పెరిగిన ఆదరణపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి సమీక్ష జరిపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

తెలంగాణను సంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ప్రజల మద్దతుతో తెలంగాణను సంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలంటూ ఆదివారం ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కార్యకర్తలు, పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అవిశ్రాంత పోరాటానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ పాలన విరగడైంది

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- కాంగ్రెస్, రేవంత్‌రెడ్డికి అభినందనలు



కరీంనగర్‌టౌన్: సీఎం కేసీఆర్ మూర్ఖపుపాలన విరగడైనందుకు సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి బీజేపీ పోరాడితే.. చివరకు కాంగ్రెస్ లాభపడిందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. ఆదివారం సాయంత్రం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ విషయానికొస్తే.. ప్రతీసారి తనఓట్ల శాతం పెరుగుతోందన్నారు. తమ ఇళ్లను కూల్చిన వారికి, వక్ఫ్ ఆస్తులను కబ్జా చేసిన వారికే ముస్లింలు ఓటేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇకనైనా హిందూ సమాజం ఆలోచించుకోవాలని సూచించారు. ప్రజలను రాచిరంపాన పెట్టిన కేసీఆర్ ప్రభుత్వంపై పోరాడిన తనతోపాటు ఎంతోమంది కార్యకర్తలపై కేసులు పెట్టారని, దాడులు చేశారని, జైలుకు పంపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. కేటీఆర్ అధికారంలో ఉన్నంతకాలం మీడియాకు విలువ ఇవ్వలేదని, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి ఎక్కడా లేనిగౌరవం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. హిందూ ధర్మం కోసం పో రాడిన బండి సంజయ్ విషయంలో ఒకవర్గం ఒక్కటైన తర్వాత కూడా హిందూ సమాజం ఏమనుకుంటోందో వాళ్ల విచక్షణకే వదిలేస్తున్నానని అన్నారు. తాను ఫిర్యాదు చేసేవరకూ 43, 289 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు లెక్కించనేలేదని, అట్లాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మధ్యలో ఎలా లెక్కిస్తారని ప్రశ్నించారు. 'బండి సంజయ్ గెలుపోటముల ఆధారంగా పనిచేయడు. గెలిచినా, ఓడినా పనిచేస్తడు. నా లక్ష్యం బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే'అ ని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రూ.200 కోట్లు ఖర్చు చేశారని, పైగా తాను డబ్బులు పంచుతున్నానని అభాండాలు వేశారని ఆయన అన్నారు.

జనసేనకు ఘోర పరాభవం

- పోటీచేసిన 8 స్థానాల్లో ఓటమి
- అన్నిచోట్లా డిపాజిట్లు గల్లంతు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. బీజేపీతో పొత్తులో భాగంగా 8 సీట్లలో పోటీచేసినా ఆ పార్టీ అభ్యర్థులు అన్ని చోట్లా ఓడిపోయారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ డిపాజిట్లు కోల్పోయారు. మొత్తంగా కలిపి కొన్ని వేల ఓట్లు మాత్రమే సాధించగలిగారు. తమ పార్టీకి పట్టు ఉండడంతో పాటు, గెలిచే అవకాశాలున్న స్థానాలను కూడా జనసేన డిమాండ్ చేసి తీసుకుందని సీట్ల సర్దుబాటు సమయంలోనే ఆయా స్థానాల్లోని బీజేపీ నాయకులు విమర్శించారు. ఎన్నికల్లో జనసేన అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో సహకరించే పరిస్థితి లేదంటూ కూడా కొందరు స్థానిక నాయకులు స్పష్టంచేసిన విషయం తెలిసిందే. జనసేన తరఫున కూకట్‌పల్లిలో ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, తాండూరులో నేమూరి శంకర్‌గౌడ్, కోదాడ నుంచి మేకల సతీశ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో లక్ష్మణ్‌గౌడ్, ఖమ్మం నుంచి మిర్యాల రామకృష్ణ, కొత్తగూడెంలో లక్కినేని సురేందర్‌రావు, వైరాలో డాక్టర్ తేజావత్ సంపత్‌నాయక్, అశ్వారావుపేట నుంచి ముయబోయిన ఉమాదేవి పోటీచేశారు. కూకట్‌పల్లిలో ప్రేమ్‌కుమార్‌కు అత్యధికంగా 39,830 ఓట్లు రాగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పోటీచేసిన తాండూరులో మూడువేలకు పైగా మాత్రమే వచ్చాయి. కోదాడలో 1,200 ఓట్లు, నాగర్‌కర్నూల్‌లో 1,800 ఓట్లు, ఖమ్మంలో 1,500 ఓట్లు, కొత్తగూడెంలో 1,800, వైరాలో 2,600, అశ్వారావుపేటలో 2,200 ఓట్లు మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులకు వచ్చాయి. తెలంగాణలో అంతగా పట్టు, గుర్తింపు లేని జనసేనకు ఎనిమిది సీట్లు కేటాయించడం వల్ల తమకు రాజకీయంగా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందని బీజేపీ నేతలు పెదవి విరుస్తున్నారు. జనసేన రాష్ట్రంలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ కాకపోవడంతో ఎన్నికల్లో పోటీకి 'కామన్ సింబల్' దక్కలేదు. ఆ పార్టీకి గతంలో కేటాయించిన గాజు గ్లాస్ సింబల్ కూడాను ఈసీ కేటాయించకపోవడంతో, అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగానే బరిలో నిలిచారు. జనసేనకు కేటాయించిన ఎనిమిది సీట్లలో తమ పార్టీ నేతలు పోటీచేసి ఉంటే కనీసం రెండు, మూడు అయినా గెలిచే అవకాశాలుండేవని బీజేపీ నాయకులు వాపోతున్నారు. కూకట్‌పల్లి, తాండూరు, తదితర సీట్లు జనసేనకు కేటాయించడం పట్ల ఆయా చోట్ల బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఇంత చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

ప్రజాసేవలో డాక్టర్లు..!

- ఈసారి అసెంబ్లీకి ఎన్నికైన వారిలో 15 మంది వైద్యులు
- ఇందులో నలుగురు జనరల్ సర్జన్లు, ముగ్గురు ఆర్థోలు



సాక్షి, హైదరాబాద్: తాజా ఎన్నికల్లో సత్తాచాటి ఏకంగా 15 మంది వైద్యులు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వైద్య వృత్తిలో రాణిస్తూనే రాజకీయ పార్టీలిచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వీరిలో నలుగురు జనరల్ సర్జన్లు కాగా, ఒకరు జనరల్ ఫిజీషియన్, మరొకరు పీడియాట్రిక్స్ కాగా ఒకరు న్యూరో సర్జన్ ఉన్నారు. ఇక ముగ్గురు ఎంఎస్ ఆర్థో ఉండగా, మరొకరు డెంటల్ సర్జన్. ఇద్దరు ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారున్నారు. వీరిలో దాదాపు అందరూ తొలిసారిగా పోటీ చేసిన వారే కావడం గమనార్హం. తాజాగా గెలిచిన 15 మంది వైద్యుల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి 11 మంది విజయం సాధించగా... బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరు గెలుపొందారు.

నియోజకవర్గం	గెలిచిన అభ్యర్థి	స్పెషలైజేషన్	పార్టీ
జగిత్యాల	సంజయ్	ఎం.ఎస్. ఆప్తమాలజీ	బీఆర్‌ఎస్
కోరుట్ల	కల్వకుంట్ల సంజయ్	న్యూరో సర్జన్	బీఆర్‌ఎస్
భద్రాచలం	తెల్లం వెంకట్రావు	ఎంఎస్ ఆర్థో	బీఆర్‌ఎస్
డోర్నకల్	రాంచందర్ నాయక్	జనరల్ సర్జన్	కాంగ్రెస్
అచ్చంపేట	వంశీకృష్ణ	జనరల్ సర్జన్	కాంగ్రెస్
మహబూబాబాద్	మురళీనాయక్	జనరల్ సర్జన్	కాంగ్రెస్
మానకొండూరు	సత్యనారాయణ	జనరల్ సర్జన్	కాంగ్రెస్
నారాయణపేట్	పర్ణికారెడ్డి	జనరల్ ఫిజీషియన్	కాంగ్రెస్
నారాయణఖేడ్	సంజీవరెడ్డి	పీడియాట్రిక్స్	కాంగ్రెస్
మెదక్	మైనంపల్లి రోహిత్	ఎంబీబీఎస్	కాంగ్రెస్
చెన్నూరు	వివేక్ వెంకటస్వామి	ఎంబీబీఎస్	కాంగ్రెస్
నాగర్‌కర్నూల్	కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి	ఎండీఎస్	కాంగ్రెస్
నిజామాబాద్ రూరల్	భూపతిరెడ్డి	ఎంఎస్ ఆర్థో	కాంగ్రెస్
సత్తుపల్లి	రాగమయి	ఎండీ పల్మనాలజిస్ట్	కాంగ్రెస్
సిర్పూర్	పాల్వాయి హరీశ్	ఎంఎస్ ఆర్థో	బీజేపీ

కమల వికాసం.. విలాపం!

- గతంతో పోలిస్తే సీట్లు, ఓట్లు పెరిగినా అంచనాలను చేరుకోలేకపోయిన బీజేపీ
- ఉత్తర తెలంగాణకే పార్టీ పరిమితం.. మిగిలిన చోట్ల కానరాని ప్రభావం
- ఓటమిపాలైన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి మిశ్రమ ఫలితాలిచ్చాయి. గతంతో పోలిస్తే సీట్లు, ఓట్లు పెరిగినా అధికారంలోకి రావాలన్న కల కలగానే మిగిలింది. 2018 ఎన్నికల్లో 118 సీట్లలో పోటీచేసి కేవలం ఒక సీటు గెలిచి 7 శాతం ఓటింగ్‌కు పరిమితమైన స్థితి నుంచి ఈ ఎన్నికల్లో 8 సీట్లలో గెలిచి 14 శాతం ఓటింగ్ సాధించడం వరకే కమలదళం పరిమితమైంది. పోటీ చేసిన 111 స్థానాలకుగాను కనీసం 35–40 సీట్లలో గట్టి పోటీ ఇచ్చి 18–22 సీట్లలో గెలుస్తామనే అంచనాలకు ఆమడ దూరంలో నిలిచింది.

ఉత్తర తెలంగాణలో బీజేపీ గాలి..

బీజేపీ పోటీ చేసిన మొత్తం సీట్లలో దాదాపు 32.20 లక్షల ఓట్లు సాధించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గెలిచిన 8 సీట్లలో 7 ఉత్తర తెలంగాణ నుంచే రావడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 4 ఎంపీ సీట్లలో మూడు ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో ఉండగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మళ్లీ ఉత్తర తెలంగాణనే బీజేపీని ఆదుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 4, నిజామాబాద్‌లో 3 సీట్లలో బీజేపీ విజయదుందుభి మోగించింది. ఆయా నియోజకవర్గాల పరిధిలో బీజేపీ అగ్రనాయకులైన మోదీ, అమిత్ షా, నడ్డా నిర్వహించిన ప్రచారం కూడా పార్టీ అభ్యర్థుల విజయానికి దోహదపడిందని నాయకులు అంచనా వేస్తున్నారు.

నిజంకాని అంచనాలు..

ఉత్తర తెలంగాణలో మెజారిటీ సీట్లతోపాటు గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో కొన్ని సీట్లు కలిపి మొత్తం 18కిపైగానే గెలుస్తామనే బీజేపీ ముఖ్యనేతల అంచనాలు నిజం కాలేదు. హైదరాబాద్ పరిధిలో కేవలం గోషామహల్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి విజయం సాధించడం మాత్రమే ఆ పార్టీకి కాస్త ఓదార్పు మిగిల్చింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఏకంగా 48 సీట్లు గెలిచినా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ఫలితాలేవీ ప్రతిబింబించకపోవడం పార్టీ నేతలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. అలాగే ఈ ఎన్నికల్లో పోటీ చేసిన ముగ్గురు ఎంపీలు బండి సంజయ్ (కరీంనగర్‌లో), ధర్మపురి అర్వింద్ (కోరుట్లలో), సోయం బాపూరావు (బోథ్‌లో)తోపాటు గతంలో ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్ (హుజూరాబాద్, గజ్వేల్‌లలో), ఎం.రఘునందన్‌రావు (దుబ్బాకలో) ఓడిపోవడం బీజేపీకి అంతుబట్టడంలేదు.

పనిచేయని బీసీ నినాదం...ఎస్సీ వర్గీకరణ...

బీజేపీ బీసీ నినాదం, అధికారానికి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే హామీ, ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిర్ణయం, మేనిఫెస్టోలో రైతులు, యువత, మహిళలు... ఇలా వివిధ వర్గాలను ఆకట్టుకొనేందుకు పొందుపరిచిన అంశాలేవీ ఫలితాల సాధనలో బీజేపీకి కలసి రాలేదు. బీసీ నినాదం తీసుకున్నారే తప్ప ఈ వర్గాలను చేరుకొని వారి మద్దతు సాధించడంలో పార్టీ విఫలమైంది. ఎస్సీ–19, ఎస్టీ–12 స్థానాల్లో ఒక్కటంటే ఒక్క సీటునూ పార్టీ గెలవలేకపోయింది. ఈ సీట్లపై ప్రత్యేక దృష్టిపెట్టి మిషన్–31ను ప్రారంభించినా పెద్దగా ఆ దిశగా కృషి చేయకపోవడం ఫలితాలపై ప్రభావం చూపింది. పార్టీ గెలిచిన 8 సీట్లలో ముగ్గురు బీసీ వర్గానికి చెందిన వారు (36 మందికి సీట్ల కేటాయింపు) కాగా ఐదుగురు జనరల్ కేటగిరీకి చెందినవారు. పార్టీ గెలిచిన 8 సీట్లలో (రాజాసింగ్, మహేశ్వర్‌రెడ్డి మినహా) ఆరుగురు తొలిసారిగా శాసనసభలోకి అడుగుపెడుతుండటం గమనార్హం. అయితే మహిళలకు 12 టికెట్లు ఇచ్చినా వారిలో ఒక్కరూ విజయం సాధించలేదు.

కమలాన్ని దెబ్బతీసిన అంశాలెన్నో...

రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ మార్పుపై 3–4 నెలలపాటు సందిగ్ధత నెలకొనడం... ఎన్నికలకు ముందు సంజయ్‌ను హఠాత్తుగా మార్చడం.. బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య అంతర్గత దోస్తీ ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోవడం, అధికార బీఆర్‌ఎస్ అవినీతిపై ఆరోపణలు గుప్పించి వాటిపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో విచారణ లేదా దర్యాప్తునకు ఆదేశించకపోవడం ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీశాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందనే ఆరోపణలపై ఈడీ ద్వారా విచారణ జరిపినా చర్యలు తీసుకోకుండా తాత్సారం చేయడం, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఏటీఎంగా మారిందని స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటి వారు బహిరంగ సభల్లో ఆరోపించినా దర్యాప్తుకు మొగ్గుచూపకపోవడం వంటివి పార్టీపై ప్రతికూల ప్రభావానికి ప్రధాన కారణాలుగా పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాలను ముందుగానే అంచనా వేసిన వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, విజయశాంతి వంటి అసంతృప్త నేతలు పార్టీని వీడినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వివేక్, రాజ్‌గోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు.

పంచతంత్రం

సుపరిపాలనకే జై కొట్టారు!: మోదీ

న్యూఢిల్లీ: సుపరిపాలన కోరుకుంటూ మూడు రాష్ట్రాల ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో బీజేపీ విజయబావుటా ఎగరేయడంతో ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'సుపరిపాలన, అభివృద్ధికే ఓటరు దేవుళ్లు జై కొట్టారు. ఆ అభివృద్ధికి బీజేపీ సదా కట్టుబడి ఉంది. అద్భుత విజయం అందించి మాకు పూర్తి మద్దతు తెలిపిన ఓటరు మహాశయులకు మా కృతజ్ఞతలు. ఇకమీదటా చెమటోడ్చి కష్టించి పనిచేస్తామని ఈ సందర్భంగా నేను మీకు మాట ఇస్తున్నా. పార్టీ విజయం కోసం అహరహం శ్రమించిన పార్టీ కార్యకర్తలకు నా ప్రత్యేక అభినందనలు. మీరే అనుక్షణం పార్టీ కోసం పనిచేస్తూ బీజేపీ ఎజెండాను జనాల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లారు'' అని మోదీ ట్వీట్‌చేశారు. ''బీజేపీకి మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రాంత సోదర, సోదరీమణులకు నా ధన్యవాదాలు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతూ వస్తోంది. మన 'రోజు' వచ్చే దాకా ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగుతుంది. తెలంగాణతో బీజేపీ బంధం విడదీయరానిది. ఇక్కడి ప్రజల కోసం అవిశ్రాంతంగా పని చేస్తాం. తెలంగాణలో అలుపెరగకుండా పని చేసిన ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్తను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా '' అని మరో ట్వీట్ చేశారు.

తాత్కాలిక వెనుకంజ: ఖర్గే

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో అధికారాన్ని చేజిక్కించుకోవడంలో కాంగ్రెస్ విఫలమవడంపై ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. 'పార్టీ తాత్కాలిక వెనుకంజను ఈ ఫలితాలు దర్పణం పడతాయి. అయితే వీటిని మేం వెంటనే అధిగమిస్తాం. 'ఇండియా' కూటమి పార్టీలతో కలిసి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ అనుకూల ప్రజాతీర్పును అందించిన ఓటర్లకు నా ధన్యవాదాలు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లోనూ మాకు మద్దతుగా నిలిచి ఓటర్లకు ధన్యవాదాలు. ఈ 3 రాష్ట్రాల్లో ఫలితాలు.. కాంగ్రెస్ పార్టీని నిస్సందేహంగా నిరుత్సాహానికి గురిచేసినా సరే పార్టీని, మమ్మల్ని మళ్లీ పునర్‌నిర్మించుకోవడానికి ఇది చక్కని అవకాశం. రెట్టించిన ఉత్సాహం, దృఢసంకల్పంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం సంసిద్ధమవుతున్నాం'' అని ఎక్స్ ఖాతాలో ట్వీట్‌చేశారు. ''ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ స్ఫూర్తిదాయకమైన ప్రచారాన్ని కొనసాగించింది. అవిశ్రాంతంగా ప్రచారం చేసిన పార్టీ కార్యకర్తలకు నా అభినందనలు'' అని ఖర్గే మరో ట్వీట్‌చేశారు.


కుల, బుజ్జగింపు రాజకీయాలకు బైబై


కేంద్ర హోంమంత్రి అమిత్ షా


న్యూఢిల్లీ: నవీన భారతంలో బుజ్జగింపు, కుల రాజకీయాలకు రోజులు చెల్లిపోయాయని, పనితీరును బట్టి సాగే రాజకీయాలకు మాత్రమే ప్రజలు ఓటేస్తారనేందుకు తాజా ఎన్నికల ఫలితాలనే నిదర్శనమని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఆదివారం ఆయన 'ఎక్స్'లో పలు ట్వీట్లు చేశారు. ప్రధాని మోదీ సారథ్యంలో ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమ విధానాలకు ఆమోదముద్ర వేస్తూ ప్రజలు బీజేపీకి అఖండ విజయం అందించారన్నారు. 'ప్రజల గుండెల్లో ఉన్న ఒకే ఒక్క నేత మోదీ. పూర్తిస్థాయిలో మద్దతు తెలిపిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు నా సెల్యూట్. బీజేపీ ఘన విజయం సాధించినందుకు ప్రధాని మోదీకి, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అభినందనలు'అని షా పేర్కొన్నారు.

ఊహించని ఫలితమిది: గెహ్లోత్

జైపూర్: రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఘోర పరాజయం ఎవరూ ఊహించని ఫలితమని రాష్ట్ర సీఎం అశోక్ గెహ్లోత్ పేర్కొన్నారు. కొత్త వారిని పోటీకి నిలిపి ఉన్నట్లయితే ఫలితాలు మరోలా ఉండేవన్న అంచనాలను ఆయన కొట్టిపారేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టారని విమర్శించారు. బీజేపీ నేతలపై ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారని భావించానని, అలాంటిదేమీ జరగలేదన్నారు. 'ప్రజల తీర్పును వినయంతో స్వీకరిస్తున్నాము. మా ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు, చట్టాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో విఫలమైనట్లు ఈ పరాజయం చెబుతోంది'అని పేర్కొన్నారు.







బీజేపీ తీన్మార్

- సెమీఫైనల్స్ పోరులో ఘనవిజయం
- మధ్యప్రదేశ్‌లో బంపర్ మెజారిటీ
- రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ జయకేతనం



ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్స్ పోరులో బీజేపీ ఘనవిజయం సాధించింది. ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు కీలక రాష్ట్రాలను సొంతం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో భారీ విజయంతో అధికారాన్ని నిలుపుకోగా రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లను కాంగ్రెస్ నుంచి చేజిక్కించుకుంది. తద్వారా ఉత్తరాది హిందీ బెల్టులో తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకుంది. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట్లో లభించిన ఈ సానుకూల ఫలితాలతో బీజేపీలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ఘోరమైన ఓటమి మూటగట్టుకుని కాంగ్రెస్ చతికిలపడింది. తెలంగాణలో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు తెర దించుతూ విజయం సాధించడం ఒక్కటే ఈ ఎన్నికల్లో దానికి ఊరట. మధ్యప్రదేశ్‌లో 230 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 164 సీట్లతో ఘనవిజయం సాధించింది. కాంగ్రెస్ 65 స్థానాలతో సరిపెట్టుకుంది. రాజస్తాన్‌లో పోలింగ్ జరిగిన 199 స్థానాల్లో బీజేపీ 115 చోట్ల గెలిచింది. కాంగ్రెస్‌కు 69 సీట్లు దక్కాయి. 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ 54 సీట్లు సాధించగా కాంగ్రెస్‌కు 35 దక్కాయి. ఇక తెలంగాణలో 119 సీట్లకు కాంగ్రెస్ 64 చోట్ల నెగ్గి మెజారిటీ సాధించగా అధికార బీఆర్‌ఎస్ 39 సీట్లకు పరిమితమైంది. ఐదో రాష్ట్రమైన మిజోరంలో సోమవారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడనున్నాయి. ప్రధానంగా స్థానిక పార్టీలైన ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎం మధ్యే పోరు సాగిందన్న అంచనాల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలకు అక్కడ పెద్దగా ఆశలేమీ లేవు.

ఆద్యంతమూ ఆధిక్యమే...

ఫలితాల వెల్లడిలో తెలంగాణ మినహా మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ హవాయే సాగింది. ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైనప్పటి నుంచే మధ్యప్రదేశ్‌లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళ్లింది. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో తొలుత కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తున్నట్టు కన్పించినా కాసేపటికే పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారుతూ వచ్చింది. కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకుంటుందని చాలామంది భావించిన ఛత్తీస్‌గఢ్‌లో కూడా స్పష్టమైన ఆధిక్యం కన్పిస్తుండటం పార్టీలో జోష్ నింపింది. దాంతో ఒకవైపు లెక్కింపు కొనసాగుతుండగానే బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. జై శ్రీరాం, మోదీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నేతలు, కార్యకర్తలు హోరెత్తించారు. మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రధాన కార్యాలయాల వద్ద బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఏ రాష్ట్రంలోనూ సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం బీజేపీకి కలిసొచ్చింది. ఈ నిర్ణయం ద్వారా మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత ప్రభావం నుంచి తప్పించుకోవడంతో పాటు రాజస్తాన్‌లో నేతల మధ్య కుమ్ములాటలకు కూడా పార్టీ చెక్ పెట్టిందని చెబుతున్నారు. మోదీ కేంద్రంగా సాగించిన ప్రచారం ఫలించింది. అంతిమంగా బీజేపీ మీద ప్రజల విశ్వాసానికి ఈ ఫలితాలు అద్దం పట్టాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొనగా, కాంగ్రెస్ మత, విభజన రాజకీయాలను వారు తిరస్కరించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

నిరుత్సాహంలో కాంగ్రెస్

గత మేలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించిన ఊపులో ఉన్న కాంగ్రెస్‌లో తాజా ఫలితాలు నిరుత్సాహం నింపాయి. ఇది తాత్కాలిక వెనుకంజేనని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ప్రజా తీర్పును శిరసావహిస్తున్నామని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల్లో కలిపి 84 లోక్‌సభ స్థానాలున్నాయి. తాజా విజయాలతో ఉత్తర, పశ్చిమ భారతంలో అత్యధిక రాష్ట్రాలు బీజేపీ అధికారంలోకి వెళ్లాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయానికి ఆ ప్రాంతాల్లో మెరుగైన ప్రదర్శనే ప్రధాన కారణంగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణలో ఆశించినన్ని సీట్లు నెగ్గకపోవడం బీజేపీకి నిరాశ కలిగించగా అక్కడ తొలిసారిగా అధికారం చేపట్టనుండటం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే అంశం.

రాజస్తాన్ బీజేపీదే

115 అసెంబ్లీ స్థానాల్లో విజయం | **69** సీట్లకే పరిమితమైన కాంగ్రెస్

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సొంతం చేసుకుంది. రాష్ట్రంలో మొత్తం 200 శాసనసభ స్థానాలకు గాను 199 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ ఏకంగా 115 స్థానాల్లో జెండా ఎగురవేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజార్టీని సాధించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఓడిపోవడం గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తుంది. ఈ ఆనవాయితీని కాంగ్రెస్ బద్దలు కొట్టలేకపోయింది. ఈసారి ఎన్నికల్లో 69 సీట్లకు పరిమితమైంది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆ పార్టీని గెలిపించలేకపోయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా బీజేపీ అగ్రనేతలు దూకుడుగా సాగించిన ప్రచారం ముందు కాంగ్రెస్ చేతులెత్తేసింది. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామంటూ ముఖ్యమంత్రి గెహ్లోత్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ పరాజయాన్ని ఊహించలేదని పేర్కొన్నారు. తమ ప్రణాళికలు, పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయని అంగీకరించారు. సీఎం గెహ్లోత్ తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కల్‌రాజ్ మిశ్రాకు సమర్పించారు. రాజస్తాన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నా చిన్నాచితక పార్టీలు సైతం ప్రభావం చాటాయి. భారత ఆదివాసీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్ కొన్ని సీట్లు గెలుచుకున్నాయి. పలువురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. పలువురు కాంగ్రెస్ మంత్రులు ఓడిపోయారు. అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ సీనియర్ నేత సి.పి.జోషీకి సైతం పరాజయం తప్పలేదు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ జోద్‌పూర్ జిల్లాలోని సర్దార్‌పురా నుంచి వరుసగా ఆరోసారి విజయం సాధించడం విశేషం. గత ఎన్నికల్లో ఆయనకు 45,597 ఓట్ల ఆధిక్యం లభించగా, ఈసారి 26,396కు తగ్గింది.

మధ్యప్రదేశ్‌లో మళ్లీ కాషాయమే

163 స్థానాలు బీజేపీ కైవసం | **66** సీట్లకే పరిమితమైన కాంగ్రెస్

భోపాల్: మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయ బావుటా ఎగురవేసింది. మొత్తం 230 స్థానాలకు గాను ఏకంగా 163 స్థానాలను సొంతం చేసుకుంది. మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. ఈసారి బీజేపీని ఎలాగైనా గద్దె దించాలన్న అధికార కాంగ్రెస్ వ్యూహాలు ఫలించలేదు. ఆ పార్టీ కేవలం 66 సీట్లకే పరిమితమైంది. బీజేపీ గెలుపు నేపథ్యంలో రాజధాని భోపాల్‌లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం సంబరాలు హోరెత్తాయి. కాంగ్రెస్ కార్యాలయం బోసిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా వల్లే విజయం సాధ్యమైందని బీజేపీ నాయకులు చెప్పగా పరాజయానికి కారణాలను సమీక్షించుకుంటున్నామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. బుద్నీ అసెంబ్లీ స్థానంలో సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ఏకంగా లక్షకు పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఈసారి బీజేపీ మధ్యప్రదేశ్‌తో పాటు ఏ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా ప్రకటించకపోవడం తెలిసిందే. అయినా పార్టీ ఘనవిజయం నేపథ్యంలో శివరాజ్ ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని భావిస్తున్నారు. అయితే బీజేపీ ఇంతటి ఘనవిజయం సాధించినా ఏకంగా 12 మంది మంత్రులు ఓటమి పాలవడం విశేషం! అయితే అసెంబ్లీ బరిలో దిగిన కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయ వర్గీయ మాత్రం విజయం సాధించారు. 2013 ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో బీజేపీకి 165 స్థానాలొచ్చాయి. కాంగ్రెస్ 58 సీట్లకు పరిమితమైంది. బీజేపీకి 44.88 శాతం, కాంగ్రెస్‌కు 36.38 శాతం ఓట్లు లభించాయి. ఇక 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 40.89 శాతం ఓట్లతో 114 స్థానాలు సాధించింది. బీజేపీ 41.02 శాతం ఓట్లు సాధించినా 109 సీట్లే నెగ్గింది. బీఎస్పీ, స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టింది. కమల్‌నాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. 15 నెలలకే కాంగ్రెస్ అగ్ర నేత జ్యోతిరాదిత్య తన వర్గం ఎమ్మెల్యేలతో బీజేపీలోకి ఫిరాయించారు. దాంతో కమల్‌నాథ్ సర్కారు కుప్పకూలింది. శివరాజ్ సీఎంగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో విరబూసిన కమలం

54 సీట్లతో బీజేపీ విజయహాసం | **35** స్థానాలతో కాంగ్రెస్ ఓటమి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం భారతీయ జనతా పార్టీని వరించింది. మొత్తం 90 శాసనసభ స్థానాలకు గాను బీజేపీ 54 స్థానాలు దక్కించుకుంది. అధికార కాంగ్రెస్‌కు 35 స్థానాలే లభించాయి. 2018 ఎన్నికల్లో ఓడిపోయిన కమలం పార్టీ ఐదేళ్ల తర్వాత మళ్లీ అధికార పీఠం సొంతం చేసుకుంది. 'మోదీ కీ గ్యారంటీ–2023' పేరిట బీజేపీ ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించినట్లు కనిపిస్తోంది. క్వింటాల్ రూ.3,100 చొప్పున ధరకు ఎకరాకు 21 క్వింటాళ్ల చొప్పున ధాన్యం కొనుగోలు, మహతారీ వందన్ యోజన కింద వివాహమైన మహిళలకు ఏటా రూ.12,000 చొప్పున ఆర్థిక సాయం వంటి హామీలు ప్రజలను ఆకర్షించాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకత కూడా బీజేపీ గెలుపునకు తోడ్పడింది. కాగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలు ఆ పార్టీకి ప్రతికూలంగా మారాయి. స్వయానా సీఎం బఘెల్, డిప్యూటీ సీఎం సింగ్‌దేవ్ మధ్య స్పర్థలుండటం కూడా బాగా చేటు చేసింది. 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర దించి 2018లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈసారి చతికిలపడింది. సీఎం బఘెల్ తన సొంత నియోజకవర్గం పటన్‌లో నెగ్గినా రాష్ట్రంలో మాత్రం పార్టీని గెలిపించుకోలేకపోయారు. డిప్యూటీ సీఎం టీఎస్ సింగ్‌దేవ్ కూడా ఓటమి చవిచూశారు! అంబికాపూర్ అసెంబ్లీ స్థానంలో సమీప బీజేపీ ప్రత్యర్థి రాజేశ్ అగర్వాల్ చేతిలో కేవలం 94 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. మహదేవ్ బెట్టింగ్ యాప్ నుంచి సీఎం బఘెల్ ముడుపులు స్వీకరించారంటూ పోలింగ్ సమీపించిన వేళ వచ్చిన ఆరోపణలు కూడా కాంగ్రెస్‌కు బాగా నష్టం చేసినట్టు కనబడుతోంది. మరోవైపు బీజేపీ ఈసారి వ్యూహాత్మకంగా సీఎం అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల్లో పోటీకి దిగింది. అయినా ప్రధాని మోదీకి ఉన్న జనాదరణ, ఆయన పేరుతో ఇచ్చిన హామీల ఆసరాతో పార్టీ విజయ తీరాలకు చేరింది.

మామా.. సీఎం మామా!



ప్రభుత్వ వ్యతిరేకతకు చెక్ పెట్టిన సంక్షేమ పథకాలు

కలిసొచ్చిన శివరాజ్ వ్యూహాలు, మోదీ మేనియా | **సమన్వయరాహిత్యంతో దెబ్బ తిన్న కాంగ్రెస్**

మధ్యప్రదేశ్‌లో బీజేపీ సాధించిన ఘనవిజయం రాజకీయ విశ్లేషకులను కూడా ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో హోరాహోరీగా సాగిన పోరులో బీజేపీ గెలవవచ్చని భావించినా, ఈ స్థాయి విజయం మాత్రం అనూహ్యమే. ఎందుకంటే మధ్యలో 15 నెలల కాంగ్రెస్ పాలనను మినహాయిస్తే రాష్ట్రంలో 20 ఏళ్లుగా బీజేపీదే అధికారం. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం దాకా కూడా కొట్టొచ్చినట్టుగా కన్పించిన ప్రభుత్వ వ్యతిరేకతను ఆ పార్టీ, ముఖ్యంగా సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ సమర్థంగా అధిగమించిన వైనం అబ్బురపరిచేదే. రాష్ట్ర ప్రజలు ప్రేమగా 'మామ' అని పిలుచుకునే చౌహాన్ ఈ విషయంలో ముందునుంచే పక్కాగా వ్యవహరిస్తూ వచ్చారు. ఒక్కొక్కటిగా పలు ప్రజాకర్షక పథకాలను తెరపైకి తెస్తూ ప్రజల్లో అసంతృప్తిని తగ్గించగలిగారు. ప్రధాని నరేంద్ర మోదీ మేనియా, బూత్ స్థాయి నుంచి పక్కా ఎన్నికల ప్రణాళిక, పార్టీపరంగా వ్యవస్థాగతమైన బలం వంటివన్నీ అందుకు తోడయ్యాయి. వ్యక్తిగతంగా శివరాజ్‌కు ఉన్న మంచి పేరు కూడా బాగా కలిసొచ్చింది. వివాదాలకు దూరంగా నిరాడంబర వ్యక్తిత్వంతో రాష్ట్ర ప్రజల మనసుల్లో ఆయన పట్ల మొదటి నుంచీ ఉన్న సానుకూల భావన ఓట్ల రూపంలోనూ ప్రతిఫలించింది. ఇక సమన్వయరాహిత్యం కాంగ్రెస్ పార్టీని ఈసారి బాగా దెబ్బ తీసింది. పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, అగ్ర నేత దిగ్విజయ్‌సింగ్ మధ్య విభేదాలు ప్రచార పర్వంలో పలుసార్లు తెరపైకి వచ్చాయి.

'లాడ్లీ' సూపర్ హిట్...

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పలు ప్రజాకర్షక పథకాలకు శివరాజ్ తెర తీస్తూ వచ్చారు. అధికారంలోకి వస్తే నారీ సమ్మాన్ నిధి పేరిట ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న కాంగ్రెస్ హామీకి ప్రతిగా లాడ్లీ బెహనా యోజన తీసుకొచ్చారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,250 చొప్పున ఇచ్చే ఈ పథకం బాగా హిట్టయింది. ఈ మొత్తాన్ని క్రమంగా నెలకు రూ.3,000కు పెంచుతానని కూడా శివరాజ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 2.72 కోట్ల మహిళా ఓటర్లుంటే, ఏకంగా కోటిన్నర మంది మహిళలు దీని లబ్ధిదారులు! ఇది బీజేపీకి బాగా కలిసి వచ్చిందని భావిస్తున్నారు. అంతేగాక శివరాజ్‌పై అధిష్టానం అభిప్రాయాన్ని మార్చడం ద్వారా ఆయన్ను తిరిగి సీఎం అభ్యర్థి రేసులో బలంగా నిలిపింది.

అంతర్గత సమస్యలను అధిగమిస్తూ...

ఎన్నికల వేడి మొదలయ్యే నాటికి మధ్యప్రదేశ్‌లో బీజేపీ పరిస్థితి అంత ఆశాజనకంగా కూడా ఏమీ లేదు. సుదీర్ఘ కాలంగా సీఎంగా ఉన్న 64 ఏళ్ల శివరాజ్ పని కూడా అయిపోయిందని, ఈ ఎన్నికలతో ఆయన రాజకీయ కెరీర్‌కు తెర పడ్డట్టేనన్న ప్రచారమూ జరిగింది. ప్రభుత్వ వ్యతిరేకతను తప్పించుకునేందుకు అధిష్టానం కూడా ఆయన ప్రాధాన్యతను క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. సీఎం అభ్యర్థిగా కూడా ప్రకటించలేదు. ఇటు బీజేపీలో అంతర్గతంగా కూడా పరిస్థితులు గొప్పగా లేవు. నేతల గ్రూపు తగాదాలతో పాటు కార్యకర్తల్లోనూ నిస్తేజం ఆవహించిన పరిస్థితి! అలాంటి స్థితిని క్రమంగా బీజేపీకి అనుకూలంగా మార్చడంలో, నేతల్లో ఐక్యత సాధించడంతో పాటు కార్యకర్తల్లో ఉత్తేజం నింపడంలో శివరాజ్ విజయం సాధించారు. తనను సీఎం అభ్యర్థిగా ప్రకటించకపోయినా ఎన్నికల బాధ్యతలను తలకెత్తుకుని నడిపించారు.

మేరా బూత్, సబ్ సే మజ్‌బూత్...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీకి స్వల్ప దూరంలో ఆగిపోయిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి బీజేపీ ముందునుంచే చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వచ్చింది. గత జూలై నుంచే పూర్తిస్థాయిలో రంగంలోకి దిగింది. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జిగా, మరో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయనకు డిప్యూటీగా నియమించింది. ఇంకోమంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా వేసి ప్రతి విషయంలోనూ ముందునుంచే శ్రద్ధ తీసుకుంది. ఇక ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను, 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాని మోదీ సూచించిన 'మేరా బూత్, సబ్ సే మజ్‌బూత్' కార్యక్రమం మధ్యప్రదేశ్‌లో ఈసారి బీజేపీకి మంచి ఫలితాలిచ్చింది. బలమైన స్థానిక నేతల్లో ఒక్కొక్కరికి ఒక్కో బూత్ పరిధిలో పార్టీ అవకాశాలను బలోపేతం చేసే బాధ్యతను నాయకత్వం అప్పగించింది. వారి పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ ప్రోత్సహించింది. దీనికి తోడు మోదీ కూడా రాష్ట్రంలో ప్రచారంతో హోరెత్తించారు 14 ర్యాలీల్లో పాల్గొన్నారు. ఆయన ప్రసంగాలకు యువతతో పాటు మహిళలు విపరీతంగా స్పందించారు. 'ఎంపీ (మధ్యప్రదేశ్) మనసులో మోదీ, మోదీ మనసులో ఎంపీ' నినాదం బాగా ప్రజల్లోకి వెళ్లింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పంచతంత్రం

నేడే మిజోరంలో ఓట్ల లెక్కింపు

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటలకు మొత్తం 13 కేంద్రాల్లో కౌంటింగ్ మొదలవుతుందని రాష్ట్ర అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి హెచ్ లియాంజెలా తెలిపారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను, అనంతరం 8.30 గంటల నుంచి ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల కోసం 4 వేల మంది భద్రతా సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. మిజోరం అసెంబ్లీకి నవంబర్ 7న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మిగతా నాలుగు రాష్ట్రాలు మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణతోపాటుగా మిజోరంలోనూ ఓట్ల లెక్కింపు ఆదివారమే చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ఎన్‌జీవోలు, చర్చిలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈసీని కలిసి ఆదివారానికి ఉన్న మతపరమైన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, కౌంటింగ్‌ను వాయిదా వేయాలని కోరారు. పరిగణనలోకి తీసుకున్న ఈసీ, ఓట్ల లెక్కింపును సోమవారానికి వాయిదావేసింది.

6న 'ఇండియా' కూటమి భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఈ నెల 6న ఢిల్లీలో సమావేశం కానున్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో జరగనున్న ఈ భేటీలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూటమి అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఐక్యంగా ఎదుర్కొనే అంశంపై దృష్టి సారిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయిదు రాష్ట్రాలైన రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక సాధారణ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, సీట్ల పంపకం అంశాలను ఖరారు చేయాలని కూటమి నేతలు ఇప్పటి వరకు ఎదురు చూశారు. ఆదివారం నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడం, సోమవారం మిజోరంలోనూ ఓట్ల లెక్కింపు జరగనుండటంతో కూటమి నేతల సమావేశం తేదీ ఖరారయ్యింది.

ఒక సీటును వదులుకోవాల్సిందే

న్యూఢిల్లీ: ఇటీవల అయిదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసి గెలుపొందిన పార్లమెంట్ సభ్యులు ఏదో ఒక సీటును కచ్చితంగా వదులుకోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు వారికి 14 రోజుల సమయం మాత్రమే ఉంటుందంటున్నారు. ఏ నిర్ణయమూ తీసుకోలేకుంటే వారు పార్లమెంట్ సభ్యత్వాన్ని ఆటోమేటిక్‌గా కోల్పోతారని హెచ్చరిస్తున్నారు. '14 రోజుల్లోగా వారు ఒక సీటును వదులుకోకుంటే వారి పార్లమెంట్ సభ్యత్వం తానంతటదే రద్దవుతుంది. అయితే, శాసన సభ సభ్యత్వం మాత్రం కొనసాగుతుంది' అని రాజ్యాంగ నిపుణుడు, లోక్‌సభ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి చెప్పారు. ఇటువంటి సందర్భాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 101 వర్తిస్తుందన్నారు. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేంద్రమంత్రులైన నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, ఫగ్గన్ సింగ్ కులస్తే తదితర 21 మంది ఎంపీలను బరిలోకి దింపిన విషయం తెలిసిందే. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో ఏడుగురు చొప్పున, ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు, తెలంగాణలో ముగ్గురు ఎంపీలను బీజేపీ పోటీకి నిలిపింది.

నేటి నుంచి శీతాకాల సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇవే పూర్తి స్థాయి చివరి సమావేశాలు కానున్నాయి. జనవరిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. శీతాకాల సమావేశాల్లో రెండు ద్రవ్య బిల్లులు సహా 21 బిల్లులను కేంద్రం సభ ముందుకు తీసుకురానుంది.

అంతరాయం కలిగిస్తే దారుణ ఫలితాలు

పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం కలిగిస్తే, దారుణమైన ఫలితాలను చవిచూస్తారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రతిపక్ష పార్టీల నేతలను హెచ్చరించారు. సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. 4 రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో బీజేపీ మూడు చోట్ల ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 4 నుంచి 22వ తేదీ వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. 'నిర్మాణాత్మక చర్చలు జరిగేందుకు సహకరించాలని శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష పార్టీలను కోరాం. అన్ని అంశాలపై చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని జోషి అన్నారు.

హ్యాట్రిక్‌కు గ్యారంటీ

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తంచేసిన ప్రధాని మోదీ
- ఈ ఫలితాలు అహంకార కూటమికి గట్టి హెచ్చరిక
- బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రసంగించిన ప్రధాని



ఆదివారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విజయోత్సవాల్లో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: మూడు రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన హ్యాట్రిక్ విజయం.. 2024 ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల్లో సాధించబోయే హ్యాట్రిక్‌కు గ్యారంటీ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో పార్టీ ఘన విజయం తర్వాత ఆదివారం రాత్రి ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ప్రధాని నరేంద్ర మోదీ వందలాది మంది పార్టీ శ్రేణులనుద్దేశిస్తూ ప్రసంగించారు. '' మూడు రాష్ట్రాల్లో కలిపి హ్యాట్రిక్ సాధించాం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించబోయే హ్యాట్రిక్ గెలుపునకు ఈరోజు విజయం గ్యారంటీని ఇస్తోంది. ఇది చక్కని సంకేతం. ఈ ఫలితాలు అహంకార 'ఇండియా' కూటమికి గట్టి హెచ్చరిక. ఆత్మనిర్భరత, పారదర్శక, సుపరిపాలన భారత్‌ను కాంక్షించే బీజేపీ ఎజెండాకు ఈ గెలుపు మద్దతుగా నిలిచింది'' అని మోదీ వ్యాఖ్యానించారు. విపక్షాల 'ఇండియా' కూటమి ఏర్పాటు సందర్భంగా గతంలో విపక్షాల అగ్రనేతలు గ్రూప్ ఫొటో దిగటాన్ని మోదీ ఈ సందర్భంగా ఎద్దేవాచేశారు. '' స్టేజీ మీద వారసత్వ నాయకులంతా ఒక్క చోటకు చేరితే మంచి ఫొటోలు దిగగలరు. కానీ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని మాత్రం గెలుపొందలేరు. ఈ ఫలితాలు కాంగ్రెస్, దాని గర్విష్ఠి కూటమికి పెద్ద గుణపాఠం నేర్పాయి'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ప్రపంచదేశాల నమ్మకాన్ని పెంచుతోంది

మోదీ సర్కార్ ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలపై ఒత్తిడి తెచ్చి తమ నేతలపై తప్పుడు అవినీతి కేసులను బనాయిస్తోందంటూ విపక్షాలు చేసిన ఆరోపణలను మోదీ ప్రస్తావించారు. ' అవినీతికి వ్యతి రేకంగా మేం చేస్తున్న పోరాటానికి ప్రజలు ఈ ఫలితాల రూపంలో మాకు మద్దతు పలికారు. అవినీతిలో మునిగిన పార్టీలకు ఓటర్లు ఈ ఫలితాల రూపంలో వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధికి, ప్రజలకు మధ్య మరెవరూ రాలేరు. ఎవరైనా వచ్చేందుకు ప్రయత్నిస్తే ఓటర్లు ఇలాగే తీసి పక్కనపడేస్తారు. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలకు నాదో విన్నపం. దేశాభివృద్ధి ఊపందుకున్న ఈ తరుణంలో దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా రాజకీయాలు చేయొద్దు. దేశాన్ని విభజించే, విచ్ఛిన్నం చేసే శక్తులతో జట్టు కట్టొద్దు'' అని హితవు పలికారు. ''ఇలాంటి సందర్భాల్లో దేశ వ్యతిరేక శక్తులు ఏకమయ్యేందుకు కష్టపడుతుంటాయి. అదను కోసం ఎదురు చూస్తుంటాయి. ఇలాంటి వారితో జాగ్రత్త' అంటూ పార్టీ కార్యకర్తలను హెచ్చరించారు. 'ఈ గెలుపు భారత్‌పై ప్రపంచదేశాలు పెట్టుకున్న నమ్మకాన్ని మరింత పెంచుతుంది.

ఇది భారత్‌లో పెట్టుబడులు పెట్టే అంతర్జాతీయ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత మెరుగుపరుస్తుంది. 'అభివృద్ధి చెందిన భారత్' సాకారం కోసం మనం చేపడుతున్న ఎజెండాకు ప్రజా మద్దతుకు లభిస్తోందని ఈ ఫలితాలు చాటుతున్నాయి. దేశంలో చక్కటి మెజారిటీతో అధికారంలోకి వచ్చే సుస్థిర ప్రభుత్వానికే ప్రజలు పట్టం కడతారన్న విషయాన్ని ప్రపంచదేశాలు కళ్లారా చూశాయి'' అని మోదీ అన్నారు.

ఈ భూతాలను బీజేపీయే తరిమికొట్టగలదు

'అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, కుటుంబ రాజకీయాలకు కాలం చెల్లిందని ఈ ఫలితాల ద్వారా ప్రజలు తీర్పు చెప్పారు. అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలనే ఈ మూడు భూతాలను తరిమికొట్టే సత్తా ఒక్క బీజేపీకే ఉందని యావత్ భారతదేశమే భావిస్తోంది. అవినీతి భరతం పట్టే బీజేపీకి ఇప్పటికే దేశవ్యాప్త మద్దతు దక్కుతోంది. అవినీతితో అంటకాగే నేతలకు ఇది సూటి హెచ్చరిక. అవినీతిపరులకు రక్షణగా ఉండే వ్యక్తులు, తప్పులను దాచిపెట్టే వ్యక్తులే దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దిగజార్చేలా ఆరోపణలు గుప్పిస్తున్నారు. వాళ్లొకటి గమనించాలి. అవినీతి వ్యతిరేక పోరాటానికి ప్రజా మద్దతు ఉందని ఈ ఎన్నికల ఫలితాలను చూసైనా ఈ వ్యక్తులు అర్థం చేసుకోవాలి'' అని విపక్షాలను పరోక్షంగా విమర్శించారు.

ఆ కులాల సాధికారత దేశ సాధికారత

''దేశంలో మహిళలు, యువత, పేదలు, రైతులు అని దేశంలో నాలుగే పెద్ద కులాలున్నాయి. ఈ కులాలు సాధికారత సాధించిన నాడే దేశ సాధికారత సాధ్యపడుతుంది. దేశంలో దాదాపు అన్ని ఓబీసీ వర్గాలు, షెడ్యూల్డ్ తెగల వారంతా ఈ నాలుగు వర్గాల్లోనే ఉన్నారు. బీజేపీ తమ విధాన నిర్ణయాలు, పథకాల ద్వారా వీరి సాధికారతకు కృషిచేస్తోంది. ఈ ఫలితాలొచ్చాక మేం గెలిచామని ప్రతి ఒక్క రైతు, యువజన ఓటరు, పేద, అణగారిన వర్గాల వ్యక్తులు గొంతెత్తి నినదిస్తున్నారు. గొప్ప భవిష్యత్తు కోసం యువత కలలు కంటోంది. ఈ రోజు ఫలితాలు చూశాక 2027కల్లా అభివృద్ధిచెందిన భారత్ సాకారం అవుతుందని ప్రతి ఒక్క పౌరుడు భరోసాగా ఉన్నాడు. నిజాయితీగా ఒక్కటి చెప్పదలుచుకున్నా. మీ స్వప్నం సాకారమవ్వాలనేదే నా సంకల్పం. ప్రపంచంలో భారత ఆర్థికాభివృద్ధి దూసుకుపోతూ దేశ మౌలికరంగ ముఖచిత్రాన్ని మార్చేస్తోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. 'స్వప్నాలు సాకారం కావాలనుకునే ప్రతి ఒక్కరూ మోదీనే ఎంచుకుంటారు'' అని రాసి ఉన్న భారీ కటౌట్‌ను బీజేపీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.

గహ్లోత్ మేజిక్‌కు తెర!

- అధికార పార్టీ ఓడే ఆనవాయితీ రాజస్తాన్‌లో పునరావృతం



రాజస్తాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఈసారి 'మేజిక్' చేయలేకపోయారు. మెజీషియన్ల కుటుంబం నుంచి వచ్చిన ఆయన, ఈసారి కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. ఆ క్రమంలో సంక్షేమ, ప్రజాకర్షక పథకాలతో సహా అందుబాటులో ఉన్న ట్రిక్కులన్నీ ప్రయోగించినా లాభం లేకపోయింది. అధికార పార్టీని ప్రజలు ఇంటికి సాగనంపే 30 ఏళ్ల ఆనవాయితీ అప్రతిహతంగా కొనసాగింది. దాంతో కాంగ్రెస్ పరాజయం చవిచూసింది. ''సీఎం పదవిని వదిలేయాలని నాకు కొన్నిసార్లు అనిపిస్తుంటుంది. కానీ సీఎం పదవే నన్ను వదలడం లేదు'' అని పదేపదే గొప్పగా చెప్పుకున్న 72 ఏళ్ల గహ్లోత్ చివరికి ఓటమిని అంగీకరించి ఆ పదవిని వీడాల్సి వచ్చింది.

ఏ పథకమూ ఆదుకోలేదు...

గతేడాది కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు గహ్లోత్ రాజకీయ జీవితానికి పెద్ద అగ్నిపరీక్షగా మారాయి. సీఎంగిరీని విడిచి పార్టీ అధ్యక్ష పదవిని స్వీకరించాలన్న అధిష్టానం ఆదేశాలను ధిక్కరించడం ద్వారా పెను సాహసమే చేశారాయన. ఆ క్రమంలో సోనియా, రాహుల్‌గాంధీ ఆగ్రహానికి గురైనా వెనకాడలేదు. చివరికి అధిష్టానమే వెనక్కు తగ్గాల్సిన పరిస్థితి కల్పించారు. ఈ దృష్ట్యా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎలాగైనా గెలిపించకపోతే తన రాజకీయ జీవితమే ప్రమాదంలో పడుతుందని గ్రహించి దూకుడు ప్రదర్శించారు. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ వాడుకున్నారు. ఎన్నికలకు ఏడాది ముందునుంచే పుంఖానుపుంఖాలుగా పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాలకు తెర తీశారు. పేదలకు కారుచౌకగా వంట గ్యాస్ మొదలుకుని ప్రజలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా దాకా ఆయన ప్రవేశపెట్టిన పథకాలన్నింటికీ మంచి పేరే వచ్చింది. ఏం చేసినా చివరికి ప్రజల మనసును మార్చలేక, అధికార పార్టీని ఓడించే 'ఆనవాయితీ'ని తప్పించలేక చతికిలపడ్డారు.

దెబ్బ తీసిన విభేదాలు...?

యువ నేత సచిన్ పైలట్‌తో విభేదాలు కూడా రాజస్థాన్‌లో కాంగ్రెస్ అవకాశాలను దెబ్బ తీశాయనే చెప్పాలి. ముఖ్యంగా 30కి పైగా అసెంబ్లీ స్థానాల్లో నిర్ణాయక శక్తిగా ఉన్న గుజ్జర్లు తమ వర్గానికి చెందిన పైలట్‌కు కాంగ్రెస్‌లో అన్యాయం జరుగుతోందన్న భావనకు వచ్చారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా కూడా పార్టీని దెబ్బ తీసిన అంశాల్లో ఒకటని పరిశీలకులు చెబుతున్నారు. ఎన్నికల వేళ గహ్లోత్‌కు పైలట్ నిజానికి పెద్దగా సహాయ నిరాకరణ చేయలేదు. పైపెచ్చు స్నేహ హస్తమే సాచారు. కానీ గహ్లోత్ మాత్రం తానేంటో అధిష్టానానికి నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో పైలట్‌కు ప్రాధాన్యం దక్కకుండా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చిన పైలట్‌ను అలా పక్కన పెట్టడం కూడా పార్టీకి చేటు చేసింది. – సాక్షి, నేషనల్ డెస్క్

రాజస్తాన్ రాజెవరో?

ముఖ్యమంత్రి రేసులో నలుగురు కీలక నేతలు

రాజస్తాన్ శాసనసభ ఎన్నికల్లో విపక్ష బీజేపీ ఘన విజయం సాధించింది. అశోక్ గహ్లోత్ ప్రభుత్వానికి పరాభవం ఎదురైంది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. రాజస్తాన్ రాజు ఎవరవుతారో మరో రెండు మూడు రోజుల్లో తేలిపోనుంది. ప్రధానంగా నలుగురు ముఖ్యనేతలు సీఎం రేసులో ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే మరోసారి పదవి ఆశిస్తున్నారు. పార్లమెంట్ సభ్యురాలు దియా కుమారి(ఈ ఎన్నికల్లో విద్యాధర్‌నగర్ స్థానం నుంచి గెలిచారు), కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, మహంత్ బాలక్‌నాథ్ యోగి సైతం సీఎం పోస్టు కోసం పోటీపడుతున్నారు. ఎవరికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయో ఒకసారి పరిశీలిస్తే..

– సాక్షి, నేషనల్ డెస్క్

వసుంధర రాజే



వసుంధర రాజే గతంలో రెండుసార్లు రాజస్తాన్ సీఎం చేశారు. ఈ ఎన్నికల్లో ఝల్రాపటాన్ స్థానం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆమె బీజేపీ అధిష్టానాన్ని విభేదిస్తున్న నేతగా పేరుగాంచారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో పెద్దగా సత్సంబంధాలు లేవన్న సంగతి బహిరంగ రహస్యమే. బీజేపీలో పాతతరం నేత అయిన వసుంధర రాజేను మూడోసారి గద్దెనెక్కించడానికి పార్టీ అగ్రనేతలు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ అధిష్టానం ఆశీస్సులు లేకపోవడంతో ఆమె ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కుదించుకుపోయాయి.

దియా కుమారి




రాజ్‌సమంద్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దియా కుమారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి నెగ్గారు. జైపూర్ దివంగత మహారాణి గాయత్రి దేవి మనవరాలైన దియా కుమారి బీజేపీలో వసుంధర రాజేకు ప్రత్యామ్నాయ నేతగా ఎదిగారు. రాచరిక నేపథ్యం, రాజ్‌పుత్ వర్గానికి చెందిన మహిళ కావడం ఆమెకు కలిసి వచ్చాయి. చాలాఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. గతంలో సవాయ్‌మాధోపూర్ ఎమ్మెల్యేగా ఆమె చేసిన అభివృద్ధి పనులు ప్రశంసలందుకున్నాయి. రాజస్తాన్‌లో నూతన ముఖ్యమంత్రిని నియమించే విషయంలో పార్టీ అధిష్టానం దియా కుమారి వైపు మొగ్గ చూపుతున్నట్లు బీజేపీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

మహంత్ బాలక్‌నాథ్ యోగి



రాజస్తాన్‌లోనూ ఉత్తరప్రదేశ్ తరహా ప్రయోగం చేయాలనుకుంటే ముందుగా గుర్తొచ్చే పేరు మహంత్ బాలక్‌నాథ్ యోగి. ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ మఠాధిపతి అయిన ఆదిత్యనాథ్ యూపీ సీఎం అయ్యారు. బాలక్‌నాథ్ ప్రస్తుతం రాజస్తాన్‌లో అల్వార్ ఎంపీగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో తిజారా అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. గతంలో సన్యాసం స్వీకరించారు. మహంత్ చాంద్‌నాథ్ మఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతలున్నాయి. రాష్ట్రంలో బలమైన అనుచరవర్గం ఉంది. నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్టానం దృష్టిలో ఆయన పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

గజేంద్రసింగ్ షెకావత్



రాజస్తాన్ బీజేపీలో మరో సీనియర్ నేత గజేంద్రసింగ్ షెకావత్. ప్రస్తుతం కేంద్ర జలశక్తి శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ అవినీతి వ్యవహారాలపై పలు ఫిర్యాదులు చేశారు. ఎన్నికల ప్రచారంలోనూ దూకుడుగా పనిచేశారు. ముఖ్యమంత్రిపై పలు ఆరోపణలు గుప్పించారు. తదుపరి సీఎం రేసులో తాను ఉన్నానంటూ ఇప్పటికే సంకేతాలు పంపించారు. కొందరు బీజేపీ ముఖ్యనేతలు ఆయనకు మద్దతిస్తున్నారు. సీఎం పోస్టుపై గజేంద్రసింగ్ ఆశలు పెట్టుకున్నారు.

బఘెల్‌కు 'బోనస్' దక్కలేదు



ఛత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. రెండు పార్టీలూ అంతే పోటాపోటీగా సంక్షేమ, ప్రజాకర్షక పథకాలను ప్రకటించాయి. వరికి దేశంలోనే అత్యధికంగా అందిస్తూ వస్తున్న బోనస్ తమను గట్టెక్కించి అధికారాన్ని నిలబెడుతుందని ముఖ్యమంత్రి భూపేశ్ బఘెల్ పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలే అయ్యాయి. మోదీ హామీల పేరుతో బీజేపీ ప్రకటించిన పథకాలకే ప్రజలు జై కొట్టారు.

ఎదురుదెబ్బ నేపథ్యంలో..

వరుసగా 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండటంతో ప్రజల్లో నెలకొన్న తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గట్టి దెబ్బ కొట్టింది. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ వెంటనే సీఎం బఘెల్ పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాల అమలు ప్రారంభించారు. రైతులు, గిరిజనులు, పేదలను ఎవరినీ వదలకుండా అందరికీ సాయం అందేలా చూశారు. ముఖ్యంగా వరికి ఆయన అందిస్తున్న బోనస్ సూపర్ హిట్టయింది. మళ్లీ గెలిస్తే పథకాన్ని మరింత విస్తరిస్తామని కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఇది ఒక దశలో బీజేపీని బాగా కలవరపరిచింది. దీనికి తోడు భూమిలేని కార్మికులకు వార్షిక ఆర్థిక సాయం రూ.10,000కు పెంచుతామని, కేజీ టు పీజీ ఉచిత విద్య, 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ సహా పలు హామీలెన్నో కాంగ్రెస్ ఇచ్చింది. దాంతో 'మోదీ గ్యారంటీలు' పేరుతో బీజేపీ దూకుడుగా ఎన్నో పథకాలు ప్రకటించింది. క్వింటాకు రూ.3,100 చొప్పున ఎకరాకు 21 క్వింటాళ్లను సేకరిస్తామని పేర్కొంది. ప్రతి వివాహితకూ ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం, పీఎం ఆవాస్ యోజన కింద 18 లక్షల ఇళ్ల నిర్మాణం, పేదలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, కాలేజీ విద్యార్థులకు ప్రయాణ భత్యం, నిరుపేద కుటుంబంలో పుట్టే ఆడపిల్లకు రూ.1.5 లక్షలు తదితరాలెన్నో ప్రకటించింది. వీటికి తోడు ప్రధాని మోదీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. డబుల్ ఇంజన్ సర్కారుకు చాన్సిస్తే అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తామని చెప్పుకొచ్చారు. ఇవన్నీ ప్రజలపై బాగా ప్రభావం చూపాయి. చివరికి బఘెల్ సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ కొత్త హామీల కంటే బీజేపీ 'మోదీ గ్యారంటీ'ల వైపే ప్రజలు మొగ్గు చూపారు.

ముంచిన 'మహదేవ్' ఆరోపణలు...

మోదీ గ్యారంటీలకు తోడు, పోలింగ్ సమీపించిన వేళ సీఎం బఘెల్‌పై ముసురుకున్న బెట్టింగ్ యాప్ ముడుపుల ఆరోపణలు కాంగ్రెస్‌కు బాగా చేటు చేశాయి. ఈ ఉదంతంలో ఒక కొరియర్‌ను అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించడం, దుబాయ్‌కి చెందిన మహదేవ్ బెట్టింగ్ యాప్ నుంచి బఘెల్‌కు ఏకంగా రూ.508 కోట్ల మేరకు ముడుపులు అందించినట్టు అతడు చెప్పాడని పేర్కొనడం సంచలనం రేపింది. – సాక్షి, నేషనల్ డెస్క్

17 మంది రాజస్తాన్ మంత్రుల ఓటమి

జైపూర్: రాజస్తాన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుగాలులకు పలువురు మంత్రులు ఓటమి దిశలో కొట్టుకుపోయారు. రాజస్తాన్ విపత్తు నిర్వహణ శాఖ మంత్రి, పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ సారథి అయిన గోవింద్ రామ్ మేఘ్వాల్ సహా 17 మంది మంత్రులు ఓటమిని చవిచూశారు. ఓడిన మంత్రుల్లో రమేశ్ చంద్ మీనా, షాలే మొహమ్మద్, భన్వర్ సింగ్ భటి, శకుంతలా రావత్, విశ్వేంద్ర సింగ్, ఉదయ్‌లాల్ అంజనా, బీడీ కల్లా, జహిదా ఖాన్, ప్రతాప్‌సింగ్ కచరియావాస్, భజన్‌లాల్ జాతవ్, మమతా భూపేశ్, పర్సాదీ లాల్ మీనా, సుఖ్‌రామ్ విష్ణోయ్, రామ్‌లాల్ జాట్, ప్రమోద్ జైన్ భయ్యా, రాజేంద్ర యాదవ్ ఉన్నారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌కు సలహాదారులుగా ఉన్న ఎమ్మెల్యేలు సన్యమ్ లోధా, రాజ్‌కుమార్ శర్మ, బాబులాల్ నగార్, దానిష్ అబ్రార్‌సహా ఆరుగురు ఎమ్మెల్యేలు ఓడిపోయారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆర్య సైతం విజయం సాధించలేకపోయారు. ముఖ్యమంత్రి గెహ్లోత్ 25 మంది మంత్రులతో కలిసి ఈసారి తమ గెలుపు అదృష్టాన్ని పరీక్షించుకోగా కొద్దిమంది మాత్రమే గెలుపు తలుపు తట్టారు. సర్దార్‌పుర స్థానంలో గెహ్లోత్ గెలిచారు.

నలుగురు బీజేపీ ఎంపీల గెలుపు

బీజేపీ ఏడుగురు ఎంపీలను ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. వీరిలో నలుగురు విజయం సాధించారు. విద్యాధర్ నగర్ బీజేపీ మహిళా ఎంపీ దియా కుమారీ, ఝోట్వారా ఎంపీ రాజ్యవర్ధన్ రాథోడ్, తిజారా ఎంపీ బాబా బాలక్ నాథ్, రాజ్యసభ సభ్యుడు కిరోడిలాల్ మీనాలు గెలిచారు.

12 రాష్ట్రాల్లో అధికార పీఠంపై కమలం

- కేవలం 3 రాష్ట్రాల్లో సొంతంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రశంసనీయమైన ఫలితాలు సాధించింది. మూడు కీలక రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకుంది. మధ్యప్రదేశ్‌లో అధికారం నిలబెట్టుకోగా, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో సులువుగా నెగ్గింది. దీంతో దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారం చేపట్టినట్లయ్యింది. ఉత్తరాఖండ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, గోవా, అస్సాం, త్రిపుర, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వాలున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వాలు కొలువుదీరడం లాంఛనమే. అలాగే మహారాష్ట్ర, మేఘాలయా, నాగాలాండ్, సిక్కిం ప్రభుత్వాల్లో బీజేపీ భాగస్వామిగా కొనసాగుతోంది. అక్కడ మిత్రపక్షాలతో కలిసి అధికారం పంచుకుంటోంది. దేశంలో రెండో అతి పెద్ద జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తాజా ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లను కోల్పోయింది. తెలంగాణలో విజయం సాధించింది. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఇప్పటికే సొంతంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. ఇప్పుడు తెలంగాణ సైతం ఆ పార్టీ ఖాతాలోకి చేరింది. అంటే మొత్తం మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ సొంతంగా అధికారంలోకి ఉన్నట్లు లెక్క. బిహార్, జార్ఖండ్ ప్రభుత్వాల్లో కాంగ్రెస్ భాగస్వామిగా ఉంది. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి మిత్రపక్షంగా వ్యవహరిస్తోంది. ఇక్కడ ప్రభుత్వంలో భాగస్వామి కాదు. మరో జాతీయ పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఢిల్లీ, పంజాబ్‌లో పూర్తి మెజార్టీతో అధికారంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ నుంచి రెండు రాష్ట్రాలు చేజారిపోవడంతో ఇక ఉత్తర భారతదేశంలో 'ఆప్' అతి పెద్ద ప్రతిపక్షంగా అవతరించిందని ఆ పార్టీ నేత జాస్మిన్ షా తెలిపారు. 2024లో లోక్‌సభ సాధారణ ఎన్నికలతోపాటు సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి.

ఎర్ర సముద్రంలో అమెరికా యుద్ధ నౌకపై దాడి

దుబాయ్: ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న తమ యుద్ధ నౌక యూఎస్ఎస్ కార్నీ సహా పలు వాణిజ్య నౌకలపై ఆదివారం దాడులు జరిగినట్లు అమెరికా పేర్కొంది. దాడికి కారణమెవరనే విషయం పెంటగాన్ తెలపలేదు. ఉదయం 10 గంటల సమయంలో యెమెన్ రాజధాని సనాలో మొదలైన ఈ దాడులు సుమారు 5 గంటలపాటు కొనసాగినట్లు ఓ అధికారి చెప్పారు. ఎర్ర సముద్రంలో అనుమానాస్పద డ్రోన్ దాడి, పేలుళ్లు సంభవించినట్లు అంతకుముందు బ్రిటిష్ మిలటరీ తెలిపింది. ఇందుకు సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఎర్ర సముద్రం మీదుగా ప్రయాణించే ఓడలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవలి కాలంలో దాడులకు తెగబడుతున్నారు. తాజా ఘటనలపై హౌతీలు స్పందించలేదు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం వేళ మధ్యప్రాచ్యంలో ఈ దాడులు ఆ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలకు అద్దం పడుతున్నాయని పరిశీలకులు అంటున్నారు.



రష్మిక జోడీకి డబుల్స్ టైటిల్... సింగిల్స్ చాంపియన్ రామ్‌కుమార్

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు రాణించారు. అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో మహిళల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక భారత్‌కే చెందిన వైదేహితో కలిసి టైటిల్ సొంతం చేసుకుంది. డబుల్స్ ఫైనల్లో రష్మిక-వైదేహి ద్వయం 6-1, 6-2తో సోహా సాదిక్-ఆకాంక్ష (భారత్) జోడీపై గెలిచింది. 55 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక జోడీ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. సింగిల్స్ విభాగంలో రష్మిక పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. మరోవైపు కర్ణాటకలోని గుల్బర్గాలో జరిగిన ఐటీఎఫ్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ విజేతగా అవతరించాడు. ఫైనల్లో రామ్‌కుమార్ 6-2, 6-1తో డేవిడ్ పిచ్లార్ (ఆస్ట్రియా)పై నెగ్గాడు. రెండు నెలల వ్యవధిలో రామ్‌కుమార్‌కిది మూడో ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం.



రన్నరప్ అశ్విని-తనీషా జోడీ



లక్నో: సయ్యద్ మోడి వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఈసారి భారత జట్టు క్రీడాకారులకు ఒక్క టైటిల్ కూడా లభించలేదు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో అశ్విని-తనీషా ద్వయం 14-21, 21-17, 15-21తో రిన్ ఇవనాగ-కీ నకనిషి (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలిచిన అశ్విని-తనీషాలకు 7,980 డాలర్ల (రూ. 6 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5950 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అంతకుముందు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో యు జెన్ చి (చైనీస్ తైపీ) 20-22, 21-12, 21-17తో ప్రపంచ 12వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై సంచలన విజయం సాధించి టైటిల్ దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్) 21-19, 21-16తో లినె హామార్క్ (డెన్మార్క్)ను ఓడించి విజేతగా నిలిచింది.

తలైవాస్ శుభారంభం



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తమిళ్ తలైవాస్ జట్టు శుభారంభం చేసింది. మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ జట్టుతో ఆదివారం జరిగిన తమ తొలి లీగ్ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు 42-31 పాయింట్ల తేడాతో గెలిచింది. తలైవాస్ తరఫున రెయిడర్స్ అజింక్య పవార్ 21 పాయింట్లు, నరేందర్ 8 పాయింట్లు స్కోరు చేసి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. దబంగ్ ఢిల్లీ తరఫున కెప్టెన్ నవీన్ కుమార్ 14 పాయింట్లు సాధించాడు. రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 34-31తో బెంగళూరు బుల్స్ జట్టును ఓడించింది. గుజరాత్ తరఫున సోను 12 పాయింట్లు సాధించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో జైపూర్ పింక్‌పాంథర్స్; బెంగళూరు బుల్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.

చివరిదీ మనదే

ఉత్కంఠ పోరులో భారత్‌ను గెలిపించిన బౌలర్లు

- ఆస్ట్రేలియాపై 4-1తో సిరీస్ సొంతం
- రాణించిన అయ్యర్, ముకేశ్, అర్ష్‌దీప్



బెంగళూరు: ఈ సిరీస్‌లోనే తక్కువ స్కోర్ల అంతిమ సమరం ఆఖరికొచ్చేసరికి ఉత్కంఠ రేపింది. గెలుపు ఇరుజట్లను దోబూచులాడిన తరుణంలో భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గట్టెక్కింది. చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో టీమిండియా 6 పరుగులతో ఆస్ట్రేలియాను ఓడించి సిరీస్‌ను 4-1తో ముగించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (37 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, ఆఖర్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్ (21 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. ప్రత్యర్థి బౌలర్లలో బెహ్రెన్‌డార్ఫ్, డ్వార్షుయిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 154 పరుగులే చేసి ఓడింది. బెన్ మెక్‌డెర్మాట్ (36 బంతుల్లో 54; 5 సిక్సర్లు) రాణించాడు. ముకేశ్ (3/32), అర్ష్‌దీప్ (2/40) డెత్ ఓవర్ల లో నిప్పులు చెరిగారు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' రవి బిష్ణోయ్ (2/29), అక్షర్ (1/14) బౌలింగ్ కూడా ఆస్ట్రేలియాను కట్టడి చేసింది.

ఆదుకున్న అయ్యర్

యశస్వి జైస్వాల్, రుతురాజ్‌లు ఆరంభంలో నెమ్మదించడంతో 3 ఓవర్ల దాకా చెప్పుకోదగ్గ స్కోరేలేదు. ఎట్టకేలకు 4వ ఓవర్లో గైక్వాడ్ 4, జైస్వాల్ 4, 6 కొట్టి ఊపు తెచ్చారు. కానీ అదే ఓవర్లో యశస్వి (21), మరుసటి ఓవర్లో రుతురాజ్ (10) నిష్క్రమించడంతో పవర్‌ప్లేలో భారత్ 42/2 స్కోరు చేసింది. కాసేపటికే కెప్టెన్ సూర్యకుమార్ (5), రింకూ సింగ్ (6)లు సైతం అవుట్ కావడంతో 55 పరుగులకే కీలకమైన 4 వికెట్లు కోల్పోయిన భారత్ కష్టాల్లో పడింది. ఈ దశలో అనుభవజ్ఞుడైన శ్రేయస్ అయ్యర్ బాధ్యతగా ఆడి గౌరవప్రదమైన స్కోరుకు బాటవేశాడు. జితేశ్ శర్మ (16 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్‌లతో కలిసి జట్టు స్కోరును 150 పరుగుల దాకా తీసుకొచ్చాడు. 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకొన్నాక అయ్యర్ అవుట్ కావడంతో డెత్ ఓవర్లలో ఆశించినన్ని పరుగులు రాలేదు.


ముకేశ్

రాణించిన మెక్‌డెర్మాట్

ఆసీస్ పవర్‌ప్లేలోనే ఓపెనర్లు జోష్ ఫిలిప్ (4), హెడ్ (18 బంతుల్లో 28; 5 ఫోర్లు, 1 సిక్స్) వికెట్లను కోల్పోయింది. హార్డీ (6) కూడా చేతులెత్తేయగా... వన్‌డౌన్ బ్యాటర్ బెన్ మెక్‌డెర్మాట్ బాధ్యతగా ఆడాడు. టిమ్ డేవిడ్ (17; 1 సిక్స్)తో కలిసి జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. తర్వాత కాసేపటికే డేవిడ్ అవుట్ కాగా... 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న మెక్‌డెర్మాట్‌ను ఊరించే ఫుల్‌టాస్ బంతితో అర్ష్‌దీప్ బోల్తా కొట్టించాడు. ముకేశ్ వరుస బంతుల్లో షార్ట్ (16), డ్వార్షుయిస్ (0)లను పెవిలియన్ చేర్చడంతో 129/7 స్కోరు వద్ద భారత్ పట్టుబిగించింది. 18 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన తరుణంలో అవేశ్ వేసిన 18వ మార్చేసింది. వేడ్ 3 వరుస బౌండరీలతో 15 పరుగులు వచ్చాయి. మళ్లీ ముకేశ్ 19వ ఓవర్లో 7 పరుగులే ఇచ్చి భారత్‌వైపు మొగ్గేలా చేశాడు. చివరకు ఆసీస్ విజయానికి 6 బంతుల్లో 10 పరుగులు కావాలి. ఉత్కంఠ తారస్థాయికి చేరగా అర్ష్‌దీప్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో వేడ్ (15 బంతుల్లో 22; 4 ఫోర్లు) వికెట్ తీసి కేవలం 3 పరుగులే ఇవ్వడంతో భారత్ గెలిచి ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) ఎలిస్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 21; రుతురాజ్ (సి) బెహ్రెన్‌డార్ఫ్ (బి) డ్వార్షుయిస్ 10; అయ్యర్ (బి) ఎలిస్ 53; సూర్యకుమార్ (సి) మెక్‌డెర్మాట్ (బి) డ్వార్షుయిస్ 5; రింకూ సింగ్ (సి) డేవిడ్ (బి) సంఘా 6; జితేశ్ (సి) షార్ట్ (బి) హార్డీ 24; అక్షర్ (సి) హార్డీ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 31; రవి బిష్ణోయ్ (రనౌట్) 2; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 160. వికెట్ల పతనం:** 1-33, 2-33, 3-46, 4-55, 5-97, 6-143, 7-156, 8-160. **బౌలింగ్:** హార్డీ 4-0-21-1, బెహ్రెన్‌డార్ఫ్ 4-0-38-2, డ్వార్షుయిస్ 4-0-30-2, నాథన్ ఎలిస్ 4-0-42-1, తన్వీర్ సంఘా 4-0-26-1.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) బిష్ణోయ్ 28; ఫిలిప్ (బి) ముకేశ్ 4; మెక్‌డెర్మాట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 54; హార్డీ (సి) అయ్యర్ (బి) బిష్ణోయ్ 6; టిమ్ డేవిడ్ (సి) అవేశ్ (బి) అక్షర్ 17; షార్ట్ (సి) రుతురాజ్ (బి) ముకేశ్ 16; వేడ్ (సి) అయ్యర్ (బి) అర్ష్‌దీప్ 22; డ్వార్షుయిస్ (బి) ముకేశ్ 0; ఎలిస్ (నాటౌట్) 4; బెహ్రెన్‌డార్ఫ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1-22, 2-47, 3-55, 4-102, 5-116, 6-129, 7-129, 8-151. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-2, అవేశ్ ఖాన్ 4-0-39-0, ముకేశ్ 4-0-32-3, రవి బిష్ణోయ్ 4-0-29-2, అక్షర్ 4-0-14-1.

హైదరాబాద్ జట్టుకు మూడో విజయం


తన్మయ్ అగర్వాల్

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు ఖాతాలో మూడో విజయం చేరింది. విదర్భ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ వీజేడీ పద్ధతిలో 30 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (98 బంతుల్లో 102 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించగా... ధ్రువ్ షోరే (83; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ, నితిన్‌సాయి యాదవ్ రెండు వికెట్ల చొప్పున తీశారు. 287 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 29 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 159 పరుగులు సాధించింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట సాధ్యపడలేదు. వీజేడీ పద్ధతి ఆధారంగా హైదరాబాద్ విజయ సమీకరణాన్ని లెక్కించగా హైదరాబాద్ 30 పరుగులు ఎక్కువే చేసింది. దాంతో హైదరాబాద్‌ను విజేతగా ప్రకటించారు. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (77 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీలు సాధించారు. హైదరాబాద్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మంగళవారం మేఘాలయ జట్టుతో ఆడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది.

పరాజయంతో ముగించిన ఆంధ్ర


నితీశ్ రెడ్డి

చండీగఢ్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆంధ్ర జట్టు పరాజయంతో ముగించింది. ఉత్తరప్రదేశ్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 46.5 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ కరణ్ షిండే (67; 7 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ రెడ్డి (37 బంతుల్లో 60 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), కోన శ్రీకర్ భరత్ (50 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... పృథ్వీరాజ్ (35; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా రాణించాడు. షేక్ రషీద్, రికీ భుయ్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో కార్తీక్ త్యాగి, శివా సింగ్ మూడు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం ఉత్తరప్రదేశ్ జట్టు 41.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు సాధించి గెలిచింది. ఆర్యన్ జుయల్ (55; 7 ఫోర్లు), సమీర్ రిజ్వీ (61 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (57 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేసి ఉత్తరప్రదేశ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఏడు జట్లున్న గ్రూప్ 'డి'లో ఆంధ్ర తమ ఆరు మ్యాచ్‌లను పూర్తి చేసుకొని ఆరు పాయింట్ల తో ఐదో స్థానంలో నిలిచింది. ఒక మ్యాచ్‌లో నెగ్గిన ఆంధ్ర, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. మరో మ్యాచ్ వర్షంవల్ల రద్దయింది.

నేటి నుంచి జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ అండర్-13 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఏడు రోజులపాటు జరిగే ఈ టోర్నీని సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తారు. దేశం నలుమూలల నుంచి 623 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పోటీపడనున్నారు. ఈ టోర్నీలో తెలంగాణ జట్టుకు బాలుర విభాగంలో ఆదిరెడ్డి అర్జున్, వుప్పల ఆదర్శ్, చల్లా సహర్ష, అందబట్ల సాత్విక్, రితేశ్ మద్దుకూరి... బాలికల విభాగంలో హాసిని, శరణ్యదేవి, కీర్తిక, శివాంశిక ప్రాతినిధ్యం వహిస్తున్నారని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.

ఇంగ్లండ్ 'ఎ' జట్టుదే సిరీస్

ముంబై: భారత మహిళల 'ఎ' జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఇంగ్లండ్ 'ఎ' జట్టు 2-1తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 'ఎ' రెండు వికెట్ల తేడాతో భారత్ 'ఎ'పై గెలిచింది. ముందుగా భారత జట్టు 19.2 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష ఏడు పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఇసీ వాంగ్, క్రిస్టీ, మ్యాడీ, లారెన్ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం ఇంగ్లండ్ 'ఎ' జట్టు 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసి నెగ్గింది. ఇసీ వాంగ్ (28 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇంగ్లండ్ జట్టును విజయతీరానికి చేర్చింది. ఆంధ్ర అమ్మాయి బి.అనూష ఒక వికెట్ తీసింది.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జీజీహెచ్, అనంతపురం జిల్లాలో 72 పోస్టులు

ఉమ్మడి అనంతపురం జిల్లా ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 72
» **వైద్య సంస్థలు:** ప్రభుత్వ వైద్య కళాశాల/సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (అనంతపురం), ప్రభుత్వ జనరల్ హాస్పిటల్(అనంతపురం), కాలేజ్ ఆఫ్ నర్సింగ్ (అనంతపురం).
» **పోస్టులు:** ల్యాబ్ అటెండెంట్స్, నర్సింగ్ ఆర్డర్లీ, అటెండర్, డెంటల్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, అనంతపురం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.12.2023.
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ఏపీఎస్సీఎస్సీఎల్, విజయనగరంలో 11 పోస్టులు

విజయనగరంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్సీఎస్సీఎల్), జిల్లా కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:** అకౌంటెంట్ గ్రేడ్3-03, డేటా ఎంట్రీ ఆపరేటర్-1, టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3-7
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 35ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అకౌంటెంట్‌కు రూ.27,000, డీఈవోకు రూ.18,500, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.22,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం, ఏపీఎస్సీఎస్సీఎల్, దాసన్నపేట,విజయనగరం చిరునామకు పంపించాలి
» **దరఖాస్తులకు చివరితేది:** 04.12.2023.
» **వెబ్‌సైట్:** vizianagaram.ap.gov.in

ఏపీఎస్సీఎస్సీఎల్, రాజమహేంద్రవరంలో 12 పోస్టులు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్సీఎస్సీఎల్), జిల్లా కార్యాలయం.. తూర్పు గోదావరి జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/బయోటెక్నాలజీ/డ్రైల్యాండ్ అగ్రికల్చర్/బోటనీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 35ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లైస్ మేనేజర్ ఆఫీస్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.12.2023.
» **వెబ్‌సైట్:** https://eastgodavari.ap.gov.in

ఏపీసీటీడీ, తిరుపతిలో వివిధ ఉద్యోగాలు

తిరుపతిలోని రీజనల్ జీఎస్‌టీ ఆడిట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్, కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** డేటా ఎంట్రీ ఆపరేటర్,ఆఫీస్ సబార్డినేట్
» **అర్హత:** డీఈవోకు బ్యాచిలర్ డిగ్రీ, టైపింగ్ స్కిల్స్/ఎంఎస్ ఆఫీస్/పీజీడీసీఏ/డీసీఏ/ఇంజనీరింగ్, ఆఫీస్ సబార్డినేట్‌కు ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ. 18,500, ఆఫీస్ సబార్డినేట్స్‌కు రూ.15,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ జీఎస్‌టీ ఆడిట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్, ఎ-బ్లాక్, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం, పద్మావతి నిలయం, తిరుపతి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.12.2023.
» **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

ఉస్మానియా యూనివర్శిటీలో ఫారెన్ లాంగ్వేజ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్శిటీలోని జర్మన్ విభాగం .. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫ్రెంచ్/జర్మన్‌లో(జూనియర్/సీనియర్) డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** నాలుగు నెలలు.
» **అర్హత:** జూనియర్ డిప్లొమాకు ఇంటర్మీడియట్, సీనియర్ డిప్లొమాకు జూనియర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.12.2023.
» **వెబ్‌సైట్:** http://www.osmania.ac.in

పశు సంవర్థక సహాయకుల కొలువులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఉద్యోగార్థులకు మరో తీపి కబురు అందించింది! యానిమల్ హజ్బెండరీ, డైరీ సైన్స్ కోర్సులు పూర్తి చేసి.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి స్వాగతం పలుకుతోంది. రాష్ట్రంలోని గ్రామ సచివాలయాల్లో మొత్తం 1896 యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ప్రభుత్వ పశు సంవర్థక శాఖ విడుదల చేసిన యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్స్ ఉద్యోగాల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



» మొత్తం 1,896 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక
» వేతన శ్రేణి రూ.22,460-రూ.72,810

మొత్తం 1,896 పోస్టులు

ఏపీ గ్రామ సచివాలయాల్లో పశు సంవర్థక సహాయకుల నియామక ప్రకటన ప్రకారం-రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా మొత్తం 1,896 పోస్టులను భర్తీ చేయనున్నారు.

విద్యార్హతలు

డైరీ సైన్స్, డైరీయింగ్, పౌల్ట్రీసైన్స్, వెటరినరీ సైన్స్ అనుబంధ సబ్జెక్టులలో ఒకేషనల్ ఇంటర్మీడియెట్, డిప్లొమా, బీఎస్సీ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ వర్గాలకు అయిదేళ్లు, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ వర్గాలకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

ఎంపిక విధానం

యానిమల్ హజ్బెండరీ పోస్టులకు సంబంధించి తొలుత రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా జిల్లాల వారీగా జాబితా విడుదల చేస్తారు. అనంతరం జిల్లా ఎంపిక కమిటీల ఆధ్వర్యంలో తుది జాబితా రూపొందించి.. నియామకాలు ఖరారు చేస్తారు. జిల్లా ఎంపిక కమిటీకి కలెక్టర్ నేతృత్వం వహిస్తారు.

వెయిటేజీ మార్కులు

నియామక ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ సర్వీసులో పని చేస్తున్న వారికి వెయిటేజీ మార్కులు కూడా కేటాయించనున్నారు. గోపాల మిత్ర, గోపాలమిత్ర సూపర్‌వైజర్స్, 1962 వెట్స్, ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారికి ప్రతి ఆరు నెలల సర్వీసుకు ఒకటిన్నర మార్కులు చొప్పున గరిష్ఠంగా 15 మార్కులు కేటాయిస్తారు.

రాత పరీక్షకు 150 మార్కులు

యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్షను రెండు విభాగాలుగా మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్ ఏ జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీపై 50 ప్రశ్నలు-50 మార్కులకు; పార్ట్ బీ యానిమల్ హజ్బెండరీ సంబంధిత సబ్జెక్టుపై 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు తగ్గిస్తారు.

ఆకర్షణీయ వేతనం

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా..ఆ తర్వాత డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నిర్వహించే ఎంపిక ప్రక్రియలోనూ మెరిట్ జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. ఆకర్షణీయమైన వేతనంతో కొలువు సొంతమవుతుంది. ప్రారంభ వేతన శ్రేణి రూ.22,460-రూ.72,810గా పేర్కొన్నారు.

రెండేళ్ల ప్రొబేషన్

ఎంపికైన వారికి రెండేళ్ల ప్రొబేషన్ ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున వేతనం అందిస్తారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత పూర్తి స్థాయిలో వేతనం అందుతుంది. ఎంపికైన వారు గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబర్ 11, 2023
- **ఫీజు చెల్లింపు చివరి తేదీ:** డిసెంబర్ 10, 2023
- **హాల్ టికెట్ జారీ:** డిసెంబర్ 27 నుంచి
- **పరీక్ష తేదీ:** డిసెంబర్ 31, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://apaharecruitment.aptonline.in

విజయం సాధించేలా

జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ

- అభ్యర్థులకు సామాజిక అంశాలపై ఉన్న అవగాహనను పరిశీలించేలా పార్ట్-ఎలో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ ఉంటుంది. ఇందులో మంచి మార్కుల కోసం హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.
- హిస్టరీలో రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ.. ముఖ్యమైన అంశాలపై పట్టు పెంచుకోవాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. అదేవిధంగా భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి.
- పాలిటీలో రాణించేందుకు రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాలు (రాజ్యాంగ సవరణలు, వాటి ప్రభావం) తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఎకానమీలో మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో టెక్నాలజీ రంగంలో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.
- మెంటల్ ఎబిలిటీకి సంబంధించి టాబ్యులేషన్, డేటా సమీకరణ, డేటా విశ్లేషణలపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

పార్ట్-బి ప్రిపరేషన్ ఇలా

యానిమల్ హజ్బెండరీ సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రశ్నలతో ఉండే పార్ట్-బిలో రాణించేందుకు.. వెటర్నరీ అనాటమీ అండ్ ఫిజియాలజీ, లైవ్ పౌల్ట్రీ డిసీజెస్, వెటర్నరీ ఫార్మసీ, యానిమల్ రీ-ప్రొడక్షన్ అండ్ గైనకాలజీ ఫండమెంటల్స్, కృత్రిమ గర్భధారణ ప్రాథమిక అంశాలు, వెటర్నరీ మెడిసిన్ ఫండమెంటల్స్, వెటర్నరీ బయలాజికల్, వ్యాక్సిన్స్ నిర్వచనం, వెటర్నరీ ఫస్ట్ ఎయిడ్, క్లినికల్ మేనేజ్‌మెంట్, లైవ్‌స్టాక్ ఫీడింగ్ ప్రిన్సిపుల్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం, 4, డిసెంబర్, 2023





గ్రేటర్ సెపరేట్

పల్లెకు భిన్నంగా పట్నం

- సిటీ షి'కార్'
- పతంగ్ జోష్
- కాంగ్రెస్ బేజార్
- బీజేపీ.. సీన్ రిపీట్

నాన్నా గెలిచావ్



అంబర్‌పేట ఎమ్మెల్యేగా గెలిచిన కాలేరు వెంకటేష్‌ను ఎత్తుకొని సంతోషం పంచుకుంటున్న కుమారుడు కాలేరు మణికంఠ

అన్నా.. నిలిచావ్



పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మద్దతుగా గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ జెండాతో కార్యకర్తల ఆనందోత్సాహం

రాష్ట్రంలో కాంగ్రెస్.. గ్రేటర్‌లో బీఆర్ఎస్ అన్న చందంగా ఫలితాలు ప్రతిబింబించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నగరం విలక్షణ తీర్పునిచ్చింది. ప్రగతికే పట్టం కట్టింది. గ్రేటర్‌లో కారు టాప్‌గేరులో దూసుకెళ్లింది. రాష్ట్రం మొత్తంగా కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించినా నగరంలో మాత్రం ఆ పార్టీకి రిక్తహస్తమే మిగిలింది. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. గాలిపటం హవా కొనసాగింది. ఏడు సిట్టింగ్ ఎమ్మెల్యేలను తిరిగి తన ఖాతాలో వేసుకుంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలను సాధించిన కమలం పార్టీ.. అసెంబ్లీ పోరులో పాత స్థానానికే పరిమితమైంది. గోషామహల్‌లో రాజాసింగ్ మాత్రమే విజయం సాధించారు. కాగా.. అధికార బీఆర్ఎస్ కృషి ఫలితంగానే నగరాభివృద్ధి సాధ్యమైందనే తలంపుతో సిటీజనులు ఆ పార్టీని ముందంజలో నిలిపారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ స్థానాలు గెలుచుకోలేకపోయినా.. గ్రేటర్ నగరంలో మాత్రం ఆ పార్టీకి ఆదరణ తగ్గలేదని ఇక్కడి ఎన్నికల ఫలితాలే నిదర్శనమంటున్నారు. రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ చిక్కులు తొలగడం, రియల్ ఎస్టేట్ బూమ్ పెరగడం, రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోరైల్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించడంపై సిటీ ఓటర్లు ఆకర్షితులయ్యారు. అంతిమంగా గ్రేటర్ ఓటర్ పట్టణ ప్రగతికే జై అన్నారు.

దూసుకెళ్లిన కారు.. అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ విజయం

- అధికార పార్టీకే నగర ఓటరు పట్టం
- శివారు స్థానాల్లోనూ గులాబీ హవా
- నగరంలో బోణీ కొట్టని హస్తం
- గోషామహల్‌కే పరిమితమైన కాషాయం పార్టీ

ఎవరికి ఎన్ని?

బీఆర్ఎస్	ఎంఐఎం	బీజేపీ	కాంగ్రెస్
16	07	01	0

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రానికి భిన్నంగా గ్రేటర్ ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. అధికార బీఆర్ఎస్ వైపు నగర వాసులు మొగ్గు చూపారు. కారు గేరుకు అనూహ్యంగా ఊతమిచ్చారు. అభివృద్ధికే పట్టం కట్టారు. హైదరాబాద్‌లో అధికార పార్టీకి ఊరట లభించింది. శివారు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ జెండా ఎగిరింది. కాంగ్రెస్‌కు రిక్తహస్తమే మిగిలింది. బీజేపీ తన సిట్టింగ్ స్థానం గోషామహల్‌ను పదిలపర్చుకుంది. ఎంఐఎం 7 స్థానాల్లో విజయం సాధించింది.

గ్రేటర్ గులాబీ విజేతలు..

కుత్బుల్లాపూర్ పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌గౌడ్ సుమారు 85 వేలకు పైగా భారీ మెజారిటీతో మరోసారి విజయఢంకా మోగించగా.. శేరిలింగంపల్లి నుంచి ఆరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపీనాథ్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు, సనత్‌నగర్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, ముషీరాబాద్ నుంచి ముఠా గోపాల్, కంటోన్మెంట్ లాస్య నందిత, సికింద్రాబాద్ పద్మారావుగౌడ్, ఎల్‌బీ నగర్ నుంచి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నుంచి మల్లారెడ్డి, మల్కాజిగిరి నుంచి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నుంచి ప్రకాశ్ గౌడ్, ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డిలు విజయం సాధించారు.

విజయ సూత్రమిలా..

- గ్రేటర్‌లో దశాబ్ద కాలంగా జరిగిన అభివృద్ధి వైపు ఓటర్లు మొగ్గు చూపారు. అనేక అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ డెస్టినేషన్‌గా మార్చుకున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో పెట్టుబడులు పెట్టాయి. దీంతో ఆ రంగం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన ప్రజలు సహజంగానే అధికార పార్టీ వైపు మొగ్గు చూపారు. ఐదారేళ్లుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున రహదారుల విస్తరణ చేపట్టింది. అనేక చోట్ల ఫ్లైఓవర్‌లు అందుబాటులోకి తెచ్చింది. ప్రతి క్షణం ట్రాఫిక్ రద్దీలో చిక్కుకొని విలవిలలాడే సిటీ జనులకు ఫ్లై ఓవర్లతో ఎంతో ఊరట లభించింది.
- ఐటీ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు తరలిరావడంతో నగరానికి పశ్చిమవైపున పెద్దఎత్తున అభివృద్ధి జరిగింది. ఆకాశాన్ని తాకే 50 అంతస్తుల వరకు హైరైజ్‌డ్ బిల్డింగ్‌లు వచ్చాయి. రియల్ ఎస్టేట్ భూమ్ భారీగా పెరిగింది. భూముల ధరలకు అనూహ్యంగా రెక్కలొచ్చాయి. కోకాపేట్ వంటి చోట్ల ఎకరం రూ.వంద కోట్లకు పైగా ధర పలికింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు హైదరాబాద్ కొంగుబంగారంగా మారింది. జాతీయ,అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలకు హైదరాబాద్ వేదికగా నిలిచింది.
- మరోవైపు రాయదుర్గం నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రోరైల్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించడం, పాతబస్తీతో పాటు, ఔటర్‌కు నలువైపులా మెట్రో విస్తరణకు కార్యాచరణను రూపొందించడం వంటి అంశాలు సిటీ ఓటరును బాగా ప్రభావితం చేశాయి.
- మంత్రి కేటీఆర్ ఆలోచనతో లింక్‌రోడ్లు వంటివి సైతం అందుబాటులోకొచ్చాయి. ప్రధాన రహదారుల సమస్యలు దాదాపుగా పరిష్కరించారు. తీరని అతిపెద్ద సమస్య నాలాలు, లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టడం అధికార పార్టీకి కలిసొచ్చింది. ముఖ్యంగా వేల సంఖ్యలో ఐటీ ఉద్యోగులున్న ఐటీ కారిడార్లలో చేపట్టిన అభివృద్ధితో పాటు నగరంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జరిగిన పనులతో బీఆర్ఎస్‌పై పెద్దగా వ్యతిరేకత ఏర్పడలేదు.

సుస్థిర పాలనకే ఓటు..

గ్రేటర్ ఓటరు సుస్థిరతకే ఓటర్లు వేశారు. ఎవరెన్ని చెప్పినా ఇప్పటికే జరిగిన అభివృద్ధి పనులతో పాటు కొనసాగుతున్న పనులు పూర్తి చేస్తారనే అభిప్రాయంతోనూ గులాబీ పార్టీ వైపు మొగ్గు చూపారు.

- శాంతియుత జీవనం, కర్ఫ్యూలు లేని ప్రశాంత వాతావరణాన్ని కోరుకున్నారు. విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో గ్రేటర్‌వ్యాప్తంగా చేపట్టిన పనులు ప్రజలు ఆ పార్టీ వైపు నిలిచేలా చేశాయి.
- మరీ ముఖ్యంగా అన్నీ తానై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తారకరామారావు పార్టీ అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించగలిగారు. సాధారణ ప్రజానీకంతో పాటు ఐటీ, తదితర వృత్తి నిపుణులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశాల్లోనూ వాటి గురించి వివరించిన తీరుకు ఆకర్షితులవడమూ కారు దూసుకెళ్లడానికి కారణమయ్యాయి.

మేడ్చల్ ఖిల్లాపై గులాబీ జెండా

ఐదు సిట్టింగ్ స్థానాల్లోనూ బీఆర్ఎస్ జయకేతనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాపై గులాబీ జెండా ఎగిరింది. ఇక్కడ ఊహించని ఫలితాలు వెలువడ్డాయి. ఐదుకు ఐదూ బీఆర్ఎస్ నిలబెట్టుకుంది. ఈసారి ఓట్ల శాతం కూడా గణనీయంగా పెరిగింది. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఐదు స్థానాలను కైవసం చేసుకుంది. అదే చరిత్రను ఇప్పుడు పునరావృతం చేసింది. మేడ్చల్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డి రెండోసారి గెలుపొందగా.. కుత్బుల్లాపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటిసారి పోటీ చేసిన బండారి లక్ష్మారెడ్డి గెలుపొందారు. మల్కాజిగిరిలో కూడా చామకూర మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మొదటిసారి విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఓటమి పాలయ్యారు.

వికసించని కమలం

గ్రేటర్‌లో కమలం వికసించలేకపోయింది. కేవలం సిట్టింగ్ స్థానానికే పరిమితమైంది. గోషామహల్‌లో ఆ పార్టీ అభ్యర్థి రాజాసింగ్ మరోసారి విజయం సాధించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన అంబర్‌పేట్‌లో ఆ పార్టీ కృష్ణయాదవ్ ఓటమిని చవిచూశారు. కొన్ని స్థానాలు ఊరించి ఉసూరుమనిపించాయి. మరికొన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు ఆ పార్టీ ఆశించిన స్థాయిలో విజయం వరించక పోయినా పలుచోట్ల కాంగ్రెస్ కంటే ఎక్కువ ఓట్లు సాధించడం ఊరటనిచ్చింది. కొన్ని చోట్ల నువ్వా.. నేనా అన్నట్లుగా ప్రత్యర్థి పార్టీతో బీజేపీ అభ్యర్థులు పోటీ పడ్డారు. ఎల్బీనగర్, కార్వాన్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి తదితర చోట్ల గట్టి పోటీనిచ్చారు. సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విజయం సాధించగా ప్రత్యర్థిగా బీజేపీ అభ్యర్థి, సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. అంబర్‌పేట్, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, రాజేంద్రనగర్‌లలో రెండో స్థానంలో నిలిచింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు గట్టిపోటీనిచ్చి అనేక డివిజన్‌లలో రెండోస్థానంలో నిలిచిన బీజేపీ ఈ ఎన్నికల్లో కొద్ది సీట్లకే రెండో స్థానానికి పరిమితం కావడం గమనార్హం.



అగ్రనేతల ప్రచారంతో..

బీజేపీకి ఈ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితం లభించకపోయినా ఆ పార్టీ అగ్రనేతలు ప్రధాని మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్‌గడ్కరీ తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాల్లో పర్యటించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ బహిరంగసభలో మోదీ పాల్గొనడం అలాగే ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి కాచిగూడ వరకు నిర్వహించిన రోడ్ షోలోనూ ప్రధాని పాల్గొనడం బీజేపీ బలాన్ని పెంచింది. ఆ పార్టీకి చెందిన అనేక మంది అతిరథమహారథులు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేశారు. అంబర్‌పేట్‌లో ఆ పార్టీ ఓటమిని బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

మజ్లిస్ సిట్టింగ్ స్థానాలు పదిలం..



మజ్లిస్ ప్రధాన కార్యాలయంలో అధినేత అసదుద్దీన్ ఒవైసీతో ఆ పార్టీ మజ్లిస్ ఎమ్మెల్యేలు

పాతబస్తీలో పతంగి పైకి ఎగిరింది. ఏడు సిట్టింగ్ స్థానాలనూ మజ్లిస్ మళ్లీ పదిలపర్చుకుంది. పోటీ చేసిన మరో రెండు సిట్టింగేతర స్థానాల్లో మాత్రం పరాజయం పాలైంది. యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంబీటీతో, నాంపల్లిలో కాంగ్రెస్‌తో గట్టి పోటీ ఎదురైనా.. ఫలితం మాత్రం చేజారకుండా దక్కించుకుంది. జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్‌లో స్నేహపూర్వకంగా పోటీ చేసి పరాజయం పాలైన మిత్ర పక్షం బీఆర్ఎస్ విజయానికి దోహదపడింది. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ పక్షాలు పాతబస్తీలో పాగా వేసేందుకు శతవిధాలుగా ప్రయత్నించినా.. తన కంచుకోటను బీటలు వారకుండా పదిలపర్చుకోవడంలో మజ్లిస్ సఫలీకృతమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పావులు కదిపింది. ఏకంగా చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా సిట్టింగ్ సీనియర్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ప్రకటించి కొత్త వారికి అవకాశం కల్పించి ఎలాంటి అసంతృప్తి ప్రభావం పకడ్బందీగా పావులు కదిపింది. మరోవైపు నాంపల్లి సిట్టింగ్‌పై వ్యతిరేకత ఉండటంతో ఏకంగా యాకుత్‌పురా స్థానానికి మార్చింది. ఇద్దరు మాజీ మేయర్లను చార్మినార్, నాంపల్లి నుంచి, బహదూర్‌పురా స్థానంలో ఒక జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌కు అవకాశం ఇచ్చి సిట్టింగ్ స్థానాలను పదిలపర్చుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అసెంబ్లీ సెగ్మెంట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉదయం, సాయంత్రం పాదయాత్ర, రాత్రి కార్నర్ మీటింగ్‌లతో ఓటర్లను ఆకర్షించడంలో సఫలీకృతమయ్యారు.

ఆది నుంచీ ఆధిపత్యమే..

పాతబస్తీలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో దశాబ్దాలుగా మజ్లిస్ పార్టీ ఆధిపత్యం ప్రదర్శిస్తూ వస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడిన నాంపల్లి, మలక్‌పేటలో సైతం వరుసగా పట్టు సాధిస్తూ వస్తోంది. నాలుగు పర్యాయాలుగా విజయకేతనం ఎగురవేసింది. చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాలో వరుస విజయాలు సాధిస్తోంది.

ఎంఐఎం విజేతలు వీరే..

చాంద్రాయణ గుట్ట నుంచి అక్బరుద్దీన్‌ఒవైసీ డబుల్ హ్యాట్రిక్, కార్వాన్ నియోజకవర్గం నుంచి కౌసర్ మొహియుద్దీన్ హ్యాట్రిక్ విజయం సాధించారు. మలక్‌పేట నుంచి అహ్మద్ బలాల నాలుగో గెలిచారు. గత రెండు పర్యాయాలుగా నాంపల్లి స్థానం నుంచి విజయం సాధించిన జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఈసారి యాకుత్‌పురా స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. చార్మినార్ నుంచి మీర్ జుల్ఫీకర్ అలీ, బహదూర్‌పురా నుంచి మహమ్మద్ ఆబీద్, నాంపల్లి నుంచి మాజిద్ హుస్సేన్‌లు తొలిసారిగా విజయం సాధించారు.



సనత్‌నగర్‌లో తలసాని విజయోత్సాహం..

అసెంబ్లీలోకి 'కొత్త రక్తం'

ఐదుగురికి తొలి విజయం



లాస్య నందిత, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ మోబీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, మాజిద్ హుస్సేన్

రాజధాని నుంచి నలుగురు కొత్త ప్రజాప్రతినిధులు ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. వీరిలో ఒకరు మహిళ కూడా ఉన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత బీఆర్ఎస్ అభ్యర్థిగా కంటోన్మెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. బహదూర్‌పురా ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మోబీన్, మల్కాజిగిరి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి, చార్మినార్ నుంచి ఎంఐఎం అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీ, నాంపల్లి ఎంఐఎం నుంచి గెలిచిన మాజిద్ హుస్సేన్ తొలిసారిగా అడుగుపెడుతున్న వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌కు రిక్త 'హస్తమే'

మరోసారి హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు రిక్తహస్తమే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీచినా.. అవి నగరానికి మాత్రం తాకలేదు. ఈసారి గ్రేటర్‌లో 24 స్థానాల్లో పోటీ చేసిన కాంగెస్‌కు కనీసం ఒక్కటి కూడా దక్కలేదు. గట్టిగా ఆశలు పెట్టుకున్న స్థానాల్లో సైతం బోల్తాపడింది. నాంపల్లి, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్, కూకట్‌పల్లి, మలక్‌పేట సెగ్మెంట్లల్లో గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానానికి పరిమితమైంది. ఎల్‌బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, అంబర్‌పేట తదితర స్థానాల్లో మూడో స్థానానికి పడిపోయింది. కాంగ్రెస్‌ను వెంటాడుతున్న మజ్లిస్‌ను దాని సొంత గడ్డ పాతబస్తీలో దెబ్బ తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. నాంపల్లిలో మాత్రం గట్టి పోటీ ఇచ్చింది. వాస్తవంగా రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పావులు కదిపిన కాంగ్రెస్ హైదరాబాద్‌పై మాత్రం దృష్టి సారించలేదు. అసెంబ్లీ సెగ్మెంట్లలో నాయకత్వ లోపం, అభ్యర్థుల ఎంపికలో ఆలస్యం, పారాచూట్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం, కొందరు పార్టీ వీడటం, ప్రచార వైఫల్యం లాంటి అంశాలు పార్టీ పరాభవానికి ప్రధాన కారణమైనట్లు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కనీసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై నగరవాసులకు అవగాహన కల్పించడంలో వైఫల్యమే మరో కారణంగా చెప్పవచ్చు.

పదేళ్లుగా గడ్డుకాలమే

గత పదేళ్లుగా గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ వరుస అపజయాలతో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అత్యధికంగా 14 అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ.. తెలంగాణ ఆవిర్భావం అనంతరం క్రమంగా చతికిలబడింది. వాస్తవంగా 2014 ఎన్నికల్లో తక్కువ సీట్లతో సరిపెట్టుకుంది. 2018 ఎన్నికల్లో టీడీపీ, టీజేఎస్‌తో కలిసి కూటమిగా పోటీ చేసినా కేవలం ఎల్‌బీనగర్, మహేశ్వరం సీట్లు గెలుచుకొని మిగతా వాటిలో పరాభవం మూటగట్టుకుంది. గెలిచిన ఇద్దరు అభ్యర్థులు సైతం అధికార పార్టీలో చేరిపోయారు. గత పదేళ్ల నుంచి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఊసే లేకుండా పోయింది. రెండు పర్యాయాలు జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగినా.. అందులోనూ సైతం మొక్కుబడి స్థానాలకు పరిమితమైంది. ఇక పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లో ఖాతా తెరవడం కత్తి మీద సాములా మారింది. 2009లో చేజారిన మలక్‌పేట నియోజకవర్గం ఎంఐఎంకు కంచుకోటగా మారింది. తాజాగా ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా మారినప్పటికీ నగరంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటును దక్కించుకోవడంలో విఫలమైంది.

యాకుత్‌పురాలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు



మంత్రులకు మళ్లీ పట్టం!
- ఆరుసార్లు అసెంబ్లీలోకి తలసాని
- ఐదోసారి ఎమ్మెల్యేగా సబితారెడ్డి
- ఒకసారి ఎంపీ, రెండుసార్లు ఎమ్మెల్యేగా మల్లారెడ్డి

మహిళలు ఇద్దరే
- సిటీ నుంచి మహిళా ప్రతినిధిగా లాస్య నందిత
- మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి విజయం

ఈ అభ్యర్థులు మాకు నచ్చలే..
గ్రేటర్‌లో నోటాకు 44,464 ఓట్లు

పోటీలో ఉన్నా... ఫలితం సున్నా...
- దయనీయంగా జనసేన పరిస్థితి
- కూకట్‌పల్లిలో ఘోర పరాభవం
- టీడీపీ అభిమానుల ఓట్లూ పడని వైనం

..జాతీయ రాజకీయాలకు సై
గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
14లో▸


కార్యకర్తలతో సంతోషాన్ని పంచుకుంటున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్


కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద విజయోత్సవ ర్యాలీ


గచ్చిబౌలి స్టేడియం వద్ద నుంచి విజయోత్సవ ర్యాలీలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

మంత్రులకు మళ్లీ పట్టం!

- ఆరుసార్లు అసెంబ్లీలోకి తలసాని
- ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సబిత
- ఒకసారి ఎంపీ, రెండుసార్లు ఎమ్మెల్యేగా మల్లన్న
- మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, కృష్ణా యాదవ్‌లకు చుక్కెదురు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ నుంచి బరిలోకి దిగిన ముగ్గురు నగర మంత్రులు వరుసగా మరోసారి గెలిచారు. మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి, సనత్‌నగర్ నుంచి తలసాని, మేడ్చల్ నుంచి మల్లారెడ్డి మరోసారి 'అధ్యక్షా..' అనేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యేగా తలసాని ఆరుసార్లు, సబిత ఐదుసార్లు, మల్లారెడ్డి ఒకసారి ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇదే గ్రేటర్ నుంచి బరిలోకి దిగిన మాజీ మంత్రులు కృష్ణా యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డిలకు చుక్కెదురైంది.

తలసాని..ఆరుసార్లు గెలిచి, రెండుసార్లు ఓడి..

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుంచి నేటి వరకు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రెండుసార్లు ఓడిపోయారు. 1994లో సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి, తొలిసారిగా పర్యాటక, కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004లో టీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు చేతిలో ఓడిపోయిన తలసాని..2008 ఉప ఎన్నికల్లో గెలిచారు. 2009లో అదే అసెంబ్లీ నుంచి పోటీ చేసి, సినీ నటి జయసుధ చేతిలో 5 వేల ఓట్లతో ఓడిపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలలో టీడీపీ టికెట్‌తో సనత్‌నగర్ నుంచి బరిలోకి దిగిన తలసాని గెలుపొంది, టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో గెలిచి పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. తాజా ఫలితాల్లో తలసాని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డిపై 41,827 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ఐదోసారి అసెంబ్లీలోకి సబిత..

దేశంలోనే తొలి మహిళా హోం మంత్రిగా రికార్డు సృష్టించిన పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఐదోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. రెండుసార్లు చేవెళ్ల, మూడు సార్లు మహేశ్వరం నియోజకవర్గాల నుంచి గెలిచారు. మహేశ్వరం నుంచి బీఆర్ఎస్ టికెట్‌తో సబిత గెలవడం ఇదే తొలిసారి. భర్త ఇంద్రారెడ్డి మరణంతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన సబితా.. 2000, 2004లో వరుసగా రెండుసార్లు చేవెళ్ల నుంచి గెలిచారు. 2009లో మహేశ్వరం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో పోటీ చేయలేదు. తిరిగి 2018లో కాంగ్రెస్ నుంచి టికెట్ పొంది గెలుపొందిన సబిత.. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరి, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగా మళ్లీ 2023లో బీఆర్ఎస్ టికెట్‌తో పోటీ చేసి 26,187 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

మేడ్చల్ నుంచి మల్లన్న రెండోసారి..

చామకూర మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గం నుంచి వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018 ఎన్నికల్లో మల్లారెడ్డికి 1,67,324 ఓట్లు రాగా.. తాజాగా 1,86,017 ఓట్లొచ్చాయి. తాజా ఫలితాల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్‌పై మల్లన్న 33,419 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014లో టీడీపీలో చేరిన మల్లారెడ్డి మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు. తెలంగాణలో టీడీపీ నుంచి గెలుపొందిన ఏకైక పార్లమెంట్ సభ్యుడు మల్లారెడ్డే. 2016 జూన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన..2018లో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిపై గెలిచి కేసీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.

మాజీ 'ఉమ్మడి' మంత్రులకు చుక్కెదురు..

ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా పనిచేసిన కృష్ణ యాదవ్, మర్రి శశిధర్ రెడ్డిలకు తాజా ఫలితాల్లో చుక్కెదురైంది. ఇద్దరూ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల చేతిలో ఓడిపోయి, రెండోస్థానానికి పరిమితమయ్యారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌తో బరిలోకి దిగిన పశుసంవర్ధక శాఖ మాజీ మంత్రి కృష్ణ యాదవ్.. కాలేరు వెంకటేశ్ చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే మర్రి..ఈసారి బీజేపీ కండువాతో సనత్‌నగర్ నుంచి పోటీ చేసి, తలసాని చేతిలో కంగుతిన్నారు.


ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నేతల సంబరాలు


గోషామహల్ కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు..


హస్తినాపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గెలుపు ఉత్సవాల్లో ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

ఈ అభ్యర్థులు మాకు నచ్చలే..

గ్రేటర్‌లో నోటాకు వచ్చిన ఓట్లు 44,464

- అత్యధికంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో
- ఇక్కడ నోటాకు వచ్చిన ఓట్లు 15,418

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికలలో నోటా ఓట్లు కీలకమని మరోసారి రుజువైంది. బరిలోకి దిగిన అభ్యర్థులు నచ్చకపోతే నన్ ఆఫ్ ది ఎబౌ (నోటా) గుర్తును నొక్కే అవకాశం ఉండటంతో ఈసారి నోటాకు ఓట్లు బాగానే పడ్డాయి. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాలలో మూడు ప్రధాన పార్టీల తర్వాత అత్యధిక ఓట్లు వచ్చింది నోటాకే. అత్యధికంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 15,418 రాగా.. అత్యల్పంగా రంగారెడ్డి జిల్లాలో 12,824 వచ్చాయి. హైదరాబాద్‌లో నోటాకు 16,222 ఓట్లు పోలయ్యాయి.

అత్యధికం కుత్బుల్లాపూర్, అత్యల్పం నాంపల్లి..

అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో నోటాకు 4,079 ఓట్లు రాగా.. అత్యల్పంగా నాంపల్లిలో 544 ఓట్లొచ్చాయి. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్య గెలిచిన మెజారిటీ కంటే నోటా ఓట్లే ఎక్కువ ఉండటం కొసమెరుపు. ఇక్కడ యాదయ్య కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్‌పై 268 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. నోటాకు వచ్చిన ఓట్లు 1,423 కావడం గమనార్హం. యాకుత్‌పురలో 878 ఓట్ల మెజారిటీతో గెలిచిన ఎంఐఎం అభ్యర్థి జాఫర్ హుస్సేన్. ఇక్కడ నోటాకు వచ్చిన ఓట్లు 704.

నోటా ఓట్లు గతంలో కంటే తక్కువే..

అయితే 2018 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్లు నోటా ఓట్లు తక్కువే పోలయ్యాయి. గత ఎన్నికలలో మూడు జిల్లాలతో కూడిన గ్రేటర్‌లో నోటాకు 44,935 ఓట్లు రాగా.. తాజా ఫలితాల్లో 471 తగ్గి నోటాకు 44,464 ఓట్లొచ్చాయి. గతంలో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో నోటాకు 17,078 ఓట్లు రాగా.. ఈసారి 16,222కు తగ్గాయి. రంగారెడ్డిలో గతంలో 13,242 ఓట్లు పోలవగా.. ఇప్పుడు 12,824 వచ్చాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరిలో గతంలో 14,615 ఓట్లు రాగా.. ఈసారి 803 ఓట్లు ఎక్కువొచ్చాయి. తాజా ఫలితాల్లో నోటాకు 15,418 ఓట్లు వచ్చాయి.

జిల్లాల వారీగా గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో నోటా ఓట్లు ఇవే:

హైదరాబాద్ జిల్లా

నియోజకవర్గం	2018	2023
బహదూర్‌పుర	1,210	1,279
చాంద్రయాణగుట్ట	1,010	1,460
చార్మినార్	958	837
గోషామహల్	709	626
కార్వాన్	938	896
మలక్‌పేట	918	881
యాకుత్‌పుర	799	704
అంబర్‌పేట	1,462	1,317
జూబ్లీహిల్స్	1,547	1,374
ఖైరతాబాద్	1,371	1,194
ముషీరాబాద్	1,664	1,332
నాంపల్లి	793	544
సనత్‌నగర్	1,464	1,040
సికింద్రాబాద్	1,582	1,518
కంటోన్మెంట్	1,571	1,220
మొత్తం	17,078	16,222

రంగారెడ్డి జిల్లా

చేవెళ్ల	1,469	1,423
ఇబ్రహీంపట్నం	1,151	1,427
ఎల్బీనగర్	3,085	2,966
మహేశ్వరం	2,171	2,031
రాజేంద్రనగర్	1,729	1,832
శేరిలింగంపల్లి	3,637	3,145
మొత్తం	13,242	12,824

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

కూకట్‌పల్లి	2,134	2,458
మల్కాజ్‌గిరి	3,391	2,608
మేడ్చల్	3,402	3,737
కుత్బుల్లాపూర్	2,976	4,079
ఉప్పల్	2,712	2,536
మొత్తం	14,615	15,418

మహిళలు ఇద్దరే

- సిటీ నుంచి మహిళా ప్రతినిధిగా లాస్య నందిత
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి విజయం
- నాటి నుంచి నేటి వరకు కొద్ది మంది మహిళలే ఎమ్మెల్యేలు...


కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా కంటోన్మెంట్ అభ్యర్థి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు విజయం సాధించారు. బీఆర్ఎస్ నుంచి ఆమె గెలుపొందారు. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నుంచి వరుస విజయాలను నమోదు చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి కూడా ఈ ఎన్నికల్లో విజయ తీరాలను చేరుకున్నారు. మొత్తం మీద గ్రేటర్ నుంచి ఇద్దరే మహిళా ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఆకాశంలో సగమైనా.. అనాదిగా మహిళలకు లభిస్తున్న రాజకీయ అవకాశాలు అరకొరగానే ఉన్నాయి. గడిచిన 70 ఏళ్లలో అతి కొద్ది మంది మహిళలే హైదరాబాద్ నుంచి చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించారు. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంచుమించు పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు ఉన్నారు. అన్ని పార్టీల గెలుపోటములను ప్రభావితం చేయడంలో మహిళా ఓటర్లే కీలకం. కానీ ప్రజాప్రతినిధులుగా హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు మాత్రం తక్కువే.

- 1952 నుంచి ఇప్పటి వరకు కేవలం పదకొండు మంది ప్రాతినిధ్యం వహించినట్లు ఒక అంచనా.
- 1967, 1972లలో జరిగిన ఎన్నికల్లో మేడ్చల్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సుమిత్రాదేవి గెలిచారు.
- 1952, 1957లో జరిగిన ఎన్నికల్లో పత్తర్‌గట్టి నియోజకవర్గం నుంచి మసూమాబేగం గెలిచారు.
- నాటి ముఖ్యమంత్రి టి.అంజయ్య సతీమణి మణెమ్మ కాంగ్రెస్ అభ్యర్థిగా ముషీరాబాద్ నుంచి పలుమార్లు గెలుపొందారు. 2008లోనూ ఆమె నాయిని నర్సింహారెడ్డిని ఓడించారు.
- కాంగ్రెస్ మలక్‌పేట్ అభ్యర్థిగా బి.సరోజిని పుల్లారెడ్డి 1967, 1972 ఎన్నికల్లో విజయం సాధించారు. 1972లో గగన్‌మహల్ నియోజకవర్గం నుంచి టి.శాంతాబాయి ప్రాతినిధ్యం వహించారు.
- అలాగే టీడీపీ అభ్యర్థిగా కొండ్రు పుష్పలీల ఇబ్రహీంపట్నం నుంచి గెలుపొందారు.
- కాట్రగడ్డ ప్రసూన సనత్‌నగర్ నుంచి ప్రాతినిధ్యం వహించారు.
- సినీనటి జయసుధ 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి విజయం సాధించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆమె ఓడించారు.
- అలాగే మొదటిసారి చేవెళ్ల నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డి ఆ తరువాత మహేశ్వరం నుంచి వరుస విజయాలను నమోదు చేస్తున్నారు.
- ప్రస్తుతం లాస్య నందిని విజయం సాధించిన కంటోన్మెంట్ నుంచి 1969లో మంకమ్మ అనే మహిళా నేత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.




గాంధీ భవన్ వద్ద ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

పోటీలో ఉన్నా...ఫలితం సున్నా

దయనీయంగా జనసేన పరిస్థితి

- కూకట్‌పల్లిలో ఘోర అవమానం
- నమ్ముకున్న టీడీపీ అభిమానుల ఓట్లు సైతం పడని వైనం

సాక్షి, సిటీబ్యూరో: ఆకస్మికంగా నగర రాజకీయ తెరపై ప్రత్యక్షమైన జనసేన పార్టీ ఈ ఎన్నికల్లో కనీస ప్రభావం కూడా చూపలేకపోయింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజాపాతో ఆదరాబాదరా పొత్తు పెట్టుకుని...తొలుత నగరంలో 2 సీట్లు ఆశించి చివరకు కూకట్‌పల్లి సీటుతో సరిపెట్టుకుంది పవన్ పార్టీ. తమకు పెద్దగా బలం లేకపోయినప్పటికీ భాజాపా నుంచి ఇంపోర్ట్ చేసుకున్న, ఆర్థికంగా బలవంతుడైన అభ్యర్థిని గ్లాసు గుర్తుపై నిలబెట్టి రకరకాల సమీకరణాలతో గట్టెక్కాలనుకుంది. సెటిలర్స్ పెద్ద సంఖ్యలో ఉండడం, ఆంధ్రలోని ఓ రెండు బలమైన సామాజిక వర్గాల ఓట్లు లక్షల సంఖ్యలో ఉండడంతో..వీటన్నింటినీ బేరీజు వేసుకున్న జనసేన ఈ సీటుపై గెలుపు ఆశలు పెట్టుకుంది. ఈ ఒక్కసీటులోనైనా గెలిచి తొలిసారి తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టాలని కలలు గంది. ఆ అంచనాలు, ఆశలతోనే దాదాపుగా అరడజను సార్లు జనసేన అధ్యక్షుడు ఈ నియోజకవర్గాన్ని సందర్శించారు. కార్యకర్తలతో సమావేశాలు, సభలు నిర్వహించారు. అయినప్పటికీ ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

పవన్ పార్టీని పట్టించుకోని తెదేపా...

సామాజిక వర్గ సమీకరణాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీకి కూకట్‌పల్లి నియోజకవర్గంలో పట్టుంది అనే అభిప్రాయం ఉంది. తెలుగుదేశం పార్టీ కూకట్‌పల్లిలో చివరిసారి ఎన్నికల్లో పోటీచేసినప్పుడు కూడా ఆ పార్టీకి 70 వేల పైచిలుకు ఓట్ల దాకా వచ్చాయి. ఆంధ్రాలో తెలుగుదేశం పార్టీకి బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ..ఇక్కడ ఆ పార్టీ మద్దతుదారులెవరూ జనసేనను కనీస స్థాయిలో కూడా పట్టించుకోలేదని తేలిపోయింది. అంతేకాకుండా అటు తెదేపాను సమర్థించే సామాజికవర్గం గానీ ఇటు పవన్ అతిగా ఆశపడిన స్వంత సామాజిక వర్గం ఓటర్లను గానీ జనసేన ఆకర్షించలేకపోయింది. ఏదేమైనా ఆషామాషీ పొత్తులు, ఆకస్మిక పోటీల ద్వారా గెలిచేయవచ్చునని ఆశించే పార్టీలకు భంగపాటు తప్పదని కూకట్‌పల్లి ఓటర్లు తేల్చి చెప్పారు. సినీ గ్లామర్‌తో జనాల్ని రప్పించవచ్చు గానీ ఓట్లు వేయించలేమని పవన్ పార్టీ ధరావత్తు కోల్పోయిన వైనం స్పష్టం చేసింది.

అధిష్టానం ఆదేశిస్తే జాతీయ రాజకీయాలకు సై

ఎమ్మెల్యే రాజాసింగ్

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌పై 21,457 వేల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటిగా పోటీ చేసినా ప్రజలు తనను గెలిపించారన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎంతో నష్టపోయిందని, రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంతో మరింత నష్టాన్ని చవిచూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిష్టానం ఆదేశిస్తే దేశ రాజకీయాల్లోకి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేటీఆర్ మూడుసార్లు తన నియోజకవర్గంలో ప్రచారం చేసినా ప్రజలు తనను గెలిపించారన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖా, గోవింద్‌రాఠీ, జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, ప్రేమ్‌సింగ్ రాథోడ్‌లతో పాటు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.


విజయోత్సవంలో రాజాసింగ్

బల్దియా టు అసెంబ్లీ

- కొత్తగా నలుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా నుంచి అసెంబ్లీలోకి అడుగుపెట్టి అధ్యక్షా..అనే కోరిక నెరవేర్చుకుంటున్న జాబితాలోకి కొత్తగా నలుగురు చేరుతున్నారు. వీరిలో ఇద్దరు మాజీ మేయర్లు కూడా ఉండటం విశేషం. గతంలో మేయర్లుగా పనిచేసిన జుల్ఫికర్ అలీ ప్రస్తుతం చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎంఐఎం అభ్యర్థిగా గెలుపొందారు. అదే పార్టీకి చెందిన మాజీ మేయర్, సిట్టింగ్ కార్పొరేటర్ అయిన మహ్మద్ మాజిద్ హుస్సేన్ నాంపల్లి నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఎంఐఎం నుంచే మరో సిట్టింగ్ కార్పొరేటర్ మహ్మద్ ముబిన్ బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ నుంచి మాజీ కార్పొరేటర్ లాస్య నందిత కంటోన్మెంట్ నుంచి గెలుపొందారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు గెలుపొందిన సాయన్న మరణంతో ఖాళీ అయిన ఆ స్థానానికి తిరిగి ఉప ఎన్నిక జరగలేదు. తాజా ఎన్నికల్లో సాయన్న కుమార్తె లాస్య నందితకు టిక్కెట్టు దక్కడంతో ఆమె విజయం సాధించారు. ఆమె జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా పనిచేశారు. గతంలోనూ పలువురు జీహెచ్ఎంసీ నుంచి అసెంబ్లీకి వెళ్లడం తెలిసిందే...

నెరవేరని ఆశ

ప్రస్తుతం సిట్టింగ్ కార్పొరేటర్లుగా ఉన్న వారిలో కాంగ్రెస్ నుంచి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పోటీ చేసిన జగదీశ్వర్‌గౌడ్, ఖైరతాబాద్ నుంచి బరిలో దిగిన విజయారెడ్డి, రాజేంద్రనగర్‌లో బీజేపీ తరఫున పోటీ చేసిన తోకల శ్రీనివాసరెడ్డి, ఎంఐఎం నుంచి జూబ్లీహిల్స్‌లో పోటీ చేసిన రాషెద్ ఫరాజుద్దీన్, రాజేంద్రనగర్‌లో బరిలో దిగిన స్వామి ఓటమి పాలయ్యారు. సిట్టింగ్ కార్పొరేటర్లలో ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడంతో ఆయా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.


ఓయూలోని కౌంటింగ్ కేంద్రం నుంచి ర్యాలీగా వెళ్తున్న పద్మారావు గౌడ్


గెలుపు సంబరాల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి


గాంధీ భవన్ వద్ద బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


చాంద్రాయణగుట్ట కౌంటింగ్ కేంద్రంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

ఖైరతాబాద్‌లో

బీఆర్‌ఎస్ జయకేతనం

ఆరోసారి విజయం సాధించిన దానం నాగేందర్ • ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత కనబరచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి



దానంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఘన విజయం సాధించారు. ఆదివారం ఉదయం ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు మూడో రౌండ్ మినహా మిగతా అన్ని రౌండ్లలోనూ దానం నాగేందర్ తన విజయపరంపరను కొనసాగించారు. ప్రతిరౌండ్‌లోనూ ఆధిక్యత కనబరిచారు.

◆ ఈ ఎన్నికల్లో మొత్తం 2,96,014 ఓట్లకుగాను 1,54,244 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్‌కు 67,165 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డికి 45,061 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి 37,941 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ నుంచి పోటీ చేసిన మిద్దె కృష్ణకు 530 ఓట్లు వచ్చాయి. నాగేందర్ 22,104 మెజార్టీతో గెలుపొందారు.

◆ ఉదయం 8 గంటకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డికి మెజార్టీ వచ్చింది. అనంతరం ఈవీఎంల లెక్కింపు ప్రారంభమైంది.

◆ హిమాయత్‌నగర్ డివిజన్ నుంచి మొదటి రౌండ్ ప్రారంభం కాగా వరుసగా రెండు రౌండ్లలోనూ దానం నాగేందర్ స్వల్ప ఆధిక్యంలో కొనసాగారు. ఆ తర్వాత ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్ల ఓట్ల లెక్కింపు జరగగా అన్ని డివిజన్లలోనూ అయన మెజార్టీ సాధిస్తూ విజయం దిశగా దూసుకెళ్లారు.



ఖైరతాబాద్ ఆర్‌ఓ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న దానం నాగేందర్

ఇదిలా ఉండగా..

◆ 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు 63,068 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్‌కు 33,549, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 34,666 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలతో పోలిస్తే ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో నాగేందర్‌కు 4097 ఓట్లు ఈ ఎన్నికల్లో ఎక్కువగా వచ్చాయి. చింతల రామచంద్రారెడ్డి సైతం సుమారు 3 వేల ఓట్లను ఈ ఎన్నికల్లో అదనంగా సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సుమారు 10 వేల ఓట్లు గత ఎన్నికల కంటే ఎక్కువగా సాధించారు.



స్వీట్లు పంచుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

సంబరాల్లో దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన దానం నాగేందర్ ఆదివారం సాయంత్రం గెలిచినట్లుగా ఆర్‌వో నుంచి ధ్రువపత్రం అందుకున్న అనంతరం తన ఆనందాన్ని కార్యకర్తలతో పంచుకున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు వెంకటేష్, సంగీతాయాదవ్, మహాలక్ష్మి రామన్‌గౌడ్, మన్నె కవితారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు రాములు చౌహాన్, మామిడి నర్సింగ్‌రావు తదితరులతో కలిసి ఆయన ధ్రువపత్రాన్ని అందుకున్నారు. అక్కడే ఉన్న మేయర్ విజయలక్ష్మి ఆలింగనం చేసుకొని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆయనకు కార్యకర్తలు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం పూర్తిగా బీఆర్‌ఎస్ శ్రేణులదేనని ఆయన స్పష్టం చేశారు.

ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో...

ఖైరతాబాద్: ఎమ్మెల్యేగా దానం నాగేందర్ విజయం సాధించడంతో ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు చందు, మహేష్‌యాదవ్, గజ్జల నంద్ పాల్గొన్నారు.

◆ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘన విజయం సాధించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని నృత్యాలు చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. హిమాయత్‌నగర్ డివిజన్‌తో పాటు సోమాజిగూడ, ఖైరతాబాద్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్ల పరిధిలో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ రంగులు చల్లుకుంటూ విజయోత్సవాలను జరుపుకొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని దానం ఇంటి వద్దకు కార్యకర్తలు భారీగా చేరుకోగా ఆయన సతీమణి దానం అనిత వారందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

హిమాయత్‌నగర్ డివిజన్‌లో...

హిమాయత్‌నగర్: దానం నాగేందర్ విజయంతో హిమాయత్‌నగర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ సర్ఫరాజ్ పలువురు పార్టీ శ్రేణులతో కలిసి బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో...



కౌంటింగ్ కేంద్రం వద్ద వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్



పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

సాయంత్రం వరకూ.. కౌంటింగ్



బంజారాహిల్స్: కట్టుదిట్టమైన భద్రత మధ్య ఖైరతాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. లెక్కింపు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగడంతో రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రేతో పాటు కౌంటింగ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 6 గంటలకే ఆర్‌వోతో పాటు లెక్కింపు సిబ్బంది కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉండి పరిస్థితి సమీక్షించారు.

ప్రతిపక్షంలో ఉన్నా నిర్మాణాత్మకంగా పనిచేస్తాం

ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ని గెలిపించాలని గట్టి సంకల్పంతో పని చేశామని, కానీ ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసినా ఎక్కడో మిస్ ఫైర్ అయిందని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన దానం నాగేందర్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా కూడా తాము కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో నిర్మాణాత్మకంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ వద్ద రిటర్నింగ్ అధికారి నుండి గెలిచిన సర్టిఫికెట్ తీసుకున్న అనంతరం దానం మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు పూర్తి చేయడంలో ఎక్కడ విఫలమైనా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేస్తామన్నారు. తనను గెలిపించిన ఖైరతాబాద్ ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఆమె పోటీలో ఉండడంతో తాను ఇంకా ఎక్కువగా కష్టపడాల్సి వచ్చిందని దానం వ్యాఖ్యానించారు. విజయారెడ్డి తన బిడ్డ లాంటిదని, కానీ ఎన్నికల రణరంగంలో పోటీ చేసినపుడు బంధుత్వాలు చూడలేమన్నారు.

నిత్యం ప్రజాసేవలోనే ఉంటా: విజయారెడ్డి



పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు, తెరవెనక పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. తాను ఓడిపోయినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వల్ల నిత్యం ప్రజల్లో ఉండి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. సమయం తక్కువగా ఉండడం, బీఆర్‌ఎస్ అభ్యర్థిని నెల ముందే ప్రకటించడం హిమాయత్‌నగర్ డివిజన్ ఎక్కువగా సమయం కేటాయించకపోవడం వల్లే వెనుకంజలో ఉన్నట్లు ఆమె తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఓటువేసిన ప్రతి ఒక్క ఓటరుకూ ధన్యవాదాలు తెలిపారు. ఎవరికీ ఏ సమయంలో ఎలాంటి ఆపద వచ్చినా ఒక్క ఫోన్ చేస్తే మీ ముందు ఉంటానని, రాబోయే రోజుల్లో ఖైరతాబాద్‌ను కాంగ్రెస్ కంచుకోటగా మారుస్తానని తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు



ప్రేమ్‌నగర్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజారిటీతో విజయం సాధించడంతో ప్రేమ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బ్యాండ్.. మేళాలతో నృత్యం చేస్తూ, టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఖైరతాబాద్ ప్రజలు విజ్ఞతతో ఓటువేశారని, అభివృద్ధికే మరోమారు పట్టం కట్టారని ఈ సందర్భంగా పార్టీ నాయకులు కొనియాడారు.

కాంగ్రెస్ విజయం అభినందనీయం

మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ చెన్నయ్య



పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఘనవిజయం సాధించడంపట్ల మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ జి.చెన్నయ్య హర్షం వ్యక్తం చేశారు. మాలల పంతం బీజేపీ అంతం అనే నినాదంతో తాము ఈ ఎన్నికల్లో పనిచేసి కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించామని, అభ్యర్థుల గెలుపునకు మాల, మాల ఉపకులాల వారు శ్రమించి పనిచేశారని తెలిపారు. ఆదివారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ వైఖరివల్ల కాంగ్రెస్‌కు మద్దతు పలికామన్నారు. బీజేపీ నిలబెట్టిన 20 ఎస్సీ స్థానాల్లో అభ్యర్థులు ఓడిపోయారని, మాదిగ అభ్యర్థులు కూడా ఓడిపోవడంతో మాదిగల ఓట్లు పార్టీలుగా చీలిపోయాయని అర్థం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం బీజేపీకి కలిసిరాలేదని, కర్నాటకలో కూడా ఎస్సీ రిజర్వేషన్ అని ఓడిపోయిందని, తెలంగాణలో కూడా అదే జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా బీజేపీ తనవైఖరిపై పునరాలోచించాలని, లేకపోతే దేశవ్యాప్తంగా తగిన మూల్యం చెల్లించక తప్పదని చెన్నయ్య హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై వెనక్కి తగ్గకపోతే మాలల పంతం బీజేపీ అంతం అనే నినాదం దేశవ్యాప్తంగా తీసుకెళ్లి బీజేపీని బొందపెడతామన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొంతవరకు నిజమైన డిమాండ్ అని తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత కాలం చెల్లిన డిమాండ్ అయిపోయిందన్నారు. దళితులందరూ కలసికట్టుగా రాజ్యాధికారం కోసం పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ మన్నె శ్రీధర్ రావు, మోజెస్, గోకుల కళ్యాణ్, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్ విజయం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందింది. హోరాహోరీగా సాగిన పోరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్‌పై 16337 ఓట్ల మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. తొలి రౌండ్‌లో స్వల్ప ఆధిక్యం కనబరిచిన అజహరుద్దీన్ తర్వాత రౌండ్లలో వెనుకబడ్డారు. మధ్యలో ఈవీఎంలలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో అజహరుద్దీన్ పలు అనుమానాలు వ్యక్తం చేసి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ కౌంటింగ్ కేంద్రానికి కలెక్టర్, డీసీపీ తదితర అధికారులు వచ్చి కౌంటింగ్‌ను తిరిగి ప్రారంభించారు. అభ్యంతరం తెలిపిన ఈవీఎంల వీవీ ప్యాట్‌లను లెక్కించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు 80,549 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్‌కు 64,212 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 25,866 ఓట్లు లభించగా, ఎంఐఎం అభ్యర్థి రషీద్ ఫరాజుద్దీన్‌కు 7848 ఓట్లు లభించాయి. మొత్తంమీద మాగంటి గోపీనాథ్‌కు 16337 ఓట్ల మెజారిటీ లభించింది. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని మాగంటి గోపీనాథ్‌కు రిటర్నింగ్ ఆఫీసర్ అందజేశారు.



ధ్రువపత్రాన్ని అందుకుంటున్న జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్

పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్ యాదవ్

హిమాయత్‌నగర్: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే అసెంబ్లీ, పార్లమెంట్‌లలో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరినట్లు రాజేశ్వర్ యాదవ్ తెలిపారు. నామినేటెడ్ పదవులు, బీజేపీ కమిటీలలో బీసీలకు 50 శాతం కేటాయించాలని, జాతీయ బీసీ కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్ల నిధులు విడుదల చేసి నిరుద్యోగ యువతకు చేయూత ఇవ్వాలని కోరారు. బీసీ కుల గణన చేయాలని, ప్రైవేట్ సంస్థలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంఘం ప్రధాన కార్యదర్శి పూసల సత్యనారాయణ, రాజు, భాస్కర్ యాదవ్, సాయి ప్రదీప్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మాగంటి మార్క్ విజయం!



శ్రీనగర్‌కాలనీ: గ్రేటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ తన బలాన్ని చాటుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎలక్షన్ స్ట్రాటజీ మరోసారి వర్కవుట్ అయింది. ముచ్చటగా మూడోసారి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్ పోటీ చేసినా, సిట్టింగ్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, యువనేత నవీన్ యాదవ్ కాంగ్రెస్‌తో జతకట్టినా మాగంటి గోపీనాథ్ విజయాన్ని ఆపలేకపోయారు. ఎలక్షన్ క్యాంపెయిన్‌తో పాటు ఓటర్ పల్స్‌ను పట్టుకోవడంలో మాగంటి తన మార్క్‌ను చూపించారు. అన్నివర్గాలను తనవైపు తిప్పుకొనేలా చేశారు. బీఆర్‌ఎస్ పథకాలతో పాటు క్యాడర్‌ని పోగొట్టుకోకుండా ఇతర పార్టీల నాయకులను పార్టీ చేర్చుకొని పక్కా ప్లాన్‌తో విజయాన్ని నమోదు చేశారు. గ్రేటర్ అంతటా కారు జోరు తగ్గలేదు. సెటిలర్లు, మైనార్టీలు సైతం బీఆర్‌ఎస్ ఉంటేనే నగరం బాగుంటుందని భావించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెండోసారి బీఆర్‌ఎస్ విజయాన్ని నమోదు చేసింది.

కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల ఓవరాక్షన్

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగింది. అయితే ఇక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల ఓవరాక్షన్ వల్ల తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఒక వైపు పాస్‌లు ఉన్న వారందరినీ అనుమతించాలని ఎన్నికల అధికారులు చెబుతున్నప్పటికీ పోలీసులు మాత్రం అనుమతించలేదు. మరో వైపు ఈ విషయాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీ హరిప్రసాద్‌లు మీడియా వారిని అనుమతించాలని చెప్పినప్పటికీ డ్యూటీలో ఉన్న బోరబండ డీఐ భూపాల్ గౌడ్ వినిపించుకోకుండా మీడియావారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోనికి వెళ్లేందుకు అనుమతించిన కానిస్టేబుల్‌ను మందలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌంటింగ్‌లో కేంద్రంలో అవకతవకలు జరుగుతున్నట్లు అనుమానాలు వస్తున్నాయని మీడియాను అనుమతించాలని చెప్పాని కూడా పోలీసులు పట్టించుకోలేదు.

మంచిమాట



మనిషిని జంతుప్రపంచం నుండి వేరు చేసేది భాష. దానికి కారణమైన ఆలోచన, ఆలోచనకి మూలస్థానమైన మెదడు. ఇంతటి విలువైనదానిని సద్వినియోగం చేసుకోటం తెలివిగల వారి లక్షణం. కాని, దానిని దుర్వినియోగం చేసే వారిని ఏమనాలి? అన్నింటి వలెనే మాటని కూడా పొదుపుగా వాడుకోవాలి.

మితభాషణం

''అతి సర్వత్ర వర్జయేత్'' అని నానుడి. ఇది మాటలకి కూడా వర్తిస్తుంది. అతిగా మాట్లాడటాన్ని వాగటం అంటారు. జల్పమన్నా అదే. అవి పేరుకి మాటలే కాని, వాస్తవానికి శబ్దాల సముదాయాలు మాత్రమే.

అతిగా మాట్లాడుతూ ఉంటే అనవసర విషయాలు ప్రసక్త మౌతూ ఉంటాయి. ఏదో ఒకటి మాట్లాడాలనే తపన వల్ల అసత్యాలు దొర్లవచ్చు. కొన్నిసార్లు అప్రయత్నంగా నోరు జారి బయటపెట్ట కూడని విషయాలు బహిర్గతం అవుతాయి. ఆ సంగతిని గుర్తించక పోవచ్చు. కాని, ఒకసారి నోరు జారితే వెనక్కి తీసుకోవటం కుదరదు. దాని వల్ల ఇబ్బందులు, కొండొకచో ప్రమాదాలు కూడా కల్గవచ్చు. శత్రుత్వాలు పెరిగితే మనశ్శాంతి కరువు అవుతుంది. కొంచెం నోరు సంబాళించుకుంటే ఎంత బాగుండేది? అని తరవాత ఎంతగా పశ్చాత్తాప పడినా ఏం లాభం? గతం గతః అతిగా మాట్లాడటం కూడా ఒక వ్యసనం. వ్యసనం అంటే వదిలి పెట్టలేని అలవాటు. చేస్తున్నది తప్పని తెలిసినా, చేయకుండా ఉండలేని బలహీనత వ్యసనం. వాగటం అనే బలహీనత ఉన్న వారు అవతలి వాళ్ళు వినుక్కుంటున్నారు, వినటం లేదు అని గుర్తించినా మాట్లాడటం ఆపలేరు. ఈ లక్షణం చిన్నపిల్లలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పెద్దవాళ్లు మాట్లాడ వద్దన్నా, చివరకు చేతితో నోరు మూసినా, వేళ్ళసందులలో నుండి తాము చెప్పదలచిన దానిని చెప్పేస్తారు. పిల్లలని వాగుడుకాయ అని తేలికగా తేల్చేస్తాం. పెద్దలని ఊరుకోమని అనలేం. పెద్దవారిని ఎదురుగా అనకపోయినా వాచాలుడు, వ్యర్థప్రసంగి, అధికప్రసంగి అంటూ తేలికగా మాట్లాడుతారు. నోరు అదుపులో ఉంటే ఈ చెడ్డ పేరు రాదు.

కుటుంబ సభ్యుల మధ్య, బంధువులు స్నేహితుల మధ్య, సహోద్యోగుల మధ్య, దేశాల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చి సత్సంబంధాల బదులు తగాదాలు, యుద్ధాలు రావటానికి కారణం చాలా వరకు అధిక ప్రసంగాలే. ''మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులు'' అని సరసంగా మొదలయిన సంభాషణ చినికి చినికి గాలివానగా మారే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి రాకుండా ఉండటానికి ఏకైక మార్గం వీలైనంత తక్కువగా మాట్లాడటం. అందుకే ''ఊరుకున్నంత ఉత్తమం లేదు'' అనే సామెత వచ్చింది.

> కాళిదాసు పేర్కొన్న రఘు వంశ రాజుల లక్షణాలలో మితభాషణం ఒకటి. అది సత్ప్రవర్తనలో ప్రధానాంశం. మనకి నోరు ఉన్నది మాట్లాడటానికే కదా! ఎందుకు పరిమితం చేసుకోవాలి? అన్న ప్రశ్నకి మహాకవి కాళిదాసే సమాధానం కూడా చెప్పాడు - "సత్యాయ మితభాషిణాం" అని. సత్యాన్ని పలకటానికి మాత్రమే పెదవి విప్పేవారట.

అవతలివారి రహస్యాలను కూపీ తియ్యటానికి చేసే మొదటి పని, ఉత్తమమైన పద్ధతి వారిని మాటల్లోకి దించటం. మాటల ధోరణిలో ఎవరితో ఏం మాట్లాడుతున్నారో మర్చిపోయి వాగి, వాగి తమ వ్యక్తిగత విషయాలను, గోప్యంగా ఉంచవలసిన కుటుంబ వ్యవహారాలను, చివరకు దేశరక్షణకు సంబంధించిన రహస్యాలను కూడా బయట పెట్టిన సందర్భాలు చరిత్రలో కనపడతాయి. ఆలోచనతో పాటు విచక్షణని కూడా ఉపయోగిస్తే దేనిని వృథా చేయటం ఉండదు. మాటని వృథా చేయటం అంటే ప్రకృతి మనకి ఇచ్చిన దానిని సరిగా వాడుకోక ప్రకృతి పట్ల అపచారం చేయటం. ఎందుకంటే మాట్లాడటానికి ఎంతో శక్తిని వెచ్చించ వలసి ఉంటుంది. వినే వారి సమయం వృథా అవుతుంది. అందుకే అతి వాగుడు ఆయుః క్షీణం అంటారు. నోరు చేసుకుని, నోరు పెట్టుకుని బతికేవాళ్ళు తగు జాగ్రత్తలని తెసుకోకపోతే ఆయువు తరిగే ప్రమాదం ఉంది సుమా! మునుల దీర్ఘాయువు రహస్యం కూడా ఇదే.

– డా. ఎన్ అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం

నమస్కారం అంటే...



గురువు గారికి తిరిగి ప్రత్యుపకారం చేస్తాను... అనడం సాధ్యమయ్యే విషయం కాదు. గురువు విషయంలో చేయగలిగినది ఏమిటి.. అంటే ...'జలజాతేక్షణ? దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి; నన్/ని లువం బెట్టితి; నీ కృపన్ బ్రతికితిన్ నీ యంత పుణ్యాత్మకుల్/గలరే; దీనికి నీకు? బ్రత్యుపకృతిం గావింప నే నేర; నం/జలిం గావించెద; భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!' అంటుంది రుక్మిణీ దేవి భాగవతంలో. అంతటి ఉపకారం చేసిన నీకు ప్రత్యుపకారం నేనేం చేయగలను.. అంజలి ఘటించడం తప్ప... అంటుంది. అంటే రెండు చేతులు కలిపి జోడించి శిరస్సు తాటించి నమస్కరించడం.

ఈ ఐదు వేళ్ళతో కూడుకున్న చెయ్యి –కర్మేంద్రియ సంఘాతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు పదింటిని, బుద్ధిస్థానమయిన 11వదయిన శిరస్సును కలిపి మీ పాదాల దగ్గర న్యాసం చేస్తున్నాను... అని చెప్పడానికి నమస్కారం చేస్తారు. ఈ తలలో వచ్చిన ఎన్నో ఆలోచనలను, ఈ చేతులతో ఎన్నో చేయకూడని పనులను చేసి మనుష్య జన్మ పాడుచేసుకున్నా. మీ వాక్కులు అగ్నిహోత్రం. నాలో ఉన్న అజ్ఞానాన్ని దహించి నేను ప్రయాణించాల్సిన మార్గాన్ని చూపించి నన్ను రక్షించండి... అని చెప్పడానికి అంజలి ఘటిస్తారు. అంతటి గొప్పరూపం గురువు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సనాతన ధర్మంలో భగవంతుడే గురువుగా కూడా ఉంటాడు. గురువు ఒకడు, భగవంతుడు ఒకడు కాదు. నిజానికి భగవంతుడే గురువు. శైవసంప్రదాయంలో దక్షిణామూర్తి చాలా చాలా గొప్ప గురువు. ఆయన నోటితో మాట్లాడకుండా చిన్ముద్రపట్టి కూర్చున్నాడు. ఆయన గురువు. అలాగే వైష్ణవ సంప్రదాయంలో శ్రీకృష్ణపరమాత్మ జగద్గురువు. 'కృష్ణం వందే జగద్గురుమ్!'. అమ్మవారు గురుమండల రూపిణి. సమస్త గురుమండల రూపిణి జగన్మాతయే. భగవంతుడు ఏ అవతారంలో మనముందు కొచ్చినా గురువుపట్ల అమిత గౌరవంతో ప్రవర్తిస్తాడు.

16 గుణాలు పరిపూర్ణంగా కలిగిన నరుడెవరు? – అంటే రామచంద్రమూర్తిని చూపించాడు నారద మహర్షి సంక్షేప రామాయణంలో. అంతటి గొప్ప రాముడు కూడా గురువుకు నమస్కరించి తలవంచుకుని నిలబడ్డాడు. ఏదో యాంత్రికమైన నమస్కారం కాదు. నమస్కారం చేసేటప్పుడు ఎప్పుడు ఎక్కడ ఎలా నమస్కారం చేయాలో తెలుసుకుని చేయాలి. సాష్టాంగ నమస్కారం చేయాలన్నా, అభివాదం చేయాలన్నా ఒక పద్ధతి ఉండాలి. రెండు చేతులు కలిపి తలతాకించి నమస్కారం చేయడం కూడా నమస్కారమే. అలాకాక, ప్రణిపాతం.. కర్ర ఎలా నేలమీద పడిపోతుందో అలా పడిపోవడం. అంటే ఎంత కింద పడిపోవాలో అంత పడిపోయాను. ఇంతకన్నా కిందపడే అవకాశం లేదు. ఇప్పుడు నన్ను పైకెత్తడం మీ చేతుల్లో ఉంది... అన్న భావనతో చేస్తే ప్రణిపాతం. అంటే అహంకారం వదిలి పెద్దలముందు పడిపోవడం. రామచంద్రమూర్తి అలా గురువుగారి ముందు నిలబడి నమస్కరించి నేను రాకుమారుడిని కాదు, కింకరుడిని.. సేవకుడిని, మీరేది ఆజ్ఞాపిస్తే అలా చేయడానికి సంసిద్ధంగా ఉన్నా.. ఆజ్ఞాపించండి. అన్నాడు.. గురువుల, పెద్దల విషయంలో అలా మసలుకోవాలనేది సనాతన ధర్మం మనకు ఇచ్చిన సందేశం.

బౌద్ధవాణి

జీర్ణించుకోలేకపోతే.. జగడమే!

మనస్సు పొందే అనుభూతుల్ని 'వేదన' అంటుంది బౌద్ధం. మనిషి అనుభూతుల గురించి ఒకసారి బౌద్ధసంఘంలో చర్చ జరిగింది.

బుద్ధుడు శ్రావస్థిలోని అనాథ పిండికుడు నిర్మించిన ఆరామంలో ఉన్నాడు. అక్కడున్న అనేకమంది భిక్షువుల్లో ఉదాయి అనే భిక్షువు ఒకడు. ఒకరోజున ఉదాయి ఆరామం తోట చివర చెట్టునీడన కూర్చొని ఉన్నాడు. ఆ సమయానికి శిల్పకారుడైన పంచకంగ స్థపతి అరామంలోకి వెళ్తూ ఉదాయిని చూశాడు. వచ్చి నమస్కరించాడు. ఒక పక్కన కూర్చొన్నాడు. వారిద్దరూ కొన్ని విషయాల మీద మాట్లాడుకుంటున్నారు. వారి సంభాషణ వేదనల వైపు మళ్ళింది. ''స్థపతీ! పంచకంగా! భగవాన్ బుద్ధుడు మూడు రకాల వేదనల గురించి చెప్పాడు. ఒకటి; సుఖవేదన రెండు; దుఃఖ వేదన మూడు; సుఖమూ, దుఃఖమూ రెండూ కాని 'అసుఖ, అదుఃఖ వేదనలు.'' అన్నాడు.

అంటే... మనుషులకి సుఖానుభూతి గానీ, దుఃఖానుభూతి గానీ, ఈ రెండూ లేని తటస్థ (ఉపేక్షానుభూతి) అనుభూతి గానీ.. ఉంటాయి అని. దానికి పంచకంగ స్థపతి– ''భంతే! ఉదాయీ! మీరు చెప్తున్నది తప్పు. భగవానుడు రెండు రకాల అనుభూతులను గురించే చెప్పాడు. అవి సుఖానుభూతి, దుఃఖానుభూతి. ఈ రెండు అనుభూతుల గురించే చెప్పారు.'' అన్నాడు.



''వారిద్దరూ నేను విన్నదే సరైనది అంటే... నేను విన్నదే సరైనది'' అంటూ చాలాసేపు వాదించుకున్నారు. విషయం తేలక, ఏకాభిప్రాయానికి రాలేక చర్చ ముగించారు. పంచకంగ స్థపతి ఉదాయి భిక్షుకునికి నమస్కరించి వెళ్ళిపోయాడు. ఈ విషయం ఆనందునికి తెలిసింది. ఆనందుడు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. వారిద్దరికీ జరిగిన వాదం గురించి చెప్పి, వివరణ కోరాడు. ''ఆనందా! నేను పంచకంగుడు చెప్పినట్లు రెండు వేదనల విధానాన్నీ చెప్పాను. ఉదాయి భిక్షు చెప్పినట్లు మూడు రకాల వేదనల గురించి చెప్పాను. వారిద్దరూ ఎవరి పక్షంలో వారు సరిగానే చెప్పారు. కానీ, ఎదుటి వారిది తప్పుగా భావించారు ఆనందా! నిజానికి ఆ వేదనల్ని ఇంకా ఇంకా విశ్లేషించి నూట ఎనిమిది విధానాల్నీ చెప్పాను.'' ''అయినా వారిద్దరూ తనకు తెలిసిందే సరైనదని, ఇతరులకు తెలిసింది సరైనది కాదనే ఆలోచనల్లో ఉన్నారు భగవాన్!'' అన్నాడు.

''ఔను! ఆనందా! నేను బోధించిన ధర్మాన్ని చక్కగా గ్రహించిన వారు కూడా, ఇతరులు చక్కగా, సరిగ్గా చెప్పిన దాన్ని కూడా అంగీకరించలేక పోతున్నారు. ఆమోదించలేకపోతున్నారు. జగడాలకు దిగుతున్నారు. కలహాలు పడుతున్నారు. వివాదాలు పెంచుకుంటూ ఒకరినొకరు మాటల ఈటెలతో పొడుచుకుంటున్నారు. అంటే వారు నేను చెప్పిన దాన్ని వింటున్నారే తప్ప ఇముడ్చుకోలేకపోతున్నారు. జీర్ణించుకోలేక జగడాలకు దిగుతున్నారు. జీర్ణించుకున్న వారు పాలూ, నీరులా కలిసిపోయి, ప్రేమతో కలసిమెలసి ఉంటారు'' అని చెప్పాడు. అహం వీడని వారు ఎంత తెలిసినా, ఎంత జ్ఞానులైనా వంటబట్టించుకో లేరని, వాదాలతో తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శిస్తూ బతుకుతారని ఆనందునికి అర్థమైంది.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



● ప్రభాస్

యాక్షన్ ట్రైలర్ రెడీ

ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం నుంచి మరో ట్రైలర్ రిలీజ్ కానుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'సలార్'. ఈ సినిమాలోని తొలిపార్టు 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ నెల 1న 'సలార్:సీజ్‌ఫైర్' చిత్రం తొలి ట్రైలర్ విడుదలైంది. ఇద్దరు మిత్రుల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఈ ట్రైలర్ స్పష్టం చేస్తోంది. అయితే 'సలార్:సీజ్‌ఫైర్' నుంచి రెండో ట్రైలర్ కూడా రానుందని టాక్. సినిమా రిలీజ్‌కు ఐదారు రోజుల ముందు రాబోయే ఈ రిలీజ్ ట్రైలర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా, ప్రభాస్ పాత్రను హైలెట్ చేసేలా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా, పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను విజయ్ కిరగందూర్ నిర్మించారు.



● శౌర్యువ్, హేషమ్, నాని, మృణాల్ ఠాకూర్, ప్రియదర్శి

వారి ఉత్సాహంతో కడుపు నిండిపోయింది - నాని

''హాయ్ నాన్న' మ్యూజికల్ నైట్‌లో ఇంత హాయిగా గడపటం చాలా ఆనందాన్నిచ్చింది. అభిమానులు ఇచ్చిన ఉత్సాహం చూస్తుంటే కడుపు నిండిపోయింది. నా ప్రతి సినిమాకి ఇలాంటి వేడుక ఒకటి ఉండేలా చూస్తాను. 'హాయ్ నాన్న' కోసం ప్రాణం పెట్టి సొంత సినిమాలా పని చేసిన యూనిట్‌కి ధన్యవాదాలు'' అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, శ్రుతీహాసన్, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలకానుంది. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'హాయ్ నాన్న మ్యూజికల్ నైట్' వేడుకలో నాని మాట్లాడుతూ–''ఈ చిత్రానికి హేషమ్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. శౌర్యువ్‌కి చాలా ప్రత్యేకమైన సినిమాగా ఇది నిలిచిపోతుంది. 'హాయ్ నాన్న' లాంటి అందమైన కథలు పెద్ద బ్లాక్ బస్టర్స్ కావాలి'' అన్నారు. ''సీతారామం' తర్వాత నేను చేసిన చిత్రాల్లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'హాయ్ నాన్న'' అన్నారు మృణాల్ ఠాకూర్. ''మా సినిమాకి సెన్సార్ బోర్డ్ క్లీన్ యూ సర్టిఫికేట్ ఇచ్చింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు శౌర్యువ్. ఈ వేడుకలో హేషమ్ అబ్దుల్ వాహబ్, నటులు ప్రియదర్శి, విరాజ్ అశ్విన్ పాల్గొన్నారు.

బర్త్ డే కానుక?



● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోందని, రజనీకాంత్– ఫాహద్ కాంబినేషన్‌లో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని కోలీవుడ్ టాక్. అయితే ఈ సినిమా టీజర్ విడుదలకు వేళ అయిందట. ఈ నెల 12న రజనీకాంత్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్, టీజర్‌ను విడుదల చేసే ఆలోచనలో చిత్రయూనిట్ ఉన్నట్లు కోలీవుడ్ సమాచారం. ఈ సినిమాలో రజనీకాంత్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారని, ఫేక్ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందనే ప్రచారం జరుగుతోంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది. అలాగే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కనున్న సినిమా అప్‌డేట్ కూడా ఈ నెల 12న రావొచ్చని టాక్.

వెకేషన్ టైమ్



● వరుణ్ తేజ్, లావణ్య

ట్రావెల్ ఆన్.. అంటూ వెకేషన్‌కు బయలుదేరారు హీరో వరుణ్ తేజ్ అండ్ హీరోయిన్ లావణ్యాత్రిపాఠి. ఈ నూతన దంపతులు యూరప్‌కు పయనమయ్యారని, వీరి హాలిడే రెండువారాలకుపైనే ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ ఏడాది నవంబరు 1న ఇటలీలో వరుణ్, లావణ్యల వివాహం జరిగిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత 'మట్కా' సినిమా చిత్రీకరణలో జాయిన్ అవుతారు వరుణ్ తేజ్. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాకి 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తారు. ఇక వరుణ్ తేజ్ నటించిన దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదలకు సిద్ధంగా ఉంది.



చాలా భావోద్వేగానికి గురయ్యాను

– షారుక్ ఖాన్

''డంకీ' సినిమాలోని 'నికలె ది కబీ హమ్ ఘర్ సే..' పాట తొలిసారి విన్నప్పుడు చాలా భావోద్వేగానికి గురయ్యాను'' అని బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'డంకీ'. రాజ్‌కుమార్ హిరాణి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తాప్సీ పన్ను, బొమన్ ఇరాని, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనీల్ గ్రోవర్ కీలక పాత్రల్లో నటించారు. జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్‌పై గౌరీ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి, జ్యోతి దేశ్ పాండే నిర్మించారు. క్రిస్మస్ కానుకగా ఈ సినిమా ఈ నెల 21న విడుదలకానుంది. ప్రీతమ్ చక్రవర్తి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నికలె ది కబీ హమ్ ఘర్ సే..' పాటకు అద్భుతమైన స్పందన వస్తోంది. కాగా 'హ్యాష్‌ట్యాగ్ ఆస్క్ ఎస్ఆర్‌కే' సెషన్స్‌లో భాగంగా అభిమానులు, నెటిజన్స్‌తో మాట్లాడిన షారుక్ ఖాన్ పలు విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా 'నికలె ది కబీ హమ్ ఘర్ సే..' పాటని తొలిసారి విన్నప్పుడు మీకు ఎలా అనిపించింది?' అనే ప్రశ్నకు షారుక్ ఖాన్ మాట్లాడుతూ–''ఆ పాట నా తల్లిదండ్రులను, నా స్నేహితులను గుర్తు చేసింది. అలాగే ఢిల్లీలో నేను గడిపిన నాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి. చాలా భావోద్వేగానికి గురయ్యాను'' అని బదులిచ్చారు.



నిర్మాత సుధాకర్ కన్నుమూత

నిర్మాత, కెమెరామేన్ మన్నం సుధాకర్ (62) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. మూడు నెలల క్రితం చెన్నైలోని స్వగృహంలో బాత్‌రూంలో ప్రమాదవశాత్తు పడటంతో తలలో తీవ్ర రక్తస్రావమైంది. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన ఆ తర్వాత ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం కన్నుమూశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి ఆయన స్వస్థలం. ప్రముఖ కెమెరామేన్ వీయస్ఆర్ స్వామి దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన సుధాకర్ 'సితార, వారాలబ్బాయి, పుట్టినిల్లా మెట్టినిల్లా' వంటి పలు చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. మహాగణపతి ఫిలింస్ బ్యానర్ స్థాపించి 'తారకరాముడు, నా మనసిస్తారా, వాలి, సేవకుడు, ఆక్రోశం' వంటి సినిమాలు నిర్మించారు సుధాకర్. టంగుటూరు ప్రాంతం నుంచి పలువురిని సినీ రంగానికి పరిచయం చేశారాయన. సుధాకర్‌కి భార్య దేవరపల్లి లక్ష్మమ్మ, కుమారులు మన్నం హరీష్ బాబు, మన్నం సతీష్ బాబు ఉన్నారు. కాగా ఆయన కుమార్తె మన్నం స్వాతి గతంలోనే చనిపోయారు. కారుమంచిలో మన్నం సుధాకర్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



''నా కెరీర్‌లో ఎప్పుడూ విభిన్నమైన సినిమాలు, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలనుకుంటాను'' అని హీరోయిన్ కీర్తీ సురేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు.. 'దసరా', 'మామన్నన్' సినిమాల విజయాల తర్వాత కథ ఎంపికలో మీ ఆలోచనలు ఏవైనా మారాయా? అనే ప్రశ్న ఎదురైంది. ఇందుకు కీర్తీ సురేశ్ బదులిస్తూ.. ''నేను నటించిన సినిమా హిట్టు అయిందనో, ఫ్లాప్ అయిందనో అప్పటికప్పుడు కథల ఎంపికలో నా ఆలోచనా విధానం మారదు. అయితే నేనెప్పుడూ భిన్నంగా చిత్రాలు చేయాలనుకుంటా. ఎందుకంటే నాకిది ప్రయోగాలు చేసే

ప్రయోగాలు చేసే సమయం ఇది!

– కీర్తీ సురేశ్

సమయం. అందుకు తగ్గట్టే కథలను ఎంపిక చేసుకుంటున్నా. నా వద్దకు వస్తున్న కథలు, పాత్రలు నా ఊహలకు, కలలకు మించిన విధంగా ఉంటున్నాయి. అలాంటప్పుడు మళ్లీ కథల గురించి ఆలోచించుకోవాల్సిన అవసరం ఏముంటుంది? ఆ ప్రయాణాన్ని బాగా ఆస్వాదించాలనే దానిపైనే దృష్టిపెడితే సరిపోతుంది'' అన్నారు. కాగా కీర్తీ సురేశ్ ప్రస్తుతం 'సైరెన్, రఘు తాత, రివాల్వర్ రీటా' చిత్రాలు, 'అక్క' అనే వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నారు.

మంచి సినిమా తీశామంటున్నారు

– కార్తీక్ రాజు



● కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, మహేశ్ రెడ్డి

''అథర్వ' చిత్రానికి ఫుల్ పాజిటివ్ రిపోర్టులు వచ్చాయి. ఇంత మంచి ఆదరణ రావడంతో మేం పడ్డ కష్టాన్ని మర్చిపోయాం. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు అంటున్నారు.. మా చిత్రాన్ని ఇంతలా ఆదరిస్తున్న వారికి థ్యాంక్స్'' అని హీరో కార్తీక్ రాజు అన్నారు. మహేశ్ రెడ్డి దర్శకత్వంలో కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి జంటగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో మహేష్ రెడ్డి మాట్లాడుతూ– ''కొత్త పాయింట్, కొత్త కథ చెబితే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. అందుకే క్లూస్ టీమ్ నేపథ్యంలో 'అథర్వ' తీశాను. ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. ''మా సినిమాకు ఇంత మంచి స్పందన వస్తుందనుకోలేదు.. చాలా సంతోషంగా ఉంది'' అన్నారు సుభాష్ నూతలపాటి. సిమ్రాన్ చౌదరి, నటీనటులు కల్పికా గణేష్, గగన్ విహారి, విజయ రామరాజు మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
493	135
67,481	20,268

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	14,305	▲ 79
డోజోన్స్	36,246	▲ 295
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,529	▲ 76
డాక్స్	16,398	▲ 182
షాంఘై	3,032	▲ 2
నికాయ్	33,432	▽ 37

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	103.73	107.11
€	యూరో	89.40	93.09
¥	జపాన్ ఎన్ (100)	55.48	57.18
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.93	56.53
S$	సింగపూర్ డాలర్	54.31	56.29
SAR	సౌదీ రియాల్	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హమ్	21.78	23.57
¥	చైనా యువాన్	10.54	12.62

మీ పెట్టుబడికి మీరే డ్రైవర్!

ఫండ్స్‌లో నేరుగా ఇన్వెస్ట్‌మెంట్

భవిష్యత్ లక్ష్యాల కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో నియమబద్ధంగా పెట్టుబడులు పెట్టే ధోరణి మన దేశంలో క్రమంగా విస్తరిస్తోంది. ఇందుకు నెలవారీ వస్తున్న సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులే నిదర్శనం. 16,928 కోట్లు సిప్ రూపంలో అక్టోబర్ నెలలో మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు ఒక నెలలో సిప్ ద్వారా వచ్చిన గరిష్ట పెట్టుబడులు ఇవి. అంతేకాదు, ప్రతి నెలా ఈ మొత్తం పెరుగుతూ పోతుండడం, మరింత మంది ఇన్వెస్టర్లు ఈక్విటీ ఫండ్స్ వైపు అడుగులు వేస్తుండడాన్ని తెలియజేస్తోంది. కొత్తగా వచ్చే ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పట్ల కనీసం ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్‌లో డైరెక్ట్ ప్లాన్లు, రెగ్యులర్ ప్లాన్లలో ఏది ఎంపిక చేసుకోవాలన్నది తెలిసి ఉండాలి. దీర్ఘకాలంలో ఈక్విటీ ఫండ్స్ ద్వారా సంపద సమకూర్చుకోవాలని ఆశించే వారు ఈ రెండింటిలో ఏది ఎంపిక చేసుకుంటే ఎక్కువ ప్రయోజనమో తెలిసి ఉంటే, తమ లక్ష్యం సులువు అవుతుంది.



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లు దీర్ఘకాలంలో అధిక రాబడులు అందిస్తాయి. రెగ్యులర్ ప్లాన్ అంటే మ్యూచువల్ ఫండ్స్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా లేదా బ్రోకర్ ద్వారా విక్రయించే ప్లాన్. దీనిపై వారికి అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎంసీలు/ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) నుంచి కమీషన్లు అందుతాయి. కనుక ఎక్స్‌పెన్స్ రేషియో (ఇన్వెస్టర్ పెట్టుబడి నుంచి ఏటా వసూలు చేసే మొత్తం) రెగ్యులర్ ప్లాన్లలో అధికంగా ఉంటుంది. డైరెక్ట్ ప్లాన్లలో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. మూడో పక్షం (బ్రోకర్లు, ఫిన్‌టెక్ సంస్థలు) కూడా రెగ్యులర్ ప్లాన్లను ఆఫర్ చేస్తున్నాయి. అయినప్పటికీ వీటిపై కమీషన్ చెల్లింపులు ఉండవు. కనుక డైరెక్టర్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో, రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో డైరెక్ట్ ప్లాన్లను ప్రవేశపెట్టి పదేళ్లు అవుతోంది. అయినా, ఇప్పటికీ ఎక్కువ మంది పెట్టుబడులు రెగ్యులర్ ప్లాన్లలోకే వెళుతున్నాయి. డైరెక్ట్ ప్లాన్లలో రాబడులు ఎక్కువగా ఉంటున్నప్పటికీ.. రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో పోలియోలు ఎంతో తక్కువగా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతీ ఇన్వెస్టర్ వీటి మధ్య వైరుధ్యాన్ని తప్పక తెలిసి ఉండాలి.


డైరెక్ట్ ప్లాన్ల వెసులుబాటు

- వీటితో దీర్ఘకాలంలో అధిక రాబడి
- మధ్యవర్తులకు కమీషన్ల చెల్లింపు ఉండదు
- ఈక్విటీలపై అవగాహన ఉన్నవారికి అనుకూలం

నేపథ్యం..

2007 వరకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు పెట్టుబడులపై 2–2.5 శాతం వరకు ఎంట్రీ లోడ్‌ను వసూలు చేశాయి. డిస్ట్రిబ్యూటర్లు లేదా నేరుగా ఫండ్స్ సంస్థల ద్వారా ఇన్వెస్ట్ చేసినా ఈ చార్జ్ పడేది. కాకపోతే అప్పట్లో ఫండ్స్‌లో పెట్టుబడులు చాలా తక్కువగా ఉండేవి. దీంతో మరింత మంది రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ దిశగా అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలని సెబీ నిర్ణయించింది. కనుక నేరుగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థ ద్వారా పెట్టుబడులు పెట్టే వారి నుంచి ఎంట్రీ లోడ్ వసూలు చేయవద్దంటూ మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి)ను సెబీ కోరింది. అప్పట్లో సెబీ చైర్మన్‌గా దామోదరన్ ఉన్నారు. ఆయన తర్వాత సీబీ భవే అదే విధానానికి మద్దతుగా నిలిచారు. 2008లో ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా మార్కెట్లు కుదేలు కావడంతో రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు వెనుకంజ వేసిన పరిస్థితి కనిపించింది. దీంతో 2009లో సెబీ ఫండ్స్‌లో ఎంట్రీలోడ్‌ను రద్దు చేసింది. ఆ తర్వాత నుంచి పంపిణీదారులు, ఏజెంట్లకు ఫండ్స్ సంస్థలు కమీషన్ చెల్లిస్తూ, ఆ మొత్తాన్ని టోటల్ ఎక్స్‌పెన్స్ రేషియో (టీఈఆర్) పేరుతో ఇన్వెస్టర్ల నుంచి రాబట్టడం మొదలు పెట్టాయి. నేరుగా ఫండ్స్ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టే వారికి, పంపిణీదారులు ద్వారా పెట్టుబడులు పెట్టే వారికి ఒక్కటే టీఈఆర్ వసూలు చేసేవి. దీనివల్ల ఎంట్రీలోడ్ రద్దు చేసిన ప్రయోజనం ఇన్వెస్టర్లకు నెరవేరకుండా పోయింది. దీంతో డైరెక్ట్ ప్లాన్లకు అప్పటి సెబీ చైర్మన్ యూకే సిన్హా పునాది వేశారు. గతంలో యూటీఐ మ్యూచువల్ ఫండ్‌కు చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉండడంతో, నేరుగా ఇన్వెస్ట్ చేసే వారికి ప్రయోజనం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నేరుగా ఇన్వెస్ట్ చేసే వారికి కమీషన్ల బెడద తొలగి, డైరెక్ట్ ప్లాన్లలో టీఈఆర్ తక్కువగా ఉండడం అమల్లోకి వచ్చింది.

అనుకూలతలు...



మ్యూచువల్ ఫండ్ అడ్వైజర్ (సలహాదారు) లేదా పంపిణీదారు (డిస్ట్రిబ్యూటర్) సేవలు అవసరం లేకుండా నేరుగా పెట్టుబడులు పెట్టే వారికి వ్యయాలు ఆదా చేసుకునేందుకు తీసుకొచ్చిందే డైరెక్ట్ ప్లాన్లు. సులభంగా చెప్పాలంటే డ్రైవర్ సాయం లేకుండా ఎవరి కారును వారు డ్రైవ్ చేసుకున్నట్టు. ఇన్వెస్టర్ తన పెట్టుబడుల నిర్వహణను తానే చూసుకోవడం. మ్యూచువల్ ఫండ్స్‌లో టీఈఆర్ అని ఉంటుంది. అంటే టోటల్ ఎక్స్‌పెన్స్ రేషియో (టీఈఆర్). ఇందులో ఫండ్ నిర్వహణ చార్జీలు, మార్కెటింగ్ వ్యయాలు, రిజిస్ట్రార్ ఫీజు, కస్టోడియన్ ఫీజు, ఇతర వ్యయాలు కలిపి ఉంటాయి. రెగ్యులర్ ప్లాన్లలో పంపిణీదారులకు కమీషన్ చెల్లించాల్సి వస్తుంది. కనుక ఇక్కడ చెప్పుకున్న వివిధ రకాల వ్యయాలకు కమీషన్ కూడా తోడు కావడంతో రెగ్యులర్ ప్లాన్లలో టీఈఆర్ ఎక్కువగా ఉంటుంది. ఇన్వెస్టర్ పెట్టుబడి విలువపై వార్షికంగా టీఈఆర్‌ను అమలు చేస్తారు. కానీ చార్జీ మినహాయింపు ఏరోజుకారోజు కొనసాగుతుంది. పెట్టుబడి నుంచి అధిక వ్యయాలను మినహాయించినప్పుడు ఆ మేర రాబడి తగ్గుతుంది. ఒక ఇన్వెస్టర్ రెండు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో రూ.10,000 చొప్పున లమ్సమ్‌గా ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. 'ఏ' అనే పథకంలో టీఈఆర్ ఒక శాతంగా ఉంది. 'బీ' అనే పథకంలో టీఈఆర్ 2.5 శాతంగా ఉంది. కానీ, పదేళ్ల తర్వాత రూ.10,000 పెట్టుబడి 'ఏ' పథకంలో రూ.36,587గా మారితే, 'బీ' పథకంలో రూ.31,407 సమకూరింది. అంటే వ్యత్యాసం ఎంతుందో స్పష్టంగా అర్థమవుతోంది.

రాబడులు



పేరొందిన ఈక్విటీ ఫండ్స్ డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్లలో ప్రతి నెలా రూ.5,000 చొప్పున సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసే వారి రాబడులు పరిశీలించినా.. డైరెక్ట్ ప్లాన్లలోనే ఎక్కువ ఉంటున్నాయి. ఉదాహరణకు మిరే అస్సెట్ లార్జ్ క్యాప్ ఫండ్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (ఎక్స్ఐఆర్ఆర్) డైరెక్ట్ ప్లాన్‌లో 16.73 శాతం రాగా, రెగ్యులర్ ప్లాన్‌లో ఇది 15.60 శాతంగానే ఉంది. అంటే గడిచిన పదేళ్లలో ఈ పథకంలో చేసిన రూ.6 లక్షల సిప్ కాస్తా డైరెక్ట్ ప్లాన్‌లో రూ.14.26 లక్షలుగా మారితే, రెగ్యులర్ ప్లాన్‌లో రూ.13.42 లక్షలు అయి ఉండేది. అంటే ఈ రెండింటి మధ్య రూ.82,945 వ్యత్యాసం కనిపిస్తోంది. రెగ్యులర్ ప్లాన్‌ను ఎంపిక చేసుకోవడం వల్ల ఇన్వెస్టర్ పదేళ్ల కాలంలో కమీషన్ల రూపేణా ఇంత మొత్తం నష్టపోవాల్సి వస్తుందని అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఎస్‌బీఐ బ్లూచిప్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్‌లోనూ రెగ్యులర్ ప్లాన్‌తో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో రూ.67,540, రూ.60,788 చొప్పున అధిక రాబడి వచ్చింది.

ఇన్వెస్టర్లు ఎందుకు దూరం..?



డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్ల మధ్య రాబడుల్లో ఇంత స్పష్టమైన వైరుధ్యం కనిపిస్తున్నా, ఈ ప్రయోజనాన్ని పొందుతున్న ఇన్వెస్టర్లు 25 శాతానికి మించి లేరు. యాంఫీ గణాంకాల ప్రకారం మొత్తం 13.89 కోట్ల వ్యక్తిగత ఫండ్స్ ఫోలియోల్లో డైరెక్టర్ ప్లాన్లలో పెట్టుబడులకు సంబంధించినవి కేవలం 3.45 కోట్ల ఫోలియోలే ఉన్నాయి. ఫండ్స్ నిర్వహణ ఆస్తుల్లో డైరెక్ట్ ప్లాన్ల నుంచి వస్తున్నది 12 శాతం మించి లేదు. ఇందుకు గల కారణాలపై మహీంద్రా మనులైఫ్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో ఆంటోనీ హెరెడియా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ''ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. ఫండ్స్‌లో రెగ్యులర్ ప్లాన్లు సైతం దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మంచి సంపదను సమకూర్చి పెట్టాయి. దీనికి తోడు డైరెక్ట్ ప్లాన్లపై ఎక్కువ మందిలో అవగాహన లేదు''అని వివరించారు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు డైరెక్ట్ ప్లాన్ల వైపే మొగ్గు చూపుతుంటే, నాన్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్లలోనూ 50 శాతం మంది డైరెక్టర్ ప్లాన్లనే ఎంచుకుంటున్నారు. కేవలం రిటైల్ విభాగంలోనే డైరెక్ట్ ప్లాన్లను ఎంపిక చేసుకుంటున్న వారు తక్కువగా ఉంటున్నారు.

ఏమిటి మార్గం..?

ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పట్ల అవగాహన ఉంటే మెరుగైన పథకాలకు సంబంధించి డైరెక్ట్ ప్లాన్లను ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకోవచ్చు. లేదంటే ఫైనాన్షియల్ అడ్వైజర్ సాయం తీసుకోవాలి. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు, సంపద సృష్టికి మ్యూచువల్ ఫండ్ పథకం ఎంపిక కీలకం అవుతుంది. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో వేలాది పథకాలు ఉన్నాయి. ఇందులోనూ ఎన్నో విభాగాలు ఉన్నాయి. వీటిల్లో ఇన్వెస్టర్ల ఆకాంక్షలు, రిస్క్‌కు అనుగుణంగా అనుకూలమైన వాటిని ఎంపిక చేసుకోవడం కొంచెం క్లిష్టమైన పనే. ఈక్విటీ మార్కెట్ల పట్ల అవగాహన కలిగి ఉండి, రోజులో కొంత సమయం కేటాయించే వీలున్న వారు నేరుగా డైరెక్ట్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లేదంటే సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల సేవలను ఆశ్రయించినట్టయితే, వారు మెరుగైన పథకాలకు సంబంధించి డైరెక్ట్ ప్లాన్లను సూచిస్తారు. కాకపోతే సెబీ వద్ద నమోదైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు కేవలం 1,328 మందే ఉన్నారు. కనుక ఇన్వెస్టర్లు డిస్కౌంట్ బ్రోకర్లు, ఫిన్‌టెక్ సంస్థల సేవలను సైతం పొందొచ్చు. కాకపోతే చాలా మంది తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువుల సూచనల మేరకే నడుచుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.



వ్యత్యాసాలు

- మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో పంపిణీదారులు, బ్రోకర్లు తదితర మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. కనుక రెగ్యులర్ ప్లాన్‌లో యూనిట్ ఎన్ఏవీతో పోలిస్తే, డైరెక్ట్ ప్లాన్ యూనిట్ ఎన్ఏవీ ఎక్కువగా ఉంటుంది.
- డైరెక్ట్ ప్లాన్లలో టీఈఆర్ తక్కువ. దీంతో దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి వీటిల్లో ఎక్కువ.
- డైరెక్ట్ ప్లాన్లను ఏ సంస్థా సూచించదు. ఇన్వెస్టర్ నేరుగా ఎంపిక చేసుకోవాలి.
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా డైరెక్ట్ ప్లాన్లలో సులభంగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. జెరోదా, గ్రోవ్ వంటి సంస్థలు సైతం డైరెక్ట్ ప్లాన్లను ఆఫర్ చేస్తున్నాయి.

రెగ్యులర్ ప్లాన్లు
Vs
డైరెక్ట్ ప్లాన్లు



శామ్కో నుంచి డైనమిక్ అస్సెట్ ఫండ్



ముంబై: శామ్కో అస్సెట్ మేనేజ్‌మెంట్ 'డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్'ను తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. స్థిరత్వం, వృద్ధి అవకాశాలు, మార్కెట్ల కరెక్షన్లలో రక్షణ ప్రయోజనాలతో ఈ పథకం ఉంటుంది. ఈక్విటీ మార్కెట్లలో మరీ ప్రతికూల పరిస్థితులు కనిపించిన సందర్భాల్లో పెట్టుబడులను పూర్తిగా డెట్‌లోకి మార్చడం ఈ పథకం విధానంలో భాగంగా ఉంటుంది. పెట్టుబడులు అన్నింటినీ డెట్‌కు మార్చే తొలి డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్ ఇదేనని కంపెనీ ప్రకటించింది. అలాగే, ఈక్విటీ మార్కెట్లు ఆకర్షణీయంగా మారినప్పుడు అవసరమైతే నూరు శాతం పెట్టుబడులను అందులోకి మళ్లించగలదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డెట్, ఈక్విటీల మధ్య పెట్టుబడులను మారుస్తూ, రిస్క్ తగ్గించి, మెరుగైన రాబడులను ఇచ్చే విధంగా ఈ పథకం పనిచేస్తుంది. డిసెంబర్ 7 నుంచి 21వ తేదీ వరకు ఈ నూతన పథకం (ఎన్ఎఫ్‌వో) పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది.

టాటా ఏఐజీ నుంచి హెల్త్ సూపర్ చార్జ్ ప్లాన్



ముంబై: టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్.. 'హెల్త్ సూపర్ చార్జ్' ప్లాన్‌ను ప్రారంభించింది. దీని కింద పాలసీదారులు ఐదు రెట్లు అధికంగా హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీని పొందొచ్చు. ఏటా 50 శాతం రెన్యువల్ బోనస్ చొప్పున గరిష్ఠంగా 500 శాతం (ఐదు రెట్లు) కవరేజీని పెంచుకోవచ్చు. టైర్–1 నుంచి టైర్–4 వరకు పట్టణాల్లో నివసించే వారి భిన్న రకాల ఆరోగ్య సంరక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్లాన్‌ను తీసుకొచ్చినట్టు సంస్థ తెలిపింది. ప్రీమియంపై 5 శాతం డిస్కౌంట్, సమ్ ఇన్సూర్డ్ అపరిమిత రీస్టోరేషన్ సదుపాయం, ముందు నుంచి ఉన్న వ్యాధుల వేచి ఉండే కాలాన్ని నాలుగేళ్ల నుంచి 30 రోజులకు తగ్గించుకునే ఆప్షన్లు ఇందులో ఉన్నాయి. ఈ ప్లాన్ కింద రూ.5–20 లక్షల కవరేజీని పొందొచ్చు. ఏటా ఉచిత హెల్త్ చెకప్ సదుపాయం కూడా ఉంది.

యాక్సిస్ నుంచి మాన్యుఫాక్చరింగ్ ఫండ్

అందుబాటులో 15వరకు..

ముంబై: యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ 'యాక్సిస్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఫండ్'ను ప్రారంభించింది. డిసెంబర్ 1 నుంచి 15 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఇది ఓపెన్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్. నూతన పథకం ద్వారా రూ.2,500 కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో ఉన్నట్టు యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. దేశ తయారీ రంగంలోని అవకాశాలపై ఈ పథకం పెట్టుబడులు పెడుతుందని తెలిపింది. నిఫ్టీ మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్‌ను ఈ పథకం ట్రాక్ చేస్తుంది. శ్రేయాష్ దేవాల్కర్, నితిన్ అరోరా ఈ ఫండ్ నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు. ఈ పథకంలో చేసిన పెట్టుబడిని 12 నెలల్లోపు ఉపసంహరించుకుంటే 10 శాతంపై ఎలాంటి ఎగ్జిట్ లోడ్ విధించరు. మిగిలిన మొత్తంపై 1 శాతం ఎగ్జిట్ లోడ్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి నాటికి సంస్థ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) రూ.2.25 లక్షల కోట్లుగా ఉంటే, 2024 మార్చి నాటికి రూ.3 లక్షల కోట్లకు పెంచుకోనున్నట్టు యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో బి.గోప్‌కుమార్ తెలిపారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)


4-12-2023	
విశాఖ	530-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
3-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

స్టాక్స్ వ్యూ

హిటాచీ ఎనర్జీ | చోళ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 4,720 **టార్గెట్:** రూ. 5,600

ఎందుకంటే: గతంలో ఏబీబీ పవర్ ప్రొడక్ట్స్ అండ్ సిస్టమ్స్ ఇండియాగా సేవలందించిన హిటాచీ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ప్రధానంగా దేశ, విదేశాలలో విద్యుత్ ప్రసార(ట్రాన్స్‌మిషన్) విభాగంలో ఇంజినీరింగ్ ప్రొడక్టులు, ప్రాజెక్టులు, సర్వీసులను సమకూరుస్తోంది. ఈ రంగంలో విద్యుత్ వ్యవస్థను పూర్తిస్థాయిలో సమీక్షించడంతోపాటు.. భారీ స్థాయిలో విస్తరణ చేపడుతుండటంతో హిటాచీ ఎనర్జీ వంటి కంపెనీలకు అవకాశాలు పెరగనున్నాయి. రానున్న ఐదు, ఆరేళ్ల కాలంలో 280–300 గిగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి రానుంది. వెరసి విద్యుత్ రంగ థీమ్‌లో భాగంగా కంపెనీ ముందు వరుసలో నిలవనున్నట్లు భావిస్తున్నాం. విద్యుత్, ఇంధన(ఎనర్జీ) రంగాలలో కంపెనీకి కీలక స్థానముంది. దేశీ ఇంధన మార్కెట్ వృద్ధిలో కంపెనీకి పలు అవకాశాలు లభించనున్నాయి. వీటిని కంపెనీ అందిపుచ్చుకునే వీలుంది. ఇంధన రంగ మౌలికసదుపాయాల ఏర్పాటుకు దేశీయంగా లభిస్తున్న ప్రాధాన్యత కంపెనీకి ప్రోత్సాహాన్నివ్వనుంది. ఫలితంగా విద్యుత్, హరిత ఇంధన రంగ సర్వీసులలో కంపెనీ కీలకపాత్ర పోషించనున్నట్లు అంచనా వేస్తున్నాం. దేశీయంగా 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఏర్పాటుకు లభిస్తున్న ప్రాధాన్యత కారణంగా రూ. 2.44 లక్షల కోట్ల పెట్టుబడి వ్యయాలకు తెరలేవనుంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) అంచనాలివి. ఈ రంగంలోని ఇతర కంపెనీలతో పోలిస్తే కంపెనీ షేరు అందుబాటు ధరలో కదులుతోంది. రానున్న రెండేళ్లలో కంపెనీ మరింత మెరుగైన ఫలితాలను ప్రకటించవచ్చు.



యూనిపార్ట్స్ ఇండియా | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 538 **టార్గెట్:** రూ. 750

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో యూనిపార్ట్స్ ఇండియా ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18 శాతం క్షీణించింది. ఇది అంచనాలకంటే 9 శాతం తక్కువ కాగా.. ఈ కాలంలో నిల్వల విలువలో జరిగిన దిద్దుబాటు ఆదాయంపై 8–9 శాతంమేర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఇక నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సైతం అంచనాలకంటే దిగువన 18.3 శాతంగా నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో నిల్వల విలువలో దిద్దుబాటుకు తెరపడనున్నట్లు అంచనా. దీంతో చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో సాధారణ పరిస్థితులు నెలకొనే వీలుంది. యూఎస్‌లో చిన్న వ్యవసాయ పరికరాల డిమాండ్ మందగించినప్పటికీ.. భారీ వ్యవసాయ పరికరాలకు, నిర్మాణ సంబంధ ఎక్విప్‌మెంట్‌కు డిమాండ్ పుంజుకోవడం కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది. యూరోపియన్ యూనియన్(ఈయూ) లోనూ డిమాండ్ బలపడటం ఇందుకు జత కలవనుంది. గ్లోబల్ దిగ్గజ కంపెనీలు(ఓఈఎం) చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే బాటలో అమలు చేస్తున్న వ్యూహాల కారణంగా యూనిపార్ట్స్ అమ్మకాలను పెంచుకోవడంతోపాటు.. కొత్త కస్టమర్లను పొందుతోంది. అయితే సమీప కాలంలో అమ్మకాల పరిమాణం పుంజుకోనప్పటికీ మధ్య కాలానికి విలువ జోడింపు ఉత్పత్తులు, కొత్త ప్రొడక్టులపై దృష్టి పెట్టడం ద్వారా జోరందుకునే అవకాశముంది. వెరసి క్యూ4కల్లా ఇబిటా మార్జిన్లు 21 శాతానికి బలపడే వీలుంది. పటిష్ట క్యాష్ ఫ్లో, 20 శాతానికి పైగా రిటర్న్ రేషియోలు కంపెనీ బలాన్ని చాటుతున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఉద్యోగికి వ్యక్తిగత హెల్త్ ప్లాన్ ఉండాలా?

నేను ప్రభుత్వ ఉద్యోగిని. ప్రభుత్వం నుంచి హెల్త్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. అయినా కానీ, నేను వ్యక్తిగతంగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవాలా? – అమిత్ సోలంకి

ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణంగా హెల్త్ స్కీమ్‌ల కింద కవరేజీ ఉంటుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) కింద రక్షణ లభిస్తుంది. ఉద్యోగులతో పాటు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సైతం ఈ పథకం కింద కవరేజీ లభిస్తుంది. అలాగే, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వం తరఫున హెల్త్ కవరేజీ ఉద్యోగులకు ఉంటుంది. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీమ్, వెస్ట్ బెంగాల్ హెల్త్ స్కీమ్ ఇందుకు ఉదాహరణలు. ప్రభుత్వ, ఎంపానెల్డ్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాల కొనుగోలుకు వీటి పరిధిలో కవరేజీ వస్తుంది. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేద, యునానీ, సిద్ధ, యోగ చికిత్సలకూ వీరు రీయింబర్స్‌మెంట్ పొందొచ్చు. అత్యవసర చికిత్స/వైద్యం, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలకు సైతం ప్రభుత్వ ఉద్యోగులకు పరిహారం వస్తుంది. కాకపోతే అన్ని రకాల ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే వెసులుబాటు ఉండదు. ఎంపిక చేసిన ఆస్పత్రుల వరకే ఈ కవరేజీ పరిమితంగా ఉంటుంది. పైగా ప్రభుత్వ ఆమోదిత ఆస్పత్రులు అన్ని ప్రాంతాల్లోనూ ఉండాలని లేదు. ప్రధాన పట్టణాల్లోనే ఇవి ఉంటాయి. కనుక మీకు సమీపంలోని ఏఏ ఆస్పత్రుల్లో కవరేజీ ఉంటుందో ముందు తెలుసుకోండి. అక్కడ ఉండే వసతులు ఏ మేరకో విచారించుకోవాలి. ప్రభుత్వ ఆమోదం ఉన్న ఆస్పత్రి మీకు సమీపంలో లేకపోయినా, లేదంటే మెరుగైన వసతులతో అందుబాటులో లేకపోయినా, లేదంటే అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని ఆస్పత్రిలో వైద్యం పొందాలనుకుంటే.. అప్పుడు వ్యక్తిగత హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ప్రైవేటు బీమా సంస్థ నుంచి తీసుకోవడాన్ని పరిశీలించొచ్చు. వృద్ధాప్యం వచ్చే వరకు ఆగకుండా, యుక్త వయసులోనే వ్యక్తిగత హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం వల్ల ప్రీమియం తక్కువగా ఉంటుంది. మంచి ట్రాక్ రికార్డు కూడా లభిస్తుంది. 60 ఏళ్లు దాటిన తర్వాత తీసుకోవాల్సి వస్తే కో పే షరతును ఆమోదించాల్సి రావచ్చు. కోపే వద్దనుకుంటే ప్రీమియం భారీగా ఉంటుంది. కనీసం రూ.5 లక్షల వరకు వ్యక్తిగత హెల్త్ కవరేజీ ప్లాన్‌ను తీసుకోవాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పిల్లల విద్య కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఆఫర్ చేసే చైల్డ్ ఎడ్యుకేషన్ ప్లాన్లు లాభదాయకమేనా? – ఆశా

పిల్లల కోసం ఏ తరహా పెట్టుబడి అనుకూలంగా ఉంటుంది? వారు చాలా చిన్న వయసులోనే ఉంటే ఈక్విటీ ఫండ్స్ అనుకూలం. మీకు ఈక్విటీల పట్ల తగినంత అనుభవం ఉంటే, వీలైనంత ఈక్విటీ ఎక్స్‌పోజర్ తీసుకోవచ్చు. 10–12 ఏళ్లపాటు పిల్లల కోసం ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత వారు కాలేజీలోకి అడుగు పెట్టే సమయం వస్తుంది. దానికి మూడేళ్ల ముందే సన్నద్ధం కావాలి. మొదటి సంవత్సరం కాలేజీకి కోసం కావాల్సిన మొత్తాన్ని మూడేళ్ల ముందే వెనక్కి తీసుకోవాలి. కాలేజీ రెండో సంవత్సరం కోసం కావాల్సిన మొత్తాన్ని ఏడాది విరామం తర్వాత తీసుకోవాలి. ఇలా చేస్తే మార్కెట్‌లో ఆటుపోట్లు ఉన్నా ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడదు. ఎవరైనా కానీ, పిల్లల విద్య కోసం ఈక్విటీల్లో మదుపు చేస్తున్నట్టు అయితే ఈ విధానాన్ని అనుసరించొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు ఆఫర్ చేసే చైల్డ్ ఎడ్యుకేషన్ ప్లాన్‌లు అంత అర్థవంతమైనవి కావు. ఎందుకంటే అనవసరమైన నిర్బంధాలు వీటిల్లో ఉండడమే కారణం.

ఎమ్మెల్యేలు-సామాజిక వర్గాలు

కాంగ్రెస్‌లో...

రెడ్డి	25
ఎస్సీ	14
ఎస్టీ	09
బీసీ	08
వెలమ	06
బ్రాహ్మణ	01
కమ్మ	01

(నోట్: కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు.)

బీఆర్ఎస్‌లో...

రెడ్డి	14
వెలమ	06
కమ్మ	02
గౌడ	03
మాదిగ	03
మున్నూరు కాపు	02
గంగపుత్ర	01
పద్మశాలి	01
వంజరి	01
యాదవ	01
గోండు	01
లంబాడా	01
కోయ	01
మాల	01
బైండ్ల	01

బీజేపీలో...

బీసీ	3
రెడ్డి	3
వైశ్య	1
వెలమ	1

నేడు సీఎల్పీ భేటీ

- ఉదయం 9:30 గంటలకు హోటల్ ఎల్లా వేదికగా సమావేశం
- సీఎం ఎంపిక కోసం అభిప్రాయాలు తీసుకోనున్న పార్టీ పరిశీలకులు
- ఆదివారం రాత్రికే హైదరాబాద్‌కు చేరుకున్న కొత్త ఎమ్మెల్యేలు
- వారి అభిప్రాయాలను ఖర్గే, రాహుల్‌లకు వివరించనున్న డీకే శివకుమార్
- ఆశావహులకు బుజ్జగింపులు.. ఈనెల 9 నాటికి 'పని' పూర్తిచేసి ప్రభుత్వ ఏర్పాటు
- ఆదివారం రాత్రి గవర్నర్‌ను కలసిన డీకే, ఠాక్రే, రేవంత్, ఉత్తమ్‌ల బృందం
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ లేఖ
- నేడే సీఎం, ఒకరిద్దరు మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించవచ్చనే ప్రచారం



ఎల్లా హోటల్‌లో రేవంత్‌రెడ్డితో సమావేశమైన కాంగ్రెస్ కొత్త ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. నూతన ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా సోమవారం పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశాన్ని నిర్వహించనుంది. హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్ వేదికగా ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీలో సీఎం ఎంపికపై కొత్త ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పర్యవేక్షణలో, ఇతర ఏఐసీసీ ముఖ్యుల సమక్షంలో ఈ సమావేశం జరగనుంది. దీనికోసం కాంగ్రెస్ కొత్త ఎమ్మెల్యేలంతా ఆదివారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు.

భేటీ తర్వాత అధిష్టానం పరిధిలోకి..

పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించాక సీఎం ఎంపిక, మంత్రివర్గ కూర్పు అంశం అధిష్టానం పెద్దల చేతికి వెళ్లనుంది. డీకే బృందం ఎమ్మెల్యేలతో భేటీ పూర్తికాగానే ఢిల్లీ వెళ్లనున్నట్టు సమాచారం. అక్కడ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో సమాలోచనలు జరిపి సీఎం ఎవరన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. తర్వాత సీఎం రేసులో ఉన్న ఇతర నేతలను ఢిల్లీకి పిలిపించి బుజ్జగించి, ఏకాభిప్రాయం సాధించే అవకాశం ఉందని తెలిసింది. తర్వాత మరోమారు ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి లాంఛనంగా సీఎల్పీ నాయకుడి ఎంపికను పూర్తి చేయనున్నారు. ఈ నెల 9వ తేదీకల్లా ఈ ప్రక్రియ అంతా పూర్తిచేసి ఎల్బీ స్టేడియం వేదికగా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సోమ, మంగళవారాల్లోనే ప్రమాణ స్వీకారం?

ఎక్కువ రోజులు పొడిగించకుండా సోమవారం లేదా మంగళవారమే సీఎంతోపాటు ఒకరిద్దరు మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించే అవకాశాలు కూడా ఉన్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సోమవారం సీఎల్పీ భేటీ తర్వాత డీకే శివకుమార్, ఇతర పెద్దలు ఇక్కడి నుంచే ఢిల్లీ పెద్దలతో మాట్లాడి, నేరుగా గవర్నర్‌ను కలసి రాజ్‌భవన్‌లోనే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పూర్తి చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే ఈనెల 9 నాటికి మంత్రివర్గాన్ని కూర్చి పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సభలో మంత్రుల ప్రమాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలీసుల పేరిట లేఖ ఫేక్

సీఎంగా రేవంత్‌రెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేస్తారని, ఆ కార్యక్రమానికి రాహుల్, ప్రియాంక వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం తగిన భద్రత ఏర్పాటు చేయాలంటూ పోలీసు ఉన్నతాధికారుల పేరిట ఓ లేఖ వైరల్‌గా మారింది. అయితే అది ఫేక్ అని టీపీసీసీ వర్గాలు ప్రకటించాయి.

గవర్నర్‌ను కలసిన కాంగ్రెస్ నేతలు

ఫలితాల అనంతరం హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో సమావేశమైన కాంగ్రెస్ నేతలు.. రాత్రి 9 గంటల సమయంలో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ తమిళిసైను కలిశారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ పరిశీలకులు దీపాదాస్‌మున్షీ, కేజీ జార్జ్ తదితరులు రాజ్‌భవన్‌కు వెళ్లిన బృందంలో ఉన్నారు. తమకు 65 మంది సభ్యుల మద్దతు ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ వారు గవర్నర్‌కు లేఖ అందజేశారు. తర్వాత రాజ్‌భవన్ ఎదుట డీకే శివకుమార్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

సీఎంపై సోమవారమే స్పష్టత: ఉత్తమ్

గవర్నర్‌ను కలవడానికి ముందు ఎల్లా హోటల్ వద్ద ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సోమవారం సీఎల్పీ సమావేశం జరగనుందని, సీఎం ఎవరన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఈ విషయంలో తన అభిప్రాయాన్ని సమావేశంలోనే వెల్లడిస్తానని, బయట చెప్పనని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం ప్రజల విజయమని అభివర్ణించారు.

బహుజనవాదం .. బహుదూరం

108 సీట్లలో పోటీ చేస్తే రెండు చోట్లనే బీఎస్పీకి డిపాజిట్
సిర్పూరులో బీజేపీ, బీఆర్ఎస్‌లను దాటలేక పోయిన ప్రవీణ్ కుమార్
పటాన్‌చెరులో డిపాజిట్ దక్కించుకొని మూడో స్థానానికే పరిమితం

సాక్షి, హైదరాబాద్/ ఆసిఫాబాద్: బహుజన సమాజ్ పార్టీకి మరోసారి చుక్కెదురైంది. బహుజన వాదం నినాదంతో రాష్ట్రంలో కొన్ని సీట్లతో పాటు మెరుగైన ఓట్ల శాతం సాధించాలని కలలుగన్న బీఎస్పీ ఆశలు నీరుగారి పోయాయి. ఐపీఎస్ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ పొంది బీఎస్పీ సారథ్య బాధ్యతలు తీసుకొన్న ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో 108 స్థానాల్లో పోటీ చేసిన బీఎస్పీకి రెండు చోట్ల మాత్రమే డిపాజిట్ దక్కింది. అందులో ఒకటి ప్రవీణ్‌కుమార్ పోటీ చేసిన సిర్పూరు కాగా, రెండోస్థానం పటాన్‌చెరు. సిర్పూరులో గెలుపుపై ఆశలు రేకెత్తించిన ప్రవీణ్‌కుమార్‌కు లభించిన ఓట్లు 44,646. ఇక్కడ అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు విజయం సాధించగా, ప్రవీణ్ కుమార్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. దళిత, గిరిజన బహుజనుల ఓట్లపై గంపెడాశలు పెట్టుకున్న ప్రవీణ్‌కుమార్ స్థానికేతరుడు కావడం కూడా ఇక్కడ ఆయన విజయావకాశాలను దెబ్బతీసినట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేరు కోనప్పను తెలంగాణేతరుడుగా ప్రచారం చేయడంతో ప్రవీణ్‌కుమార్ విజయం సాధించినప్పటికీ, హరీశ్‌బాబు స్థానికుడు కావడంతో ఓట్లన్నీ గంపగుత్తగా పోలయినట్టు తెలుస్తోంది. కాగా పటాన్‌చెరులో చివరి నిమిషంలో బీఎస్పీ టికెట్టుపై పోటీ చేసిన కాంగ్రెస్ రెబల్ నీలం మధుకు 46,162 ఓట్లు మాత్రమే లభించి మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి 7వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాటా శ్రీనివాస్ గౌడ్ రెండోస్థానంలో నిలిచారు. ఇక ప్రవీణ్‌కుమార్ సోదరుడు ప్రసన్న కుమార్ స్వచ్ఛంద విరమణ చేసి ఆలంపూర్ నుంచి పోటీ చేయగా, కేవలం 4,711 ఓట్లు మాత్రమే లభించాయి. వీరు కాకుండా పెద్దపల్లి నుంచి పోటీ చేసిన దాసరి ఉష 10,315 ఓట్లు సాధించగా, సూర్యా పేటలో వట్టె జానయ్యకు 13,907 ఓట్లు దక్కా యి. చొప్పదండి నుంచి పోటీ చేసిన శేఖర్‌కు 5,153 ఓట్లు లభించాయి. ఇలా మరికొన్ని స్థానాల్లో స్వ ల్పంగా ఓట్లు మాత్రమే సాధించి బహుజనవాదం వినిపించడంలో ఆ పార్టీ విఫలమైంది.

ప్రవీణ్‌కుమార్‌కు నిరాశ



బహుజన వాదం నినాదంతో కుమురంభీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో పాగా వేయాలని ఆశపడిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమా ర్‌కు నిరాశ తప్పలేదు. దళితులు, గిరిజనులు, బుద్ధిస్టుల ఓట్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి కచ్చితంగా గెలుస్తామనే ధీమాతో ఆర్ఎస్పీ పోటీకి మొగ్గు చూపారు. పోలింగ్ సరళిని బట్టి ఆ పార్టీకి అధిక సంఖ్యలో ఓట్లు పడ్డాయని విశ్లేషకులు భావించారు. అయితే ఆ పార్టీ నాయకులు వేసిన అంచనాలు తారుమారయ్యాయి.

రాష్ట్రంలో అధికార మార్పిడిని

స్వాగతిస్తున్నాం..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి టీఎం జేఎన్‌జే అభినందనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారమార్పును స్వాగతిస్తున్నామని టీమ్ జేఎన్‌జే మ్యాక్ హౌసింగ్ సొసైటీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సాధించి అధికారం చేపట్టబోతున్న కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు. మాకు అండగా నిలిచిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి జర్నలిస్టుల పక్షాన ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి పేట్‌బషీరా బాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసింది. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 15 ఏళ్ల మా కలను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని పేర్కొంది.

ప్రెస్‌క్లబ్‌లో సంబరాలు: కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించడంపట్ల టీంజేఎన్జే సభ్యులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నా రు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ముందు పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు.

రేవంత్.. భట్టి.. ఉత్తమ్?

- సీఎం ఎంపికపై అధిష్టానం సమాలోచనలు.. ఢిల్లీతో టచ్‌లోకి డీకే
- దళిత కోటాలో భట్టి పేరు కూడా..
- డిప్యూటీ సీఎంలుగా ఇద్దరు లేదా ముగ్గురికి చాన్స్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు సీఎం అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇందుకు పోటీపడుతున్న వారి సంఖ్య సహజంగానే కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ వర్గాల విశ్లేషణల ప్రకారం.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి (మహబూబ్‌నగర్), సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క (ఖమ్మం), ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (నల్లగొండ) పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఎవరిని చాయిస్‌గా ఎంచుకోవాలన్న దానిపై అధిష్టానం ఇప్పటికే సమాలోచనలు ప్రారంభించగా, తెలంగాణకు పరిశీలకుడిగా వచ్చిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కూడా ఢిల్లీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది.

ఉప ముఖ్యమంత్రులుంటారా?

కర్ణాటక తరహాలో ఉప ముఖ్యమంత్రి పదవులు తెలంగాణలోనూ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎంగా ఏ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఎంపిక చేస్తారన్న దాన్నిబట్టి మరో రెండు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. సీఎం హోదా రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే ఎస్సీ, బీసీలకు చెరో ఉప ముఖ్యమంత్రి, దళితులకు సీఎం హోదా ఇస్తే రెడ్డి, బీసీలకు చెరో ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఈ క్రమంలో మైనార్టీలకూ ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో మైనార్టీల పక్షాన ఎవరూ విజయం సాధించకపోవడంతో ఉప ముఖ్యమంత్రి హోదా మైనార్టీలకు ఇవ్వాలంటే నామినేటెడ్ ఎమ్మెల్సీ హోదా ఇవ్వాల్సి ఉండడం గమనార్హం.

అమాత్యులెవరంటే...!

మంత్రివర్గ కూర్పులో కూడా సామాజిక వర్గాలు, జిల్లాల వారీ లెక్కలు కట్టుకుంటూ తమ నాయకుడికి కచ్చితంగా మంత్రి పదవి వస్తుందనే చర్చ కీలక నేతల అనుచరుల్లో జరుగుతోంది. కొండా సురేఖ, సీతక్కకు కేబినెట్‌లో చోటు లాంఛనప్రాయమేనని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ముఖ్యమంత్రి రేసులో ఉన్న ఉత్తమ్ ఒకవేళ తనకు అవకాశం ఇవ్వని పక్షంలో ఇతరుల కేబినెట్‌లో ఉండేందుకు అంగీకరించకపోతే ఆయన సతీమణి పద్మావతికి మంత్రి పదవి అవకాశం లేకపోలేదు. ఇక, ఆదిలాబాద్ నుంచి ప్రేంసాగర్‌రావు, మహబూబ్‌నగర్ నుంచి జూపల్లి కృష్ణారావు, ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మెదక్ నుంచి ఆంథోల్ రాజనర్సింహ, రంగారెడ్డి నుంచి రామ్మోహన్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, ఆదివాసీతో పాటు ఎస్టీల్లో లంబాడాలకు కూడా ఇవ్వాలనుకుంటే నేనావత్ బాలూనాయక్, ఆదిలాబాద్ నుంచి వివేక్ బ్రదర్స్‌లో ఒకరికి మంత్రివర్గంలో అవకాశమిస్తారని చర్చ జరుగుతోంది.

ఎంపికలో ఇవే కీలకం

సీఎం అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్ అధిష్టానం నాలుగైదు కీలకాంశాలను పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీపై విధేయత, ప్రభుత్వాన్ని నడిపించగల సామర్థ్యం, సామాజిక న్యాయంతో పాటు రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోనున్నట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రమంతా ప్రచారం నిర్వహించి, సీఎం కేసీఆర్‌పై పోటీ చేసి, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి పేరును అభిప్రాయ సేకరణలో కాంగ్రెస్ పెద్దలు ప్రతిపాదించనున్నారు. ఇక, శాసనసభాపక్షం (సీఎల్పీ) నాయకుడిగా పనిచేసి, పాదయాత్ర నిర్వహించడం ద్వారా కేడర్‌లో కదలిక తెచ్చి, పార్టీకి విధేయుడిగా ఉంటున్న భట్టి విక్రమార్క పేరునూ సీఎం అభ్యర్థిత్వానికి ప్రతిపాదించనున్నారు. అలాగే, పార్టీలో వివిధ పదవులు నిర్వహించడంతో పాటు బలమైన సామాజిక వర్గానికి చెందిన ఉత్తమ్ పేరునూ ఈ జాబితాలో ప్రతిపాదించనున్నారు. వీరిలో ఒకరిని సీఎంగా ఎంపిక చేసే అవకాశాలున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సీపీఎంకు ఎక్కడా డిపాజిట్లు దక్కలే!

పోటీచేసిన 19 చోట్లా ఘోర పరాజయం

- పార్టీ కార్యదర్శి తమ్మినేనికీ డిపాజిట్ గల్లంతు
- కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్న సీపీఐకి ఊరట
- కొత్తగూడెం నుంచి భారీ మెజారిటీతో కూనంనేని గెలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎంకు ఘోర పరాభవం మిగిలింది. ఒంటరిగా పోటీచేసిన 19 స్థానాల్లోనూ దాదాపు అన్నిచోట్లా డిపాజిట్లు కోల్పోయింది. ఖమ్మం జిల్లా పాలేరులో పోటీచేసిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా గౌరవప్రదమైన ఓట్లు పొందలేకపోయారు. ఆయనకు 16వ రౌండ్ వచ్చేసరికి కేవలం 4,354 ఓట్లు వచ్చాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డికి 3,234 ఓట్లు మాత్రమే వచ్చాయి. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థురాలిగా బరిలోకి దిగిన శిరీష (బర్రెలక్క)కు 5,598 ఓట్లు వచ్చాయి. ఆ స్థాయి ఓట్లు కూడా సీపీఎం అభ్యర్థులకు రాకపోవడం గమనార్హం. కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో ప్రతిష్టకు పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. సీపీఎం తాను పోటీచేసిన మొత్తం 16 స్థానాల్లోనూ కలిపి 49,604 ఓట్లు మాత్రమే సాధించింది.

కాంగ్రెస్‌కే పడ్డ సీపీఎం ఓట్లు!

పార్టీ కార్యకర్తలు అనేకచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేశారన్న చర్చ జరుగుతోంది. తాము పోటీచేయని చోట కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొనగా, రాష్ట్ర పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాత్రం ప్రజాతంత్ర లౌకిక శక్తులకు ఓటు వేయాలని మాత్రమే చెప్పారు. ఈ విషయంలో కేంద్ర కమిటీకి, రాష్ట్ర కమిటీకి మధ్య వైరుధ్యం నెలకొందన్న విమర్శలు వచ్చాయి. కాగా, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 26,568 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు ఎమ్మెల్సీలు కూడా ఆ పార్టీకి దక్కనున్నాయి. సీపీఎం మాత్రం పరాజయం పాలవడమే కాకుండా, తన ఓటు బ్యాంకును కూడా నిలబెట్టుకోలేకపోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.